


ఈనాడు



కరీంనగర్ 19-2-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 190

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

డొల్ల కంపెనీలపై గురి

నీరవ్‌మోదీ 200 నకిలీ సంస్థలపై ఈడీ ఆరా

- గడియారాలు అమ్ముతున్నామంటూ పట్నా దుకాణం బుకాయింపు
- రంగంలోకి ఐటీ శాఖ
- భరోసా పత్రాల జారీలో శెట్టి రూటే సెపరేటు
- నాలుగో రోజూ కొనసాగిన సోదాలు

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో ప్రధాన నిందితుడైన ఆభరణాల వ్యాపారి నీరవ్‌మోదీ, అతని మేనమామ మెహుల్ ఛోక్సీ, ఇతరులకు చెందిన బినామీ ఆస్తులు, డొల్ల కంపెనీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ దృష్టి సారించాయి. కనీసం 200 డొల్ల సంస్థలు, బినామీ ఆస్తులను జల్లెడ పట్టే పని మొదలయింది. వరుసగా నాలుగో రోజైన ఆదివారం కూడా ఈ కంపెనీలు, ప్రాంగణాలపై ఈడీ అధికారుల సోదాలు కొనసాగాయి. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 45 ప్రాంగణాల్లో బంగారం ఆభరణాల దుకాణాలు, వర్క్‌షాపుల్లో ఆధారాల కోసం అన్వేషణ చేపట్టారు. పట్నాలోని 'జస్ట్ ఇన్ వోగ్' అనే దుకాణానికి ఈడీ అధికారులు వెళ్లినప్పుడు అక్కడి సిబ్బంది తాము గడియారాలను అమ్ముతామే గానీ ఆభరణాలను కాదని బుకాయించే ప్రయత్నం చేశారు. కుంభకోణం గురించి బయటపడగానే వారు ఆభరణాలన్నింటినీ దుకాణం నుంచి తొలగించి, తెలివిగా చేతి గడియారాలను అమర్చారు కూడా. లోతైన సోదా చేసేసరికి ఎకాఎకి రూ.కోటి విలువైన ఆభరణాలు అక్కడి లాకర్లో బయటపడ్డాయి..! పట్నాలోని గీతాంజలి షోరూంలో శనివారం రూ.2.07 కోట్ల ఆభరణాలను జప్తు చేశారు.

పీఎంఎల్‌ఏ కింద ఆస్తుల జప్తు!

నీరవ్ మోదీకి, అతని కుటుంబ సభ్యులకు చెందిన కనీసం 29 స్థిరాస్తులను 'అక్రమ నగదు చలామణి నిరోధక చట్టం' (పీఎంఎల్‌ఏ) కింద జప్తు చేసుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. వాటిని ఐ.టి.శాఖ ప్రాథమికంగా జప్తు చేసుకొంది. త్వరలోనే మరిన్ని ఆస్తులను ఈడీ స్వాధీనం (మిగతా 2లో)

నీరవ్, ఛోక్సీలకు 32 బ్యాంకుల రుణాలు

- ఏమాత్రం స్థోమతలేని వ్యక్తులూ వ్యాపార భాగస్వాములుగా చెలామణీ
- ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తులో వెలుగుచూస్తున్న బాగోతం 13లో



నీరవ్ బాటలోనే రోటోమాక్ అధినేత!

- ప్రభుత్వ బ్యాంకుల నుంచి రూ. 800 కోట్ల రుణాలు 2లో
- కాన్పూర్ కార్యాలయానికి తాళాలు
- ఆచూకీ కనిపించని కొఠారీ
- దేశం దాటేసినట్లు అనుమానం

డిజిటల్ వాగ్దానం నెరవేరుద్దాం!

- నేటి నుంచి ప్రపంచ ఐటీ కాంగ్రెస్
- హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో మూడురోజులపాటు నిర్వహణ
- వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- తొలిరోజు సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్ హాజరు
- 30 దేశాల నుంచి 2 వేలకుపైగా ప్రతినిధులు
- ప్రత్యేక ఆకర్షణ రోబో 'సోఫియా'

ఈనాడు - హైదరాబాద్

కృత్రిమ మేధస్సు, నూతన టెక్నాలజీల హవా నేపథ్యంలో ఉపాధి రంగంలో మార్పులు, ఐటీ భవిష్యత్తుపై చర్చించేందుకు ప్రపంచ ఐటీ నిపుణులు, దార్శనికులు, సాఫ్ట్‌వేర్ సంస్థల దిగ్గజాలు ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా ఒకే వేదికపైకి రానున్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగే ఈ సదస్సును ప్రపంచ ఐటీ సేవల సమాఖ్య (డబ్ల్యూఐటీఎస్ఏ), నాస్కామ్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దేశంలో తొలిసారి జరుగుతున్న ఐటీ కాంగ్రెస్‌లో దాదాపు 30 దేశాలకు చెందిన 2 వేలకు పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. 'డిజిటల్ యుగ వాగ్దానం నెరవేరుద్దాం.. డిజిటల్ విస్తరణ' నినాదంతో జరుగుతున్న ఈ సదస్సును ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రారంభించనున్నారు.

ప్రధాన అంశాలు..: నూతన టెక్నాలజీలు, కృత్రిమ మేధస్సు, వీఆర్, (మిగతా 2లో)

WCIT Hyderabad INDIA 2018
World Congress on Information Technology

డిజిటల్ గ్రామస్థులతో ముచ్చటించనున్న ఐటీ దిగ్గజాలు

మీ ఇంటికి అంతర్జాలం రావడం ద్వారా ఏమేం మార్పులొచ్చాయి? ఇంటర్నెట్‌ను ఎలా ఉపయోగిస్తున్నారు?.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని డిజిటల్ గ్రామాల ప్రజలతో ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు హాజరయ్యే ఐటీ దిగ్గజాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇలా ముచ్చటించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న 'ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్' ప్రాజెక్టుపై ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం దృశ్యరూపక ప్రదర్శన ఇవ్వనుంది. ఇందులో భాగంగా వీడియో లింకేజీతో నేరుగా గ్రామస్థులతో మాట్లాడిస్తారు. తెలంగాణలో బ్రాడ్‌బ్యాండ్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం టీఫైబర్ ప్రాజెక్టును రూపొందిస్తోంది. మిషన్‌భగీరథ ప్రాజెక్టు గొట్టాలకు సమాంతరంగా ఆప్టికల్ ఫైబర్‌ను వేస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత ఇంటింటికీ తీగలను వేసి, నెట్ సదుపాయం కల్పిస్తారు. తొలుత ప్రయోగాత్మకంగా దీనిని రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రారంభించాలని నిర్ణయించారు.

కునుకులేని చిన్నారులు



- 70% మంది విద్యార్థులకు నిద్ర కరవు
- 18% మంది 3 నుంచి 5 గంటలే
- పరీక్షల ముందు పిల్లల అలవాట్లపై తాజా అధ్యయనం వెల్లడి 2లో



భాషల గోస

- అంతరించిపోయే ప్రమాదంలో 40కి పైగా భాషలు 2లో
- మాట్లాడేవారు 10వేల కంటే తక్కువే
- హోంశాఖ అధికారవర్గాల వెల్లడి



ఎర్రకోటలా మెరిసిపోతున్న ఈ భవనం దిల్లీలో భాజపా నూతన ప్రధాన కార్యాలయం. ఆదివారం ప్రధాని మోదీ దీనిని ప్రారంభించారు. భాజపా అగ్రనేత ఎల్‌కే అడ్వాణీ, జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, సుష్మాస్వరాజ్, నితిన్‌గడ్కరీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివరాలు 16లో

శవాలు తేలిన చెరువు

- కడప జిల్లా ఒంటిమిట్ట చెరువులో ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్ల మృతదేహాలు 5లో
- మృతి చెందిన తీరుపై సందేహాలెన్నో
- కిట్ బ్యాగులు.. కాళ్లకు చెప్పులు
- 2 రోజుల కిందట పోలీసుల తనిఖీలు
- కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాలు

రక్తం చిందిన అడవి

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కాల్పులు.. ఇద్దరు జవాన్లు సహా నలుగురి మృతి
- 20 మంది మావోయిస్టులను మట్టుబెట్టామంటూ పోలీసుల ప్రకటన 13లో

ప్రత్యక్ష ఆత్మహత్య

స్నేహితుడితో వీడియో కాల్‌లో మాట్లాడుతూనే విద్యార్థిని బలవన్మరణం

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మాజీ స్నేహితుడి వివాహానికి వెళ్తే ప్రస్తుత స్నేహితుడు ఎక్కడ అనుమానిస్తాడోనన్న అపోహ ఓ విద్యార్థినిని ఆత్మహత్యకు పురిగొల్పింది. స్నేహితుడితో వీడియో కాల్ మాట్లాడుతూనే ఆమె బలవన్మరణానికి పాల్పడింది. పేట్‌బషీరాబాద్ ఎస్సై ఎం.వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురానికి చెందిన బుగ్గయ్యచౌదరి కుమార్తె అనీషా చౌదరి(23) కొంపల్లిలోని శివశివానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళాశాలకు చెందిన వసతి గృహంలోనే ఉంటోంది. అనంతపూర్‌లో చదువుతున్న సమయంలో ఆమెకు తోటి విద్యార్థితో పరిచయం ఏర్పడింది. అతనితో కొన్ని ఫొటోలు కూడా దిగింది. ప్రస్తుతం ఆ స్నేహితుడి వివాహానికి ఆమె స్వస్థలానికి (మిగతా 2లో)



అనీషా చౌదరి

రైతు సమితులతో సదస్సులు

- రాజేంద్రనగర్, కరీంనగర్‌లో 25, 26 తేదీల్లో నిర్వహణ
- మండల, జిల్లా సమితుల సభ్యులు హాజరు కావాలి
- ఏప్రిల్ 20నుంచి పెట్టుబడి చెక్కుల పంపిణీ ప్రారంభం
- ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి

> వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న నిపుణులు, శాస్త్రవేత్తలతో మొత్తం 42 మందితో రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేస్తాం. మొత్తం 30 జిల్లాల ప్రతినిధులూ ఇందులో ఉంటారు. వ్యవసాయాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న వారిని ఇందులో నియమించడానికి పేర్లను సూచించాలి.

ఈనాడు - హైదరాబాద్

మండల, జిల్లాస్థాయి రైతు సమన్వయ సమితుల సభ్యులతో ప్రాంతీయ సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఈ నెల 25న హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీ సమావేశ మందిరంలో, 26న కరీంనగర్‌లోని అంబేడ్కర్ మైదానంలో ఈ సదస్సులు ఉంటాయని సీఎం తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రైతులకు చేర్చేందుకు సమితులు నిర్వహించాల్సిన పాత్రను ఇందులో వివరిస్తామన్నారు. ఆదివారం వ్యవసాయశాఖపై ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడతాం. ఇందుకు సంబంధించిన ముసాయిదాను తయారు చేయాలి. ఎకరానికి రూ.4 వేల చొప్పున ఇచ్చే పెట్టుబడి సాయాన్ని రెండు సీజన్లలో రెండు విడతలుగా అందిస్తాం. వానాకాలం సీజన్‌కు ఇచ్చే సాయం చెక్కుల పంపిణీ ఏప్రిల్ 20 నుంచి ప్రారంభించాలి. వచ్చే యాసంగి సీజన్‌కు ఇచ్చే (మిగతా 2లో)



పాస్ పుస్తకాలు వచ్చేస్తున్నాయ్

ముందుగా ఐదేసి గ్రామాల్లో పంపిణీ! • వచ్చే నెల 11 నుంచి ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని సాగు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. మార్చి 11 నుంచి 30 జిల్లాల్లోని 71.75 లక్షలమంది రైతులకు కొత్తపుస్తకాలు అందజేయనుంది. ఇందులో భాగంగా మొదట ప్రతి మండలంలో 5 గ్రామాల్లో పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఎకరాకు రూ.4,000 పెట్టుబడి సాయం చేసేందుకు నిర్ణయించగా సాగులో ఉన్న భూములకు మాత్రమే ఆ మొత్తం ఇవ్వాలని ఆలోచిస్తోంది. దీంతో రెవెన్యూ శాఖ భూ దస్త్రాల (మిగతా 2లో)



ప్రభుత్వం పంపిణీ చేయనున్న పాసుపుస్తకం నమూనా

ఇదీ సంగతి!



జీవజలం.. ప్రాణాంతకం

- రాజధాని చుట్టూ చెరువులు, భూగర్భజలాల్లో కాలకూట విషం
- పరిశ్రమల సమీప ప్రాంతాల్లో కాలుష్య భూతానికి జనం విలవిల

ఈనాడు - హైదరాబాద్

గంగ పొంగితే గుండె ఉప్పొంగాలి.. కానీ ఆ గ్రామాల్లో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎందుకంటే అది ప్రాణజలం కాదు.. కాలకూట విషం. తాగడం కాదు కదా కనీసం తాకినా ఆరోగ్యానికి ప్రమాదమే. అంత భారీగా కలుషితమైన నీటివనరులు ఆ పల్లెల జీవన చిత్రాన్నే మార్చేశాయి. ఉపాధి కల్పించి వెలుగులు నింపుతాయనుకున్న పరిశ్రమలు పల్లె ప్రజానీకానికి ఇస్తున్న బహుమతి ఈ నీటి కాలుష్యం. హైదరాబాద్ నలుమూలలా పారిశ్రామిక ప్రాంతాల చుట్టుపక్కల పల్లెల్లో రసాయన వ్యర్థాలతో జలకాలుష్యం పడగవిప్పి ఆడుతున్న తీరుపై 'ఈనాడు' క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఐదు గ్రామాల్లో నీటి నమూనాలు సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షలు చేయించింది. ఆ జలాలు పారిశ్రామిక వ్యర్థాలు, రసాయనాల కారణంగా తీవ్రంగా కలుషితమైనట్లు తేలింది. పరిశ్రమల సమీపంలోని నీటివనరులు, భూగర్భజలాలు కాలుష్య భూతం బారినపడిన పరిస్థితిపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.. 14 పేజీలో



విషతుల్యంగా మారిన పాశమైలారం పెద్దచెరువు



2లో

ఇరాన్‌లో కూలిన విమానం

66 మంది దుర్మరణం

అంతర్జాలంలో భద్రాద్రి సీతారాముల కల్యాణం టికెట్లు

భద్రాచలం, న్యూస్‌టుడే: శ్రీరాముడు అవతరించిన విశిష్ట సంవత్సరం(విళంబి) కావడంతో ఈ సారి జరిగే శ్రీసీతారామచంద్రుల కల్యాణోత్సవానికి భద్రాద్రిలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి అంతర్జాలంలో అన్ని రకాల టికెట్లు అందుబాటులో ఉండనున్నాయి. వచ్చే నెల 18 నుంచి ఏప్రిల్ 1 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మార్చి 26న జరిగే సీతారాముల కల్యాణానికి, 27న జరిగే పట్టాభిషేకానికి మిథిలా మండపం ప్రాంగణంలో ప్రత్యేక సెక్టార్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులోకి ప్రవేశించేందుకు 18,807 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది.

నేటి నుంచి విక్రయాలు

కల్యాణానికి 5 వేలు (ఇద్దరికి), రూ.2 వేలు, రూ.1116, రూ.500, రూ.200, రూ.100 టిక్కెట్లను సోమవారం నుంచి విక్రయిస్తామని దేవాలయ వర్గాలు తెలిపాయి. రూ.250, రూ.100 టిక్కెట్‌లను తీసుకున్న వారు పట్టాభిషేకాన్ని నేరుగా వీక్షించవచ్చు. రూ.5 వేల టికెట్‌లను అంతర్జాలంతో పాటు ఆలయ కార్యాలయం వద్ద విక్రయిస్తారు. దీనిపై ఇద్దరికి ప్రవేశం ఉంటుంది. మిగతా అన్ని టికెట్‌లపై ఒక్కరికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. టిక్కెట్ల కోసం అంతర్జాల చిరునామా www.bhadrachalamonline.com ను సంప్రదించాలని ఆలయ వర్గాలు తెలిపాయి.

నీరవ్ బాటలోనే రోటోమాక్ అధినేత!

కాన్పూర్: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)ని భారీగా మోసంచేసిన రీతిలోనే కాన్పూర్‌లోని ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.800 కోట్లకుపైగా చేతి చమురు వదిలించుకున్న దాఖలాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ఈ రుణాన్ని తీసుకున్న రోటోమాక్ (కలాల తయారీ) కంపెనీ అధినేత విక్రమ్ కొఠారీ గత కొన్ని రోజులుగా కనిపించడం లేదు. వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ బాటలోనే ఈయనా దేశం దాటేసినట్లు అనుమానిస్తున్నారు. అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. .. ఈ అయిదు బ్యాంకులూ కొన్ని నిబంధనల్ని అతిక్రమించి మరీ రుణాలు ఇచ్చాయనేది ఇప్పుడు బయటపడుతోంది.

వడ్డీ రాదు... అసలూ లేదు...

ముంబయిలోని యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.485 కోట్లు, కోల్‌కతాలోని అలహాబాద్ బ్యాంక్ నుంచి రూ.352 కోట్లు తీసుకుని, ఏడాది తర్వాత కూడా అసలు గానీ, వడ్డీగానీ కొఠారీ చెల్లించలేదని తెలుస్తోంది. దీంతో రోటోమాక్ గ్లోబల్ ప్రై.లి. సంస్థని 'ఉద్దేశపూర్వక ఎగవేతదారు'గా బ్యాంక్ ఆఫ్ బరోడా గత ఏడాది ప్రకటించింది. ఈ జాబితానుంచి తమ పేరును తొలగించాల్సిందిగా ఈ సంస్థ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. బకాయి పడినప్పటి నుంచి రూ.300 కోట్లకు పైగా విలువైన ఆస్తుల్ని బ్యాంకుకి ఇచ్చేందుకు రోటోమాక్ ముందుకు వచ్చినందువల్ల ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ప్రకటించడం తప్పు అని హైకోర్టు తీర్పునిచ్చింది. కాన్పూర్ సిటీసెంటర్ రోడ్డులోని కార్యాలయం వారం రోజులుగా మూతపడే ఉంది. అప్పటినుంచి అధినేత ఆచూకీ తెలియరావడంలేదు. కొఠారీ కూడా నీరవ్ మోదీ మాదిరిగా విదేశాలకు చెక్కేసినట్లు అనుమానాలు నెలకొన్నాయి. వ్యాపార అవసరాల నిమిత్తం తాను తరచూ విదేశాలకు వెళ్లొచ్చినప్పటికీ కాన్పూర్ వాసిగా నగరంలోనే ఎప్పటికీ ఉంటానని, దేశం విడిచి పారిపోయినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆయన చెప్పినట్లు స్థానిక ప్రసారమాధ్యమాలు వెల్లడిస్తున్నాయి. కొఠారీ ఆస్తుల్ని జప్తు చేసుకునైనా రుణాన్ని రాబడతామని అలహాబాద్ బ్యాంక్‌వర్గాలు ధీమావ్యక్తంచేస్తున్నాయి.



వైభవంగా ఆమ్రపాలి వివాహం

వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి వివాహం ఆదివారం వైభవంగా జరిగింది. ఐపీఎస్ అధికారి సమీర్‌శర్మతో జమ్ము కశ్మీర్‌లోని ఆర్కే రెసిడెన్సీలో బంధుమిత్రుల సమక్షంలో వివాహం ఘనంగా జరిగింది. వరంగల్ జిల్లా నుంచి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

–న్యూస్‌టుడే, వరంగల్


డొల్ల కంపెనీలపై గురి

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోనుందని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అక్రమంలో భాగంగా డబ్బు చేరవేతకు దేశ విదేశాల్లో ఏర్పాటైన కంపెనీలను ఈడీ, ఐ.టి. శాఖలు స్తంభింపజేశాయి. చేతికందిన డబ్బును ఉపయోగించి భూములు, బంగారం, విలువైన రాళ్లు వంటివి కొనుగోలు చేసినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. వీటిని వెలికితీయడానికి రెండు శాఖలూ ప్రత్యేక బృందాలను పురమాయించాయి. ఇప్పటివరకు రూ.5674 కోట్ల విలువైన ఆభరణాలను ఈడీ స్వాధీనం చేసుకొంది. శనివారం నాటి సోదాల తర్వాత గీతాంజలి జెమ్స్, ఛోక్సీలకు చెందిన 9 బ్యాంకు ఖాతాల్ని స్తంభింపజేశారు.

63 రోజుల్లోనే 143 ఎల్‌వోయూలు..: మొత్తం అవ్యవహారంలో చక్రం తిప్పిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ మాజీ డీజీఎం గోకుల్‌నాథ్ శెట్టి వాయువేగంగా పనిచేస్తూ నీరవ్‌కు కొమ్ముకాసిన తీరు అధికారులను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతోంది. కుంభకోణం మొదలైన 2011 ఏడాది నుంచి 150 భరోసా పత్రాలు (ఎల్‌వోయూలు) జారీ అయితే 2017 మార్చి ఒకటో తేదీ నుంచి కేవలం 63 రోజుల్లోనే 143 జారీ అయినట్లు బయటపడింది. కొన్నిసార్లు డజను, అంతకంటే ఎక్కువ పత్రాలు ఒక్క రోజులో జారీ అయ్యాయి. 2017 మార్చి 1 నుంచి మే 2 వరకు రోజుకు సగటున రెండు చొప్పున వెలువడ్డాయి. మార్చి 21న ఒకేరోజు గీతాంజలి, గిలి, నక్షత్ర సంస్థలకు 10 ఎల్‌వోయూలు ఇచ్చారు. వీటిని బెల్జియంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా- యాంట్వెర్ప్ శాఖకు, మారిషస్‌లోని ఎస్‌బీఐ శాఖకు జారీ చేశారు. మొదటి 150 పత్రాలతో రూ.6500 కోట్లు పిండుకోగా, తర్వాతి 143 పత్రాల సాయంతో రూ.3000 కోట్లకు పైగా నొక్కేసినట్లు తేలింది. ఇంత హడావుడిగా, ఇబ్బడిముబ్బడిగా అనుమతులు మంజూరు చేయడానికి కారణాలపై సీబీఐ దృష్టి సారించింది. సాధారణంగా ఉండాల్సిన చెల్లుబాటు వ్యవధికంటే నాలుగురెట్లు ఎక్కువ కొన్ని పత్రాల్లో ఉన్నట్లు తేలింది. తాను రిటైరైనా నీరవ్‌కు కనీసం ఏడాది పాటు నిధుల ప్రవాహం కొనసాగేలా చూడాలనేది శెట్టి ఆలోచనగా భావిస్తున్నారు. జారీ అయిన ఎల్‌వోయూలను నిందితులు అదేరోజో, తప్పితే మర్నాడో వాడేసేవారు. ఈ వేగం కూడా అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. గతంలో జారీ అయిన భరోసా పత్రాల నవీకరణే 2017-18 సంవత్సరంలో ఎక్కువగా జరిగినట్లు తెలుస్తోంది.

ఏడో నిజాం కుమారుడు కన్నుమూత



చార్మినార్, న్యూస్‌టుడే: ఏడో నిజాం కుమారుడు నవాబ్ ఫజల్‌జహా బహదూర్(72) ఆదివారం హైదరాబాద్ కింగ్‌కోఠిలోని తన నివాసంలో కన్ను మూశారు. హైదరాబాద్ స్టేట్ చివరి పాలకుడైన ఏడో నిజాం మీర్‌ఉస్మాన్ అలీఖాన్, సాహెబా లీలాబేగం దంపతులకు ఆయన 1946 ఫిబ్రవరి 29న జన్మించారు. గత కొంతకాలంగా ఫజల్‌జహా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇన్నాళ్లూ ఆయన నిజాంకు సంబంధించిన వివిధ ట్రస్టుల వ్యవహారాలు చూసుకున్నారు. సౌదీ అరేబియాలో హజ్ యాత్రికుల బస కోసం నిజాం నిర్మించిన అతిథిగృహం 'హైదరాబాద్ రుబాత్' వ్యవహారాల బాధ్యతలనూ నిర్వహించారు. ఆయనకు భార్య సాహెబ్‌జాదీ దర్వేరున్నీసాబేగం, తనయుడు ఉన్నారు. ఫజల్‌జహా భౌతిక కాయానికి కింగ్‌కోఠిలోని పూర్వీకుల సమాధుల పక్కన అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

వందేళ్ల నాటి భూగర్భ గని 'మ్యాన్ వే' వెలుగులోకి

- మిషన్ భగీరథ తవ్వకాల్లో బయటపడిన రహదారి

ఇల్లెందు, న్యూస్‌టుడే: బొగ్గు గనులకు పుట్టినిల్లయిన ఇల్లెందు ప్రాంతంలో ఆదివారం మిషన్ భగీరథ పనుల్లో భాగంగా చేపట్టిన తవ్వకాల్లో వందేళ్ల చరిత్ర కలిగిన 1వ ఇంక్లైన్ భూగర్భ గని 'మ్యాన్ వే'(రహదారి) వెలుగులోకి వచ్చింది. ఉపరితలం నుంచి భూగర్భంలోకి వెళ్లేందుకు ఆంగ్లేయులు మ్యాన్ వే(రహదారి)లు ఏర్పాటు చేశారు. ఇల్లెందు పట్టణంలోని బుగ్గవాగు సమీపంలో భగీరథ తవ్వకాల్లో భాగంగా ప్రధాన రహదారిని డ్రిల్ చేస్తుండగా ఒక్కసారిగా సొరంగం కన్పించింది. సమాచారం అందుకున్న సింగరేణి, సర్వే అధికారులు సొరంగాన్ని పరిశీలించారు. అనంతరం ఏరియా జీఎం కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బ్రిటీషు వాళ్లు వందేళ్ల కిందట 1వ ఇంక్లైన్ భూగర్భ గనిలోకి ఉపరితలం నుంచి భూగర్భంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న మ్యాన్ వేగా గుర్తించామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి బొగ్గు వెలికితీత జరగలేదని స్పష్టంచేశారు. ఈ ప్రాంతంలో ఏర్పడిన సొరంగంలో మట్టి పోసి పూర్తిగా పూడ్చివేస్తామని.. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు.



మిషన్ భగీరథ పనుల్లో బయటపడిన సొరంగం(మ్యాన్ వే) ఇదే..

కునుకులేని చిన్నారులు

దిల్లీ: పరీక్షలు దగ్గరపడే వేళ దేశంలోని 70 శాతం మందికిపైగా విద్యార్థులు ఏడు గంటలు కూడా సరిగా నిద్రపోవడంలేదని తాజా అధ్యయనంలో తేలింది. 18 శాతం మంది అయితే కేవలం మూడు నుంచి ఐదు గంటలే కునుకు తీస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. అనారోగ్యకర జీవనశైలికి వ్యాయామలేమి తోడుకావడంతో ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్నట్లు బయటపడింది. దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, జైపుర్, చండీగఢ్ సహా పలు ప్రధాన నగరాల్లో ఫోర్టిస్ హెల్త్‌కేర్ సంస్థ దీన్ని నిర్వహించింది. దీనిలో 6,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షలకు వారాల గడువు ఉండేటప్పుడు చదవాల్సిన మొత్తం ఎక్కువగా ఉండిపోతోందని దీనిలో విద్యార్థులు తెలిపారు. కొందరైతే కనీసం కుటుంబం, స్నేహితులతో మాట్లాడేందుకూ సమయం దొరకడం లేదనీ పేర్కొన్నారు.

తల్లిదండ్రుల జోక్యమూ ఇబ్బందే

- శారీరక వ్యాయామానికి కనీసం 30 నిమిషాలు కూడా 86 శాతం మంది పిల్లలు కేటాయించలేకపోతున్నారు.
- 68 శాతం మంది బయటకు వెళ్లేందుకు గంట కంటే తక్కువ సమయమే వెచ్చిస్తున్నారు.
- తమ పరీక్షలపై తల్లితండ్రులు పడే ఆందోళన. . ఒత్తిడిని మరింత పెంచుతోందని 74 శాతం మంది పిల్లలు భావిస్తున్నారు. మరోవైపు తమ పాఠ్యప్రణాళికలో తల్లిదండ్రులు జోక్యం చేసుకుంటే ఇబ్బందిగా ఉంటోందని 82 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- 73 శాతం మంది కుటుంబంతో గంట కంటే తక్కువసేపు గడుపుతున్నారు. కేవలం ఒక శాతం మంది చిన్నారులు మాత్రమే కుటుంబానికి మూడు గంటలు కేటాయిస్తున్నారు.
- 34 శాతం మంది గంట నుంచి మూడు గంటల పాటు స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లపై గడుపుతున్నారు. 11 శాతం మంది మాత్రం ఐదు నుంచి ఏడు గంటలు ఆన్‌లైన్‌లో ఉంటున్నారు.
- 53 శాతం మంది విద్యార్థులు రోజుకు 5 నుంచి 7 గంటలు నిద్రపోతున్నారు.
- 94శాతం మంది పరీక్షల సమయంలో లభించే కాసేపు తీరిక సమయాన్నీ ప్రశాంతంగా గడపలేకపోతున్నారు.

భాషల గోస

దిల్లీ: మనదేశంలో 40కిపైగా భాషలు/మాండలికాలు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయని అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం కొన్ని వేలమంది మాత్రమే ఈ భాషల్లో మాట్లాడుతున్నారని తెలిపాయి. జనగణన సంచాలకుడి కార్యాలయం నివేదిక ప్రకారం.. మనదేశంలో 22 షెడ్యూల్డు భాషలు, 100 నాన్-షెడ్యూల్డు భాషలు ఉన్నాయి. వీటిని కనీసం ఒక లక్ష లేదా అంతకంటే ఎక్కువమంది మాట్లాడుతున్నారు. అయితే, మరో 40కిపైగా భాషలు మాత్రం అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయని హోంశాఖ అధికారి ఒకరు తెలిపారు. వాటిని(ఒక్కో భాషను) మాట్లాడేవారి సంఖ్య 10 వేల కంటే తక్కువగా ఉందని వెల్లడించారు. భారత్‌లో 42 భాషలు/మాండలికాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయంటూ యునెస్కో కూడా ఓ జాబితా విడుదల చేసిన సంగతిని గుర్తుచేశారు. అంతరించిపోయే ముప్పున్నవాటిలో అత్యధికంగా అండమాన్-నికోబార్ దీవులకు చెందిన భాషలు/మాండలికాలు 11 ఉన్నాయని తెలిపారు. ఆ తర్వాతి స్థానాల్లో మణిపూర్(7), హిమాచల్ ప్రదేశ్(4) ఉన్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గడాబా, నైకీ కూడా ఈ ముప్పును ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.

మూగబోయిన రైతు గొంతు

బెంగళూరు, న్యూస్‌టుడే: రైతు నాయకుడు, కర్ణాటకలోని మండ్య జిల్లా మేలుకోటె శాసనసభ్యుడు కె.ఎస్.పుట్టణ్ణయ్య (69) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కబడ్డీ పోటీలను వీక్షిస్తుండగా ఛాతీనొప్పితో పడిపోయిన ఆయనను వైద్యశాలకు తరలించారు. ఈలోపే కన్నుమూశారు. రైతులకు మద్దతు ధర, రుణ మాఫీ తదితరాల కోసం ఆయన మూడున్నర దశాబ్దాలుగా రాజీలేని పోరాటం చేశారు.

JLM GRAND FREE DEMO & New Batch Starts on Feb 22nd Thursday@10am
-Expert Lecturers -Printed Material -Daily Tests -Hostel
THE BEST
HANAMKONDA. 8341116815, 8317531584

BANK PO's / CLERK | SSC CGL / CHSL | RRB ALP/26502
Separate Batches
PACIFIC Dilsukhnagar, Hyderabad 9912094000 9912084000

జూనియర్ లైన్‌మెన్ POSTS 2553
New Batch Admissions are in Progress
SEA HANAMKONDA 8143511212
SRUSHTI ENGINEERING ACADEMY

JLM NPDCL Daily 8 Hours Classes Daily Tests Printed Study Material
New Batch Starts on 22.2.2018
SAIMEDHA Koti, Hyd.

విజేతకాంపిటీషన్స్® vijetacompetitions.net
పక్షపత్రిక రూ. 20 CURRENT AFFAIRS TM Rs.159, Rs.49 EM Rs.169
RRB ALP TM Rs.349,Rs.139, EM Rs.399,Rs.149
GROUP-D TM Rs.449,Rs.149, EM Rs.439,Rs.159
TSPSC HOSTEL WELFARE PAPER-I Rs. 499 MP 119 PAPER-II Rs. 299 MP 119
POSTMAN/MAIL GUARD Rs.379 MODEL PAPER Rs.149 9963293399
బుక్స్ విడుదల

ANM / MPHA / Lab-Technicians
State No.1 Faculty, Daily Test, Printed Material

JLM NPDCL Posts: 2553
New Batches From 21-2-2018
SAIMEDHA

డిజిటల్ వాగ్దానం నెరవేరుద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

బ్లాక్‌చైన్, ఐవోటీ, డేటా, డిజిటల్ మార్కెటింగ్, నైపుణ్య శిక్షణ, డిజిటల్ ఎకానమీ, క్రిప్టో కరెన్సీ-నియంత్రణ, కృత్రిమ మేధస్సు - ఆటోమేషన్ నేపథ్యంలో ఉద్యోగాలు, సమాచార నిధి నిక్షిప్తం- దొంగలించకుండా ఉండటం, నూతన ఆవిష్కరణలు, వలయాకార ఆర్థికాభివృద్ధి.. సదస్సు ప్రధాన అంశాలుగా ఉండనున్నాయి. సోమవారం ఉదయం జరిగే కార్యక్రమంలో తెలంగాణ సీఎం కేసీఆర్, కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్, రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్, ప్రపంచ ఐటీ సేవల సమాఖ్య అధ్యక్షురాలు వోనిచూ, ప్రధాన కార్యదర్శి జిమ్ పోయిసెంట్, నాస్కామ్ అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్, ఛైర్మన్ రమన్ రాయ్, విప్రో సీఎస్‌వో రిషిద్ ప్రేమ్‌జీ, టెక్‌మహీంద్రా సీఈవో సీపీ గుర్నాని పాల్గొంటారు. 'డిజిటల్ ఆర్థిక వ్యవస్థ - పరిపాలన పునరాలోచన' అంశంపై జరిగే ప్లీనరీలో రవిశంకర్‌ప్రసాద్, కేటీఆర్ పాల్గొంటారు. మూడురోజుల పాటు జరిగే ప్లీనరీల్లో ఐటీలో కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, వ్యూహాలు, వ్యాపారాలు, వ్యాపార అనుసంధానం తదితర అంశాలపై చర్చిస్తారు. ఈ సదస్సులకు శ్రీలంక ప్రధాని విక్రమసింఘే, కెనడా ఆర్థిక అభివృద్ధి మంత్రి నవదీప్ బైన్స్, సద్గురు జగ్గీ వాసుదేవ్(ఈషా), శంతను నారాయణ్ (అడోబ్ సిస్టమ్స్), హానివెల్ కార్యనిర్వాహక ఛైర్మన్ డేవిడ్ ఎం.కోటే తదితరులు హాజరవుతారు. మొత్తంగా 50కి పైగా జరిగే ప్లీనరీ సదస్సుల్లో 150 మంది మాట్లాడతారు.

ఆకర్షణగా 'సోఫియా': ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌లో సోఫియా రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. రెండోరోజు కార్యక్రమంలో ఈ రోబో 'మానవత్వంతోనే మెరుగైన భవిష్యత్తు' అంశంపై మాట్లాడుతుంది. ప్రపంచంలోనే ఓ దేశ పౌరసత్వం పొందిన తొలి రోబో ఇది. బాలీవుడ్ నటి దీపికా పదుకొణె 'మానసిక సంసిద్ధత- సమయస్ఫూర్తి' అనే అంశంపై ఈ సదస్సులో మాట్లాడతారు.

తొలిరోజు 'కృత్రిమ మేధస్సు' అజెండా: ఐటీ కాంగ్రెస్‌లో డిజిటలీకరణలో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తారు. తొలిరోజు సదస్సులో 25 ప్లీనరీ సమావేశాలు ఉంటాయి. ప్రధానంగా కృత్రిమ మేధస్సు, ఉద్భవిస్తున్న నూతన టెక్నాలజీ అంశాల కేంద్రంగా చర్చలు జరగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం ఈ రెండు అంశాలపై జరగనున్న రెండు ప్లీనరీల్లోనూ కర్నేసా సహవ్యవస్థాపకులు, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ ఆండ్రూ మాట్లాడతారు. పరిశ్రమలు సాఫ్ట్‌వేర్ ఆధారితంగా ఎలా మారుతున్నాయి? సేవా రంగ మార్కెట్ భవిష్యత్తు, ఆర్థిక వ్యాపారాల ఆర్కిటెక్చర్‌లో మార్పులు, భవిష్యత్తు ఉపాధి - నాయకత్వ చిక్కులు లాంటి అంశాలపై చర్చలు ఉంటాయి. 'సమాచార యుగం ముగిసింది - నూతన పరిశోధనల యుగానికి స్వాగతం' అంశంపై అడోబ్ సిస్టమ్స్ అధినేత శంతను నారాయణ్ మాట్లాడుతారు. క్రిప్టో కరెన్సీ- బ్లాక్‌చైన్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు - ఏఐ సమాచార దూరం' అంశాలపై ప్రముఖులు చర్చలు నిర్వహిస్తారు.

రైతు సమితులతో సదస్సులు

(మొదటి పేజీ తరువాయి)

చెక్కుల పంపిణీని నవంబరు 18న ప్రారంభించాలి. ఈ పథకానికి అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లోనే కేటాయిస్తాం. ప్రస్తుతం రైతులు సాగుకు కూలీల కొరతను ఎదుర్కొంటున్నారు. భవిష్యత్తులో ఇది అధికమవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ యంత్రాలపై రాయితీలిచ్చి యాంత్రీకరణను ప్రోత్సహిస్తాం. వరినాట్లు వేసే యంత్రాలను రాయితీపై ఇస్తాం. దీనికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. వ్యవసాయాభివృద్ధికి దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నాం. ఈ ఏడాది నుంచి మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తాం. వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న నిపుణులు, శాస్త్రవేత్తలతో మొత్తం 42 మందితో రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేస్తాం. మొత్తం 30 జిల్లాల ప్రతినిధులూ ఇందులో ఉంటారు. వ్యవసాయాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న వారిని ఇందులో నియమించడానికి పేర్లను సూచించాలి. రాజేంద్రనగర్‌లో నిర్వహించే సదస్సుకు జనగామ, మెదక్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూలు, గద్వాల, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల సమన్వయ సమితుల సభ్యులను, వ్యవసాయాధికారులను, వ్యవసాయ విస్తరణ అధికారులను ఆహ్వానించాలి. కరీంనగర్ సదస్సుకు మిగతా జిల్లాల వారిని పిలవాలి'' అని సీఎం అధికారులకు సూచించారు.

రైతులతో మాట్లాడనున్న సీఎం

ఆరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు జరిగే ఈ సదస్సుల్లో సీఎం నేరుగా రైతులతో మాట్లాడతారు. వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల విజయవంతానికి సమితులు ఏం చేయాలనే దానిపై ఇందులో చర్చిస్తారు. హాజరయ్యేవారందరికీ ప్రయాణ, భోజన సదుపాయాలు వ్యవసాయశాఖ కల్పించాలి. రైతులను సంఘటితం చేయడం, రైతు వేదికల నిర్మాణం, రైతులకు నిరంతర శిక్షణ, పంటలకు గిట్టుబాటు ధర అందేలా చూడటం, పెట్టుబడి పథకం అమలు, మార్కెట్లకు పంటలను తెచ్చే విషయంలో నియంత్రణ పాటించడం, మేలైన సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటు, శీతల గిడ్డంగుల నిర్మాణం, పంటల కాలనీల ఏర్పాటులో సమితులు పోషించాల్సిన పాత్రపై కరదీపిక అందించి వారితో ఈ అంశాలపై చర్చిస్తారు. సమావేశంలో ఆర్థిక, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, పార్థసారథి, కమిషనర్ డాక్టర్ ఎం.జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు వచ్చేస్తున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్షాళనలో నవీకరించిన సమాచారానికి, క్షేత్రస్థాయి పరిస్థితికి తేడాలు గుర్తించాలని నిర్ణయించారు. ప్రతి మండలంలో మొదట 5 గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని యంత్రాంగానికి సూచనలు అందాయి. దీనికి అనుగుణంగా మండలాల్లో గ్రామాలను ఎంపిక చేసుకుని వ్యవసాయ అధికారులు, వీఆర్‌ఓలతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. కమిటీల పరిశీలన పూర్తికాగానే సాగుభూముల దస్త్రాల సమాచారం(డాటా) సిద్ధం చేసుకుని ఆ మేరకు మాత్రమే పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని భావిస్తున్నారు. దీనికితోడు ఇప్పటికీ పూర్తికాని ఎల్‌ఆర్‌యూపీ ఆన్‌లైన్ సమస్యను కొంత వరకు ఎదుర్కొని దశలవారీగా గ్రామాలకు పట్టా పాస్ పుస్తకాలు చేర్చాలన్నది ప్రణాళిక.

రైతుల ఫొటోలు తీసుకోవాల్సిందేనా

గ్రామాల నుంచి సేకరించిన భూ దస్త్రాల నవీకరణ సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే క్రమంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. సేకరించిన సమాచారాన్ని ఆఫ్‌లైన్ చేయడం.. దాన్ని టీఎల్‌ఆర్‌ఎంఎస్‌తో అనుసంధానం చేసి ఒకే వెబ్‌లోకి తీసుకొచ్చేందుకు సిబ్బంది పలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీనికి తోడు రోజుకో అంశాన్ని(ఆప్షన్)జోడించాలంటూ హైదరాబాద్‌నుంచి మండలాలకు సమాచారం అందుతుండటంతో వారు మరిన్ని అవస్థలు పడుతున్నారు. పట్టా పాస్‌పుస్తకాల్లో రైతు ఆధార్ నంబర్, ఫొటో, చరవాణి నంబర్ తదితర అంశాలు ఉండాలని సూచించడంతో వాటికోసం కొత్త చిక్కులు ఎదుర్కొన్న రెవెన్యూ సిబ్బందికి తాజాగా రైతుల ఫొటోలు అందుబాటులో లేకుండాపోవడం కలవరపెడుతోంది. ఆధార్ సమాచారం నుంచి కలెక్టర్ల అనుమతితో రైతుల ఫొటోలు తీసుకోవడానికి ప్రయత్నిస్తుండగా అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీంతో అన్నదాతల నుంచి నేరుగా ఫొటోలు తీసుకోకతప్పదన్న వాదన వినిపిస్తోంది. ఫొటోల ముద్రణ తప్పనిసరి చేసిన నేపథ్యంలో కొత్త సమస్యలు వచ్చి చేరుతుండటంతో మార్చి 11న పుస్తకాల పంపిణీ లక్ష్యం ఎంతవరకు సాధ్యమవుతుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్‌లో కూలిన విమానం

టెహ్రాన్: ఇరాన్‌కు చెందిన ప్రయాణికుల విమానం ఒకటి ఆదివారం కూలిపోయింది. అందులో ప్రయాణిస్తున్న 66 మంది చనిపోయారని అధికారులు తెలిపారు. అసెమాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానం.. రాజధాని టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్రయం నుంచి ఉదయం 8.00 గంటల సమయంలో బయలుదేరింది. ఇస్ఫాహన్ ప్రావిన్స్‌లోని యాసుజ్ విమానాశ్రయానికి ఇది చేరుకోవాల్సింది. అయితే టెహ్రాన్‌కు 500 కిలోమీటర్ల దూరంలో జాగ్రోస్ పర్వతశ్రేణిలోని డెనా పర్వతంపై ఈ విమానం కూలిపోయింది. ఈ విమానంలో ఒక చిన్నారి సహా 60 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఇరాన్ జాతీయ అత్యవసర సేవల విభాగం.. అక్కడికి ఒక హెలికాప్టర్‌ను పంపింది. అయితే ప్రతికూల వాతావరణం వల్ల అది అక్కడ దిగలేకపోయింది. ఆ ప్రాంతం మొత్తం పర్వతమయంగా ఉండటంతో అంబులెన్సులు కూడా చేరుకోలేకపోయాయని అధికారులు తెలిపారు. అనంతరం అక్కడికి వెళ్లిన సహాయ సిబ్బంది.. విమానంలోని వారందరూ మరణించినట్లు గుర్తించారు. దశాబ్దాల పాటు అంతర్జాతీయ ఆంక్షలను ఎదుర్కోవడం వల్ల ఇరాన్ వద్ద కాలం చెల్లిన విమానాలే మిగిలాయి. వాటి నిర్వహణ, ఆధునికీకరణకు అక్కడి విమానయాన సంస్థలు అవస్థలు పడుతున్నాయి. తరచూ విమాన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2015లో అగ్రదేశాలతో అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి.. విమానాల కొనుగోళ్లపై ఆంక్షలు ఎత్తివేయాలన్న షరతును ఇరాన్ పెట్టింది. అనంతరం 30 బోయింగ్ 737 విమానాలకు ఆర్డర్ పెట్టింది. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ ఆంక్షలు విధిస్తే ఈ విమానాల సరఫరా నిలిచిపోయే అవకాశం ఉంది. తాజాగా ప్రమాదానికి లోనైన విమానం.. టర్బోప్రాప్ ఏటీఆర్-72 శ్రేణి విహంగం.

గ్రహం అనుగ్రహం

19-2-2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
చవితి: తె. 3-40 తదుపరి పంచమి
ఉత్తరాభాద్ర నక్షత్రం: మ. 12-38 తదుపరి రేవతి
అమృత ఘడియలు: ఉ. 7-42 నుంచి 9-21 వరకు
వర్జ్యం: రా. 12-40 నుంచి 2-17 వరకు
దుర్ముహూర్తం: మ. 12-36 నుంచి 1-22 వరకు
తిరిగి మ. 2-54 నుంచి 3-40 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00
సూర్యోదయం: ఉ.6-29; సూర్యాస్తమయం: సా.5-58

ప్రత్యక్ష ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లాలనుకొంది. ఆ విషయాన్ని ప్రస్తుత స్నేహితుడు మేడ్చల్‌కు చెందిన దక్షేశ్‌పటేల్‌కు తెలపగా.. అతనూ వెళ్లమన్నాడు. అయినా అతను ఎక్కడ అనుమానపడతాడోనని ఆందోళన చెందిన అనీషా.. ఈ విషయమై శనివారం అర్ధరాత్రి దక్షేశ్‌తో వీడియో కాల్‌లో మాట్లాడింది. ఓ పక్క మాట్లాడుతూనే మరోపక్క పాత స్నేహితుడితో ఉన్న ఫొటోలను ఒక్కొక్కటిగా తొలగించింది. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ దక్షేశ్‌కు వివరిస్తూనే చున్నీతో వసతిగృహంలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. వెంటనే ఈ సమాచారాన్ని వసతిగృహం వార్డెన్, అనీషా తండ్రికి దక్షేశ్ చేరవేశాడు. ఘటనా స్థలానికి వచ్చి అనీషా గది తలుపులు బద్దలు కొట్టించాడు. ఆమెను ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దక్షేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 16 నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకు వారిద్దరి సంభాషణలు, వీడియో కాల్‌లను పరిశీలిస్తున్నారు.

చిత్తూరులో విదేశీ విద్యార్థి ఆత్మహత్య

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగర శివారులోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఖలెద్ మహమద్ ఒత్‌మాన్ నయీఫ్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యెమెన్ దేశానికి చెందిన ఇతడు 2014లో ఆ దేశ ప్రభుత్వం తరపున ఉపకార వేతనంపెకిక్కడికి వచ్చాడు. అదే దేశానికి చెందిన హషీమ్ అల్-షబి అనే విద్యార్థితో కలిసి స్థానికంగా గది అద్దెకు తీసుకుని చదువుకుంటున్నాడు. కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని కేరళకు తీసుకెళ్లి అక్కడ వైద్య సేవలను అందించాడు. అతడి గదిలో ఉంటున్న మిత్రుడు సైతం కొన్ని నెలల నుంచి ఆరోగ్య సమస్యలపై కేరళలో వైద్య సేవలను పొందుతున్నాడు. ఇటీవలే మిత్రుడు కేరళకు వెళ్లగా.. తన తల్లికి సైతం అక్కడి నుంచి మందులు తీసుకురావాలని కోరాడు. శనివారం కేరళకు వెళ్లిన మిత్రుడు.. నయీఫ్‌కు ఫోన్ చేశాడు. ఎంతసేపటికీ అతడు స్పందించకపోవడంతో మరో మిత్రుడికి ఫోన్‌చేసి గదిని పరిశీలించాలని కోరాడు. మిత్రులు వెళ్లి గదిని పరిశీలించగా. . అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు ఏదైనా సమస్యలు.. లేక ఆర్థిక సమస్యలేదైనా ఉండొచ్చని తోటి విద్యార్థులు పోలీసులకు తెలిపారు.



మృతుడు ఖలెద్ గుర్తింపు కార్డు

చలి - పులి


ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	10.7	34.7
మెదక్	12.9	36.2
రామగుండం	16.0	35.0
హైదరాబాద్	16.6	32.8
హన్మకొండ	17.0	34.0
నిజామాబాద్	17.0	34.0
కర్నూలు	17.0	36.7
అనంతపురం	17.8	33.8
కరీంనగర్	18.0	33.0
కడప	18.0	35.0
మహబూబ్‌నగర్	18.0	36.0
తిరుపతి	18.5	32.8
సూర్యాపేట	23.0	34.5
ఖమ్మం	23.0	36.0


సంగారెడ్డి జిల్లా వేల్పుగొండ గ్రామంలోని కాకతీయుల కాలం నాటి అద్భుత ఆలయానికి నల్లరంగు


కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామంలోని మల్లన్నగుట్ట వద్దగల శాసనంపై సున్నం


వెదిర గ్రామంలో మల్లన్నగుట్ట అంతర్థానమై కొత్తగా వెలసిన గ్రానైట్ గుట్ట

పూంఛ్ జిల్లాలో సరిహద్దుల గుండా భారత భూభాగంలోకి చొరబడేందుకు తీవ్రవాదుల ముఠా చేసిన యత్నాన్ని సైన్యం ఆదివారం భగ్నం చేసింది. ఆదివారం తెల్లవారుజామున 5:15 ప్రాంతంలో నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడింది. సరిహద్దు వెంబడి మోహరించి ఉన్న భారత సైన్యం అత్యంత అప్రమత్తంగా ఉండి...తీవ్రవాదుల కదలికలను ఇట్టే పసిగట్టేసింది. దాదాపు పదిహేను నిముషాల పాటు సరిహద్దుల వెంబడి కాల్పులు జరిగాయి.



మరణ 'శాసనమే'!

- అద్భుత శిల్ప సంపద, శాసనాలకు రంగులు
- క్వారీల కోసం గుత్తేదార్ల ఎత్తుగడ
- దారుణమంటున్న పురావస్తు శాఖ

ఈనాడు – హైదరాబాద్

కాకతీయులు సహా పలు రాజవంశాల కాలంలో నిర్మించిన అద్భుత నిర్మాణాలెన్నో తెలంగాణలో ఉన్నాయి. ఎక్కడ తవ్వినా శిల్పాలు కనిపించే ఊరుగా సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గం ప్రసిద్ధి. అలా బయటపడ్డ విగ్రహాలతోనే ఆ గ్రామంలో పాతికపైగా ఆలయాలు రూపుదిద్దుకున్నాయి. రుద్రమదేవి మరణ వివరాలు నల్గొండ జిల్లాలోని చందుపట్ల శాసనం ద్వారానే వెలుగుచూడగా.. ఇప్పటికీ ఎవరికంటా పడని, చదవని శాసనాలు రాష్ట్రంలో చాలానే ఉన్నట్లు చరిత్రకారుల నిశ్చితాభిప్రాయం.

మల్లన్నగుట్ట శాసనానికి రంగులు

విలువైన గ్రానైట్ రాళ్ల నిల్వలున్న కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే పెద్ద సంఖ్యలో చారిత్రక ప్రాధాన్యమున్న గుట్టలు నేలమట్టమయ్యాయి. గంగాధర మండలంలో మిగిలి ఉన్న దేవునిగుట్ట వంటి వాటినీ ధ్వంసం చేసేందుకు గుత్తేదార్లు యత్నిస్తున్నారు. వ్యూహంలో భాగంగా రామడుగు మండలం వెదిర గ్రామంలోని మల్లన్నగుట్ట వద్ద గల శాసనాలకు రంగులు పులిమేశారు. మల్లన్న గుడిలోని శాసనాలకు, అక్కడి శిల్పాలకూ రంగులద్దారు. సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గంలోని చాళుక్యులు, కాకతీయుల కాలం నాటి ఆలయాల్లోని శిల్పాలు, స్తంభాలు రంగులతో దర్శనమిస్తున్నాయి. ఇదే జిల్లాలోని వేల్పుగొండ వద్దగల ఒక శాసనంపైనా రంగులేశారు. గంగాధర మండలంలోని కోట్లనర్సింహులపల్లిలోని దేవునికొండను గుత్తేదార్లకు కేటాయించేందుకు కొద్దినెలల క్రితం గనులశాఖ శరవేగంగా దస్త్రాన్ని కదిపింది. కొండపైన కొలువైన నరసింహస్వామి ఆలయ విశిష్టతో సహా అక్కడి చరిత్రను 'ఈనాడు' వెలుగులోకి తేవడంతో వెనక్కితగ్గింది. 'శాసనాల్లో విలువైన సమాచారం ఉన్నట్టు తెలిసిన పక్షంలో చరిత్రకారులు కొండల్ని తవ్వనీకుండా అడ్డుకుంటారనే భావనతోనే కొందరు వాటిని నామరూపాలు లేకుండా చేస్తున్నారు.' అని ఆ ప్రాంత వాసులు వాపోయారు.

రంగుల్ని తొలగించటం చాలా కష్టం

శాసనాల్లోని వివరాలు నాశనం చేయడం దారుణం. శాసనాలు, శిల్పాలు, ఆలయాలకు పూసే దట్టమైన రంగులను తొలగించి వాటిని పూర్వ స్థితికి తీసుకురావటం కష్టమైన పని. రోజుల తరబడి రసాయన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అద్భుతమైన శిల్పసంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత.

– డి.కన్నబాబు, సూపరింటెండెంట్, భారత పురావస్తు సర్వే శాఖ, చెన్నై

యాదాద్రిలో ఘనంగా ధ్వజారోహణం


ధ్వజారోహణ పర్వంలో పాల్గొన్న అర్చకులు, ఆలయ ఈవో

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో రెండోరోజైన ఆదివారం ధ్వజారోహణం నిర్వహించారు. అష్టరాగాలాపన, వేద పఠనాల మధ్య వేద స్వరూపుడైన గరుత్మంతుడిని రప్పించే కార్యక్రమం ఉదయం పాంచరాత్ర ఆగమశాస్త్రోక్తంగా జరిగింది. ధ్వజపఠంపై గరుడ ఆళ్వారుడిని చిత్రించి బాలాలయం చెంత ధ్వజారోహణ పర్వాన్ని చేపట్టారు. సెలవురోజు కావడంతో భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

'భారత సంతతి' ఎన్నికల ప్రచారంపై న్యాయశాఖ మౌనం

దిల్లీ: ఎన్నికల ప్రచారంలో భారత సంతతి వ్యక్తులు పాల్గొంటున్న అంశంపై ఎన్నికల సంఘం (ఈసీ) లేవనెత్తిన ప్రశ్నకు.. కేంద్ర న్యాయశాఖ ఇంకా సమాధానమివ్వలేదు. అధికారిక, వ్యక్తిగత, పర్యటక కారణాలతో వీసాలు పొందుతున్న వీరు.. ప్రచారంలో పాల్గొనడం నిబంధనల ఉల్లంఘన కిందకి వస్తుందా అని ఈసీ ఇందులో ప్రశ్నించింది. అయితే ఈ విషయంలో ఏవైనా సూచనలుంటే చేయాలని న్యాయశాఖ తిరిగి ఈసీనే కోరింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో భారత సంతతి వ్యక్తులు ఆప్ తరఫున ప్రచారం నిర్వహించడంతో.. ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలో దీనిపై ఎలాంటి నిబంధనలూ లేకపోవడంతో.. విదేశీ వ్యవహారాలశాఖ దృష్టికి ఈసీ ఈ విషయాన్ని తీసుకువెళ్లింది. తిరిగి న్యాయశాఖ స్పందనను విదేశీ వ్యవహారాలశాఖ కోరింది.



మేధో ఆర్థిక వ్యవస్థలదే ఈ శకం

- రాష్ట్రపతి కోవింద్ వెల్లడి

దిల్లీ: డబ్బు కన్నా వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణల శక్తి చాలా గొప్పదని.. 'మేధో ఆర్థికవ్యవస్థ (నాలెడ్జ్ ఎకానమీ)'లదే ఈ శకమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. భారతీయ విలువలు, ఆధునిక విజ్ఞానం, సాంకేతికతల సంగమంతో.. మానవ సమాజ సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. దిల్లీ విశ్వవిద్యాలయంలోని పీజీడీఏవీ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో.. ఆదివారం ఆయన ఈమేరకు ప్రసంగించారు. ఇ-కామర్స్, రవాణా, పర్యటక రంగాల్లో అంకుర సంస్థల విజయాలను ప్రస్తావిస్తూ.. సఫలం చెందడానికి పెట్టుబడి కన్నా మానవ నైపుణ్యం, మేధస్సు ముఖ్యమని అన్నారు. ఉపాధి నిర్వచనం మారుతోందని.. స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవడంతోపాటు ఇతరులకు ఉద్యోగాలను కల్పించే అవకాశాలు వ్యక్తులకు లభిస్తున్నాయని కోవింద్ అభిప్రాయపడ్డారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా సాయం అందిస్తోందని తెలిపారు. సంఘ సంస్కర్త స్వామి దయానంద సరస్వతి బోధనలను వ్యాప్తి చేసేందుకు.. 130 ఏళ్ల క్రితం భారత విద్యావేత్త లాలా హన్స్‌రాజ్ లాహోర్‌లో డీఏవీ పాఠశాలకు పునాది వేశారని కోవింద్ గుర్తుచేశారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీ, తానూ డీఏవీ విద్యాసంస్థల్లో కోర్సులు చదివామని పేర్కొన్నారు.

సూపర్ స్మార్ట్ తెరలు

టోక్యో: అత్యంత పలుచని, సాగే గుణమున్న ఎలక్ట్రానిక్ తెరలను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. వీటిని చక్కగా చర్మంపై అతికించుకునే వీలుంది. చిన్నచిన్న శరీర స్పందనలనూ సునిశితంగా గుర్తించడం వీటి ప్రత్యేకత. దీనికోసం ప్రత్యేక వైద్య సెన్సర్‌లను ఉపయోగించారు. వైర్‌లెస్ సమాచార వ్యవస్థతో అనుసంధానించిన ఈ తెరలు ఇట్టే స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లకు సమాచారం చేరవేయగలవు. అధునాతన సెమీకండక్టర్ సాంకేతికతతో వీటిని అభివృద్ధి చేసినట్లు జపాన్‌లోని టోక్యో వర్సిటీ నిపుణులు తెలిపారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెరపైనా ఇవి చూపించగలవనీ పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని తరచూ పర్యవేక్షించే వైద్య ఉపకరణాల్లో వీటిని ఉపయోగించే వీలుందని చెప్పారు. వీటిలో సూక్ష్మ ఎల్ఈడీలు ఉన్నాయి. రబ్బరు షీట్‌కు వీటిని జాగ్రత్తగా పరిశోధకులు జతచేశారు. చర్మ స్వేద ప్రక్రియకు ఎలాంటి అడ్డూతగలకుండా తీర్చిదిద్దారు. వారం రోజులపాటు వీటిని అతికించి అలానే ఉంచేసుకున్నా.. ఎలాంటి చర్మ సమస్యలూ రావని వివరించారు.


కల్యాణ మండపంలో ఆసీనులైన వధూవరులు

దాతల సహకారంతో ఒక్కటైన 60 ముస్లిం జంటలు

- మసీద్ అబ్బాసియా కమిటీ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు

మఠంపల్లి, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన నిరుపేద ముస్లిం జంటలకు ఆదివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో దాతల సహకారంతో సామూహిక ఉచిత వివాహాలు జరిపించారు. మండల కేంద్రంలోని మసీద్ అబ్బాసియా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుంటూరు, కృష్ణా, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన 60 జంటలు ఒక్కటయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఖాజీ సంఘం సదరు ఎండీ ఎక్రాముల్లాసాహెబ్ నేతృత్వంలో నిఖా జరిపించారు. మసీద్ అబ్బాసియా కమిటీని, దాతలను ఆయన అభినందించారు. ఒక్కో జంటకు రూ.25వేలు విలువైన గృహోపకరణాలు అందజేసినట్లు కమిటీ సదరు షేక్ అబ్బాస్‌అలీ తెలిపారు. దాతలు షేక్ మహ్మద్ ఇషాక్ సాహెబ్, హాజీ ప్యారా అలీబాయ్, హాజీ అన్వర్ అలీబాయ్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన జల్లికట్టు

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

వి.కోట, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా వి.కోట మండల పరిధిలోని చింతమాకుపల్లెలో ఆదివారం నిర్వహించిన జల్లికట్టులో అపశ్రుతి చోటు చేసుకుంది. ఎద్దును నిలువరించే క్రమంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోటీలలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన మూడు వందలకు పైగా ఎద్దులు పరుగులు తీశాయి. వీటిని నిలువరించడానికి ప్రయత్నించిన కొందరు తీవ్రంగా గాయపడ్డారు. మండల పరిధిలోని గోనుమాకులపల్లెకు చెందిన మునెప్ప, తమిళనాడులోని ఎరుకంబట్టుకు చెందిన సురేష్, వి.కోటకు చెందిన బాషాలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎద్దుకొమ్ములు ఛాతిలో గుచ్చుకుని తీవ్ర రక్తస్రావమైన మునెప్పను మెరుగైన వైద్యం కోసం కుప్పానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న పలమనేరు డీఎస్పీ చౌడేశ్వరి గ్రామానికి చేరుకొని జల్లికట్టును నిలిపివేశారు.



రంగంలోకి కేంద్ర సంస్థలు

- పురుషోత్తమ్‌రెడ్డి కేసులో దర్యాప్తు చేయనున్న ఈడీ, ఐటీ శాఖ

ఈనాడు, హైదరాబాద్ : సంచలనం సృష్టిస్తున్న హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగం సంచాలకులు పురుషోత్తమ్‌రెడ్డి అవినీతి, అక్రమాస్తుల వ్యవహారంలో కేంద్ర సంస్థలు రంగంలోకి దిగనున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపన్నుశాఖ (ఐటీ) అధికారులు ఇప్పటికే దీనికి సంబంధించిన వివరాలు ఆరా తీస్తున్నారు. నిధుల మళ్లింపు వ్యవహారంలో ఈడీ, ఆదాయ వ్యయాలకు సంబంధించి ఐటీ అధికారులు దర్యాప్తు చేపట్టనున్నారు. దీనిపై అవినీతి నిరోధకశాఖ (అనిశా) అధికారులతో సంప్రదింపులు జరుపుతున్న ఈ రెండు సంస్థలు అవసరమైన ధ్రువపత్రాలను న్యాయస్థానం నుంచి సేకరించనున్నాయి. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతూ రెండోసారి అనిశాకు చిక్కిన పురుషోత్తమ్‌రెడ్డి అక్రమాస్తుల విలువ మార్కెట్ లెక్కల ప్రకారం అధికారులు రూ.25 కోట్లకు లెక్కగడితే, మంచిరేవుల వద్ద తన బినామీల ద్వారా వేసిన స్థిరాస్తి వెంచర్ విలువ రూ.30 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఇలాంటి వెంచర్లు మరికొన్ని బయటపడ్డాయని, వాటన్నింటినీ మదింపు చేస్తున్నట్లు తెలిసింది. ఒకసారి అనిశాకు పట్టుబడ్డ పురుషోత్తమ్‌రెడ్డి ఆ అనుభవంతో తన చేతికి మట్టి అంటకుండా అవినీతికి పాల్పడటం మొదలుపెట్టాడు. దీనిలో భాగంగానే తన బావమరిదిని రంగంలోకి దింపి తన సంపాదనను అతని ఆదాయంగా చూపించడం మొదలుపెట్టాడు. అలా చూపించిన ఆదాయంతో తన బినామీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టించేవాడని అనిశా దర్యాప్తులో బయపడింది. నిధుల మళ్లింపు వ్యవహారం ఈడీ పరిధిలోకి వస్తుంది. అక్రమార్జన తాలూకు నిధుల ప్రవాహం, తద్వారా ఆస్తులు కూడబెట్టుకోవడం పీఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్) పరిధిలోకి వస్తుంది. దీని ప్రకారం ఈడీ అధికారులు రంగంలోకి దిగబోతున్నారు. ఇది నిరూపణయితే అక్రమార్జన ద్వారా సమకూర్చుకున్న ఆస్తులను 180 రోజుల్లోగా ఈడీ అధికారులు స్వాధీనం చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మరోపక్క అసలు జరిగిన వ్యాపారం, చూపించిన ఆదాయం, చెల్లించిన పన్ను వంటి వాటిని ఐటీ అధికారులు దర్యాప్తు చేయనున్నారు. మొత్తంమీద పురుషోత్తమ్‌రెడ్డి కేసులో అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరగబోతోంది.



ఈనాడు

వ్యూహాత్మక ప్రయోజనాలెన్నో...

రెండు విశిష్ట నాగరికతల కరచాలనంగా దిల్లీ, టెహరాన్‌ల నెయ్యాన్ని ఇరాన్ అధ్యక్షుడిగా ఖతామీ లోగడ ఘనంగా శ్లాఘించారు. శతాబ్దాల చారిత్రక స్నేహ బాంధవ్యాన్ని ఉభయ తారక వాణిజ్య వృద్ధికి ఊతం చేసి, ప్రగతి ఇంద్రచాపాన్ని ఆవిష్కరించాలన్న సదాశయంతో ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ తాజాగా భారత్‌లో మూన్నాళ్లు పర్యటించారు. ఇండియా, ఇరాన్ దేశాల అగ్రనేతల మాటల్లో పరిమళిస్తున్న స్నేహ సుగంధాలకు దీటుగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ జోరందుకోవడం లేదన్న ఆక్షేపణల నేపథ్యంలో సాగిన రౌహానీ పర్యటన ఎంతో కీలకమైనది. టెహరాన్‌నుంచి నేరుగా హైదరాబాద్ విచ్చేసిన రౌహానీ- 'ఇరాన్ వర్ధిల్లాలి... ఇండియా వర్ధిల్లాలి' అంటూ మక్కా మసీదులో ప్రార్థనల అనంతరం చిరు ఉపన్యాసం దరిమిలా నినదించడం, అరమరికల్లేని అభిమానానికి అద్దం పట్టింది. భద్రత, వాణిజ్యం, ఇంధనం, ఉగ్రవాదం వంటి కీలక అంశాలపై విస్తృత సంప్రతింపుల దరిమిలా ఇండియా- ఇరాన్‌ల నడుమ తొమ్మిది ఒప్పందాలు కుదరడం స్వాగతించదగింది. ఇరు దేశాల మధ్య పెట్టుబడులు, సేవలను విస్తృతం చేసేలా ద్వంద్వ పన్నుల నివారణ ఒప్పందంతోపాటు- ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షల ప్రభావాన్ని అధిగమించేలా రూపాయి, రియాల్ కరెన్సీల్లో చెల్లింపులు నిరాఘాటంగా సాగించే అంశంలో సాధ్యాసాధ్యాల పరిశీలనకూ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. ప్రాంతీయ రవాణా సేవల్ని మెరుగుపరచడంలో భాగంగా చాబహార్- జాహెదన్ రైలు మార్గ నిర్మాణానికి తోడ్పాటునందిస్తామన్న ప్రధాని మోదీ- వాణిజ్యం, పెట్టుబడుల్లో మరింత బలీయ బంధానికి నిబద్ధత చాటుతున్నారు. ఏ ఒక్క అంశంపైనా భారత్ వైఖరితో తమకు భిన్నాభిప్రాయమే లేదన్న రౌహానీ- దేశీయంగా చుట్టుముడుతున్న తీవ్ర సమస్యలు, సంక్షోభాల్ని సమర్థంగా కాచుకోవడానికి భారత్‌తో ఇతోధిక బాంధవ్యం అక్కరకు వస్తుందని ఆశిస్తున్నారు. చెరువుకు నీటి ఆశ- నీటికి చెరువాశ చందంగా చేరువవుతున్న దిల్లీ, టెహరాన్లు ఒకేమాట ఒకే బాటగా సాగగలిగితే, అభివృద్ధికి ఆకాశమే హద్దు!

'ఎడబాటు రోజులు గతించాయి. ఎదురు తెన్నుల చీకట్లు మలిగిపోయాయి' అంటూ పర్షియన్ కవి హాఫీజ్ కవితా పంక్తుల స్ఫూర్తితో 2016 మే నెలలో భారత ప్రధాని మోదీ జరిపిన టెహరాన్ పర్యటన చరిత్రాత్మకమైనదిగా వాసికెక్కింది. చైనా దుందుడుకుతనానికి, పాకిస్థాన్ ఒంటెత్తు ధోరణులకు 'చెక్' పెట్టగలిగే వ్యూహాత్మక స్థావరంగా చాబహార్ ఓడరేవు అభివృద్ధిలో భారత్ భాగస్వామ్యానికి తథాస్తు పలుకుతూ కీలకమైన త్రైపాక్షిక ఒడంబడిక అప్పుడే కుదిరింది. దక్షిణ ఇరాన్‌లో నిర్మాణంలో ఉన్న చాబహార్ నౌకాశ్రయంలోని టెర్మినల్ ఏణ్నర్ధంపాటు ఇండియాకు అప్పగించేలా తాజాగా కుదిరిన అవగాహన మరెంతో కీలకమైనది. పాకిస్థాన్‌ను పక్కనపెట్టి అఫ్గానిస్థాన్‌తో నేరుగా వర్తక వాణిజ్యాలకు వీలు కల్పించేలా చాబహార్ స్వేచ్ఛా వాణిజ్య మండలిని అభివృద్ధి చేస్తే- ఎకాయెకి లక్షా 30వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో రైల్వే లైను సహా పెట్రో రసాయనాలు, ఉక్కు, ఎరువుల కర్మాగారాలు నెలకొల్పగల వీలుందని లోగడే గుర్తించారు. గుజరాత్‌లోని కాండ్లా నుంచి గోధుమల నౌక మూడు నెలలనాడు తొలిసారిగా చాబహార్ చేరుకోవడం, అక్కడినుంచి సరకు రోడ్డు మార్గాన అఫ్గాన్‌కు తరలించడం అభివృద్ధికి కొత్త బాటలు పరచిన పరిణామమే అయినా, లక్షించిన దానితో పోలిస్తే అది ఎంత? 2001లో ప్రధాని వాజ్‌పేయీ ఇరాన్ పర్యటన తొలిరోజే వెలువడిన 'టెహరాన్ డిక్లరేషన్' రెండు దేశాల సంబంధాలకు దిక్సూచిగా వాసికెక్కినా, తదుపరి పదిహేనేళ్లు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉండటం- యూపీఏ నేతాగణంలో దూరదృష్టి లేమికి నిదర్శనమే కదా? వడివడిగా మారుతున్న భౌగోళిక రాజకీయాల్లో ఇరాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం- చైనా పన్నుతున్న పద్మవ్యూహాన్ని ఛేదించడానికే కాదు, అగణిత వాణిజ్య వృద్ధికీ ఎంతో కీలకం కానుంది!

ప్రపంచంలోనే అత్యధికంగా చమురు నిల్వలున్న దేశాల్లో నాలుగో స్థానంలో ఉన్న ఇరాన్, సహజ వాయు నిక్షేపాల్లో రెండో స్థానంలో నిలుస్తోంది. ఇరాన్‌పై ధూర్తదేశంగా ముద్రవేసి, అమెరికా ఆంక్షల కొరడా ఝుళిపించిన తరుణంలో- ఇండియాకు గొట్టపు మార్గంలో సహజవాయు నిక్షేపాల సరఫరా ద్వారా ఆర్థిక క్లేశాల్ని అధిగమించాలని టెహరాన్ తలపోసింది. అమెరికా ఒత్తిళ్లకు లొంగిన యూపీఏ పెద్దలు భలే మంచి చౌక బేరాన్ని కాలదన్నేయగా, పాకిస్థాన్ ఆ అవకాశాన్ని దొరకబుచ్చుకొంది. బరాక్ ఒబామా కృషి ఫలించి 2015 జులైలో ఇరాన్‌తో చారిత్రక అణు ఒప్పందం పట్టాలకెక్కడంతో టెహరాన్‌తో బహుముఖ వాణిజ్యానికి అన్ని దేశాలూ బారులు తీరుతున్నాయి. మరో మూన్నాళ్లలో ఫ్రాన్స్‌లో జరగనున్న సమితి 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్' సదస్సు- 'బ్లాక్ లిస్ట్'నుంచి తన పేరు తొలగించేలా ఇండియా సహకరించాలని ఇరాన్ కోరుతోంది. అణు ఒప్పందాన్ని తూలనాడుతూ ఇరాన్‌పై గుడ్లురుముతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శివాలుతో ఆర్నెల్ల వ్యవధిలోనే 'రియాల్' విలువ నాలుగో వంతు కోసుకుపోయింది. అవినీతి, ఆర్థిక మాంద్యం, నిరుద్యోగిత, అసమానతలు పెరిగి ఇరాన్ నివురుగప్పిన నిప్పులా మారింది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక రంగ సముద్ధరణకు పెట్టుబడులకోసం చూస్తున్న రౌహానీ, భారత్ తోడ్పాటు కోరుతున్నారు. ఎవరి విలువ వారికిస్తూ- కత్తి కట్టిన కోడిపుంజుల్లాంటి ఇజ్రాయెల్, పాలస్తీనాలతో సౌహార్ద దౌత్యబంధాన్ని ముడివేసిన ప్రధాని మోదీ, అదే చాకచక్యాన్ని ఇరాన్, అరబ్ దేశాల మధ్య ప్రదర్శిస్తున్నారు. ఒకరికి చేరువ అవుతున్నామంటే అర్థం, వేరొకరికి దూరం జరుగుతున్నట్లు కాదన్న భారత్ వ్యూహాత్మక దౌత్యనీతి పాటవానికి ఇరాన్ గీటురాయి కానుందిప్పుడు!



సేద్యానికి ఎగుమతి వైద్యం




కోటేశ్వరరావు వీరా

గడచిన కొన్ని నెలలుగా అంతర్జాతీయ వ్యాపారం మళ్ళీ వృద్ధిబాట పట్టింది. ఈ ఏడాది వ్యాపారం మరింత దివ్యంగా ఉంటుందని అంచనాలు వెలువడుతున్నా, భారతదేశ ఎగుమతులు మాత్రం ఆశించిన మేరకు పెరగలేదు. ఆసియాలో ఇతర ప్రధాన దేశాలతో పోల్చినా మన ఎగుమతుల వృద్ధిరేటు తక్కువే. 2017 ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో భారతదేశ ఎగుమతులు అంతకు ముందు సంవత్సరంకన్నా 12 శాతం పెరిగాయి. ఇదే కాలంలో మలేసియా, ఇండొనేసియా, దక్షిణ కొరియా, వియత్నామ్‌ల ఎగుమతులు వరసగా 15.08, 15.94, 17.14, 23.83 శాతం చొప్పున పెరగడం చూస్తే, వాటి జోరు అర్థమవుతోంది. 2016లో అంతర్జాతీయ వాణిజ్యం కేవలం 2.4 శాతం పెరగ్గా, 2017లో 4.2 శాతం వృద్ధిని అందుకుంది. 2018లో ఈ రేటు నాలుగు శాతంగా ఉంటుందని భావిస్తున్నారు. అందువల్ల ఈ సంవత్సరం భారత్ నుంచి ఎగుమతులు ఇనుమడిస్తాయని బడ్జెట్‌కు ముందు విడుదలైన 2017-18 ఆర్థిక సర్వే నమ్మకం వ్యక్తీకరించింది. పెరుగుతున్న చమురు ధరలు ఎగుమతుల రథాన్ని కాస్త వెనక్కు లాగే అవకాశమున్నా, ప్రవాసులు పంపే జమలు పెరగడం ఖజానాకు దన్ను ఇస్తుంది. వస్తుసేవల పన్ను, వ్యాపార ప్రోత్సాహక విధానాలు మన ఉత్పత్తి, ఎగుమతులకు ఊతమివ్వొచ్చు.

విస్తృత ప్రభావం

నిజానికి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)ని ప్రవేశపెట్టినప్పుడు కొంతకాలంపాటు మన ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడింది. జీఎస్‌టీ తెచ్చిపెట్టిన సమస్యలు ఇప్పుడిప్పుడే తొలగుతున్నందున ఎగుమతులు మళ్ళీ పుంజుకొనే సూచనలు బలంగా ఉన్నాయి. ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ఎగుమతిదారుల విన్నపాలపై మరింత పకడ్బందీ చర్యలు తీసుకొని ఉండాల్సింది. జీఎస్‌టీకి సంబంధించిన అనిశ్చితులను తొలగించాల్సింది. డాలర్లలో వాణిజ్య లోటు ఇటీవల పెరిగిన సంగతి ఇక్కడ గమనార్హం. క్రితం సంవత్సరంతో పోలిస్తే 2017 ఏప్రిల్-డిసెంబరులో వాణిజ్య లోటు 50 శాతం ఎక్కువ. చమురు ధరలు పెరుగుతూనే ఉంటే, ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా వాణిజ్యలోటు మరింత పెచ్చరిల్లడం ఖాయం. ఈ పరిస్థితిలో ఎగుమతులను అధికం చేయడానికి ప్రోత్సాహకాలు ఇస్తే అదనపు విదేశ ద్రవ్యాన్ని ఆర్జించి వాణిజ్యలోటును అధిగమించగలుగుతాం. భారత్ నుంచి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను మరింత పెంచే అవకాశం పుష్కలంగా ఉందని గత ప్రభుత్వాలన్నీ గుర్తించినా ఇంతవరకు ఈ దిశగా సరైన చర్యలు తీసుకోనే లేదు. ప్రస్తుతం మన వ్యవసాయిక ఎగుమతుల విలువ 3,000 కోట్ల డాలర్లు కాగా, 2022 కల్లా వీటిని 10,000 కోట్ల డాలర్లకు పెంచవచ్చునని ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అంటే ఇప్పుడున్న దానికన్నా మూడు రెట్లు హెచ్చు ఎగుమతులు చేయవచ్చన్నమాట. దీన్ని సుసాధ్యం చేయడానికి ఆర్థికమంత్రి రెండు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశారు. మొదటిది- వ్యవసాయ సరకుల ఎగుమతులను సరళతరం చేయడం, రెండు- దేశంలోని మొత్తం 42 మెగా ఆహార పార్కుల్లో అత్యాధునిక నాణ్యతా పరీక్షా కేంద్రాలను స్థాపించడం. ఇవి రెండూ స్వాగతించాల్సిన ప్రతిపాదనలు. దేశంలో కొన్ని ముఖ్యమైన వ్యవసాయ ఉత్పత్తులకు కొరత రాకూడదన్న భావనతో వాటి ఎగుమతులపై ప్రభుత్వం నియంత్రణ విధించింది. వ్యవసాయ సరకులకు కొరత ఏర్పడితే ధరలు పెరిగి, సామాన్య ప్రజలు ఇబ్బందుల పాలవుతారు. ఇప్పుడు నియంత్రణ ఎత్తివేసి ఎగుమతులను సరళీకరిస్తే పర్యవసానం ఎలా ఉంటుందో ప్రభుత్వం పరిశీలించాలి.

భారతీయ వ్యవసాయ ఎగుమతుల నాణ్యతపై అమెరికా, జపాన్, ఐరోపా దేశాల్లో అభ్యంతరాలు వ్యక్తమైన ఉదంతాలు చాలానే ఉన్నాయి. వాటిని తొలగించి మన వ్యవసాయ సరకులు నాణ్యమైనవని భరోసా కల్పించడం ఎంతో అవసరం. అందుకే ప్రభుత్వం మెగా ఆహార పార్కుల్లో నాణ్యతా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తోంది. దానికన్నా ముందు మన రైతులకు ఎరువులు, క్రిమినాశనులను శాస్త్రీయంగా వినియోగించడంలో శిక్షణ ఇవ్వాలి. ఎగుమతులు వృద్ధి చెందినప్పుడు రైతు ఆదాయాలను రెట్టింపు చేయాలనే లక్ష్యం తేలిగ్గా నెరవేరుతుంది. పొలాల్లో పంటల పరిస్థితి, గిరాకీ, ప్రస్తుత నిల్వలను డిజిటలీకరించాలి. ఈ సమాచారం ఆధారంగా స్థిరమైన వ్యవసాయ ఎగుమతుల విధానాన్ని రూపొందించాలి. ఉత్పత్తి, శుద్ధి, నిల్వ, బట్వాడా వంటి అంచెలను పటిష్ఠంగా నిర్వహించే ఏర్పాట్లు ఉండాలి. వ్యవసాయ రంగం అధిక వృద్ధిరేటును నమోదు చేసినప్పుడు ఎగుమతులు సహజంగానే వర్ధిల్లుతాయి. ఎగుమతిదారులకు వడ్డీ సబ్సిడీ ఇవ్వడానికి ఉద్దేశించిన వడ్డీ సమానీకరణ పథకానికి కేటాయిపులను రూ.1,100 కోట్ల నుంచి 2017-18



వాణిజ్యావకాశాలను ఒడిసిపట్టాలి

సంవత్సరానికి రూ.2,000 కోట్లకు; 2018-19 సంవత్సరానికి రూ.2,500 కోట్లకూ పెంచారు. దీనివల్ల ఎగుమతిదారులకు తక్కువ రేట్లకు రుణాలు లభిస్తాయి. సరకుల బట్వాడా ఖర్చులూ తగ్గుతాయి. అలాగే రాష్ట్రాలకు కట్టిన సుంకాలను కేంద్రం భర్తీ చేసే ఆర్‌ఓఎస్ఎల్ పథకం కింద కేటాయింపులను రూ.1,555 కోట్ల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,855 కోట్లకు పెంచారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.21,654 కోట్లు కేటాయించనున్నారు. దీనివల్ల తివాచీలు, హస్తకళలు, నూలు, వస్త్ర ఎగుమతిదారులకు లబ్ధి చేకూరుతుంది. ఎగుమతి ఆర్డర్లు వచ్చినప్పుడు మాత్రమే సిబ్బందిని ఉద్యోగాల్లోకి తీసుకునే వెసులుబాటు తమకు ఉండాలని ఎగుమతిదారులు కోరుతున్నారు. కొన్ని రకాల ఎగుమతులకు కొన్ని సీజన్లలోనే గిరాకీ ఉంటుంది. కాబట్టి అలాంటి సమయాల్లో తాత్కాలిక ప్రాతిపదికపై సిబ్బందిని నియమించుకోవాలని ఆశిస్తున్నారు. తాజా బడ్జెట్ సరకుల బట్వాడా రంగానికీ ఊతమిచ్చింది. రైల్వేలు, రహదారులు, నౌకా రవాణా, కోస్తా వెంబడి నౌకాయానం, అన్ని టోల్‌గేట్ల వద్ద ఎలక్ట్రానిక్ చెల్లింపుల సౌకర్యం, సరకుల బట్వాడాకు సంబంధించిన అన్ని అంశాలకూ ఒకే పోర్టల్ ఏర్పాటు- ఇవన్నీ చాలా ముఖ్యమైన చర్యలు. వీటివల్ల బట్వాడా ఖర్చులు తగ్గి మన ఎగుమతులు ఇతర దేశాలతో పోటీపడగలుగుతాయి.

బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలు చేయడానికి తోడు, ప్రభుత్వం 2015-20 విదేశీ వాణిజ్య విధానాన్ని గత డిసెంబరు అయిదున సమీక్షించింది. స్వదేశంలో సరకులకు అదనపు విలువ జోడించి వస్తు సేవల ఎగుమతులను పెంచడం, అదనపు ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ మధ్యంతర సమీక్ష లక్ష్యాలు. ఎగుమతులకు ఊతమివ్వడానికి ఈ సమీక్షలో వార్షిక ప్రోత్సాహకాన్ని 34 శాతం పెంచి రూ.8,450 కోట్లకు తీసుకెళ్లారు. ఇందులో రూ.749 కోట్లను తోలు, పాదరక్షల ఎగుమతి రంగానికి, రూ.1,354 కోట్లను వ్యవసాయ ఎగుమతులకూ, రూ.759 కోట్లను సముద్ర ఉత్పత్తులకు, రూ.369 కోట్లను టెలికం, ఎలక్ట్రానిక్ వస్తు ఎగుమతులకు, రూ.921 కోట్లను చేతితో చేసిన తివాచీల ఎగుమతికి, రూ.193 కోట్లను వైద్య, శస్త్రచికిత్స పరికరాలకు, రూ.1,140 కోట్లను జౌళి, రెడీమేడ్ దుస్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి కేటాయించారు. ఇవన్నీ కార్మికులను పెద్ద సంఖ్యలో నియోగించే రంగాలు కాబట్టి తాజా ప్రోత్సహకాల వల్ల అదనపు ఉద్యోగావకాశాలు లభ్యమవుతాయి. భారత్ నుంచి సరకులు, సేవల ఎగుమతి ప్రోత్సాహక పథకాలైన ఎంఈఐఎస్, ఎస్ఈఐఎస్‌ల కింద ఎగుమతిదారులకు ఇప్పటికే లభిస్తున్న ప్రయోజనాలకన్నా రెండు శాతం అదనపు ప్రయోజనాలు లభించనున్నాయి. ఏదిఏమైనా భారతీయ ఎగుమతిదారులు అంతర్జాతీయ అవకాశాలను మరింత భారీ స్థాయిలో అందిపుచ్చుకోవాలి.

తెలుగు రాష్ట్రాల్లో...

భారతదేశ ఎగుమతుల్లో రాష్ట్రాలవారీ వాటాలను తెలుసుకునే అవకాశాన్ని 2017-18 ఆర్థిక సర్వే మొట్టమొదటిసారిగా అందించింది. మహారాష్ట్ర వాటా 22.3 శాతంకాగా, తరవాతి స్థానాలను గుజరాత్ (17.2), కర్ణాటక (12.7), తమిళనాడు (11.5) ఆక్రమిస్తున్నాయి. 6.4 శాతం వాటాతో తెలంగాణ అయిదో స్థానాన్ని ఆక్రమిస్తుంటే, 2.8 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. భారత ఎగుమతుల్లో 70 శాతం వాటాను ఈ ఆరు రాష్ట్రాలే ఆక్రమిస్తున్నాయి. భారతదేశంలో రాష్ట్రాల మధ్య సరకుల వ్యాపారం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 30-50 శాతం వరకు ఉంటుందని గత ఏడాది ఆర్థిక సర్వే వివరించింది. వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) గణాంకాల ప్రకారం ఈ వ్యాపారం జీడీపీలో 60 శాతానికి చేరింది. రెండు తెలుగు రాష్ట్రాలు తమ ఎగుమతులను మరింత పెంచుకోవడానికి కృషి చేయాలి. రాష్ట్రాలు ఎగుమతుల వృద్ధికి నోడల్ అధికారులను నియమించాలని, ఈ పదవుల్లో నిపుణులను నియోగించాలని కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు జనవరి సమావేశంలో సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎమ్ఎస్ఎమ్ఈ) నుంచి ఎగుమతులను పెంచడానికి ప్రభుత్వం అండదండలనివ్వాలి. విదేశీ మార్కెట్లకు ఎగుమతి అవకాశాల గురించి ఈ పరిశ్రమలకు తెలియజెప్పాలి. అంతర్జాతీయంగా మార్కెటింగ్ అవకాశాలను విస్తరించాలి. ఎగుమతుల వృద్ధికి కృషి చేయడానికి ప్రత్యేక ప్రభుత్వ విభాగాలను ఏర్పరచాలి. విదేశీ వాణిజ్య ప్రోత్సాహక మండలుల్లో నిపుణులు, సలహాదారులను నియమించి వస్తుసేవల ఎగుమతులను పెద్దయెత్తున పెంచాలి.



డాక్టర్ జీవీఎల్ విజయ్‌కుమార్

ప్రతి ఏరూ... కాలుష్య కావేరే

పల్లపు ప్రాంతాలకు గలగలమని ప్రవహించడమే తప్ప భాష, ప్రాంతం, ఎల్లలు ఎరుగని ప్రకృతి ప్రసాదిత సహజ వనరులు- నదీజలాలు! 'గాలి, నీరు వంటి ప్రకృతి వనరులు జాతీయ సంపద, ఉమ్మడి సొత్తు. వీటిపై ఏ ఒక్కరికీ ప్రత్యేక యాజమాన్య హక్కులుండ'వంటూ దేశ సమగ్రత, సమైక్యత స్ఫూర్తి సందేశాన్ని తన తీర్పు ద్వారా సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం కావేరి నదీ జలాల పంపిణీ తీర్పు ద్వారా జాతికి అందజేసింది. నదీ జలాల వాటా కోసం పోట్లాటలు మాని విచక్షణాయుతంగా వినియోగించుకుంటూ రాష్ట్రాలు బాధ్యతాయుతంగా మెలగాల్సిన ఆవశ్యకతను ధర్మాసనం తీర్పు చాటుతోంది. వాస్తవానికి నదీ జలాలు పరిశుభ్రంగా ఉంటేనే వాటిని వినియోగించుకోగలం. అవి కాలుష్యాల బారినపడితే కడవడైననేమి ఖరము పాలు అన్నట్లు పరిస్థితి తయారవుతుంది. దేశంలో ఉత్తరాదిన ప్రవహించే గంగ, యమునల్లోని కాలుష్యాన్ని తలదన్నేలా కావేరీ నది ఏనాడో కాలుష్య కాసారమైపోయిందని ఇటీవలి అధ్యయనాలు చాటుతున్నాయి. దక్షిణాదిన కావేరీతో పాటు కృష్ణా, గోదావరీ నదులూ కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. నదీ జలాల్లో వాటాల కోసం పోరాడుతున్న ప్రభుత్వాలు, వాటిని పర్యావరణ హితకరంగా సమన్వయంతో తీర్చిదిద్దుకోవడం ప్రాణావసరం!





పెచ్చరిల్లుతున్న ప్రమాదం

దేశంలో చిన్నవి పెద్దవి కలిపి దాదాపు 445 నదులు ఉన్నాయి. వాటిలో 275 నదులు తీవ్ర కాలుష్యం బారిన పడ్డాయని జాతీయ కాలుష్య నియంత్రణ మండలి అధ్యయనం తేల్చిచెప్పింది. అయిదేళ్లలో కాలుష్య కాసారాలైన నదుల సంఖ్య రెట్టింపు అయిందని గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. నీటిలో జీవ ప్రాణ వాయువు ప్రమాణం లీటరుకు మూడు మిల్లీగ్రాములకన్నా తక్కువకు పడిపోయింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే దేశంలో తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు ఆ జలాలను వాడుకోలేని దుస్థితి ఉత్పన్నమవుతుంది. పారిశ్రామిక, మునిసిపల్ వ్యర్థాలను విచక్షణారహితంగా వదిలేస్తుండటంతో జీవనదులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ గంగా నదీ పరిరక్షణకు నడుంబిగించారు. ఆ ప్రయత్నాలు గంగా యమునా నదులకే పరిమితం కారాదు. దేశంలోని అన్ని ప్రధాన నదులను కాలుష్యం బారి నుంచి కాపాడటానికి ఉద్యమస్థాయిలో కార్యాచరణ పథకాలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం జాతి నెత్తిన ఉరుముతోంది. దక్షిణ భారతదేశంలో శరవేగంగా పట్టణీకరణ, పారిశ్రామికీకరణ జరుగుతోంది. దీనివల్ల ఇక్కడి ప్రధాన నదులు కావేరీ, కృష్ణా, గోదావరి, తుంగభద్రల్లో కాలుష్యం అంతకంతకు పెచ్చరిల్లుతోంది. హైదరాబాద్‌లోని మూసీనదీ జలాలు ఏనాడో విషపూరితమయ్యాయి. భయంకరమైన స్థాయిలో హానికర రసాయనాలు, సీసం, పాదరసం, ఇతర భారలోహాలు కరిగి నీరు విషతుల్యమైపోయింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కావేరీ నదీ జలాల వినియోగం విషయంలో వివాదం తలెత్తినప్పుడల్లా జాతీయస్థాయిలో అది చర్చనీయాంశమవుతోంది. నదీ జలాల్లో హానికారక రసాయన వ్యర్థాల నియంత్రణలో మాత్రం అవి గుంభనంగా ఉండిపోతున్నాయి.

నదుల పరిరక్షణ తక్షణావసరం

కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 802 కి.మీ. పొడవునా ఈ నది ప్రవహిస్తోంది. గత డిసెంబరులో అన్నా విశ్వవిద్యాలయ అధ్యయనంలో కావేరీ నదిలో హానికర రసాయనాలు తీవ్రస్థాయిలో ప్రవహిస్తున్నాయన్న చేదు నిజం బయటపడింది. మొత్తం గంగానదిలోని కాలుష్య మోతాదుకు అయిదు రెట్లు అధికంగా కావేరి నదిలో కాలుష్యాలు ఉండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. నదీ కాలుష్యంతోపాటు రెండు రాష్ట్రాల్లోని భూగర్భజలాలూ కలుషితమయ్యాయి. పారిశ్రామికవాడలకు దగ్గరలోని ప్రాంతాలు, ఉపనదుల సంగమ స్థానాలు, కోస్తాతీర ప్రాంతాల్లోని భూగర్భజలాలు అత్యంత కాలుష్య కారకంగా మారడం ఆయా ప్రాంత ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ప్రమాద ఘంటిక. సోడియంగల నీటిని తాగినవారు అధిక రక్తపోటు బారిన పడే ప్రమాదం ఉంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే సమీప భవిష్యత్తులో కావేరి మృతనదిగా మారే దుస్థితి నెలకొని ఉందన్నది అన్నా విశ్వవిద్యాలయ నివేదిక సారాంశం!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ కృష్ణా, గోదావరి, తుంగభద్రలదీ ఇదే పరిస్థితి. మూసీనది గురించి వేరే చెప్పనక్కర్లేదు. తెలంగాణలో కృష్ణానదీ పరివాహక ప్రాంతంలోని రసాయన, సిమెంటు పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు నేరుగా కృష్ణాలోనే కలుస్తున్నాయి. ప్రమాదకరమైన విషపూరిత రసాయనాలతో ప్రవహిస్తున్న మూసీ సైతం కృష్ణలో కలుస్తుండటంతో జలాలు తీవ్రంగా కలుషితమవుతున్నాయి. విజయవాడ నగరంలోని మురుగునీరు, విద్యుత్తు, రసాయన, సిమెంటు పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాలూ కృష్ణనే చేరుకుంటున్నాయి. తుంగభద్రలో సైతం పరివాహక ప్రాంతంలోని రసాయనిక ఘన వ్యర్థాల వల్ల జలాలు కాలుష్యపూరితమవుతున్నాయి.

స్వచ్ఛభారత్ స్ఫూర్తితో..

నదీజలాల అవసరం గురించి ప్రభుత్వాలు ఎంతగా ఆత్రుత పడుతున్నాయో, వాటి పరిశుభ్రత, పరిరక్షణ గురించీ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంతో పవిత్రంగా పుట్టే నదీ జలాలు ప్రవాహ క్రమంలో కాలుష్యాలతో అంతగా అపవిత్రమవుతున్నాయి. అందువల్ల నదులను పరిరక్షించుకోవడం ప్రభుత్వాలు, ప్రజల పవిత్ర ధర్మం కావాలి. దేశంలోని అన్ని నదుల ప్రక్షాళనకు పాలకులు యుద్ధప్రాతిపదికన నడుం బిగించాలి. ప్రజల్లో చైతన్యం పెంచాలి. స్వచ్ఛభారత్ స్ఫూర్తిని మరింత విస్తరించి, నదులను కాపాడటానికి ప్రజలు, పాలకులు ముందడుగు వేయాలి. శుద్ధీకరణలో భాగంగా మొదట పరిశ్రమలు, పట్టణాలు విడుదలచేసే వ్యర్థాలు, మురుగు నదుల్లోకి చేరకుండా కట్టుదిట్టమైన నియంత్రణ చర్యలు చేపట్టాలి. ప్రతి వాడ, పట్టణంలో మురుగునీరు, వ్యర్థాలను శుద్ధిచేసి పరిశ్రమల్లో పునర్వినియోగానికి, తోటల పెంపకానికి ఉపయోగించేలా చర్యలు చేపట్టాలి. థేమ్స్ నది శుద్ధీకరణలో లండన్ అనుసరించిన కార్యాచరణ ప్రణాళిక ఎంతైనా ఆదర్శప్రాయం. బెంగళూరు తరహాలోనైనా ఎక్కడికక్కడ మురుగు జలాల శుద్ధీకరణ యూనిట్లను దేశంలోని అన్ని నగరాలు, పట్టణాలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రకృతి ప్రసాదించిన నదీజలాల సంరక్షణ పౌరుల ప్రాథమిక బాధ్యత కావాలి. ఆ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలి. నదీజలాల సంరక్షణోద్యమంలో అందరినీ భాగస్వాముల్ని చేయాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నదీజలాల పరిరక్షణావశ్యకత గురించిన పాఠ్యాంశాలను బోధించాలి. పారిశ్రామిక వ్యర్థాలను విడుదలచేసే విషయంలో నిబంధనలు కఠినతరం చేసి, అవి కచ్చితంగా అమలయ్యేలా చూడాలి. ఏళ్లతరబడిగా పట్టాలకెక్కని మూసీ మాస్టర్‌ప్లాన్‌ను సత్వరమే రూపొందించి ఆచరణలోకి తేవడం ద్వారా మూసీ శుద్ధీకరణను వేగిరం చేయాలి. మూసీ పరివాహక ప్రాంతంలోని పరిశ్రమలు విడుదల చేసే రసాయన, హానికారక వ్యర్థాలను తక్షణమే నిలువరించాలి. ఆ వ్యర్థాల రీసైక్లింగ్, ప్రాసెసింగ్ కోసం కేంద్రాలను ఏర్పాటు చేయాలి. లేని పక్షంలో వాటి లైసెన్సులను రద్దు పరచడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే దేశంలో నదీజలాల పరిస్థితి కొంతమేరకైనా మెరుగవుతుంది!

దైవదృష్టి

ధర్మయుద్ధాలన్నీ మంచీచెడుల మధ్యనే జరిగాయి. ధర్మం పక్షాన దేవతలు, ధర్మపరులు, సజ్జనులు ఉండగా అధర్మం పక్షాన రాక్షసులు, అధర్మపరులు, దుర్మార్గులు ఉండటం పురాణ గాథల్లో చూడవచ్చు. ధర్మ-అధర్మ మీమాంస కలిగినప్పుడు ఏది శాంతికారకమో అది ధర్మం, ఏది అశాంతిని రగిలిస్తుందో అది అధర్మమని విజ్ఞులు చెబుతారు.

ఏ మనిషీ పుట్టుకతో అధర్మపరుడు కాడు. పెరిగిన వాతావరణం, బంధుమిత్ర బృందాల ప్రభావం- మంచి చెడుల పరిణామాలకు కారణమవుతాయి. ఎవరు లోకహితం కోరతారో వారందరూ భగవంతుడికి ప్రీతిపాత్రులు. వెలుగూ ఆయనే, చీకటీ ఆయనే. పరస్పర విరుద్ధమైన ప్రకృతి-వికృతులు తన మాయారూపాలుగా భగవంతుడు గీతలో వివరించాడు. అధర్మం హద్దుమీరినప్పుడు ఆయన ప్రత్యక్షంగా ప్రమేయం పెట్టుకుంటాడు. ధర్మ పక్షపాతిగా వ్యవహరించి అధర్మాన్ని రూపుమాపుతాడు.

ప్రజారంజక పాలన అంటే- ప్రభువు ప్రజలను తన యజమానులుగా, తాను వారికి సేవకుడిగా భావిస్తూ కంటికి రెప్పలా కాపాడటం. రామరాజ్యం ఇందుకు ఉదాహరణ. శ్రీరాముణ్ని ఆదర్శంగా స్వీకరించి ఎందరో ప్రజారంజకంగా పరిపాలించారు. స్థితి కారకుడైన విష్ణువు సృష్టిని సదా రక్షిస్తున్నట్లే, విష్ణుస్వరూపుడిగా భావించే రాజు కూడా ప్రజల ప్రయోజనాల్ని ఎల్లప్పుడూ కాపాడాలి. అలా ఎప్పుడు జరగలేదో, అప్పుడు రాజ్యం అరాచకమవుతుంది. శత్రుపీడలు పెరుగుతాయి. ఇవన్నీ చారిత్రక సత్యాలు. రాజు తన ప్రజల పట్ల జాతి మత కుల విచక్షణ లేని సమదృష్టి కలిగి ఉండాలి. దీన్ని 'దైవదృష్టి'గా భావిస్తారు.

మానవులు అత్యల్పమైన తమ జీవితకాలంలో కేవలం పూజలు, భజనలు, ప్రదక్షిణలు వంటి బాహ్య చర్యలకే పరిమితం కారాదు. భగవంతుడి అభిమతానికి అనుగుణంగా తమ జీవితాల్ని తీర్చిదిద్దుకొని, దృఢమైన అనుబంధం పెంచుకోవాలి. గర్భగుడిలోని మూల విరాట్టును చూడటానికి ఒకటే ఆరాటపడే బదులు, దేహాంతరాలయంలో కొలువై ఉన్న అంతర్యామిని దర్శించడానికి అహరహం తపించాలి. అది జగన్మాత దర్శనం కోసం రామకృష్ణ పరమహంస పడిన వేదనతో పోలి ఉన్నప్పుడు- తక్షణం మనలోని అంతర్యామి స్పందించి మన ఆత్మను అక్కున చేర్చుకుంటాడు.



అంతర్యామి

భక్తి అంటే ఆంజనేయస్వామికి రాముడి పట్ల గల భక్తితో పోల్చదగినదిగా ఉండాలి. అంటే రామనామమే శ్వాస కావాలి. అలాంటి ఆకాంక్షతో సాధకుడు తన శక్తులన్నింటినీ ఏకీకృతం చేసినప్పుడు, ఆత్మ ఉత్తేజం పొందుతుంది. దైవశక్తిని భక్తితో తనలో నింపుతుంది. ఆ స్థితిలో మనసు శుద్ధ సత్వ తత్వం అందుకుంటుంది. మన చూపులు సృష్టిని దైవదృష్టితో చూడగలుగుతాయి. అప్పుడు సమభావం కలుగుతుంది. అన్ని ప్రాణుల పట్లా ప్రేమభావం ఉప్పొంగుతుంది. బాధితులను, పీడితులను కరుణామయ దృష్టితో, జీసస్ మనసుతో చూడగలుగుతాం. మదర్ థెరిసాలా వ్యాధిపీడితులకూ ప్రేమగా సేవలు చేయగలుగుతాం. రమణ మహర్షిలా ఆత్మవిచారణలో నిమగ్నమవుతాం. భగవంతుడి కోసం బయట వెతుకులాట మానేస్తాం. మనలోనే విరాజమానుడై ఉన్న అంతర్యామి ఉనికిని సదా అనుభవించగలుగుతాం.

సాధనా పద్ధతులు ఎలా ఉండాలో తెలుసుకోవడానికి చూపే శ్రద్ధ- భగవంతుడి పట్ల అనురక్తిని, భక్తిని అభివృద్ధిని చేసుకోవడంలోనూ చూపాలి. అప్పుడే సాధకుడు భక్తి అనే రాజమార్గంలో, భగవంతుడి మీద ఏకాగ్ర చిత్తంతో ముందుకు సాగుతాడు. అతడికి ఎటు చూసినా దైవత్వం, దివ్యత్వం, ప్రేమతత్వమే దర్శనమిస్తాయి. అప్పుడు అతడు- కాషాయం ధరించని సన్యాసి, ఆశలు వేధించని అవధూత, దేహాంతరాలయానికి పరమ పూజారి. అంతర్యామికి అతడే అవిశ్రాంత అర్చకుడు. అలా జీవించినప్పుడే సాధకుడిపై భగవంతుడి అనుగ్రహ దృష్టి ప్రసరిస్తుంది. అదే కైవల్యం!

– జి.నరసింహమూర్తి

విదేశీ చదువుకు దూరంగా యువత!

- ట్రాన్‌స్క్రిప్టులకు దరఖాస్తు చేసిన వారి సంఖ్య సగం తగ్గుదల
- 2015 డిసెంబరు నాటి చేదు ఘటనల నుంచే ప్రభావం మొదలు
- ట్రంపు ప్రభావమూ కొంతవరకు ఉందంటున్న నిపుణులు

ఈనాడు - హైదరాబాద్

అమెరికాలాంటి దేశాల్లో విదేశీ చదువుపై వెళ్లే తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందా? కారణాలు ఏమైనా రెండేళ్లుగా విదేశీ విద్యకు యువత దూరంగా ఉంటుందా? జేఎన్‌టీయూ నుంచి ట్రాన్‌స్క్రిప్టులు పొందిన వారి సంఖ్య సగానికిపైగా తగ్గడాన్ని బట్టి అదే నిజమని స్పష్టమవుతోంది. విదేశీ విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ట్రాన్‌స్క్రిప్టులు తప్పనిసరి. వాటికి దరఖాస్తు చేసే వారి సంఖ్య తగ్గిపోవడాన్ని బట్టి విదేశాల్లో చదవాలన్న ఆసక్తి తాత్కాలికంగానైనా సన్నగిల్లిందని ఆచార్యులు విశ్లేషిస్తున్నారు.

విదేశాల్లో చదవాలనుకున్న విద్యార్థులు అధిక శాతం మంది కనీసం 5-10 విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేస్తుంటారు. దరఖాస్తు సమయంలో తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను కూడా ఆయా విశ్వవిద్యాలయాలకు పంపిస్తారు. వారి వద్ద విద్యార్హతకు సంబంధించి అసలు ధ్రువపత్రం (ఒరిజనల్ డిగ్రీ-ఓడీ) పట్టా ఒక్కటే ఉంటుంది. దాన్ని వర్సిటీలకు పంపించలేరు. అలాగని ఫొటోస్టాట్ కాపీలను పెడితే విదేశీ వర్సిటీ అధికారులు అనుమతించరు. ఈ క్రమంలోనే ట్రాన్‌స్క్రిప్టులను పంపిస్తారు. విశ్వవిద్యాలయం అధికారికంగా ఆమోదించిన మార్కుల ధ్రువపత్రాన్నే ట్రాన్‌స్క్రిప్టుగా పిలుస్తారు. ప్రస్తుతం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా లాంటి దేశాలకే ఉన్నత విద్య కోసం వెళ్తున్నారు. అందులోనూ 80 శాతానికిపైగా బీటెక్ పూర్తి చేసిన వారే ఉంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 212 ఇంజినీరింగ్ కళాశాలల్లో 195 వరకు జేఎన్‌టీయూ పరిధిలోనివే. వాటిల్లో బీటెక్ ఉత్తీర్ణులైన వారు జేఎన్‌టీయూ నుంచే ధ్రువపత్రాలు పొందాలి. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంపు ఎన్నిక కావడం..ఆయన ఎన్నికల ప్రచారంలో స్థానికులకే ఉద్యోగాలని ప్రచారం చేయడం తదితర పరిస్థితుల నేపథ్యంలో జేఎన్‌టీయూ నుంచి ట్రాన్‌స్క్రిప్టుల కోసం దరఖాస్తు చేసిన విద్యార్థుల సంఖ్యను 'ఈనాడు' పరిశీలించింది.



రెండేళ్లలో ఎంత మార్పు!

మూడేళ్ల క్రితం..2015లో దాదాపు 60 వేల మంది విద్యార్థులు ధ్రువపత్రాల కోసం జేఎన్‌టీయూహెచ్‌కు దరఖాస్తు చేసుకోగా.. 2017లో అది 24,588కి పడిపోయింది. 60 శాతం తగ్గిపోయింది. అయితే జేఎన్‌టీయూ హెచ్ పరిధిలో 25 స్వయంప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. వాటిల్లో ఎక్కువగా 2012లో స్వయంప్రతిపత్తి పొందాయి. ఆనాడు బీటెక్ ప్రథమ సంవత్సరంలో చేరిన వారు 2016లో ధ్రువపత్రాలను అదే కళాశాల నుంచి పొందుతారు. వాటిల్లో సుమారు 15 వేలమంది విద్యార్థులుంటారు. కనీసం సగంమంది ఆ కళాశాలల నుంచి దరఖాస్తు చేసుకొని వెళ్లారనుకున్నా.. 2015, 2016కు ఇంకా దాదాపు 20 వేల వ్యత్యాసం ఉందని జేఎన్‌టీయూ పరీక్షల విభాగం సంచాలకుడు ఆచార్య కామాక్షిప్రసాద్ చెప్పారు.

ట్రంప్ రాకముందే ప్రభావం..

- అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరిగింది 2016 నవంబరు 8న. అధ్యక్షుడు ట్రంపు ఎన్నిక ప్రభావం అనుకున్నా అది 2017లో ఉండాలి. వాస్తవానికి 2016లో భారీగానే ట్రాన్‌స్క్రిప్టుల దరఖాస్తులు తగ్గాయి.
- మరి 2015తో పోల్చుకుంటే 2016లో 46 శాతం దరఖాస్తులు తగ్గాయి. స్వయంప్రతిపత్తి కళాశాలల్లోని వారిని పరిగణలోకి తీసుకున్నా మొత్తం సుమారు 40 వేలు అవుతాయి. అయినా ఇంకా 19 వేలకు పైగా తగ్గినట్లే.
- 2015 డిసెంబరులో తెలుగు రాష్ట్రాలకు చెందిన పదుల మంది విద్యార్థులను అమెరికా అధికారులు విమానాశ్రయం నుంచే వెనక్కి పంపించారు. చదువుకోవడానికి రావడం లేదని, నకిలీ బ్యాంకు డిపాజిట్లు చూపుతున్నారని తదితర కారణాలు చూపారు. ఆ సమయంలో అమెరికా వెళితే నష్టపోతామన్న ఆలోచనతో 2016లో దరఖాస్తు చేసే వారు భారీగా తగ్గిపోయి ఉంటారని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- హెచ్1బీ వీసాలను పెంచే ఆలోచన చేస్తుండటం, దేశాల వారీగా గ్రీన్‌కార్డుల జారీ విధానాన్ని రద్దు చేయనుండటం భారతీయులకు ప్రయోజనం కలిగించనుంది, అందువల్ల మళ్లీ విదేశీ విద్యకు వెళ్లే వారు పెరిగే అవకాశం లేకపోలేదని ఓయూ ఆర్థికశాస్త్రం ఆచార్యుడు వేణుగోపాలరావు అభిప్రాయపడ్డారు.

గత మూడేళ్లలో ట్రాన్‌స్క్రిప్టులకు దరఖాస్తు చేసిన విద్యార్థులు

సంవత్సరం	విద్యార్థులు
2015	59,398
2016	32,530
2017	24,588

(ప్రతి ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు దరఖాస్తులు)

తెలంగాణ రాష్ట్రంలో ప్రతిఏటా ఉత్తీర్ణులయ్యే ఇంజినీరింగ్ విద్యార్థులు	రాష్ట్రం నుంచి ఏటా విదేశాలకు వెళ్లే విద్యార్థులు	ప్రస్తుతం విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు	అమెరికాలో చదువుతున్న భారతీయులు	భారతీయులు అమెరికా చదువుకు చేస్తున్న వార్షిక వ్యయం	2008-12 మధ్య ఒక్క హైదరాబాద్ నగరం నుంచే అమెరికాకు వెళ్లిన విద్యార్థులు
సుమారు 60 వేల మంది	సుమారు 12 వేలు	5.80 లక్షలు	2.06 లక్షలు	రూ.42 వేల కోట్లు	26,220 (దేశంలో మొదటి స్థానం)



త్రిదండి చినజీయర్‌స్వామి ఆశ్రమ ప్రాంగణంలో సిద్ధమవుతున్న 216 అడుగుల ఎత్తయిన స్వామి రామానుజాచార్యుల విగ్రహం

తుదిమెరుగుల్లో భారీ రామానుజాచార్యుల విగ్రహం

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని త్రిదండి చిన జీయర్‌స్వామి ఆశ్రమ ప్రాంగణంలో పంచలోహాలతో ఏర్పాటు చేస్తున్న భారీ స్వామి రామానుజాచార్యుల విగ్రహం పనులు ప్రస్తుతం తుది దశకు చేరాయి. సుమారు 216 అడుగుల ఎత్తుతో ఈ విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. స్వామి రామానుజాచార్యుల నిత్యారాధన కోసం 120 కిలోల బంగారంతో మరో విగ్రహాన్నీ శరవేగంగా తయారు చేస్తున్నారు. ఈ రెండింటికి కలిపి మొత్తం రూ. వెయ్యి కోట్లు వ్యయం చేస్తున్నారు. 216 అడుగుల ఎత్తుతో కొలువుదీరే భారీ విగ్రహం దిగువన సిద్ధమవుతున్న సమతామూర్తి భవనంలో బంగారు విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. చైనా నుంచి వచ్చిన శిల్పులు, నిపుణుల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. సమతామూర్తి కేంద్రంలో స్వామి రామానుజాచార్యుల సమగ్ర జీవిత చరిత్రను భక్తులు, సందర్శకులకు దృశ్యరూపంలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకూ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

- ఈనాడు, రంగారెడ్డి జిల్లా

కేటీఆర్‌కు ఆసియా పసిఫిక్ బిజినెస్ అసోషియేషన్ ఆహ్వానం

తెలంగాణ కోసం ప్రత్యేక రౌండ్ టేబుల్

ఈనాడు, హైదరాబాద్: ఆసియా దేశాలతో జర్మనీ నిర్వహించే 98వ ఆసియా పసిఫిక్ బిజినెస్ అసోషియేషన్ సమావేశంలో పాల్గొనాలని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కె.టి.రామారావుకు ఆహ్వానం వచ్చింది. మార్చి రెండో తేదీన హంబర్గ్‌లో జరిగే ఈ సమావేశంలో పాల్గొనే కేటీఆర్ రాష్ట్రంలో ఉన్న వాణిజ్య అవకాశాలను వివరించనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ కోసం ప్రత్యేకంగా ఒక రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ను సంస్థ ఏర్పాటు చేయనుంది. అంతర్జాతీయంగా పేరున్న 300 మంది వాణిజ్యవేత్తలు, రాజకీయ నాయకులు, దౌత్యవేత్తలు దీనికి హాజరవుతారని అసోషియేషన్ తెలిపింది. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలో మూడేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆర్థిక విధానాలపై జర్మన్ వర్గాలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకంగా తెలంగాణ రౌండ్ టేబుల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేస్తూ ఇందులో ముఖ్య వక్తగా పాల్గొనాలని కేటీఆర్‌ను కోరింది. జర్మనీ-తెలంగాణ మధ్య వాణిజ్యం విస్తృతమవుతుందని అసోషియేషన్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ ఆహ్వానం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

బాలికపై దుండగుడి అత్యాచారం

- బాధితురాలు ఆర్మీ ఉద్యోగి కుమార్తె
- ఆలస్యంగా వెలుగులోకి ఘాతుకం

కార్ఖానా, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గత డిసెంబరులోనే ఈ ఘాతుకం చోటు చేసుకున్నా.. ఆదివారం సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కావడంతో వెలుగులోకి వచ్చింది. ఘటనాస్థలంపై రెండు కమిషనరేట్ల మధ్య సరిహద్దు వివాదం నేపథ్యంలో కేసు నమోదులో జాప్యం జరగడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు కథనం ప్రకారం.. తిరుమలగిరి ప్రాంతానికి చెందిన ఓ ఆర్మీ ఉద్యోగి కుమార్తె(15) ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. డిసెంబర్ 21న సాయంత్రం 6.45 గంటల సమయంలో బాలిక తన స్నేహితుడైన బాలుడు(16)తో కలసి అమ్ముగూడ రైల్వే ట్రాక్ దగ్గరకు వెళ్లింది. అక్కడ ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకున్న తర్వాత ఇంటి దారి పట్టారు. బాలుడు తాను తెచ్చుకున్న సైకిల్‌పై ముందు వెళ్లిపోగా.. బాలిక నడుచుకుంటు వెళ్తోంది. ఇది గమనించిన సుమారు 35 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి ఆ బాలిక నోరు మూసి సమీపంలోని చెట్ల పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక ప్రతిఘటించే ప్రయత్నం చేయగా ఆమెను కొట్టి నోరు మూశాడు. దుండగుడు పారిపోయిన అనంతరం బాలిక ఏడుపు వినిపించడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలం నేరేడ్‌మెట్, తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు సరిహద్దు ప్రాంతం కావడంతో కేసు నమోదులో జాప్యం జరిగింది. చివరకు తిరుమలగిరి పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని తేలడంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. అఘాయిత్యం చీకట్లో జరగడంతో బాధితురాలు దుండగుడిని గుర్తు పట్టలేకపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఎఫ్ఎస్ఎల్ నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని, దుండగుడిని గుర్తించేందుకు బృందాలు గాలిస్తున్నాయన్నారు.

ఐరాసలో ప్రతిపాదనలు సమర్పించనున్న భారత విద్యార్థులు!

దిల్లీ: ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఉద్దేశించిన సామాజిక సేవా పథకాలపై క్షేత్రస్థాయిలో పనిచేసిన భారతీయ విద్యార్థుల బృందం తొలిసారిగా తమ ప్రతిపాదనలను ఐక్యరాజ్య సమితిలో ప్రధాన కార్యాలయంలో మార్చి 19న జరిగే సదస్సులో సమర్పించనున్నారు. అంతర్జాతీయ దౌత్యవేత్తలు.. విధాన నిర్ణేతల ముందు ఈ ప్రతిపాదనలను ఉంచబోతున్నారు. "భావి నాయకులు' కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సును నిర్వహించబోతున్నారు. భారతీయ స్వచ్ఛంద సంస్థ '1ఎం1బి' ఆధ్వర్యంలో జరగనుంది.



కడప జిల్లా ఒంటిమిట్ట చెరువులో తేలుతున్న మృతదేహాలు,



వెలికితీసిన అనంతరం..

ఐదుగురి 'జల సమాధి'!

ఈనాడు, కడప - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలు..

కడప జిల్లా ఒంటిమిట్ట చెరువులో కొన్ని మృతదేహాలు నీటిపై తేలుతున్నట్లు కలకలం రేగింది..

కొందరు స్థానికులు విషయాన్ని గుర్తించి 'ఈనాడు' ప్రతినిధికి సమాచారం అందించారు..

ఘటనాస్థలికి చేరుకున్న 'ఈనాడు ప్రతినిధి'... రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు...

గంట తర్వాత అక్కడికి చేరుకున్న అధికారులు మృతదేహాల పరిస్థితిపై ఆరా తీశారు..

రెండు గంటల తర్వాత మృతదేహాలను బయటకు తీశారు.. ఇంతకీ ఏం జరిగింది.. మృతదేహాలు అక్కడికి ఎలా వచ్చాయి? చనిపోయిన వారెవరు? అనే విషయాలు అనేక సందేహాలకు తావిచ్చాయి.

కడప జిల్లా ఒంటిమిట్ట చెరువులో ఆదివారం ఐదుగురి మృతదేహాలు వెలుగుచూడటం కలకలం రేపింది. తొలుత పరిస్థితిని చూసి ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావించారు. పోలీసులు వచ్చి చూశాక చనిపోయినవారు తమిళ కూలీలుగా ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా మారాయి. కుళ్లిపోయిన స్థితిలో నీటిపై తేలియాడుతుండటం చూస్తే రెండ్రోజుల కిందటే వారు మృత్యువాతపడినట్లు తెలుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఈ విషయం బయటకు పొక్కింది. 2 గంటల సమయానికి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు మృతదేహాలను బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని చెరువులో మృతదేహాలను వెలికితీశారు. ఐదు నీటిపైనే తేలియాడుతుండగా.. మరో రెండు కిట్‌బ్యాగులు నీటిపై కనిపించడంతో తొలుత ఏడు మృతదేహాలుగా భావించారు. చివరకు ఐదుగురే చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. అందరూ టీ షర్టులు ధరించి లుంగీలతో ఉన్నారు. నడుముకు టవల్‌తో కొంత సామగ్రి కట్టుకున్నారు. వీపుపై కిట్‌బ్యాగులున్నాయి. వాటిలో తినుబండారాలు, సెల్‌ఫోన్లు, వంట సామగ్రి వెలుగుచూడటంతో వీరు ఎర్రచందనం స్మగ్లింగ్‌కు వచ్చిన తమిళ కూలీలుగానే పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

అనేక అనుమానాలు?

ఒంటిమిట్ట చెరువులో ఐదు మృతదేహాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండ్రోజుల కిందట పోలీసులు నందలూరు - ఒంటిమిట్ట మధ్యన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పోలీసులను గమనించిన కూలీలు కొందరు భయపడి అడవిలోకి పారిపోయినట్లు సమాచారం. విషయం పసిగట్టిన పోలీసులు చెర్లోపల్లి పరిసర గ్రామాల్లో కూలీల గురించి ఆరా తీసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. సుమారు 20 మంది వరకూ కూలీలు పారిపోయిన వారిలో ఉన్నట్లు చెబుతుండగా.. అందులో ఐదుగురు చనిపోయిన స్థితిలో కనిపించడం చర్చనీయాంశమైంది. క్షేత్ర స్థాయిలో గమనిస్తే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాలు బయటపడిన చోట నీటిలోతు తక్కువ. చనిపోయే పరిస్థితులు లేవని స్థానికులే చెబుతున్నారు. ఐదుగురి మృతదేహాలు ఒకేచోట లభ్యం కావడం దీనికి బలం చేకూరుస్తోంది. మృతదేహాల వీపుపై కిట్ బ్యాగులు అలాగే ఉండటం గమనార్హం. నీళ్లలో కూరుకుపోయే సందర్భంలో శరీరంపై ఉన్న బరువును తగ్గించుకునేందుకు ప్రయత్నించకపోగా.. కాళ్లకు చెప్పులూ అలాగే ఉన్నాయి.

పోలీసుల వ్యవహారశైలిపై అనుమానాలు..

ఈ మొత్తం వ్యవహారంలో పోలీసుల వ్యవహారశైలిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండ్రోజుల కిందట తనిఖీలు జరిగినా గోప్యత పాటించడం, కూలీలు తప్పించుకున్నారన్న విషయాన్ని బహిర్గతం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. నీళ్లలో మునిగి ఊపిరాడక చనిపోయారా? లేక ఎవరైనా చంపి పడేశారా? అన్న అనుమానాలూ కలుగుతున్నాయి. మృతదేహాలపై చిన్నపాటి గాయాలు కనిపిస్తుండగా.. కుళ్లిపోవడంవల్లే ఏర్పడ్డాయా అన్నదీ స్పష్టత రావడం లేదు. శవ పరీక్షలో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. కడప ఓఎస్డీ నయీం అస్మి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుల వివరాలు, చనిపోవడానికి కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రాత్రి డీఐజీ శ్రీనివాస్ కడప చేరుకుని సమీక్షించారు. ఈ ఐదుగురు ఎవరన్న దానిపై ఆరా తీస్తున్నారు. వీరి వివరాలు తెలుసుకునేందుకు తమిళనాడు పోలీసులతోనూ చర్చించినట్లు తెలిసింది. వీరితో పాటు మరికొందరు వచ్చి ఉండవచ్చని భావిస్తూ ప్రత్యేక బృందాలు శేషాచలంలో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ విషయమై కడప ఓఎస్డీ నయీం అస్మి 'ఈనాడు'తో మాట్లాడుతూ... చనిపోయిన ఐదుగురు తమిళ కూలీలని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. తాము వారం రోజులుగా ఎలాంటి ఆపరేషన్లు నిర్వహించలేదన్న ఆయన, సాధారణ తనిఖీలు జరుగుతూనే ఉంటాయన్నారు.

ఇలా గుర్తించారు

ఆదివారం ఉదయం చెరువు పైభాగంలో పంట సాగు చేస్తున్న రైతు సుబ్బారాయుడు తన పొలానికి వెళుతూ నీళ్లపై తేలియాడుతున్న మృతదేహాలను గమనించారు. తొలుత వాటిని మృతదేహాలుగా భావించలేదన్నది ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. పంట పొలంలో పరిశీలిస్తే. . పంట తొక్కుకుంటూ వెళ్లిన కాళ్ల గుర్తులు కనిపించాయి. దీంతో అనుమానించిన అతను.. నీటి దగ్గరకు వెళ్లి చూసి శవాలుగా నిర్ధారించుకున్నారు. అనంతరం స్థానికులకు ఆయన సమాచారం ఇవ్వడం.. అక్కడి నుంచి 'ఈనాడు' ద్వారా రెవెన్యూ, పోలీసులకు ఉప్పందడం జరిగింది.

వచ్చేనెలలో ఎస్ఎన్‌జేపీసీ నివేదిక!

జస్టిస్ వెంకట్రామ రెడ్డి

హైదరాబాద్: దేశంలోని సబార్డినేట్ జ్యుడీషియరీకి సంబంధించిన ద్వితీయ జాతీయ జ్యుడీషియల్ వేతన సంఘం(ఎస్ఎన్‌జేపీసీ) తాత్కాలిక నివేదికను త్వరలోనే సమర్పించనున్నారు. బహుశా వచ్చేనెలలో ఈ తాత్కాలిక నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించే అవకాశం ఉన్నట్లు ఎస్ఎన్‌జేపీసీ ఛైర్మన్ జస్టిస్(విశ్రాంత) పి. వెంకట్రామ రెడ్డి ఆదివారం నాడిక్కడ వెల్లడించారు. తమ నివేదిక మొదటి భాగం...ఒకరకంగా చెప్పాలంటే తాత్కాలిక నివేదిక(వేతన అలవెన్సులు, పింఛన్లకు సంబంధించి)ను వచ్చేనెలల్లో సమర్పించేందుకు గట్టిగా కృషి చేస్తున్నామన్నారు. వాస్తవానికి ఎస్ఎన్‌జేపీసీని 2017 మే నెలలో ఏర్పాటు చేశారు. ఈ సంఘం ఏర్పాటును ఆమోదిస్తూ గత నవంబరులోనే కేంద్రం ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా, తాము ఓ సంప్రదింపుల పత్రాన్ని రూపొందించి...అధికారుల సంఘాలతో సహా సంబంధితులందరి అభిప్రాయాలను కోరాలనుకుంటున్నట్లు జస్టిస్ (విశ్రాంత)పి.వెంకట్రామ రెడ్డి ఆదివారం చెప్పారు. నివేదిక తొలి భాగం వేతన అలవెన్సులు, పింఛన్లకు సంబంధించినవై ఉంటాయి. కేవలం వేతనాలే కాదు న్యాయస్థానాల్లో పనిపరిస్థితుల తీరుతెన్నులపై తమ అభిప్రాయాలను సైతం పొందుపరుస్తామన్నారు.

మోదీ విమానాలకు దారి చూపినందుకు.. రూ.2.86 లక్షలు వసూలు చేసిన పాక్

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయాణించిన విమానాలకు మార్గనిర్దేశనం చేసినందుకుగాను పాకిస్థాన్ రూ.2.86 లక్షల రుసుము వసూలు చేసింది. అందులో అత్యధిక మొత్తం.. 2015 డిసెంబరు 25లో లాహోర్‌లో ఆయన ఆకస్మిక పర్యటనకు సంబంధించిందే. వైమానికదళ విమానాల్లో ప్రధాని మోదీ పర్యటనలకు(2016 జూన్ వరకు) అయిన ఖర్చు వివరాలను నౌకాదళ విశ్రాంత అధికారి లోకేష్ బత్రా సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కింద సేకరించారు. అందులోని వివరాల ప్రకారం.. 2016 జూన్ వరకు మోదీ 11 దేశాల పర్యటనలకు వాయుసేన విమానాన్ని ఉపయోగించారు. రష్యా, అఫ్గానిస్థాన్ పర్యటనల నుంచి తిరిగి వస్తూ ఆయన లాహోర్‌లో ఆగినప్పుడు పాకిస్థాన్ అధికారవర్గాలు విమానయాన మార్గనిర్దేశన రుసుం కింద రూ.1.49 లక్షలు వసూలు చేశాయి. తమ దేశం మీదుగా మోదీ వాయుసేన విమానంలో ఇరాన్ పర్యటనకు వెళ్లినప్పుడు రూ.77,215; ఖతార్‌కు వెళ్లినప్పుడు రూ.59,215 కూడా పాక్ వర్గాలు వసూలు చేశాయి. మొత్తంగా వాయుసేన విమానంలో మోదీ పర్యటనలకు రూ.2 కోట్లు ఖర్చయ్యాయి.

కన్న తండ్రిపై కనికరమేదీ!

- తనయుడి ఇంటి వద్ద బయటకు గెంటివేత
- పదిమంది సంతానమున్నా ఆదరణ కరవైన వృద్ధుడు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: పదిమంది సంతానమున్నా ఆ తండ్రి ఎవరి ఆదరణకు నోచుకోని అభాగ్యుడయ్యాడు. సంరక్షణ చూసేవారు లేక కుమారుడి ఇంటికి చేరుకోగా ఎందుకు వచ్చావని తండ్రిని ప్రశ్నించాడా ప్రబుద్ధుడు. బయటకు పంపించి తాళం వేసింది కోడలు. సొంతవాళ్లు కాదన్నా చుట్టుపక్కల వారు అతనికి అండగా నిలిచారు. పోలీసులు కలగజేసుకోవడంతో తండ్రి బాధ్యతలు చూడటానికి కుమారులు అంగీకరించారు. వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా కొత్తగూడం సమీపంలోని జలాల్‌పూర్‌కు చెందిన అర్థం మల్లయ్య(94)కు ఐదుగురు కుమారులు. ఐదుగురు కుమార్తెలు. చిరువ్యాపారం చేసి కుటుంబాన్ని పోషించాడు. పిల్లలను చదివించి వివాహాలు చేశాడు. కుమారుల కోసం తాను సంపాదించుకున్న మూడెకరాలు అమ్మివేశాడు. అయిదేళ్ల క్రితం భార్య కన్నుమూసింది. గ్రామంలోని ఇల్లు శిథిలావస్థకు చేరింది. వయస్సు పైబడంతోపాటు, కాలికి గాయం కావడంతో నడవలేని పరిస్థితి. గ్రామంలో చూసేవారు లేక వనస్థలిపురం వైదేహినగర్‌లో నివాసముంటున్న రెండో కుమారుడు గణేశ్ ఇంటికి శనివారం మధ్యాహ్నం వచ్చాడు. అతను ఇంటికి ఎందుకు వచ్చావని ప్రశ్నించాడు. సాయంత్రం కుమారుడు బయటకు వెళ్లిపోవడంతో కోడలు మల్లయ్యను బయటకు పంపించి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. చలిలో రాత్రంతా చెట్టు కింద గడిపిన వృద్ధుణ్ని చూసి జాలిపడిన స్థానికులు ఆదివారం ఉదయం నుంచి అల్పాహారంతో పాటు భోజనాన్ని అందించారు. తనను ఆదరించకున్నా.. కొడుకులను ఏంచేయవద్దని తండ్రి ప్రేమను చాటుకున్నాడు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కుమారులకు కౌన్సిలింగ్ చేశారు. చివరకు ఒక్కోనెల చొప్పున సంరక్షణ బాధ్యతలు చూడటానికి వారు అంగీకరించారు.



రోడ్డుపైనే మల్లయ్య

ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చేరిన గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్‌ను ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం కలుసుకుని పరామర్శించారు. క్లోమ గ్రంధికి సంబంధించిన అస్వస్థతతో చికిత్స కోసం పారికర్ ఇక్కడి లీలావతి ఆసుపత్రిలో గురువారం చేరారు.

తెలంగాణ ప్రభుత్వము
గిరిజన సంక్షేమ శాఖ
తెలంగాణ షెడ్యూల్ తెగల ఆర్థిక సహకార సంస్థ లిమిటెడ్ (ట్రైకార్), హైదరాబాద్
పత్రికా ప్రకటన
ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
గిరిజన సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వము CM ST ఎంటర్ ప్రెన్యూర్ షిప్ మరియు ఇన్నోవేషన్ పథకం క్రింద ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ISB), హైదరాబాద్ ద్వారా సామర్థ్యాల పెంపుదల శిక్షణ మరియు ట్రైకార్ ద్వారా ఆర్థిక సహాయం అందించుట కొరకు ఆసక్తి & అర్హత కలిగిన గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరనైనది. దరఖాస్తులు సమర్పించవలసిన **చివరి తేది 28.02.2018, 5.00 PM**. పూర్తి వివరాలకు **www.twd.telangana.gov.in** నందు సంప్రదించగలరు.
సం/- డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, I A S., కమీషనర్ గిరిజన సంక్షేమ శాఖ/ ఎక్స్-ఆఫీసియో మేనేజింగ్ డైరెక్టర్, ట్రైకార్, హైదరాబాద్
DIPR 607PP/ CL/ADVT/1/1/2017-18

క్యాన్సర్ అంటే భయం ఎందుకు?
CANCER HEALER CENTER
తరుచుగా, ప్రజలు కేవలం 'క్యాన్సర్' అన్న పదం వినగానే భయపడతారు మరియు ఆందోళనకు గురౌతారు. ఎవరైనా పేషెంట్ క్యాన్సర్ నుండి తాను బాధపడుతున్నానని తెలిసినప్పుడు, అతని మదిలో మెదిలే మొట్టమొదటి ఆలోచన ఇక జీవితం ముగియనుందని మరియు తాను కొద్ది రోజులు మాత్రమే బ్రతకగలుగుతానని. డబ్బులు వ్యర్థం అవుతాయని మరియు పేషెంట్ ఎక్కువ కాలం బ్రతికే అవకాశం లేదు కాబట్టి చికిత్సను నిలిపివేయాలని కూడా కుటుంబాలకు మరియు బంధువులకు డాక్టర్లు సలహా ఇస్తారు.
కానీ, ఈ విధంగా ఆలోచించడం లేదా జీవితం మీద ఆశను కోల్పోవడం సరి కాదు. క్యాన్సర్‌తో పోరాడి గెలవడం సాధ్యమౌతుంది. ప్రపంచ ప్రఖ్యాత డాక్టర్ కృష్ణాస్ క్యాన్సర్ హీలర్ సెంటర్ యొక్క ఇమ్యూనోథెరపీ చికిత్స చివరి దశలో ఉన్న క్యాన్సర్‌తోనైనా పోరాడటానికి దోహదపడుతుంది మరియు పేషెంట్‌కు మెరుగైన నాణ్యతగల జీవితాన్ని అందిస్తుంది ప్రపంచంలో ప్రప్రధమ మరియు ఎకైక ఇమ్యూనోథెరపీ క్యాన్సర్ క్లినిక్ వద్ద క్యాన్సర్‌ను జయించండి. ఈ చికిత్స వలన ఎటువంటి దుష్ప్రభావాలు కలుగవు మరియు ఇతర హాస్పిటల్స్ మరియు సెంటర్స్ కన్నా అందుబాటు ధరలలో చికిత్స లభిస్తుంది. విప్లవాత్మక ఇమ్యూనోథెరపీ చికిత్స సమర్ధవంతమైనది కూడా మరియు కీమోథెరపీ మరియు రేడియోథెరపీతో పాటు ఈ చికిత్సను సమాంతరంగా పొందవచ్చును.
క్యాన్సర్‌ను జయించడం సాధ్యమౌతుంది.
క్యాన్సర్ హీలర్ సెంటర్ ప్రపంచ-ప్రఖ్యాత, స్వర్గీయ డాక్టర్ హరికృష్ణ గారిచే స్థాపించబడినది. తన 41 సంవత్సరాల కఠోర శ్రమ మరియు పరిశోధన ఫలితంగా తన ఇమ్యూనోథెరపీ చికిత్స ధృడమైన రోగనిరోధక వ్యవస్థను నిర్మించడానికి మరియు ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా మెరుగైన జీవితం గడపటానికి క్యాన్సర్ బారిన పడిన చాలామంది రోగులకు దోహదపడినది. కావున, ఇమ్యూనోథెరపీ చికిత్స మెరుగైన నాణ్యతగల జీవితాన్ని అందించడానికి సహకరిస్తుంది. మీరు క్యాన్సర్ బాధితులైతే మీ జీవితం మీద మీరు ఆశను కోల్పోవద్దు. క్యాన్సర్ హెల్త్ సెంటర్ వద్ద క్యాన్సర్‌తో పోరాడి గెలవండి మరియు పూర్తి సంతృప్తికరమైన జీవితాన్ని గడపండి. క్యాన్సర్ హెల్త్ సెంటర్‌తో జీవితంలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభిద్దాము.
స్వర్గీయ డాక్టర్ హరికృష్ణ మరియు డాక్టర్ తరంగ్ కృష్ణ ప్రపంచవ్యాప్తంగా వివిధ వేదికలలో పురస్కారాలను గెలుచుకొని గౌరవింపబడినారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) కూడా డాక్టర్ కృష్ణాస్ క్యాన్సర్ హెల్త్ సెంటర్‌ను కొనియాడినది. కావున, భయపడుతూ బ్రతకడం మానేయండి మరియు క్యాన్సర్‌ను ఆత్మవిశ్వాసంతో ఓడించండి. మీ అత్యంత విలువైన జీవితాన్ని మనసారా ఆస్వాదించండి మరియు మీ కుటుంబంతో సంతోషంగా, ఆనందంగా గడపండి.
www.cancerhealercenter.com
011-42919191
Shangrila Plaza, 403, 4th Floor, Road No. 2, Banjara Hill, Hyderabad - 500034. Ph.: 8106361352

రష్యా చర్చిలో కాల్పులు

- ఐదుగురు మహిళల దుర్మరణం

మాస్కో: రష్యాలోని దజెస్థాన్ ప్రాంతంలో ఓ దుండగుడు చర్చిలో ఆదివారం విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో అయిదుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఓ పోలీసు అధికారి, స్థానికుడు గాయపడ్డారు. ముస్లింల ప్రాబల్యం ఎక్కువగా ఉండే కిజల్‌యార్ పట్టణంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దుండగుణ్ని పోలీసులు మట్టుబెట్టారు. కాల్పులకు తెగబడింది స్థానిక యువకుడేనని ఓ వార్తాసంస్థ తెలిపింది. ప్రార్థనలు ముగించుకొని చర్చి నుంచి అంతా బయటకు వస్తుండగా.. 'అల్లాహు అక్బర్' అని గట్టిగా అరుస్తూ అతడు కాల్పులు జరిపినట్లు పేర్కొంది.

యశోధర రాజేకు ఈసీ తాఖీదులు

భోపాల్: మధ్యప్రదేశ్ మంత్రి యశోధర రాజే సింధియాకు ఎన్నికల సంఘం తాఖీదులు జారీ చేసింది. కొలారస్ ఉపఎన్నికకు సంబంధించి ప్రచారంలో.. ఓటర్లను ఆమె బెదిరింపులకు గురిచేసినట్లు ఫిర్యాదు అందడంతో ఈ చర్య తీసుకుంది. శనివారం గ్రామ్ పడోరాలో ప్రసంగిస్తూ యశోధర ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్లు ఫిర్యాదు అందిందని ఈసీ పేర్కొంది. ఇటు ఆ ప్రసంగానికి సంబంధించిన వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. "చేయి గుర్తుకు ఓటు వేస్తే.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలేవీ మీకు అందవు" అని ప్రజలను ఉద్దేశించి యశోధర వ్యాఖ్యలు చేసినట్లుగా ఈ వీడియో ఉంది.

ఫారం–సి

(ప్రకటన)

(చట్టంలోని సెక్షన్ 11 క్రింద దీనిలో 10 ఎ మినహాయింపు కలదు)

(నిబంధన 6/12 చూడండి)

తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యూ (భూ.సే) శాఖ

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. G/2854/17 తేది. 19-01-2018

నెం. ఎ/30/2017 తేది. 05-01-2018

గెజిట్ నెం. 24/18 తేది. 19.01.2018

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం, ఎర్రంబెల్లి గ్రామంలో విస్తీర్ణం ఎ. 18.26 1/2 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా బునాదిగాని కాలువ నిమిత్తం సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 108, ఇరిగేషన్ శాఖ, (యల్.ఎ.ఆర్.అండ్ఆర్/ఎ2), తేది. 31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ నిమిత్తం భూసేకరణ, నష్టపరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన, (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013 లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ అంచనా), చాప్టర్-III (ఆహారభద్రత పథకము) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

కావున, పైన తెలిపిన ప్రాజెక్ట్ నిర్మాణమునకు యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, ఎర్రంబెల్లి గ్రామంలో భూముల విస్తీర్ణం ఎ॥ 18.26 1/2 గుంటల నిర్దిష్ట కొలతలు, దిగువ వివరాలతో యున్న భూములు భూసేకరణ చేయుటకు ప్రతిపాదించనైనది.

గ్రామం: ఎర్రంబెల్లి మండలం: భువనగిరి జిల్లా: యాదాద్రి–భువనగిరి

క్ర. సం.	సర్వే నెం.	హక్కు విధము	భూమి విధము	భూ సేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం॥లు	భూమి పట్టేదారు/ అనుభవదారు/ ఆసక్తిదారు పేరు మరియు తండ్రి పేరు, చిరునామా	సరిహద్దులు (సర్వే నెం.) [illegible]	[illegible]	[illegible]	[illegible]	నిర్మాణములు/ వృక్షములు మరియు ఇతరములు (సంఖ్య మరియు రకముతో సహా)
1	2	3	4	5	6	7	8	9	10	11
1	34	ఖుష్కి	పట్టా	0.01	గొర్ల యాదమ్మ భర్త నర్సయ్య	32	34	36	34	---
2				0.04	గాదె శ్రీరాములు తండ్రి సీతయ్య					---
3				0.02 1/2	గొర్ల రాజు తండ్రి నర్సింహ్మా					(1) బోరుబావి
4				0.02 1/2	గొర్ల శ్రీను తండ్రి నర్సింహ్మా					
5				0.02	గొర్ల వెంకటేశ్ తండ్రి నర్సింహ్మా					
6	36	ఖుష్కి	పట్టా	0.07 1/2	పుల్లా నరింహ్మా తండ్రి సిద్దులు	36	36	30, 36	36	---
7				0.07 1/2	పుల్లా రాములు తండ్రి సిద్దులు					---
8				0.22	గొర్ల నర్సయ్య తండ్రి మల్లయ్య					---
9				0.07 1/2	తోట పెంటమ్మ భర్త సోమయ్య					---
10				0.07 1/2	న్యాలపట్ల మల్లయ్య తండ్రి ఎల్లయ్య					---
11				0.07	పెద్దిటి బక్కమ్మ భర్త యాదిరెడ్డి					---
12	32	ఖుష్కి	పట్టా	0.04 3/4	గొర్ల నర్సింహ్మా తండ్రి రామయ్య	గ్రామ సరిహద్దు	34, 36	32	32	---
13				0.04 1/2	గొర్ల జహంగీర్ తండ్రి రామయ్య					---
14				0.10 1/4	గొర్ల భాగ్యలక్ష్మి భర్త రమేష్					---
15				0.10 1/4	గొర్ల మల్లయ్య తండ్రి రామయ్య					---
16				0.10 1/4	గొర్ల నర్సయ్య తండ్రి రామయ్య					---
17	19	ఖుష్కి	పట్టా	0.31	పకీరు సూర్యప్రకాశ్‌రెడ్డి తండ్రి యాదిరెడ్డి	19	19	6, 18	19	---
18	18	ఖుష్కి	ప్రభుత్వ భూమి	0.01	ప్రభుత్వ భూమి	18	19	6	19	---
19	6	ఖుష్కి	పట్టా	0.12	బొక్క స్వాతి తండ్రి నర్సింహ్మారెడ్డి	18	1, 3	6	1	---
20				0.06 1/2	సోలిపురం పుష్పమ్మ భర్త సీతారాంరెడ్డి					---
21				0.06 1/2	సోలిపురం వరలక్ష్మి భర్త రాంరెడ్డి					---
22				0.06 1/2	సోలిపురం మధుసుదన్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి					---
23				0.06 1/2	సోలిపురం నర్సింహ్మారెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి					---
24	1	ఖుష్కి	పట్టా	0.07	బొక్క రాజేందర్‌రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి	18, 19	3, 1	6	1	---
25				0.03 1/4	సోలిపురం పుష్పమ్మ భర్త సీతరాంరెడ్డి					---
26				0.03 1/4	సోలిపురం వరలక్ష్మి భర్త రాంరెడ్డి					---
27				0.03 1/4	సోలిపురం మధుసుదన్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి					---
28				0.03 1/4	సోలిపురం నర్సింహారెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి					---
29	3	ఖుష్కి	పట్టా	0.01	సోలిపురం పుష్పమ్మ భర్త సీతారాంరెడ్డి	1	4	5	3	---
30	4	ఖుష్కి	పట్టా	0.10 1/2	సోలిపురం వరలక్ష్మి భర్త రాంరెడ్డి	5	116, 118	4	4	---
31				0.10 1/2	సోలిపురం పుష్పమ్మ భర్త సీతారాంరెడ్డి					---
32				0.10 1/4	సోలిపురం మధుసుదన్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి					---
33				0.10 1/4	సోలిపురం నర్సింహారెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి					---
34				0.28 1/2	బొక్క రాజేందర్‌రెడ్డి తండ్రి నర్సింహ్మారెడ్డి					---
35				0.21	బొక్క లత భర్త మల్లారెడ్డి					---
36	116	ఖుష్కి	పట్టా	0.31 1/2	సోలిపురం వరలక్ష్మి భర్త రాంరెడ్డి	116	116	117	116	---
37				0.02	పైళ్ళ నిర్మల భర్త మధుసుదన్‌రెడ్డి					---
38				0.14 1/2	సోలిపురం మధుసుదన్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి					---
39				0.14 1/2	సోలిపురం పుష్పమ్మ భర్త సీతారాంరెడ్డి					---
40				0.14 1/2	సోలిపురం నర్సింహ్మారెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి					---
41	118	ఖుష్కి	పట్టా	0.01	సోలిపురం ప్రదీప్‌కుమార్ తండ్రి రాంరెడ్డి	4	118	116	118	---
42				0.06	పైళ్ళ నిర్మల భర్త మధుసుదన్‌రెడ్డి					---
43	117	ఖుష్కి	పట్టా	1.03	గుండ్ల కొండల్‌రెడ్డి తండ్రి అనంతరెడ్డి	116	102	117	117	---
44				0.04	అనపర్తి సుదర్శన్ తండ్రి మల్లయ్య					---
45	102	ఖుష్కి	పట్టా	0.04	అనపర్తి నర్సింహ్మా తండ్రి మల్లయ్య	117	103	102	102	---
46				0.04	సిరికొండ సత్తయ్య తండ్రి ఎట్టయ్య					---
47				0.36	సిరికొండ అంజయ్య తండ్రి యాదయ్య					(2) బోరు బావులు
48	92	ఖుష్కి	పట్టా	0.02	నోముల నర్సయ్య తండ్రి నర్సయ్య	93	గ్రామ సరిహద్దు	105	92	---
49	93	ఖుష్కి	పట్టా	0.06 1/2	గొర్ల రామయ్య తండ్రి నర్సయ్య	93	92	105	93	---
50	94	ఖుష్కి	పట్టా	0.06 1/4	పడమటి యాదిరెడ్డి తండ్రి మల్లారెడ్డి	94	105	104	93	---
51				0.06 1/4	పడమటి మధుసుధన్‌రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					---
52				0.10 1/4	పడమటి జితేందర్‌రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					---
53				0.10 1/4	పడమటి మల్లారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					---
54	104	ఖుష్కి	పట్టా	0.06 1/2	పడమటి యాదిరెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	104	105	107	94	---
55				0.06 1/2	పడమటి మధుసుధన్‌రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					---
56				0.06 1/2	పడమటి జితేంధర్‌రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					---
57				0.06 1/2	పడమటి మల్లారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					---
58	107	ఖుష్కి	పట్టా	0.13	గొర్ల మల్లయ్య తండ్రి మల్లయ్య	103	107	107	104	---
59				0.02	గొర్ల నర్సయ్య తండ్రి మల్లయ్య					---
60				0.04 1/2	పద్మాటి చిట్టెమ్మ తండ్రి మధుసుదన్‌రెడ్డి					---
61				0.04 1/2	పద్మాటి యాదిరెడ్డి తండ్రి మల్లారెడ్డి					---
62	103	ఖుష్కి	పట్టా	0.06 1/4	గుత్తురు శంకరప్ప తండ్రి అడివప్ప	102	107	103	103	(1) బోరుబావి
63				0.06 1/4	గుత్తురు రాజప్పా తండ్రి అడివప్ప					---
64				0.06 1/2	గుత్తురు సుజాత భర్త సోమప్ప					---
65	29	ఖుష్కి	పట్టా	0.04	పకీరు తులసిరెడ్డి భర్త సూర్యప్రకాశ్‌రెడ్డి	30	29	20	36	---
66	20	ఖుష్కి	పట్టా	0.11 1/2	ముసునూరి అంజనేయులు తండ్రి సత్తయ్య	30	20	30	29	---
67				0.11 1/2	ముసునూరి జనార్ధన్ తండ్రి సత్తయ్య					---
68				0.11 1/2	ముసునూరి నర్సింహ్మా తండ్రి సత్తయ్య					---
69				0.02 1/4	ముసునూరి గణేష్ తండ్రి నరహరి ముసునూరి నందు తండ్రి నరహరి ముసునూరి ధాతు తండ్రి నరహరి					--- --- ---
70				0.11 1/4	ముసునూరి సత్యనారాయణ తండ్రి సత్తయ్య					---
71	30	ఖుష్కి	పట్టా	0.02	పకీరు తులసిరెడ్డి భర్త సూర్యప్రకాష్‌రెడ్డి	30	20, 29	30	36	
72				0.13 1/4	ముసునూరి అంజనేయులు తండ్రి సత్తయ్య					
73				0.13 1/4	ముసునూరి నర్సింహ్మా తండ్రి సత్తయ్య					
74				0.13 1/4	ముసునూరి సత్యనారాయణ తండ్రి సత్తయ్య					
75				0.13 1/4	ముసునూరి గణేష్ తండ్రి నరహరి ముసునూరి నందు తండ్రి నరహరి ముసునూరి ధాతు తండ్రి నరహరి					
76	105	ఖుష్కి	పట్టా	0.05	పడమటి యాదిరెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	104, 94	105	104, 107	93	
77				0.05	పడమటి మధుసుదన్‌రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					
78				0.05	పడమటి జితేందర్‌రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					
79				0.05	పడమటి మల్లారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి					
80				0.09	గొర్ల యాదయ్య తండ్రి మల్లయ్య					
81				0.09	గొర్ల మల్లయ్య తండ్రి మల్లయ్య					
82				0.09	గొర్ల నర్సయ్య తండ్రి మల్లయ్య					
83	5	ఖుష్కి	పట్టా	0.01 3/4	సామలేటి పెంటయ్య తండ్రి పోషయ్య	6	4	5	4	
84				0.01 3/4	సామలేటి లక్ష్మమ్మ భర్త ఈదయ్య					
85				0.01 3/4	అదేపు పోషయ్య తండ్రి సత్తయ్య					
86				0.01 3/4	మొల్గు చంద్రయ్య తండ్రి గోపయ్య					
87				0.01 3/4	మొల్గు బిక్షపతి తండ్రి నర్సయ్య					
88				0.01 3/4	నోముల యాదయ్య తండ్రి లక్ష్మయ్య					
89				0.01 3/4	నోముల వెంకటేశం తండ్రి యాదయ్య					
90				0.01 3/4	నోముల సాయమ్మ భర్త పోషయ్య					
			మొత్తం	18.26 1/2						

ఈ ప్రకటన భూసేకరణ, నష్టపరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన, (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం, 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013)కు సవరించబడిన తెలంగాణ చట్టం భూసేకరణ, నష్ట పరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన (సవరణ తెలంగాణ చట్టం-2016 (చట్టం 21/2017)లోని సెక్షన్ 11 (1)లో గల అంశాల ప్రకారము ఎవరికి సంబంధించిన వారికి చెందును.

సదరు భూములకు సంబంధించిన నక్షను జిల్లా కలెక్టరు, యాదాద్రి భువనగిరి గారి కార్యాలయము నందు ఉంచడమైనది. వాటిని ఏ పని దినములలో పనివేళలయందు తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వము కలెక్టరు మరియు ప్రభుత్వ అదేశాల అనుసారము నియమించబడిన ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) మరియు అతను/ఆమె సిబ్బందిని, సదరు భూసేకరణ చేపట్టె భూమిని సర్వే చేసి భూమి మట్టము తెలిసికోనుటకు / భూమిని త్రవ్వటానికి, బోర్లు వేయడానికి, కేటాయించిన పనులను అమలు చేయుటకు, కావలసిన పనులకు నిర్వహించు నిమిత్తము ఇందుమూలముగా అధికారము ఇచ్చినారు. సదరు చట్టము సెక్షన్ 12లో పొందుపర్చినారు.

ప్రకటన ప్రచురించిన తేది నుంచి (కలెక్టరు గారి నుంచి) ముందస్తు అనుమతి లేకుండా సదరు భూములపై ఎవ్వరూ ఎలాంటి వ్యవహారాలు అనగా అమ్మకం/కొనుగోలు మొదలయినవి లేదా సదరు భూములపై ఎలాంటి తాకట్టు చేయడం లాంటి పనులు చేయరాదని సదరు చట్టములోని సెక్షన్ 11 (4) క్రింద తెలుపబడమైనది.

ఆసక్తి గల వ్యక్తుల నుంచి ఈ భూసేకరణ పై ఎలాంటి అభ్యంతరాలు మరియు అక్షేపణలు ఉన్నచో లేదా నష్టపరిహార సంప్రదింపుల ద్వారా పరిష్కారంలలో బాధితులన్నచో సదరు వ్యక్తులు ఈ ప్రకటన వెలువడిన తేది నుంచి 60 (అరవై దినములు) దినముల లోపల సంబంధిత జిల్లా కలెక్టర్/అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 15 క్రింద గల అంశాల ప్రకారం తమ అభ్యంతరాలను సమర్పించుకొనవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి – భువనగిరి జిల్లా. సం/- సంయుక్త కలెక్టర్, యాదాద్రి–భువనగిరి జిల్లా. సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి–భువనగిరి

విమానయానాన్ని మార్చేస్తున్నాం

- ఈ రంగంలో మౌలిక వసతుల్లో వేగం పెంచుతున్నాం
- ప్రధాన నరేంద్ర మోదీ వెల్లడి
- ముంబయిలో రెండో అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన



నవీ ముంబయి విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు, సీఎం దేవేంద్ర ఫడణవీస్

ముంబయి: విమానయాన రంగంలో పరివర్తన తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. తద్వారా సంధానత కల్పించడం, విమానయానాన్ని అందుబాటు ధరల్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ‘ ‘మన విమానయాన రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఫలితంగా ఈ రంగంలో నాణ్యమైన మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యత ఏర్పడింది. విమానయాన రంగంలో పరివర్తన తెచ్చే విధానాన్ని ప్రభుత్వం తెచ్చింది. ఈ రంగం వల్ల దేశంలో పర్యాటకానికీ ఊతం లభిస్తుంది” అని చెప్పారు. ఆదివారం ఆయన రూ.16,700 కోట్ల నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశకు శంకుస్థాపన నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్టులో నాలుగో కంటైనర్ టెర్మినల్‌ను జాతికి అంకితమిచ్చారు. అనంతరం నవీ ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. విమానయానానికి పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా ఆ రంగంలో మౌలిక వసతులను పెంచాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. పని వేగాన్ని పెంచడంపై తాము దృష్టి పెట్టినట్లు తెలిపారు. నవీ ముంబయి విమానాశ్రయం సహా రూ.10లక్షల కోట్ల విలువైన అనేక ప్రాజెక్టులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండిపోయాయని చెప్పారు. తమ ప్రభుత్వం ఇప్పుడు నిధులు అందిస్తోందన్నారు. విమానయాన రంగం వృద్ధి సామర్థ్యాన్ని మునుపటి ప్రభుత్వాలు గుర్తించలేకపోయాయని తెలిపారు. ఈ రంగానికి సంబంధించి ఒక విధానం కూడా లేదని, తామే దాన్ని తెచ్చామని తెలిపారు. గత సంవత్సరంలో కొత్తగా 900 కొత్త విమానాలకు ఆర్డర్లు వెళ్లాయని తెలిపారు. కొత్త రేవుల అభివృద్ధికి ఉద్దేశించిన సాగరమాల ప్రాజెక్టు వల్ల కేవలం రేవులే కాకుండా వాటితో ముడిపడ్డ అంశాలూ అభివృద్ధి చెందుతున్నాయని మోదీ వివరించారు. “ప్రపంచీకరణ వేగానికి అనుగుణంగా మౌలిక వసతులు వృద్ధి చెందాలి. నేటి ప్రపంచంలో మనకంటూ ఒక స్థానం ఉండాలంటే మన జలమార్గాలను వృద్ధి చేసుకోవాలి” అని చెప్పారు. 2020 నాటికి ముంబయిలో కొత్త రైల్వే, జల మార్గాలు; అరేబియా సముద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహం సిద్ధమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్‌రావు, సీఎందేవేంద్ర ఫడణవీస్, కేంద్ర మంత్రులు అశోక్‌గజపతి రాజు, నితిన్ గడ్కరీ, జీవీకే సంస్థ అధినేత జీవీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21 ఏళ్ల నాటి ప్రతిపాదన: ముంబయిలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రూ.3వేల కోట్లతో రెండో విమానాశ్రయ నిర్మాణానికి 1997లోనే ప్రణాళిక రచించారు. రాజకీయ నిర్ణయాలు, పర్యావరణ అనుమతులు, నిధులు వంటి అంశాల వల్ల ఈ ప్రాజెక్టులో జాప్యం జరిగింది. జీవీకే గ్రూప్.. సిటీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సిడ్కో)తో కలసి ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తోంది. ఇందులో జీవీకే గ్రూప్ వాటా 74 శాతం కాగా మిగతాది సిడ్కోకు చెందుతోంది.

కేటాయింపులకే పరిమితం కాదు..

భాజపా నేతృత్వంలోని ప్రభుత్వ బడ్జెట్ సంస్కరణలు ఒక కొత్త పని సంస్కృతిని సృష్టించాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఇది దేశ సామాజిక-ఆర్థిక స్థితిగతులను మార్చేశాయని తెలిపారు. ప్రస్తుతం విచ్ఛిన్నం, అసంతృప్తి యుగంలో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. “మా బడ్జెట్.. కేవలం కేటాయింపులకే పరిమితం కాలేదు. ఫలితం మీదే దృష్టి పెట్టాం’ ’ అని వివరించారు. ఆదివారం ఆయన ముంబయి శివార్లలోని బాంద్రాలో ‘మ్యాగ్నెటిక్ మహారాష్ట్ర’ పేరుతో నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో ప్రసంగించారు.

ఫారం–సి

(ప్రకటన)

(చట్టంలోని సెక్షన్ 11 క్రింద దీనిలో 10 ఎ మినహాయింపు కలదు)

(నిబంధన 6/12 చూడండి)

తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యూ (భూ.సే) శాఖ

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. G/4715/2017 తేది. 18-02-2018

నెం. ఎ/43, 44/2017 తేది. 18-12-2017

గెజిట్ నెం. 17/2018 తేది. 16.02.2018

[illegible]

గ్రామం: [illegible] మండలం: ఆత్మకూర్(యం) జిల్లా: యాదాద్రి భువనగిరి

క్ర. సం.	సర్వే నెం.	హక్కు విధము	భూమి విధము	భూ సేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం॥లు	భూమి పట్టేదారు/ అనుభవదారు/ ఆసక్తిదారు పేరు మరియు తండ్రి పేరు, చిరునామా	సరిహద్దులు (సర్వే నెం.) [illegible]	[illegible]	[illegible]	[illegible]	నిర్మాణములు/ వృక్షములు మరియు ఇతరములు (సంఖ్య మరియు రకముతో సహా)
1	2	3	4	5	6	7	8	9	10	11
1	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	గ్రామ సరిహద్దు	[illegible]	[illegible]	—
2				[illegible]	[illegible]					—
3	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
4				[illegible]	[illegible]					—
5				[illegible]	[illegible]					—
6				[illegible]	[illegible]					—
7	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
8				[illegible]	[illegible]					—
9				[illegible]	[illegible]					—
10	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
11				[illegible]	[illegible]					—
12				[illegible]	[illegible]					—
13				[illegible]	[illegible]					—
14				[illegible]	[illegible]					—
15	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
16				[illegible]	[illegible]					—
17				[illegible]	[illegible]					—
18				[illegible]	[illegible]					—
19	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
20				[illegible]	[illegible]					—
21				[illegible]	[illegible]					—
22				[illegible]	[illegible]					—
23				[illegible]	[illegible]					—
24				[illegible]	[illegible]					—
25				[illegible]	[illegible]					—
26				[illegible]	[illegible]					—
27	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
28				[illegible]	[illegible]					—
29				[illegible]	[illegible]					—
30				[illegible]	[illegible]					—
31				[illegible]	[illegible]					—
32	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
33				[illegible]	[illegible]					—
34				[illegible]	[illegible]					—
35				[illegible]	[illegible]					—
36				[illegible]	[illegible]					—
37	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
38				[illegible]	[illegible]					—
39				[illegible]	[illegible]					—
40				[illegible]	[illegible]					—
41				[illegible]	[illegible]					—
42				[illegible]	[illegible]					—
43				[illegible]	[illegible]					—
44	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
45	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
46	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
47	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
48				[illegible]	[illegible]					—
49	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
50	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
51	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
52				[illegible]	[illegible]					—
53	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	గ్రామ సరిహద్దు	[illegible]	[illegible]	[illegible]	—
54				[illegible]	[illegible]					—
55	[illegible]			[illegible]	[illegible]					—
			మొత్తం	26.18 1/2						

[illegible]

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) యాదాద్రి–భువనగిరి జిల్లా సం/- సంయుక్త కలెక్టర్ యాదాద్రి–భువనగిరి జిల్లా సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి–భువనగిరి

దాడికి పాల్పడిన కాంగ్రెస్ ఎమ్మెల్యే కుమారుడు

- పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరణ

బెంగళూరు: ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే కుమారుడు...అదే పార్టీ యువజన విభాగం నాయకుడు అయిన మహమ్మద్ హారిస్ నలాపాడ్ తన స్నేహితులతో కలిసి ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలోనే పార్టీ నుంచి మహమ్మద్ నలాపాడ్ ఆరునెలల పాటు బహిష్కరణకు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత యుబీ సిటీలోని ఓ రెస్టారెంటులో ఈ ఘటన జరిగింది. మహమ్మద్ నలాపాడ్ ఆయన స్నేహితులు పదిమంది కలిసి కూచుని ఉన్న టేబుల్ వైపునకు విద్వత్ అనే వ్యక్తి కాళ్లు చాపుకోవడంతో గొడవ మొదలైంది. అతడి కాలుకు అప్పటికే ప్లాస్టర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దాంతో, విద్వత్‌తో గొడవపడిన మహమ్మద్ నలాపాడ్ బృందం అతడిని తీవ్రంగా కొట్టింది. ప్రస్తుతం మహమ్మద్ నలాపాడ్ ఎక్కడున్నదీ తెలియడం లేదని అతడి తండ్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్.ఏ.హారిస్ తెలిపారు. బాధితుడిని తాను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించినట్లు చెప్పారు. నేరానికి పాల్పడిన వారిని చట్టప్రకారం శిక్షించాల్సిందేనని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ట్విటర్‌లో పేర్కొన్నారు.

మరుగుదొడ్డి శుభ్రం చేసిన భాజపా ఎంపీ

మధ్యప్రదేశ్‌లో సంఘటన

రేవా(ఎంపీ): ఓ ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్లను రేవా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న భాజపా ఎంపీ జనార్దన్ మిశ్ర స్వయంగా శుభ్రం చేస్తున్న వీడియో ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. చేతులకు గ్లవుజ్ వంటివి ఏమీ ధరించకుండా ఆయన మురుగుదొడ్లను శుభ్రం చేశారు. ఇక్కడి ఖుసుండి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను జనార్దన్ మిశ్ర గురువారం సందర్శించారు. అక్కడి మరుగుదొడ్డి అంతా కూడా మట్టి, ఇసుకతో నిండిపోయి ఉండటం కనిపించింది. వెంటనే దానిని శుభ్రం చేసేశాను అంటూ ఆయన ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. తాను ఎక్కడికి వెళ్లినా ముందుగా మరుగుదొడ్ల పరిశుభ్రత గురించే పరిశీలిస్తానని చెప్పారు.

పార్టీల వ్యతిరేక ఫిర్యాదుపై సీఐసీ విచారణ వాయిదా

దిల్లీ: ఆరు రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా దాఖలైన ఫిర్యాదుపై విచారణను ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) ఆర్‌కే మథుర్ వాయిదా వేశారు. సమాచార హక్కు చట్టం పరిధిలోకి రాజకీయ పార్టీలను తీసుకువస్తూ 2013లో సీఐసీ వెల్లడించిన ఆదేశాలను.. ఆ పార్టీలు ఉల్లంఘించినట్లు ఈ ఫిర్యాదులో ఆరోపించారు. దీనిపై విచారణ మంగళవారం జరగాల్సి ఉంది. ఈ ఫిర్యాదును ఆరు నెలల్లోగా పరిష్కరించాలని 2014లోనే దిల్లీ హైకోర్టు ఆదేశించింది. అయితే 2016 డిసెంబర్ అనంతరం అసలు దీనిపై విచారణే జరగలేదు. విచారణను వాయిదా వేసినట్లు కేంద్ర సమాచార కమిషన్ వెల్లడించింది. ఇటు ఈ అంశంలో విచారణల్లో జాప్యం, విచారణ బెంచీల ఏర్పాటులో పారదర్శకత లోపించడంపై.. ఇటీవల సమాచార కమిషనర్ శ్రీధర్ ఆచార్యులు ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

మిద్దెపై పంట.. చేతికొచ్చెనంట..!



గోధుమ పంటను కోస్తున్న గణేష్‌బాబు కుటుంబ సభ్యులు

హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి శ్రీకాలనీవాసి గాండ్ల గణేష్‌బాబు తన ఇంటి పైకప్పుపై సాగు చేసిన గోధుమ పంట కోతకొచ్చింది. ఆదివారం గణేష్ కుటుంబ సభ్యులంతా ఈ కోతల కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. 2017 నవంబరులో డాబాపై దాదాపు 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆరు మడులను సిద్ధం చేసి గోధుమ నాట్లు వేశారు. దేశంలోనే తొలిసారిగా ఇలా సాగు చేసిన వ్యక్తిగా గణేష్‌బాబు ‘తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్’లో స్థానం సంపాదించారు. దాదాపు 25 కిలోల దిగుబడి వచ్చిందని గణేష్‌బాబు వివరించారు. వేప పిండి, ఆవుపేడను ఎరువుగా వాడినట్లు తెలిపారు.

–న్యూస్‌టుడే, డిఫెన్స్‌కాలనీ

మేఘాలయాలో ఉగ్రదాడి

- ఎన్సీపీ అభ్యర్థి సహా ముగ్గురి మృతి

షిల్లాంగ్: మేఘాలయాలోని తూర్పు గారో హిల్స్ జిల్లాలో ఆదివారం రాత్రి ఉగ్రవాదులు జరిపిన దాడిలో తుర నియోజకవర్గ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అభ్యర్థి జొనాథన్ ఎన్ సంగ్మా, మరో ఇద్దరు అనుచరులు ప్రాణాలు కోల్పోయారు. ఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని తిరిగివస్తున్న వీరి వాహనశ్రేణిపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. బాంబులు పేల్చి, కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా ఖండించారు. 2013 ఎన్నికల్లోనూ జొనాథన్ సంగ్మాను హతమారుస్తామంటూ బెదిరింపులు వచ్చాయి.

935 మంది రైల్వే ఉద్యోగులపై నజర్

- విధులకు గైర్హాజరవుతున్నట్లు గుర్తించిన దక్షిణ మధ్య రైల్వే
- సత్వర ఉద్వాసనపై దృష్టి

ఈనాడు, హైదరాబాద్: దీర్ఘకాలంగా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులను దక్షిణ మధ్య రైల్వే గుర్తించింది. జోన్ పరిధిలో దాదాపు 935 మంది మూడు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం నుంచి విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించి వివరాలను రైల్వే బోర్డుకు పంపినట్లు తెలిసింది. విధి నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఇలా దేశవ్యాప్తంగా 13 వేల మంది ఉన్నట్లు గుర్తించింది. ఉద్యోగుల తొలగింపులో ప్రస్తుతం ఉన్న విధానంలో ముందుకెళితే ఎక్కువ కాలం పట్టే అవకాశం ఉండటంతో కొత్త విధివిధానాలు తీసుకువచ్చి వెంటనే వేటు వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో 740 రైల్వేస్టేషన్లు ఉన్నాయి. నిత్యం 750 రైళ్లలో దాదాపు 10.50 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. రైళ్ల రాకపోకలు, భద్రతాపరమైన అంశాలతో పాటు జోన్ పరిధిలో పెద్ద సంఖ్యలో ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. జోన్ పరిధిలో దాదాపు 15 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భద్రత విభాగంలోనే 9,698 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. దీనికితోడు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు విధులకు దూరంగా ఉండటం మరింత సమస్యగా మారింది.

ఇతర ఉద్యోగాలు, వ్యాపారాలు: ద.మ. రైల్వే పరిధిలో దాదాపు వెయ్యి మంది ఉద్యోగులు దీర్ఘకాలంగా విధులకు హాజరవడం లేదు. కొందరు ఉద్యోగంలో చేరి మరో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా, మరికొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇంకొందరు వ్యక్తిగత అవసరాల పేరుతో విధులకు గైర్హాజరవుతున్నారని రైల్వే వర్గాల సమాచారం. ఉన్న ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగి రైళ్ల రాకపోకలు, భద్రత, ప్రాజెక్టుల పనులపై ప్రభావం చూపుతున్నట్లు అభిప్రాయపడుతున్నారు. లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్ల పోస్టుల భర్తీ చేపట్టిన రైల్వే శాఖ తాజాగా ఆరు వేల పైచిలుకు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది.

భారత ఆహార సంస్థ

ప్రాంతీయ కార్యాలయం, 3వ అంతస్తు, HACA భవన్, పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్-500004.

నెం. S&C 13(43)/2018-20/FSD ELR/CONTS తేది: 19-2-2018

ఇ–టెండర్ల కొరకు ఆహ్వానము

ఇ-టెండరింగ్/ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఎఫ్ఎస్‌డి, ఏలూరు వద్ద హెచ్‌టిసి నియామకం కొరకు భారత ఆహార సంస్థ, ప్రాంతీయ కార్యాలయం: హైదరాబాద్ టెండర్లను కోరుతున్నది. టెండరు డాక్యుమెంటును www.fci.gov.in & www.eprocure.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఔత్సాహిక టెండరుదారులు తమ టెండరు డాక్యుమెంట్లను (పిడిఎఫ్ ఫార్మాట్‌లో) www.eprocure.gov.in నందు మాత్రమే దాఖలు చేయవలెను. ఈ కార్యాలయం 22-2-2018న, మ. 2.30 గం. లకు ఎఫ్‌సిఐ, ఆర్.ఒ., హైదరాబాద్ వద్ద ప్రి-బిడ్ మీటింగ్‌ను నిర్వహిస్తున్నది.

సం/– జనరల్ మేనేజర్ (రీజియన్) తరపున



17 ఎకరాలు.. 100 పంటలు

టమాటాల ధర తగ్గిపోయింది..
ఏం ఫర్లేదు.. వంకాయలు విరగ్గాశాయిగా!
పత్తి రేటు తేలిపోతోంది..
దిగులొద్దు.. మిర్చి..
ఘాటు మీదుందిగా!
కంది రేటు కిందమీదయింది..
కంది పోతేనేం..
వంద పంటలున్నాయి!
ఇదేదో ప్రకటన అనుకోకండి. సమీకృతసాగులో విజయం సాధించిన ఒక రైతు ఆత్మవిశ్వాసమిది. ఆధునిక పద్ధతుల్లో.. సేంద్రియ విధానంలో.. 17 ఎకరాల్లో 100 రకాల పంటలు పండిస్తూ.. వాహ్ అనిపించుకుంటున్న రైతు కథ ఇది.

పంటను నమ్ముకుని.. తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకొని.. ప్రకృతి పరీక్షలను దాటుకొని.. దిగుబడి తగ్గితే తట్టుకొని.. గిట్టుబాటు రాకుంటే మొత్తుకొని.. దళారుల చేతుల్లో చిక్కుకొని.. ఉస్సూరుమనే సాధారణ రైతు ఎలా ఉంటాడు?

పంటను కాదనుకుంటాడు. పొలానికి పోనంటాడు. పట్టణంలో ఏదో ఒకటి చేసుకొని బతుకుతానంటాడు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామానికి చెందిన మారం కరుణాకర్‌రెడ్డీ అలాగే చేశాడు. 17 ఎకరాల ఈ ఆసామి. ఏళ్లకేళ్లు సాగు చేసినా చివరికి మిగిలిందేం లేదు. అందుకే పొలాన్ని కౌలుకిచ్చి ఊరు వదిలాడు. చిన్నవో పెద్దవో కాంట్రాక్టు పనులు చేసుకున్నాడు. కానీ, మట్టిని నమ్ముకున్న ఆ రైతన్న పొలానికి దూరంగా ఉండలేకపోయాడు. మళ్లీ ఊరిబాట పట్టాడు. ఈసారి తన పొలంలో బంగారం పండించాలని గట్టిగా అనుకున్నాడు. అందుకు తగ్గట్టుగా సన్నద్ధమయ్యాడు. ఈసారి తన ఆలోచనలే కాదు... వ్యూహాలనూ మార్చుకున్నాడు.

సమగ్ర అధ్యయనం...

మళ్లీ చిమ్మపూడి చేరుకున్న కరుణాకర్.. పంటల సాగుపై మరింత పట్టు సాధించాడు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో పర్యటించి సాగు విధానాలను అధ్యయనం చేశాడు. సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకున్నాడు. ఆ పరిజ్ఞానంతో తన వ్యవసాయ క్షేత్రాన్ని ఒక అధ్యయన కేంద్రంగా తీర్చిదిద్దాడు. మూస పద్ధతులు వదిలిపెట్టి.. ఆధునిక సాంకేతిక విధానాలు ఒడిసిపట్టాడు. సమీకృత సాగు విధానంతో ముందడుగు వేశాడు. అంతర పంటలతో ఏడాదిపొడవునా పొలం పనులు సాగించాడు. కాలాలకు అతీతంగా రకరకాల దిగుబడులు సాధించాడు. ఓ పక్క ఆకుకూరలు. మరో వైపు కాయగూరలు.. పూలు, పండ్లు, తృణ ధాన్యాలు, పప్పు దినుసులు.. ఇలా అన్ని రకాలు పండిస్తున్నాడు. ఒక పంట ముగిసే లోగా మరో పంట చేతికొచ్చేలా.. ప్రణాళికతో ముందుకెళ్లాడు. ఫలితం.. ధరల పతనం, పెరగడం వంటి అంశాలను అధిగమించాడు. పక్షం రోజులు తిరిగే సరికి ఏదో ఒక పంట చేతికి రావడంతో నిరంతరం నాలుగు రూపాయలు కళ్లజూసేవాడు.

అంతటా పంటలే..

కరుణాకర్‌రెడ్డి పొలంలో యాపిల్ బేర్, థాయ్‌జామ, కివీ, సీతాఫలం, సపోట, దానిమ్మ, నేరేడు, మామిడి, లోగన్, స్టార్ ఫ్రూట్ ఇలా 60 రకాల పండ్ల చెట్లు ఈ పొలంలో ఉన్నాయి. 17 ఎకరాల్లో విస్తరించి ఉన్న పండ్ల చెట్ల మధ్యలో అంతరపంటలుగా ఆకుకూరలు, కాయగూరలు కలిపి 40 రకాల వరకూ వేశారు. సపోట చెట్ల మధ్య అంతర పంటగా కంది సాగుచేస్తునారు. మూడు రకాల మొక్కజొన్నలు, పప్పు దినుసులు, మిర్చి, పుదీన, పుచ్చ, తర్బూజ తదితర పంటలు సాగుచేస్తున్నారు. 17 ఎకరాల్లో సెంటు భూమి కూడా ఖాళీ లేకుండా పచ్చదనం పరిచేశారు. కేఎన్ బయోసైన్సెస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని 50 శాతం రాయితీతో విత్తనాలు, సేంద్రియ ఎరువులు పొందుతున్నారు.



నీటిని ఒడిసిపట్టి..

17 ఎకరాల్లో రకరకాల పంటలు పండించాలంటే అందుకు తగ్గ నీటి వసతి ఉండాలి. రూ.25 లక్షలు ఖర్చుపెట్టి.. పదిహేను ఎకరాల్లో బిందు, తుంపర సేద్యాన్ని చేపట్టాడు. పరిమిత జలవనరులతో పైరు కళకళలాడేలా చేశాడు. మల్చింగ్ విధానంతో కలుపు సమస్యనూ అధిగమించాడు. పొలంలో 1.25 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి కుంట (ఫారంపాండ్) ఏర్పాటు చేసి పంట పొలానికి దూరంగా ఉన్న బోర్లు, బావుల నుంచి నీటిని తరలిస్తున్నాడు. పొలంలో పడిన వర్షం చినుకు బయటకు పోకుండా అక్కడే ఇంకేలా ఏర్పాట్లు చేసుకున్నాడు. పొలంలో కందకాలు, ఇంకుడు గుంతల తవ్వించాడు. భూగర్భ జలాల మట్టం పడిపోకుండా జాగ్రత్త పడ్డాడు.

సేంద్రియ విధానం

పొలంలోని నీటి కుంటలో చేపలను పెంచుతున్నారు. ఆవుపేడ, గోమూత్రం, బెల్లం వంటి పలు రకాల పదార్థాలతో తయారు చేసిన జీవామృతాన్ని చేపలకు ఆహారంగా అందిస్తున్నారు. జీవామృతంతోపాటు, చేపల విసర్జితాలతో కలిసిన నీటిని పంటలకు మళ్లిస్తున్నారు. తెగుళ్లు, పురుగుల నివారణకు వివిధ రకాల ఆకులను నీటిలో ఊరవేసి దశ పత్ర కషాయాన్ని తయారు చేసి ఎరువుగా వినియోగిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల పెట్టుబడి కూడా బాగా తగ్గించుకున్నారు. ఎకరా విస్తీర్ణంలో రసాయన ఎరువుల వినియోగానికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వెచ్చించాల్సి వస్తే.. ఇప్పుడు ఆ ఖర్చు 25 శాతానికి పడిపోవడం విశేషం. అంతేకాదు సేంద్రియ పద్ధతులు పాటించి పురుగుమందు అవశేషాలు లేని పంటలను అందిస్తున్నారు.

– సింగంశెట్టి వెంకన్న, వాసిరెడ్డి శ్రీహరి, ఈనాడు, ఖమ్మం

మా పంట.. మా అమ్మకం..

ఆరోగ్యకరమైన పంటలను పండించడం ఒక ఎత్తయితే వాటిని వినియోగదారులకు అందజేయడం మరో ఎత్తు. దళారుల ప్రమేయం లేకుండా వినియోగదారులపై భారం పడకుండా నాణ్యమైన ధరలకు వీటిని విక్రయిస్తున్నారు. తనలాంటి రైతు మిత్రులు సతీష్‌రెడ్డి, కాకి భాస్కర్, రాంరెడ్డి తదితరులను కూడగట్టి ఎస్తా సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. 'సాగు క్షేత్రం నుంచి వంట ఇంటికి' అనే నినాదంతో ఖమ్మం పట్టణంలో 'క్రాప్ టు కిచెన్' దుకాణాలు ఏర్పాటు చేశారు. ఏ రోజు కోసిన కూరగాయలు ఆ రోజునే విక్రయిస్తారు. కూరగాయల నాణ్యత, ధర తెలుసుకున్న వినియోగదారులు 'క్రాప్ టు కిచెన్' దుకాణాలకు క్యూ కడుతున్నారు. రోజూ 500 మందికిపైగా వినియోగదారులు సేంద్రియ ఉత్పత్తులను సరసమైన ధరలకు కొనుగోలు చేస్తున్నారు. త్వరలోనే మరో దుకాణం ప్రారంభించనున్నారు. సాగుబడి లాభసాటిగా ఎలా సాగించాలో చూపించిన కరుణాకర్ రెడ్డి రైతులందరికీ ఆదర్శం.



అక్కా! చూడే రేడియోలో మా చిన్నోడి ఏకపాత్రాభినయం...

బావ.. మా పిల్లోడి మాటలు విన్నావంటే ఫిదా అవ్వాల్సిందే..

అమ్మా.. నీ మనవడు పద్యాలు పాడుతున్నాడు విందురావే!

...ఇలా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభ గురించి గొప్పగా చెప్పుకొని పొంగిపోయే అదృష్టం ఆ ఊరివాళ్లకు ఉంది.... అలా తమలోని ప్రతిభపాటవాలను ప్రదర్శించే అవకాశం ఆ విద్యార్థులకుంది.

అదెలా? అంటే... పాఠశాల రేడియో వల్ల!



విద్యార్థి వాణి

ఈ బడి సంగతులు 10 కి.మీ. వినిపిస్తాయి



ఈ బడి రేడియో హెడ్‌ఆఫీసు... శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా అనంతసాగరం మండలం ఉప్పలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల. అక్కడి ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ అలీ నేతృత్వంలో ఉపాధ్యాయులు, పిల్లలు కలిసి నడుపుతున్నారు దీన్ని. పాఠశాలలో 128ఫ్రీక్వెన్సీ(ఎఫ్ఎం) పరికరం ఏర్పాటు చేసి చుట్టుపక్కల పది 10 కిలోమీటర్ల దాకా తమ వాణి వినిపిస్తున్నారు. బడిలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, పిల్లల పరీక్షల ఫలితాలు, విద్యా ప్రగతి, కొన్ని పాఠాలు.. తదితరాలను రేడియోలో తల్లిదండ్రులకు వినిపిస్తున్నారు. పద్యాలు, నాటకాలు, ఏకపాత్రాభినయాలు ప్రసారం చేస్తున్నారు. రేడియో, మొబైల్‌లో వినే సదుపాయం ఉండటంతో తల్లిదండ్రులకు సౌకర్యంగా ఉంది. దీనివల్ల బాధ్యతాయుతమైన విద్య తమ పిల్లలకు అందుతున్న నమ్మకం అక్కడి వారిలో పెరిగింది. విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో విద్యాధికారుల అభినందనలు అందుకుంది ఈ ఉపాధ్యాయ బృందం. భయభక్తులతో చదువు నేర్పించడం కంటే ఆడుతూ, పాడుతూ చదివించడం మెరుగైన ఫలితాలు ఇస్తుందని నమ్ముతానని, అందుకే ఈ మార్గం ఎంచుకున్నానని, మంచి ఫలితాలు వస్తున్నాయని ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ అలీ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, అనంతసాగరం

జీవించే హక్కు జీవించేలా 'హక్'

సేవాశ్రీ



ఎదుటి వాడికి సాయపడాలంటే ఏమి ఉండాలి?
డబ్బు..? సమయం..? ... ఇవేవీ కాదు మనిషిని మనిషిగా చూసే మనసుండాలి. సాటి మనిషి కళ్లలో నీళ్లు తిరిగితే.. మన గుండె తడిబారే గుణం ఉండాలి.
ఈ మాటలు పశ్చిమబెంగాల్‌లో ఉండే కరిముల్ హక్‌కి అతికినట్లు సరిపోతాయి.
టీ తోటల్లో పనిచేసే ఈ కూలీ 'బైక్ అంబులెన్స్'తో వేలమంది ప్రాణాలను కాపాడాడు.
ఫలితం... ఈ పేదవాడి ఇంటికి.. దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన 'పద్మశ్రీ' తలుపు తట్టింది....



అర్ధరాత్రి రెండుగంటలు..

'పెద్దమ్మ కళ్లు తిరిగి పడిపోయిందన్నా' అని ఏడుపు స్వరంతో ఫోన్.

నిద్రముఖం కడుక్కోకుండా.. అంబులెన్స్ బైక్‌ని స్టార్ట్‌చేసి కరిముల్ హక్ ఆ ఇంటికి వెళ్లాడు. ప్రాథమిక చికిత్స చేసి దగ్గర ఉండే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి ఆ పెద్దావిడను కాపాడాడు. హక్‌కు ఇదేం కొత్త కాదు. పదిహేనేళ్ల నుంచీ ఇదే పని. ఎక్కడ ఆపద ఉంటే హక్ అక్కడుంటాడు. ఎవ్వరి దగ్గరా పైసా తీసుకోడు. అంతా ఉచితమే. వైద్యం పూర్తయ్యాక వారిని ఇంటి దగ్గర వదిలిపెట్టేంత వరకు ఆయనే బాధ్యత తీసుకుంటాడు. ఆ తరువాత కూడా వారిని ఇంటికెళ్లి పలకరిస్తాడు. మాత్రలు ఇచ్చి సలహాలు చెబుతాడు. కరీం భాయ్‌ది పశ్చిమబెంగాల్‌లోని జల్పాయ్‌గురి జిల్లాలోని ధలబరి గ్రామం. 24 క్రాస్ 7 సేవలందించే ఈయన్ని అందరూ అంబులెన్స్ మ్యాన్, అంబులెన్స్ దాదా అని పిలుస్తుంటారు.

అమ్మ మరణంతో...

కరీముల్ హక్ టీ తోటలో కూలీగా పనిచేసేవాడు. పదిహేనేళ్ల కితం.. ఓ రోజు తెల్లారుజాము మూడు గంటల సమయంలో కరిముల్ అమ్మకి గుండెపోటు వచ్చింది. ఆ మారుమూల పల్లెలో కారు దొరకలేదు. అంబులెన్స్ సౌకర్యం లేదు. దీంతో ఆమె మరణించింది. తన అమ్మ మరణంతో హక్ కలత చెందాడు. అలా ఎవరూ కాకూడదని అనుకున్నాడు. ఓ బైక్‌ను లోన్‌లో తీసుకున్నాడు. దానిపై ఎర్ర అక్షరాలతో ఉచిత అంబులెన్స్ అని రాయించాడు. 'చక్కగా పని చేసుకుని బతకకుండా ఈ పనులెందుకో' అంటూ ఆ ఊరివాళ్లు కొందరు పెదవి విరిచారు. అవేవీ పట్టించుకోలేదాయన. తనకొచ్చే నాలుగువేల కూలి డబ్బుల్లో ఎక్కువ పెట్రోలుకే ఖర్చు పెడతారు. మరికొంత కొంత బైక్ లోన్‌కి చెల్లించేవాడు. ఊళ్లో చంటిబిడ్డ దగ్గరనుంచి బామ్మల వరకూ ఇబ్బందుల్లో ఉన్న వారిని బైక్ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లేవాడు. ఆపదలో ఆదుకున్నాడని ఎవరైనా ప్రేమతో డబ్బులివ్వాలని చూస్తే.. అంతే ప్రేమతో తిరస్కరిస్తాడు కరిముల్. అంతేకాదు అనాథ శవాలకోసం ఓ చెక్కబండిని తయారు చేయించాడు. దాన్ని బైక్‌కి కట్టి శ్మశానానికి తీసుకెళుతుంటాడు ఉన్నంతలో ఇతరులకు సేవ చేసే కరిముల్‌ను చూసి కొందరు దాతలు స్పందించారు. బజాజ్ సంస్థ అంబులెన్స్ మ్యాన్‌కి అంబులెన్స్ టూ వీలర్ బైక్‌ను ఉచితంగా ఇచ్చింది. ఇప్పటి వరకూ దాదాపు 3000 మందికి సాయం చేశాడు ఈ అంబులెన్స్ దాదా.

చిత్రంగా హక్ జీవితం ..

కరిముల్ హక్ అన్నం తినేసమయంలో ఎవరైనా ఫోన్ చేస్తే చేతులు కడిగేసి వెళ్లిపోతాడు. 'దేవుడి దయ. భార్య, మా ఇద్దరి పిల్లలు సహకారంతోఈ పని చేయగలుగుతున్నా'నంటాడు హక్. ఇతని సేవను గుర్తించి గతేడాది కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. 'అంబులెన్స్‌ను ప్రారంభించినపుడు కొందరు ఫక్కున నవ్వారు. ప్రస్తుతం ముంబైలోని కొంత మంది దర్శకులు తన జీవిత చరిత్రను చిత్రంగా తీస్తామని ఇంటికొచ్చి మరీ మాట్లాడి వెళుతున్నారు. ఇది కల్లో కూడా ఊహించనిది' అంటారు కరిముల్. ఇప్పుడాయన వయసు యాభై రెండేళ్లు.. అయినా ఈ ప్రజాసేవకుడు నిత్యం చురుగ్గా ఉంటాడు. తోటి వాడికి సాయపడటంలో తానే ముందుంటాడు. బైక్ అంబులెన్స్‌ను వదిలేసి కారు అంబులెన్స్ నడపొచ్చు కదా? అని ఎవరైనా అడిగితే 'బైక్ అంబులెన్స్ మా అమ్మ. మా అమ్మను ఎలా వదలను?' అంటూ మనల్ని ప్రశ్నిస్తాడు కరిముల్.

ఫిబ్రవరి 19 శివాజీ జన్మదినం



వాజీ... వాజీ... శివాజీ..!

ఈ చిత్రంలోని ద్వారానికి ఓ ప్రత్యేకత ఉంది. ఓ వీరగాథకు ఇదో చిహ్నం. అంతేనా ఓ హిందూ చక్రవర్తి, ఓ ముస్లిం నవాబుకు అండగా నిలిచినో గొప్ప సందర్భానికి సూచిక. హైదరాబాద్ నగరంలోని మత సామరస్యతకు నిదర్శనం.

అది 1677వ సంవత్సరం... కుతుబ్‌షాహీలు గోల్కొండ రాజధానిగా పరిపాలిస్తున్న కాలం... మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు నిజాం సామ్రాజ్యంపై దండయాత్రకు ఏర్పాట్లు చేసుకున్నాడు. దీంతో నవాబు తన మంత్రులు అక్కన్న, మాదన్న ద్వారా శివాజీ చక్రవర్తికి వర్తమానం పంపారు. అంతే వేగంగా ప్రతిస్పందించిన ఛత్రపతి నవాబుకు అండగా గోల్కొండకు చేరుకున్నారు. హైదరాబాద్ పాత నగరంలోని పురానా పూల్ సమీపంలోని ఈ ద్వారం వద్ద ఆయన కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఔరంగజేబు తన దండయాత్రను విరమించుకున్నారు. ఆనాటి వీర శివాజీ విజయచిహ్నంగా ఈ ద్వారం ఈనాటికీ భాసిల్లుతోంది. ఇప్పటికీ ఏటా శివాజీ జన్మదినం రోజు యువకులు గౌలిగూడ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తుంటారు..

– చిత్ర కథనం: వసంత్, హైదరాబాద్



ఘన చరిత



ఈనాడు సినిమా


అనుష్క

భానుమతిగా భాగమతి?

అనుష్క ఈమధ్యే భాగమతిగా సందడి చేసింది. తదుపరి ఆమె భానుమతి పాత్రలో మురిపించనున్నట్టు సమాచారం. ప్రముఖ నటి సావిత్రి జీవితం ఆధారంగా 'మహానటి' తెరకెక్కుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. వైజయంతీ మూవీస్ నిర్మిస్తోంది. సావిత్రిగా కీర్తి సురేష్ నటిస్తుండగా, సమంత ఓ ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రంలో సావిత్రి సమకాలీన కథానాయికల పాత్రలతో పాటు... అప్పట్లోని ప్రధాన నటులు, నిర్మాతలు, దర్శకుల పాత్రలు కూడా కీలకం. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రముఖ నటి భానుమతిగా అనుష్క నటిస్తున్నట్టు తెలిసింది. జెమినీ గణేశన్‌గా దుల్కర్ సల్మాన్, అక్కినేని నాగేశ్వరరావుగా విజయ్ దేవరకొండ, ఎస్వీ రంగారావుగా మోహన్‌బాబు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

కొత్త కబుర్లు


సాయిధరమ్ తేజ్

గోపీచంద్ దర్శకత్వంలో..

సాయిధరమ్ తేజ్ వేగం పెంచుతున్నాడు. ఇటీవలే 'ఇంటిలిజెంట్'గా ప్రేక్షకుల ముందుకొచ్చిన ఆయన ఓ కొత్త చిత్రానికి పచ్చ జెండా ఊపాడు. గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఆయన నటించనున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ బాలాజీ సినీ మీడియా పతాకంపై జె.భగవాన్, జె.పుల్లారావులు సంయుక్తంగా నిర్మించనున్నారు. ఈ సినిమా షూటింగ్ మే నుంచి మొదలు కానుంది. నిర్మాతలు మాట్లాడుతూ "గోపీచంద్, సాయి ధరమ్ తేజ్ కాంబినేషన్‌లో ఈ సినిమాను తీయడం ఆనందంగా ఉంది. ఇంతవరకు సాయిధరమ్ చేయని కొత్త తరహా కథతో చిత్రాన్ని రూపొందించనున్నాం. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తాం" అన్నారు.

అవకాశం వస్తే పంచ్ విసరాలి!

వెండి తెరపై హాఫ్ సెంచరీ కొట్టేసింది కాజల్. పన్నెండేళ్లుగా కొనసాగుతూ, రకరకాల పాత్రల్లో మెరిసినా నటిగా ఇంకా దాహం తీరలేదంటోంది. ఒక కొత్త పాత్ర గురించి వినగానే, ఇది నేను చేస్తే బాగుంటుంది కదా అనే ఆలోచన వస్తోందని చెబుతోంది. 'నేనే రాజు నేనే మంత్రి'తో యాభై సినిమాల మైలురాయిని అధిగమించిన ఆమె ప్రస్తుతం తన అనుభవానికి తగ్గట్టుగా పాత్రల్ని ఎంపిక చేసుకొంటోంది. తొలినాళ్లతో పోలిస్తే ఇప్పుడొక కొత్త ప్రయాణాన్ని ఆరంభించిన అనుభూతి కలుగుతోందని చెబుతోంది. "కథానాయికగా నిలదొక్కుకొనే సమయంలో చాలా విషయాల గురించి ఆలోచించాల్సి ఉంటుంది. పరిమిత సంఖ్యలోనే అవకాశాలు తలుపుతడుతుంటాయి. వాటితోనే కెరీర్‌ని మలుచుకోవాలనే ఒత్తిడి వెంటాడుతుంటుంది. ఇప్పుడు ఆ భయాలేం లేవు. నచ్చిన చోట, నచ్చిన కథల్ని ఎంపిక చేసుకొనే వెసులుబాటు ఉంది. అందుకే ఇప్పుడు మనసంతా విభిన్నమైన పాత్రలపైనే. ఫైటింగ్‌లంటే నాకు చాలా ఇష్టం. ఎక్కువగా యాక్షన్‌తో కూడిన కథల్లో నటించాలనే కోరిక ఎప్పట్నుంచో వెంటాడుతోంది. అవకాశం వస్తే మరోసారి పంచ్ విసరాల"ని తన మనసులో మాట బయటపెట్టింది కాజల్.


కాజల్


జయప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు, శివాజీరాజా, ఏడిద శ్రీరాం, హేమ, కె.రాఘవేంద్రరావు, డి.సురేష్‌బాబు, ఆర్.నారాయణమూర్తి

రామానాయుడు నామ స్మరణలో...

"రాజులు చాలా మంది ఉంటారు. కానీ రారాజు ఒక్కడే ఉంటాడు. నిర్మాతల్లో రారాజు.. రామానాయుడు. అందుకే ఆయన మూవీ మొఘల్ అయ్యార"న్నారు ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు. 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రామానాయుడు కళామండపంలో మూడు రోజులుగా నాటకోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం ముగింపు వేడుకల్లో భాగంగా ప్రముఖ నటుడు, నాటక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న జయప్రకాష్ రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ "విజయాలున్న దర్శకులకు ఎవరైనా అవకాశాలు ఇస్తారు. కానీ ఫ్లాపుల్లో ఉన్న చాలామంది దర్శకులకు అవకాశం ఇచ్చి ఆదుకున్నారు రామానాయుడు. ఆయన స్మృతికి చిహ్నంగా ఇలా నాటకోత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉంద"న్నారు. "ప్రేమించుకుందాం రా'తో నా సినీ జీవితాన్ని మలుపు తిప్పిన రామానాయుడు గారిని ఎప్పటికీ మర్చిపోలేన"న్నారు జయప్రకాష్‌రెడ్డి. "మాలో చాలామంది నాటకాల నుంచి సినిమాల్లోకి వచ్చినవాళ్లమే. కొంతమంది సినీ నటులు ఇంకా నాటకాల్ని వదిలి పెట్టకుండా తమవంతు సేవ చేస్తున్నారు. తనికెళ్ల భరణి, ఎల్బీ శ్రీరామ్, జయప్రకాష్‌రెడ్డిలాంటి వాళ్లని సన్మానించుకోవడం 'మా' అదృష్టం" అన్నారు పరుచూరి వెంకటేశ్వరరావు. ప్రతి నెలా కనీసం ఒక్క నాటకమైనా వేసేలా 'మా' తగిన సన్నాహాలు చేయాలని సూచించారు పరుచూరి గోపాలకృష్ణ. "బిడ్డ సినిమా అయితే... తల్లి నాటక రంగం. తమిళనాడులో, మరాఠీలో నాటకాలకు ఆదరణ బాగుంది. తెలుగు నాట కూడా అలాంటి రోజులు రావాల"ని ఆకాంక్షించారు 'మా' ప్రధాన కార్యదర్శి నరేష్. "నాన్నగారి స్మృతిని ఇలా నాటకోత్సవాల పేరిట జరుపుకోవడం సంతోషంగా ఉంద"న్నారు డి.సురేష్‌బాబు. "తెలుగు చిత్రసీమకే కాదు, భారతీయ చలన చిత్రసీమకే కాదు.. యావత్ ప్రపంచ సినీ రంగానికి మకుటం లేని మహారాజు రామానాయుడు. ఎంతోమందికి అన్నం పెట్టారాయన. నాటకాలు వేయడమే కాదు, నాటక రంగంలో ప్రతిభని చూపించినవాళ్లకు వెండితెరపై అవకాశం ఇచ్చేలా 'మా' చర్యలు తీసుకోవాల"న్నారు ఆర్.నారాయణమూర్తి. ఈ కార్యక్రమంలో 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా, శ్రీకాంత్, బెనర్జీ, హేమ, కాశీవిశ్వనాథ్, ఏడిద శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

అందాల భామలకు అమితాబ్‌బచ్చన్ దరఖాస్తు




దీపికా పదుకొణె

అమితాబ్ అప్లికేషన్

పేరు: అమితాబ్‌బచ్చన్
పుట్టిన తేదీ: 11.10.1942, అలహాబాద్,
వయసు: 76 సంవత్సరాలు,
అర్హత: 49 ఏళ్లుగా సినిమాల్లో నటిస్తున్నాను. సుమారు 200 చిత్రాల్లో నటించాను.
మాట్లాడే భాషలు: హిందీ, ఇంగ్లీష్, పంజాబీ, బెంగాలీ
ఎత్తు: 6.2, మీకు ఎత్తుతో సమస్య ఉండనే ఉండదు.


కత్రినాకైఫ్

అమితాబ్‌బచ్చన్ వయసు 76 ఏళ్లు. అయినా ఆయనలోని జోరు.. హుషారు తగ్గలేదు. సరదా...చిలిపితనం...వ్యంగ్యం...వీటికి ఆయన వయసు అడ్డు కాలేదు. తాజాగా ఆయన పెట్టుకొన్న ఉద్యోగ దరఖాస్తే అందుకు నిదర్శనం. భారతీయ చిత్ర పరిశ్రమలో శిఖర స్థాయికి వెళ్లిన ఆయన ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకోవడం ఏంటి? అదే అమితాబ్ అంటే. వివాదాల నడుమ విడుదలై విజయం అందుకొన్న చిత్రం 'పద్మావత్'. ఇందులో రాణి పద్మావతిగా దీపికా పదుకొణె, మహారాణా రతన్‌సింగ్‌గా షాహిద్‌కపూర్ నటించారు. 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్'లో ఆమీర్‌ఖాన్, కత్రినాకైఫ్ జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. 'షాహిద్ కంటే దీపికా, ఆమీర్ కంటే కత్రినా పొడుగ్గా ఉన్నారు. హీరోయిన్‌ల కంటే హీరోలు పొట్టిగా ఉండటం వల్ల కథానాయికలు ఇబ్బందిపడుతున్నార'ంటూ ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. దీనికి అమితాబ్ స్పందించారు. సరదాగా ఓ ట్వీట్ ట్వీటారు. ఆ కథానాయికల పక్కన నటించడానికి పొడుగే సమస్య అయితే నేను పొడుగ్గానే ఉన్నాను అంటూ ఓ జాబ్ అప్లికేషన్‌ను ట్వీట్ చేశారు అమితాబ్.

ఇప్పటికే 'పీకూ'లో అమితాబ్‌బచ్చన్, దీపికా కలిసి నటించారు. 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్'లో అమితాబ్‌బచ్చన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అయినా అమితాబ్ తమ పక్కన నటిస్తానంటే కాదనే వారు ఎవరుంటారు అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు.


బెల్లంకొండ శ్రీనివాస్

వేసవిలో 'సాక్ష్యం'

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. పూజా హెగ్డే కథా నాయిక. శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ జరుగుతోంది. మే 11న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. "యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రమిది. శ్రీవాస్ కథ, ఆయన దర్శకత్వం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. బెల్లంకొండ శ్రీనివాస్ డూప్ లేకుండా చేసిన యాక్షన్ ఘట్టాలతో పాటు, పూజా హెగ్డేతో కలిసి చేసిన రొమాంటిక్ సన్నివేశాలు ఆసక్తికరంగా ఉంటాయి. ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో తీర్చిదిద్దిన ప్రత్యేకమైన సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. తదుపరి అమెరికాలో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తాం. దాంతో చిత్రీకరణ పూర్తవుతుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకి మంచి స్పందన లభించింది. వేసవిలో రానున్న చిత్రం కూడా అందరికీ వినోదాన్ని పంచుతుంద"న్నాయి చిత్రవర్గాలు. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెల కిషోర్, జయప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ, రవి కిషన్, అశుతోష్ రాణా, మధు గురుస్వామి, లావణ్య తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్.ప్రకాష్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, ఛాయాగ్రహణం: ఆర్థర్ ఎ.విల్సన్, పోరాటాలు: పీటర్ హెయిన్స్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: హర్షవర్ధన్.

కళ అంటే బతుకునిచ్చేదే కాదు.. బతుకు నేర్పేది కూడా..
చిత్రం : కృష్ణం వందే జగద్గురుమ్
పంపినవారు : బాలయ్య, భద్రాచలం

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

దెయ్యాలతో ఆట


నాని, శ్రీకాంత్, తరుణ్

శ్రీకాంత్, నాజియా జంటగా నటిస్తున్న చిత్రం 'రా.రా..'. విజి చరిష్ యూనిట్ దర్శకత్వం వహించింది. విజయ్ నిర్మాత. శ్రీమిత్ర చౌదరి సమర్పిస్తున్నారు. రాప్ రాక్ షకీల్ స్వరాలు సమకూర్చిన ఈ చిత్రం ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకొస్తోంది. హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక జరిగింది. నాని, తరుణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీకాంత్ మాట్లాడుతూ "హాస్యంతో కూడిన హారర్ థ్రిల్లర్ చిత్రమిది. మనుషులకి, దెయ్యాలకి మధ్య సాగే సరదా ఆటలు ఆద్యంతం వినోదాన్ని పంచుతాయి. నా కెరీర్‌లో నేను చేసిన తొలి హారర్ చిత్రమిదే. ఓ కొత్త రకమైన కథతో తెరకెక్కింది" అన్నారు. నాని మాట్లాడుతూ "నాకు 'అష్టాచమ్మా' నుంచి శ్రీకాంత్‌తో అనుబంధం ఉంది. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. ఇప్పుడు హారర్ నేపథ్యంలో సాగే 'రా..రా..' చేశారు. ఈ సినిమా ఆయనకి మరో మంచి విజయాన్ని అందిస్తుందని ఆశిస్తున్నా" అన్నారు. "శ్రీకాంత్ నటించిన 125వ చిత్రమిది. హాస్యనటులు చాలామంది ఇందులో ఉన్నార"న్నారు తరుణ్. "శ్రీకాంత్‌తో ఉన్న అనుబంధమే ఈ సినిమా చేయడానికి కారణమైంది. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పించే ఓ మంచి చిత్రమవుతుంది" అన్నారు శ్రీమిత్ర చౌదరి. సంగీత దర్శకుడు మాట్లాడుతూ "సంగీతానికి ప్రాధాన్యమున్న చిత్రమిది. ఇలాంటి చిత్రానికి పనిచేసే అవకాశాన్నిచ్చిన దర్శకనిర్మాతలకి, కథానాయకుడికి కృతజ్ఞతలు" అన్నారు. ఈ కార్యక్రమంలో రఘుబాబు, హేమ, సదానంద్, అశోక్, ప్రతాప్, ఖయ్యూమ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుర్రకారు 'ఆనందం'

అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్, అన్ను ఆంటోనీ ప్రధాన పాత్రలు పోషించిన మలయాళ చిత్రం 'ఆనందం'. గణేష్ రాజ్ దర్శకుడు. ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు. ఎత్తరి గురురాజ్ నిర్మాత. "కాలేజీ నేపథ్యంలో సాగే కథ ఇది. యువతరం ఆలోచలకు ప్రతిబింబంగా నిలుస్తుంది. ప్రతీ సన్నివేశం సహజంగా ఉంటుంది. సచిన్ వారియర్ సంగీతం అందించారు. మార్చి మొదటి వారంలో పాటల్ని, 16న చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు నిర్మాత. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: వీర వెంకటేశ్వరరావు, వి.ఆర్.బి.రాజు, రవివర్మ చిలువూరి.


అన్ను



ఆపదా? ఆపేద్దాం పదా...!

"హలో అనూ.. హ్యాపీ బర్త్‌డే రా.. ఎక్కడున్నావ్.?''..' థ్యాంక్యూ నాన్న.. ఆఫీస్‌లో ఇప్పుడే క్యాబ్ ఎక్కా. కాసేపట్లో మీ ముందుంటా'... "హా జాగ్రత్తగా రా.. కేక్ కోయించాలని అందరం ఎదురుచూస్తున్నాం.'' ..' హా ఒకే నాన్న..' ఫోన్ పెట్టేసింది. క్యాబ్ వేగంగా ముందుకు సాగిపోతోంది. అనూష తన స్నేహితులు పంపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు ఇవ్వడంలో తలమునకలై ఉంది. ఇదే అదునుగా క్యాబ్ డ్రైవర్ కారును దారి మళ్లించి.. నిర్మానుష్యమైన ప్రాంతం వైపు తీసుకువెళ్లాడు. కాసేపటికి సెల్ నెట్‌వర్క్ పోయింది. ఇదంతా ఆమె గుర్తించేలోపే కారు సెంట్రల్‌లాక్ పడిపోయింది. మన దేశంలో ఇలాంటి ఘటనల గురించి అప్పుడప్పుడూ వింటూనే ఉంటాం.

గతేడాది ఏప్రిల్ 28.. రాత్రి ఆఫీస్‌లో పని ముగించుకుని క్యాబ్‌లో ఇంటికి వెళ్తున్న 32 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ లైంగిక దాడి.. ఇది జరిగి రెండు రోజులైనా గడిచిందో లేదో ముంబయిలో ఒంటరిగా క్యాబ్‌లో ప్రయాణిస్తున్న మరో మహిళపై డ్రైవర్ లైంగిక వేధింపులు.. మరో వారం రోజులకు దిల్లీలో ఇలాంటి ఘటనే.. 23 ఏళ్ల బెల్జియం యువతిని బలవంతంగా ముద్దుపెట్టుకునేందుకు ప్రయత్నించిన డ్రైవర్. హైదరాబాద్‌లోనూ ఇలాంటివి చాలానే వెలుగుచూశాయి. ఫలితంగా మహిళలు క్యాబ్‌లు ఎక్కాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. కానీ వృత్తిలో భాగంగా మహిళలు రాత్రిళ్లు ప్రయాణం చేయకతప్పడం లేదు. కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు మాత్రమే ఉద్యోగినుల రక్షణకోసం ప్రత్యేకంగా క్యాబ్‌లను నడుపుతున్నాయి తప్ప.. అందరికీ ఇలాంటి సేవలు అందుబాటులో లేవు. మరి ఒంటరిగా కార్లలో ప్రయాణించేవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతున్నారు క్యాబ్‌ల నిర్వాహకులు.

ఆ సీటు క్షేమం...

క్యాబ్‌లో ఎడమవైపు కూర్చోవడం మహిళలకు ఏ మాత్రం సురక్షితం కాదు. దీని వల్ల డ్రైవర్ దాడి చేసినప్పుడు తప్పించుకోవడానికీ, ఎదురు దాడి చేయడానికి ఆస్కారం తక్కువ. అదే డ్రైవరు సీటు వెనక కుడివైపు కూర్చుంటే ఇద్దరి మధ్యా సీటు అడ్డు ఉంటుంది. చేతులు వేయడానికి వీలు ఉండదు. ఒకవేళ ఆ ప్రయత్నం చేయబోతున్నా ముందే తెలుస్తుంది. సులభంగా అడ్డుకోవచ్చు. సెంట్రల్ లాక్ చేసినా దాన్ని తీసేయడానికి కూడా ప్రయత్నించొచ్చు.

రేటింగ్ గమనించుకోవాలి...

ఎప్పుడైనా సరే మహిళలు క్యాబ్ బుక్ చేసుకోవడానికి ముందు రేటింగ్ గమనించుకోవాలి. ఈ విషయంలో ఐదుకు నాలుగుపైన రేటింగ్ ఉన్న క్యాబ్‌లను ఎక్కడమే మీకు శ్రేయస్కరం. అంతకంటే తక్కువగా ఉంటే అలాంటివాటిలో ప్రయాణం చేయకపోవడమే ఉత్తమం. అలానే రాత్రైనా, పగలైనా మహిళలు క్యాబ్‌లో ప్రయాణం చేసేటప్పుడు ఆ వివరాలను కుటుంబసభ్యులతో పంచుకోవాలి. దీనికి క్యాబ్ సంస్థల యాప్స్, సైట్స్‌లో షేర్‌డిటేల్స్ ఆప్షన్‌ను క్లిక్ చేసి కుటుంబ సభ్యులతో పంచుకోవచ్చు. అలానే జీపీఎస్ ద్వారా కూడా క్యాబ్ సరైన మార్గంలోనే వెళుతుందో లేదో తెలుసుకోవచ్చు. ఒకవేళ ఏదైనా ఆపద ఎదురైతే అందులోని ఎస్ఓఎస్ ఆప్షన్ ద్వారా సమాచారాన్ని దగ్గర్లోని పోలీసులకు చేరవేయొచ్చు.

సెంట్రల్‌లాక్‌తో జాగ్రత్త...

క్యాబ్‌లలో జరిగే లైంగికదాడుల నుంచి మహిళలు త్వరగా బయటపడలేకపోవడానికి మరో ప్రధాన కారణం సెంట్రల్‌లాక్ విధానం. ఈ విషయంలో కొంత అవగాహన, అప్రమత్తత అవసరం అంటున్నారు నిపుణులు. సాధారణంగా ప్రయాణికుల రక్షణకోసం దీన్ని ఉపయోగిస్తారు. ఒకవేళ డ్రైవర్ కదలికలు అనుమానాస్పదంగా అనిపించినా సెంట్రల్‌లాక్ తీసేయమని చెప్పండి. అతను దాన్ని తీయకపోయినా, అది తెరుచుకోకపోయినా ఆందోళన పడకుండా ఫోన్లో ఎస్ఓఎస్ బటన్‌ను వాడుకోవడం ద్వారా దగ్గర్లోని పోలీసులకు సమాచారాన్ని అందించొచ్చు.

ఎప్పటికప్పుడు సమాచారం...

ఒంటరిగా ప్రయాణించేప్పుడు కుటుంబసభ్యులతోనో, స్నేహితులతోనో ఫోన్లో మాట్లాడుతూ.. క్యాబ్ ఎక్కడున్నదీ చెబుతుండాలి. అంతేతప్ప కబుర్లు చెప్పుకోవడం, ఛాటింగ్, వీడియోగేమ్‌ల వంటివాటికి దూరంగా ఉండాలి. లేదంటే మార్గం మళ్లించినా గుర్తించే అవకాశం ఉండదు. మన ప్రయాణం ఇతరులు గమనిస్తున్నారనే విషయం డ్రైవర్‌కి తెలిసేలా చూసుకోవాలి.

షేరింగ్‌క్యాబ్‌ల విషయంలో...

షేరింగ్ క్యాబ్ బుక్ చేసుకుంటే.. మీకు ఎలాంటి వ్యక్తులతోనైనా ప్రయాణం చేయాల్సి రావొచ్చు. అందులో అల్లరిమూకలు, మద్యం సేవించిన వారు, ఆకతాయిలు ఉండొచ్చు. వీరి వల్ల ఊహించని చిక్కులు ఎదురవుతాయి. అందుకే వాటికి దూరంగా ఉండటం మంచిది.

- మందలపర్తి రాజేశ్‌శర్మ, ఈనాడు డిజిటల్


మహిళల్లో మార్పు వచ్చింది...



గతంతో పోలిస్తే మహిళలు క్యాబ్‌లు ఎక్కడానికి భయపడట్లేదు. మావైపు నుంచీ వారికి సురక్షిత వాతావరణాన్ని కల్పించడం వల్ల మా క్యాబ్‌డ్రైవర్లపై పూర్తి భరోసా ఏర్పడింది. కేవలం మహిళలనే కాదు. ప్రయాణికులెవరైనా వారితో గౌరవపూర్వకంగానే వ్యవహరిస్తాం. ఎప్పుడైనా మహిళలు షేరింగ్ క్యాబ్స్ బుక్‌చేసుకుంటే వారికి మగవారితో కలిసి ప్రయాణం చేయాల్సిరావచ్చు. అలాంటప్పుడు వెనుకన ఇద్దరూ మగవారే ఉంటే.. మహిళలకు ఇబ్బంది ఉండకుండా వారిని ముందు సీటులో కూర్చోమని చెబుతాం. పోలీసులు, క్యాబ్‌సంస్థల నిరంతర పర్యవేక్షణ, టెక్నాలజీ మహిళల్లో ధైర్యాన్ని నింపుతున్నాయి.

– కట్లకుంట సత్య, క్యాబ్‌డ్రైవర్

తెలియకచేసే పొరపాటిది..!



టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక రక్షణ విషయంలో మంచి భద్రత ఏర్పడింది. మిగతా రాష్ట్రాలతో పోల్చితే మన దగ్గర క్యాబ్‌సర్వీసులు మంచిగానే ఉంటున్నాయి. సాధారణంగా కొత్తగా క్యాబ్స్ ఎక్కే అమ్మాయిలు తెలియక చేసే తప్పు డ్రైవర్లతో అవసరానికి మించి మాట్లాడటం, క్యాబ్‌లో ఉన్నప్పుడు ఫోన్‌లోనే లీనమైపోవడం వంటివి చేసి ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారు. సురక్షితమైన షీక్యాబ్స్ కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. అలాకాకుండా ఇంకా ఈ సేవల్ని పెంచితే మంచిది.

– అవధానుల కృష్ణప్రియ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, హైదరాబాద్

ధైర్యంగా స్పందించండి...



సాధారణంగా చాలా మంది అమ్మాయిలకు క్యాబ్ ప్రయాణాల్లో డ్రైవర్ నుంచి ఏమైనా ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదు చేసేందుకు ముందుకురారు. ఇది సరైన పద్ధతికాదు. ఇలాంటి వాటిని మొదట్లోనే అరికట్టాలి. ధైర్యంగా పోలీసులకు తెలియజేయడంతో పాటు సదరు క్యాబ్ సంస్థ నిర్వాహకులకు చెప్పాలి. ఫలితంగా భవిష్యత్తులో వేరొకరికి అలాంటి సమస్య ఎదురవకుండా ఉంటుంది. అలాంటి వారికి రేటింగ్ తక్కువగా ఇవ్వడం ద్వారా ఇతరులకు అవగాహన కల్పించవచ్చు. వ్యక్తిగత రక్షణ కోసం పెప్పర్ స్ప్రేలు, ప్రాణానికి హాని కలిగించని పదునైన వస్తువులు, ఇతర రక్షణా పరికరాలను దగ్గర ఉంచుకోవడం మంచిది.

– మధుమిత గూడిపల్లి, ఇంజనీరింగ్ విద్యార్థిని, హైదరాబాద్

చనువు పెంచుకోండి...

దంపతులిద్దరూ ఉద్యోగస్థులైతే... జీవనశైలి యాంత్రికంగా మారిపోతోంది. కనీసం వారి మధ్య పలకరింపులూ ఉండటం లేదు. ఒక్కోసారి అపార్థాలూ, అపోహలు...అంతకు మించి వాదనలు. ఇవన్నీ జీవితాన్ని నిస్సారంగా మార్చేస్తాయి. దీన్నుంచి బయటపడాలంటే!



భార్యాభర్తల మధ్య బంధం కేవలం పడకగదికే పరిమితం కాదు. మాటల్లో, చేతల్లో ఒకరిపై మరొకరు చూపించే అభిమానం, ప్రేమ అన్నీ మీ బంధాన్ని బలపరిచేవే. కొందరు తమ ప్రేమనూ, భావాలనూ సరిగా వ్యక్తపరచలేకపోవచ్చు. కానీ అవతలివారు మీ నుంచి కోరుకునే చిన్న చిన్న విషయాలను మాత్రం నిర్లక్ష్యం చేయకండి. ఎప్పుడైనా ఓ కప్పు కాఫీ కలిపి ఇవ్వడం, వారి బాగోగులనూ ఇష్టాయిష్టాలను గుర్తుచేయడం ఇలాంటివే.

- ఇద్దరూ ఉద్యోగం చేస్తుంటే వచ్చే వారాంతపు సెలవుని విశ్రాంతి తీసుకోవడానికి మాత్రమే ఉపయోగించుకోవాలనుకుంటారు. కానీ ప్రతిసారీ దానికే పరిమితంకాకండి. ఆ రోజులో కొంత మీ ఇద్దరికోసం మాత్రమే కేటాయించుకోండి. వీలైతే కలిసి దగ్గర్లోని పార్కుకి వెళ్లి కబుర్లు చెప్పుకోండి. అక్కడి వాతావరణం మీ ఇద్దరి మధ్య అరమరికలు లేకుండా చేస్తుంది. అభద్రతను తొలగిస్తుంది.
- రోజంతా పనిఒత్తిడితో సతమతమవుతూ మీరుంటే... మీ భాగస్వామికేమో కనీసం ఒక్కసారైనా నేను గుర్తురాలేదా అనిపిస్తుంది. ఇద్దరి వాదనా నిజమే! కానీ మీరే పనిలో ఉన్నా ఒక సెకను ఖాళీ చేసుకుని తిన్నావా అని అడిగే ప్రశ్న? సమయానికి తిను అని చెప్పే సూచన వారికి ఎంతో సంతోషాన్నిస్తాయి.
- ఇద్దరూ వేర్వేరు సమయాల్లో విధులకు వెళ్తారు. కనీసం ఇంటికి వచ్చాక పనిచేసే ఓపికా ఉండదు. ఇలాంటప్పుడు ఒకరిపై ఒకరు నాకు సాయం చేయట్లేదు. పనులు పూర్తి చేయలేదు... అంటూ వాదనలొద్దు. ఇంటి బాధ్యతల్ని ఇద్దరూ సమంగా పంచుకోండి. ఒకవేళ ఏదైనా కారణంతో ఒకరు ఆ పనిని పూర్తి చేయలేకపోయినా నీకు బాగోలేదు కదా! విశ్రాంతి తీసుకో అనే భరోసా ఇచ్చి చూడండి. అవతలివారికి అర్థం అవుతుంది మీరెంత ప్రేమ చూపిస్తున్నారో ఇవన్నీ మీ బంధాన్ని పెంచేవే మరి.

చక్కెర తినాలనిపిస్తోందా!



కొన్నిసార్లు తీపి తినాలనిపిస్తుంది. అలాంటప్పుడు కొద్దిగా చక్కెరో, స్వీట్లో నోట్లో వేసుకుంటారు. కానీ వీటివల్ల ఎటువంటి పోషకాలూ అందవు సరికదా! ఆరోగ్యానికీ మంచిది కాదు. అందుకే దీనికి బదులుగా ఏం తీసుకోవచ్చంటే...

చిలగడదుంప: ఇందులో పీచూ, పొటాషియం ఎక్కువ మొత్తంలో ఉంటాయి. పిండిపదార్థాలు కూడా ఎక్కువగా ఉంటాయి. పైగా ఇది రుచికి తియ్యగా ఉంటుంది. కాబట్టి ఉడికించుకుని నేరుగా తీసుకోవచ్చు లేదా నిమ్మరసం, పచ్చిమిర్చి, సాస్‌లతో కలిపి చాట్‌లా కూడా చేసుకుని తినవచ్చు.

ఖర్జూరాలు: తీపి తినాలని అనిపించినప్పుడు వెంటనే ఓ రెండు ఖర్జూరాలు నోట్లో వేసుకోండి. దాంతో మీ కోరికా నెరవేరుతుంది. దీన్నుంచి పుష్కలంగా ఐరన్ అందుతుంది.

పండ్లు: విరివిగా దొరికే అరటి, యాపిల్, జామ పండ్లను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోండి. తీపి తినాలనుకున్నప్పుడో వీటిని తింటే మేలు. చక్కెర పదార్థాలకు ప్రత్యామ్నాయంగా వీటిని తీసుకోవచ్చు. వీటిల్లో సహజంగా లభించే విటమిన్లూ, పోషకాలు ఆరోగ్యానికి మంచిది.

మొదటి గురువు మీరే...

బుడిబుడి నడకల బుజ్జాయిలు ఇంట్లో ఉంటే ఆ సందడే వేరు. ఎదిగే కొద్దీ వారి ఆలోచనలూ, ప్రశ్నలూ పెరుగుతుంటాయి. వారి సందేహాలకు సరైన సమాధానాలు ఇవ్వడమే కాదు వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యత కూడా తల్లిదండ్రులుగా మీదే మరి. అందుకు మీరేం చేయాలంటే...

- **సహనం ముఖ్యం:** చిన్నపిల్ల దానికేం తెలుసని...కొట్టిపారేయకండి. చిట్టిబుర్రల్లో ఉండేవి చిన్న ఆలోచనలేం కాదు. వారి ఎదుగుదలకు అవి మొదటి మెట్లు. నిజానికి వాటన్నింటికీ సమాధానం మీ దగ్గర లేకపోవచ్చు. అలాని తేలిగ్గా తీసేయడం, కట్టు కథలు చెప్పడం మానేయండి. తెలియకపోతే నిజాయతీగా తెలియదనే చెప్పండి. వారి ప్రశ్నలకు వీలైంత సహనంగా జవాబివ్వండి. వారంతటవారుగా వాటిని తెలుసుకునేలా వెన్నుతట్టండి.
- **స్వేచ్ఛనివ్వండి..హద్దులు చెప్పండి:** పిల్లలు శారీరకంగానే కాదు...మానసికంగానూ ఎదగాలి. అందుకే అల్లరి చేస్తున్నారని అతిగా ఆంక్షలు పెట్టేయకండి. వారి వయసు మళ్లీ తిరిగిరాదు. ఆనందించనివ్వండి. ఆస్వాదించనివ్వండి. అయితే దానికి కచ్చితంగా హద్దులు పెట్టాల్సిందే. వాటిని వారంతటవారుగా పాటించేలా చూడండి.
- **నడక నేర్పండి:** పిల్లల్ని నలుగురిలో కలిసేలా అలవాటు చేయాలి. సామాజిక అంశాలపట్ల అవగాహన కల్పించాలి. చిన్నవాళ్లు కదా! వారికేం అర్థమవుతాయి అంటారా? నిజమే వారి వయసు వల్ల అర్థం చేసుకోలేకపోవచ్చు. కానీ వారికి మొదటి మెంటార్ మీరే. అందుకే మీరు చేసే ప్రతిపనీ వారిని ఆకర్షిస్తుంది. వాటినే వారు నేర్చుకునే అవకాశం ఉంది. మీరు వేలు పట్టుకుని వేయించే ప్రతి అడుగూ వారి ఎదుగుదలకు ముఖ్యమే అని మరిచిపోవద్దు.



ఆస్తి అడిగితే కొడతారంట!

నా వయసు నలభై ఏళ్లు. నాన్నకు మా తాతగారి ద్వారా సంక్రమించిన జిరాయితీ భూమి మూడెకరాలూ, ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమి మూడెకరాలూ, సాగు హక్కు కింద(పోరంబోకు)భూమి మూడెకరాలు కలిపి మొత్తం తొమ్మిదెకరాలు ఆస్తి ఉంది. నాన్న నాకు పదిహేనేళ్లున్నప్పుడే చనిపోయారు. ఆయన తరువాత ఆస్తిమొత్తం అమ్మ ఆధీనంలో ఉండేది. నాకు ఇద్దరు అన్నయ్యలు ఇద్దరు చెల్లెళ్లు. నాకు పెళ్లైన తరువాత పుట్టింటి ఆస్తిలో అన్నయ్యలతో పాటు సమాన వాటా వస్తుందని తెలిసి అమ్మని అడిగితే ఇస్తానంది. కానీ ఈలోగా అనారోగ్యంతో చనిపోయింది. అన్నయ్యలూ వేర్వేరు కారణాలతో ఈ మధ్యే చనిపోయారు. ప్రస్తుతం ఆస్తిమొత్తం మా చెల్లెళ్లూ, వదినల దగ్గరే ఉంది. కానీ ఎవరిపేరునా, ఇంతవరకూ పట్టాలు గానీ పాస్‌బుక్‌లు గానీ లేవు. చెల్లెళ్లనీ నాకూ వాటా ఇమ్మని అడిగితే ఇస్తామన్నారు. కానీ వదినలు మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు. గ్రామపెద్దల సమక్షంలో పెట్టడం జరిగింది. కానీ వారి మాట కూడా వారు వినడం లేదు. పైగా ఆస్తి కోసం వస్తే కొడతామని బెదిరిస్తున్నారు. నేనేం చేయాలి. కోర్టుకు వెళ్లే స్థోమత కూడా నాకు లేదు. ఒక వేళ వెళ్తే నాకు న్యాయం జరుగుతుందా! **- ఓ సోదరి**

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

తప్పకుండా జరుగుతుంది. కానీ దానికి మీరు చాలా శ్రమ పడాల్సి వస్తుంది. మీ నాన్నగారికి మొదటి మూడెకరాలు మీ తాతగారి నుంచి వచ్చిన ఆస్తి. దానిలో కచ్చితంగా మీ అన్నదమ్ములతో పాటు మీక్కూడా భాగం ఉంటుంది. ప్రస్తుతం మీ అన్నలు చనిపోయారు కాబట్టి ఆ మూడెకరాల్ని వారి పిల్లలతో పాటు మీకూ సమానంగా పంచాల్సి ఉంటుంది. దానిపై మీ వదినలకు ఎటువంటి హక్కూ లేదు. ఇకపోతే రెండో రకం ప్రభుత్వ అసైన్డ్ భూమి మూడెకరాలు. దానికి కొడుకులు హక్కుదారులు. కానీ వారు చనిపోయిన తరువాత ఆ అసైన్డ్‌భూమి మీ అక్కచెల్లెళ్ల స్వాధీనంలోనే ఉంటే కనుక మీరు కూడా ఆ భూమిని సమానంగా పంచమని కోరవచ్చు. దానికోసం ఆర్‌డీవోకి దరఖాస్తు చేసుకోవాలి. అందుకోసం మీ కుటుంబ సర్టిఫికెట్ లేదా లీగల్ వారసత్వం కింద ధ్రువపత్రాల్ని జతచేయాల్సి ఉంటుంది. లేదా దానిని కూడా భాగస్వామ్యపు ఆస్తికింద చూపించమని కోరుతూ సూట్ వేయవచ్చు. ఒకవేళ ఆర్‌డీవో కోర్టులో తేల్చుకోమని చెబితే దానికి అనుగుణంగా మీరు కోర్టుకి వెళ్లాల్సి ఉంటుంది. ఇక మూడో భాగం మూడెకరాలు ఆస్తిని సాగు చేసుకునే హక్కు మాత్రమే మీ నాన్నగారికి ఉంది. అది రాష్ట్రభూచట్టాల కింద మీ నాన్నగారికి ప్రభుత్వం ఇచ్చింది. దానిని పంచడానికి కూడా ఆయనకి హక్కులేదు. వారి తరఫున మీ అన్నదమ్ములు సాగు చేసుకోవచ్చు. దానికి సంబంధించిన పట్టా కాగితంలో ఏముందో ఆ ప్రకారం చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు మీ అన్నలు కూడా చనిపోయారు. వారి పిల్లలు మైనర్‌లు అయితే వారికి సాగు చేసుకునే హక్కు కూడా అప్పుడే రాదు. మీ కేసులో నాన్నగారితో పాటు అన్నదమ్ములూ చనిపోయారు కాబట్టి దానిని ప్రభుత్వం తిరిగి తీసుకునే అవకాశం ఉంది. మీరు ఆ భూమిని భాగస్వామ్యపు ఆస్తికింద కానీ, పిత్రార్జిత ఆస్తి కింద కానీ చూపించడానికి లేదు. మీకు ఆర్థికస్థోమత లేదు అంటున్నారు కాబట్టి న్యాయసేవా సహాయాధికార సంస్థలను సంప్రదించండి. ప్రీ లిటిగేషన్ కేసు వేసి అందరినీ కూర్చోబెట్టి సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు. వీలైతే మీ వదినలకు కాస్త ఎక్కువ వాటా ఇస్తామని చెబితే సానుకూలంగా ఈ వివాదం పరిష్కారం అవ్వొచ్చు. ప్రయత్నించండి

ఒక్కలేఖ... పదకొండు లక్షల సాయం!



అది కోరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల. అక్కడ చదువుకునేది 530 మంది విద్యార్థులు. వారిలో అమ్మాయిల సంఖ్య 309. ఉపాధ్యాయినిలు పదకొండు మంది. వీళ్లందరికీ ఒకటే మరుగుదొడ్డి.. కనీసం అక్కడ తాగడానికీ నీటి వసతి లేదు. ఈ సమస్యలన్నింటితో విసిగిపోయిన ఓ ఇద్దరు విద్యార్థినులు సోషల్ పాఠం విని హైకోర్టు న్యాయమూర్తికి లేఖ రాశారు. పదకొండు లక్షల సాయం అందుకున్నారు. మరి ఆ విద్యార్థినులు మోత్కురి రశ్మిత, అల్లోడు వైష్ణవి ఇదంతా ఎలా చేశారో తెలుసా....!

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు నానాటికీ కరవైపోతున్నాయి. జగిత్యాల జిల్లాలోని కోరుట్లలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అదే జరిగింది. ఈ స్కూల్‌ని ప్రభుత్వం 2005లో సక్సెస్ పాఠశాలగా ప్రకటించింది. అప్పట్నుంచీ అక్కడ అబ్బాయిలు కూడా చదువుకుంటున్నారు. ప్రస్తుతం 530 విద్యార్థులున్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో బోధన జరుగుతుంది.



రశ్మిత వైష్ణవి

వసతుల్లేక అవస్థలు: విద్యార్థుల సంఖ్య పెరగడంతో వసతులు కొరవడ్డాయి. గదులూ, బల్లలూ సరిపడా లేవు. దాంతో తరగతిలో కిక్కిరిసినట్టు కూర్చునేవారు. అంతేకాదు ఉన్న బోరు చెడిపోయింది. నీళ్లు లేక ఎద్దడి. పైగా చేతి పంపు ఉన్నా.. నీటి మట్టం అడుగంటుకుపోయింది. సిబ్బంది తరగతికో నీళ్ల క్యాను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భోజనాల సమయానికి నీళ్ల ట్యాంకర్లు తెప్పించేవారు.

ఇక, అమ్మాయిలకు, పాఠశాల సిబ్బందికి ఒకే ఒక్క మూత్రశాల, మరుగుదొడ్డీ ఉండేవి. అబ్బాయిలకు అదీ లేదు. ఉదయం ఇంటర్వెల్ పావు గంట ఉండేది. ఆ సమయంలో కనీసం రెండొందల మంది అమ్మాయిలు వరస కట్టేవారు. మూత్రాన్ని ఆపుకోలేక ఏడ్చినంత పనిచేసేవారు. తరగతి మధ్యలో వెళ్లాలంటే బిడియం. దాంతో మంచినీళ్లు తాగడం మానేశారు కొందరు విద్యార్థినులు. మరికొందరు సాయంత్రం ఇంటికి వెళ్లేవరకూ బిగబట్టుకుని ఉండటం అలవాటు చేసుకున్నారు.

పాఠం చదివి అవగాహన: ఈక్రమంలో చదువు మీద ఆసక్తి పెట్టలేకపోయేవారు. ఈ ఇబ్బందులన్నీ అక్కడే చదివే రశ్మిత, వైష్ణవికీ అనుభవమే. కానీ వారు బడిమానేయడం. బాధపడటం చేయలేదు. పరిష్కారం కోసం ఆలోచించేవారు. అప్పుడే వారికి తొమ్మిదో తరగతి సాంఘిక శాస్త్రంలోని 'మానవ హక్కులు- ప్రాథమిక హక్కులు' అనే పాఠం గుర్తొచ్చింది. బాలలు తమ సమస్యల్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియనప్పుడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తే దాన్ని సుమోటోగా స్వీకరించి పరిష్కరిస్తారని అందులో ఉంది. దాంతో బడిలోని సమస్యల్నీ వివరిస్తూ ఓ లేఖరాసి జనవరి 11న పోస్టు చేశారు. ఈ విషయం అటు తల్లిదండ్రులకు గానీ.. పాఠశాల్లోగానీ ఎవరికీ చెప్పలేదు. సమాధానం వస్తుందని మాత్రం ఎదురుచూశారు.

అనుకున్నట్టే అదే వారంలో న్యాయమూర్తి స్పందించారు. రశ్మిత, వైష్ణవిలకు ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చినందుకు ధన్యవాదాలు చెప్పడమే కాదు.. నిధులూ.. మంజూరు చేసి, సమస్యల్ని పరిష్కరించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.

లక్షల్లో అంచనా: దాంతో వెంటనే ఆ శాఖ అధికారులు పాఠశాలకు వచ్చి విషయం తెలిపి.. వసతులు సమకూరుస్తామని మాట ఇచ్చారు. అంతేనా రశ్మిత, వైష్ణవి చేసిన పనిని పాఠశాల సిబ్బందీ, విద్యార్థులు అభినందించారు. మిగతా అధికారులు వసతులకు ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసుకుని విద్యాశాఖకు నివేదిక సమర్పించారు. దాన్ని విద్యాశాఖ కార్యదర్శి హైకోర్టు న్యాయమూర్తికి వివరణగా అందజేశారు. దాంతో ఆ పాఠశాల్లో అదనంగా తరగతి గదుల నిర్మాణానికి బోరుబావీ, మోటారు పంపూ, సంపూ, మూత్రశాల, మరుగుదొడ్ల నిర్మాణం చేయడంతో పాటు పాతవాటిని పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇందుకు పదకొండు లక్షల రూపాయల నిధులు ఆ పాఠశాలకు అందనున్నాయి. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లను బాగు చేశారు. బడి గురించి ఆలోచించి ఇంత మంచి నిర్ణయం తీసుకున్న రశ్మిత, వైష్ణవిలది నిరుపేద కుటుంబాలు. వారిద్దరి తల్లిదండ్రులు కష్టజీవులు. రెక్కాడితేగానీ..డొక్కాడని పరిస్థితి వారిది. పాఠశాల బృందం, విద్యాశాఖ అధికారులు ఆ అమ్మాయిల తల్లిదండ్రుల్ని అభినందిస్తుంటే వారి ఆనందం అంతా ఇంతాకాదు.

- అల్లె రాము, కోరుట్ల పట్టణం న్యూస్‌టుడే

అరచేతిలో ఒదిగిపోయేలా...!



బ్యాగులో పడిపోయిన చిల్లర వెతుక్కోవడం, ముడిపడ్డ హెడ్‌ఫోన్లు విడదీయడం... ఇవన్నీ కాస్త చిరాకు పెట్టే విషయాలే. ఈ మినీ ఆర్గనైజర్లు ఆ సమస్యలకు పరిష్కారం చూపిస్తాయి. వివిధ ఆకృతుల్లో వైవిధ్యంగానూ కనువిందు చేస్తున్నాయి. వీటిని సులభంగా చేతులో పట్టుకోవచ్చు లేదంటే బ్యాగులకు కూడా తగిలించేసుకోవచ్చు.



ఈనాడు
కరీంనగర్
సోమవారం ఫిబ్రవరి 19, 2018
e-mail: edc@eenadu.in

చదువు



కొండంత సిలబస్, పరీక్షలూ, అసైన్‌మెంట్లూ చూసి.. తగని కోర్సు ఎంచుకున్నాం, దాన్ని పూర్తిచేయడానికి కావాల్సిన అర్హతలు తమకు లేవేమోననీ కొందరు దిగాలు పడుతుంటారు. మరికొందరు... ఉద్యోగాన్వేషణ ఏ దిశలో సాగించాలో తెలియక తికమకపడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి పక్కన మెంటర్ ఉంటే.. సులువైన పరిష్కారాలు ఇట్టే లభిస్తాయి. భవితను మల్చుకోవటంలో అద్భుత సహకారం అందించే ఈ మెంటర్‌షిప్ గురించి తెలుసుకుందాం!

కెరియర్‌ను... మలుపుతిప్పే మెంటర్‌షిప్

విభిన్నమైన కోర్సులూ, సరికొత్త స్పెషలైజేషన్లూ అందుబాటులోకి వస్తున్నాయి. మరోపక్క ఉద్యోగ సాధనలో పోటీ పెరుగుతోంది. వీటిని తట్టుకుని విద్యాభ్యాసంలో, ఉద్యోగాన్వేషణలో ముందువరసలో నిలబడాలంటే... అందుకు తగ్గ చేయూత తప్పనిసరి. దీన్ని వ్యక్తిగత శ్రద్ధతో అందించేదే మెంటర్‌షిప్. ఇంజినీరింగ్, సైన్స్ లాంటి వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులూ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు సిద్ధమయ్యేవారూ మెంటర్ల తోడ్పాటును తీసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ చేసేవారు మెంటర్ల తాలూకు నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ లాంటి జాతీయ ప్రవేశపరీక్షలు రాసేవారికి మెంటర్‌షిప్ ద్వారా అందే సహాయం మెరుగైన ర్యాంకు సాధనకు దోహదపడుతుంది.

ఉన్నతవిద్య, కెరియర్ విషయాల్లో సాధారణంగా సహవిద్యార్థుల ప్రభావం ఉంటుంది. అది మంచిదే అయినప్పటికీ వారి స్వల్ప పరిజ్ఞానం వల్ల ఒక్కోసారి తప్పటడుగులకూ ఆస్కారం ఉంటుంది. అందుకే ఈ దశలో అనుభవం, పరిజ్ఞానం ఉన్న మెంటర్ల మార్గదర్శకత్వం ఉండటం మేలని నిపుణులు చెపుతున్నారు. వెనకబడుతున్నపుడు ఊతమిస్తూ.. చేరుకోవాలనుకునే గమ్యం దగ్గర్లోనే ఉందంటూ విద్యార్థిలో, ఉద్యోగార్థిలో ఆత్మవిశ్వాసాన్ని నింపటం, లక్ష్యాన్ని చేరేవరకూ వెన్నంటి ఉంటూ ప్రోత్సహించటం మెంటర్ల విధులు.

ఇలాంటివారిని ఎంచుకోవాలి

- మీరు ఏ స్థాయిలో ఉండాలనుకుంటున్నారో.. ఆ స్థాయిలో ఉన్నవారిని లేదా మీరు ఆ స్థానానికి చేరుకోవడానికి తోడ్పడతారని భావించినవారిని మెంటర్‌షిప్ కోసం ఎంచుకోవాలి. ఆ వ్యక్తి విజయాలు మీకు ప్రేరణ కలిగించేలా ఉండాలి.
- మెంటర్‌కు మీ కన్నా వేరే అభిరుచులు ఉన్నప్పటికీ వారు మీ దృష్టికోణంలో అవసరమైన మార్పులు తేగలరు.
- లింగ భేదం ఉండాల్సిన అవసరం లేదు. కానీ విద్యార్థినులకు స్త్రీలు, విద్యార్థులకు పురుషులూ మెంటర్లుగా ఉండటం ఎక్కువ ప్రయోజనకరం.
- నిజాయతీ.. మెంటర్‌షిప్‌లో కీలకం. మెంటర్, మెంటీ (విద్యార్థి) ఇద్దరికీ ఇది అవసరం. అయితే మీరు చేసిన తప్పులను మెంటర్ నిస్సంకోచంగా చెప్పగలిగినప్పుడే మీకు వాటిని సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది.
- ఎక్కువ అనుభవం, విస్తృత నెట్‌వర్క్ కలిగివున్నవారై ఉండాలి. ఉద్యోగాన్వేషణ సమయంలో వారి నెట్‌వర్క్ మీకు సాయపడే అవకాశముంది.
- ఒక స్థాయికి చేరినవారినే ఎంచుకుంటే ఉపయోగకరం. కానీ మెంటర్‌షిప్‌లో వారు మీకు వీలైనంత సమయం కేటాయించగలిగినవారై ఉండాలి.

ఎలా సాయపడగలరు?

మెంటర్లకు విద్యార్థి (మెంటీ) కంటే ఎక్కువ అనుభవముంటుంది. విద్యార్థి ఇప్పుడు ఎదుర్కొంటున్న దశలు వారు ఇంతకుముందే దాటి ఉంటారు. విద్యార్థి తన శక్తిసామర్థ్యాలను ఏ దిశలో ఉపయోగించాలో తెలియజేస్తూ అనవసర విషయాలను పక్కన పెట్టడంలో మెంటర్లు సాయపడతారు.

సమతూకం నేర్పుతారు

చాలామంది విద్యార్థులు విద్య, ప్రొఫెషనల్, సాంఘిక, వ్యక్తిగత వంటి వివిధ అంశాలను సమతూకంలో నిర్వహించడంలో తొట్రుపడుతుంటారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్నవారికి మెంటర్ సాయపడతారు. సహనంతో ఎలా నడుచుకోవాలో సూచిస్తూ.. సమతూకంగా నిర్వహించేలా సాయపడతారు. స్థిర లక్ష్యం ఉండి, కష్టపడి పనిచేసే మనస్తత్వాన్ని కలిగివుంటే.. మెంటీ కెరియర్‌లో అభివృద్ధి చెందడానికి అవసరమైన పరిచయాలను అందించడంలో మెంటర్ ఎప్పుడూ ముందుంటారు. తనకు అందుబాటులో ఉన్న వనరులన్నీ ఉపయోగించి తన కెరియర్‌కు అవసరమైన బాటను చూపిస్తారు.

ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశించే క్రమంలో మెంటర్లు ఎక్కువ ఉపయోగపడతారు. నిజానికి విద్యార్థి జీవితం నుంచి ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించడానికి చాలామంది ఎంతో కష్టపడుతుంటారు. ఒకరకంగా మెంటర్ విద్యార్థికి ఈ ప్రక్రియను సులభతరం చేస్తారు. ఆ రకంగా మెంటర్‌ను కలిగివున్నవారు ఉద్యోగ విషయంలో మిగతావారితో పోలిస్తే ఒక అడుగు ముందున్నట్లే.

ఆలోచనలు పంచుకుంటారు

భవిష్యత్తును విజయవంతం చేసుకునే సుదీర్ఘమైన ఒడిదొడుకుల మార్గంలో కొన్నిసార్లు దారి తప్పడమో, తప్పు దారిలో ప్రయాణించడమో జరుగుతుంది. అలాంటప్పుడు భావోద్వేగాలు, భావనలు, భయాలను ధైర్యంగా పంచుకోవడానికి ఒకరుంటే బాగుంటుందనే భావన విద్యార్థి దశలో సాధారణమే. తను ఎదుర్కొంటున్నవన్నీ చాలా చిన్న విషయాలనీ, వాటిని సులువుగా ఎదుర్కోవచ్చనీ తెలియజేస్తూనే విద్యార్థికి సంబంధించిన క్లిష్టమైన విషయాల్లో మెంటర్ స్పష్టతను తీసుకువస్తారు.

ప్రొఫెషనల్ లీడర్‌షిప్, ఇంటర్ పర్సనల్ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంచుకునే విషయంలో రోల్‌మోడల్‌గా నిలుస్తారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంలోనూ, రిస్క్‌లను ఎదుర్కొంటూ ఉన్నతస్థాయికి ఎదగడంలోనూ తోడ్పాటును అందిస్తారు. వైవిధ్యభరితమైన దృష్టికోణాలు, అనుభవాలపై విద్యార్థి అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడతారు.

ఉద్యోగ జీవితంలోనూ సానుకూల ప్రభావం

మెంటర్‌షిప్ చూపే ప్రభావం గురించి కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేసే ఒక పరిశోధన సంస్థ అధ్యయనం జరిపింది. 1000 మందికిపైగా ఉద్యోగులపై అయిదేళ్లపాటు దీన్ని నిర్వహించారు.

- మెంటర్‌షిప్ కార్యక్రమంలో పాల్గొన్న బృందంలో 25% మంది (ఎలాంటి మెంటర్‌షిప్ అందుకోని 5% మందితో పోల్చినపుడు) మెరుగైన వేతనాలు అందుకున్నారు.
- 72% మంది తమ స్థానాలను (ఈ కార్యక్రమంలో పాల్గొనని 49% మందితో పోల్చినపుడు) నిలబెట్టుకున్నారు.
- పదోన్నతికి సంబంధించి మిగిలినవారితో పోల్చినపుడు మెంటర్‌షిప్ అందుకున్నవాళ్లు 5 రెట్లు ఎక్కువగా అవకాశాలు పొందారు.



ఎలా ముందడుగు వేయాలి?

కుటుంబ సభ్యులు, సీనియర్లు, కళాశాల అధ్యాపకులు.. ఇలా ఎవరైనా మెంటర్ కావొచ్చు. సాధారణంగా వీళ్లు విద్య, వృత్తిపరంగా పురోగతి సాధించడానికి కావాల్సిన విజ్ఞానంతోపాటు సూచనలు, సలహాలు ఇచ్చే స్థితిలో ఉండాలి. అందుకనే... విద్యార్థులు వీరిని ఎంచుకోవడం ముఖ్యమైన అంశం.

కళాశాల సీనియర్ విద్యార్థులూ, ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులూ మెంటర్‌షిప్ విషయంలో సహకారం అందిస్తారు. క్రమం తప్పకుండా సెమినార్లకూ, కాన్ఫరెన్సులకూ హాజరవుతుంటే అక్కడకు విశేష పరిజ్ఞానమున్నవారు వస్తుంటారు. వారిని పరిచయం చేసుకోవాలి. వారి సలహా, సూచనలను అడగాలి. మీరు ఎదుర్కొంటున్న సమస్యను చెప్పి, వాటికి ఇప్పటివరకూ ప్రయత్నించిన పరిష్కారాల గురించి చెప్పాలి. మెంటర్‌గా ఉండమని నేరుగా వారిని అడగకుండా వారిని ఆసక్తికరమైన ప్రశ్నలు వేసి ఆకట్టుకోవాలి. వారే క్రమంగా మీపై ఆసక్తి చూపించవచ్చు. ఈరకంగా వారు మీ మెంటర్ అయ్యే అవకాశాలుంటాయి.

Quora, Linkedin మొదలైన ఆన్‌లైన్ వేదికలు కూడా సరైన మెంటర్‌ను కనుగొనటానికి ఉపయోగపడతాయి. www.procademia.com లాంటి వెబ్‌సైట్ల సహాయం కూడా పొందవచ్చు.

వ్యక్తిగత శ్రద్ధతో సలహాలు

కాలేజీ విద్యార్థులు తమ కెరియర్ విషయంలో సాధారణంగా ఎవరి సలహానూ తీసుకోరు. స్నేహితుల బృందం తమలో తాము ఏదో అనుకుని, ఆ నిర్ణయం ప్రకారమే ముందుకువెళ్తుంటారు. ఆ 'పియర్ డిస్కషన్' మంచిదే కానీ, దానికంటే మించి అనుభవం ఉన్న మెంటర్ల సలహాలతో తీసుకునే నిర్ణయమే మరింత ఉత్తమంగా ఉంటుంది. కెరియర్ కౌన్సెలర్, కెరియర్ అడ్వైజర్‌ల విధులే మెంటర్లకూ ఉన్నప్పటికీ వారికంటే మించి వ్యక్తిగత స్థాయిలో చేయూతనివ్వటం వీరి ప్రత్యేకత. మెంటర్లను విశ్వసించి, వారితో విద్యార్థులు నిస్సంకోచంగా మాట్లాడటం వల్ల ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. ఉన్నతవిద్య, ఉద్యోగం... రెంటిలో ఏది ఎంచుకోవాలనే సందిగ్ధత ఏర్పడినపుడూ; ఒకవేళ ఉన్నతవిద్యకు మొగ్గు చూపితే అందుకు ఉపయోగపడేలా ప్రాజెక్టులు ఏం చేస్తే బాగుంటుందో స్పష్టత లేనప్పుడూ అనుభవజ్ఞులైన మెంటర్ల సూచనలు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయి.

- పరుచూరి సతీష్‌చంద్ర
(ప్లేస్‌మెంట్ డైరెక్టర్, బీవీఆర్ఐటీ)

నాలుగు కీలకాంశాలు

విద్యార్థులకు ఈ కింది అంశాల్లో మెంటర్ తోడ్పడతారు.

- **లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం:** విద్యార్థులు తమ కెరియర్ లక్ష్యాలను ఏర్పరచుకోవడంలో మెంటర్లు సహకరిస్తారు. వాటి సాధనలో ఇతరులతో కలిసి పనిచేసేలా ప్రోత్సహిస్తారు.
- **నెట్‌వర్కింగ్:** విద్యార్థులు తాము ఎంచుకునే మెంటార్లు సంబంధిత రంగంలో నిపుణులు, గౌరవప్రదమైన స్థాయిలో ఉన్నవారైతే వారు తమ కమ్యూనిటీలోని ఇతర నిపుణులకు విద్యార్థులను ఇంటర్న్‌షిప్ ఉద్యోగాల నిమిత్తం పరిచయం చేసే అవకాశం ఉంటుంది.



- **పరిజ్ఞానాన్ని విస్తృతపరచడం:** ఎంచుకున్న రంగంలో నిపుణులను పరిచయం చేయడం, అవకాశాలను కల్పించడంతోపాటు విద్యార్థులకు ఇతర మార్గాలూ, సంస్థలను పరిచయం చేస్తాడు.
- **ఉద్యోగాన్వేషణ, ఇంటర్వ్యూ నైపుణ్యాలు:** ఉద్యోగాన్వేషణ, ఇంటర్వ్యూ విధానాలపై విద్యార్థులకు ఉండే అపోహలను తొలగించడంలో మెంటర్లు సాయపడతారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగార్థులుగా ప్రస్తుత గ్రాడ్యుయేట్లు ఎలా నిలబడవచ్చో సలహాలిస్తారు. కెరియర్ దీర్ఘకాలంపాటు ఎలా కొనసాగించవచ్చో సూచిస్తారు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో 2,553 జేఎల్ఎం పోస్టులు

అర్హత: పదోతరగతితోపాటు ఎలక్ట్రికల్/ వైర్‌మన్ ట్రేడ్లలో ఐటీఐ లేదా ఎలక్ట్రికల్ ట్రేడులో రెండేళ్ల ఇంటర్ ఒకేషనల్ కోర్సు.
వయసు: 01.01.2018 నాటికి 18-35 ఏళ్లు.
ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా.
రాతపరీక్ష తేదీ: 08.04.2018
దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు: రూ.220 **ఫీజు చెల్లింపు:** 21.02.2018 నుంచి 19.03.2018 వరకు.
ఆన్‌లైన్ దరఖాస్తు: 22.02.2018 నుంచి 19.03.2018 వరకు.
వెబ్‌సైట్: http://tsnpdcl.cgg.gov.in/

కేంద్రీయ విద్యాలయ తిరుమలగిరి, సికింద్రాబాద్

పోస్టులు: టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు
అర్హతలు, ఖాళీలు: స్కూలు నిబంధనల ప్రకారం.
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.
పరీక్ష తేదీలు: 2018 మార్చి 1, 3
దరఖాస్తు: ఆన్‌లైన్
చివరితేది: 27.02.2018
వెబ్‌సైట్: www.kvtirumalagiri.edu.in

బీఎస్ఎఫ్‌లో ఏఎస్ఐ పోస్టులు

పోస్టు: ఏఎస్ఐ
ఖాళీలు: 04 **అర్హత:** పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ గుర్తించిన సంబంధిత మూడేళ్ల డిప్లొమా లేదా ఇండియన్ ఎర్ ఫోర్స్ జారీ చేసిన గ్రూప్ ఎక్స్ డిప్లొమా.
వయసు: 28 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: నిబంధనల ప్రకారం.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ **చివరితేది:** 25.03.2018 **వెబ్‌సైట్:** http://bsf.nic.in/

ప్రవేశాలు

సీయూసెట్-2018

కోర్సులు: కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో యూజీ, పీజీ, రిసెర్చ్ ప్రోగ్రాములు **అర్హత:** ఇంటర్, డిగ్రీ, పీజీ.
ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.
రాతపరీక్ష తేది: 2018 ఏప్రిల్ 28, 29.
ఆన్‌లైన్ దరఖాస్తు: 19.02.2018 నుంచి 26.03.2018 వరకు.
వెబ్‌సైట్: https://cucetexam.in/

టీజీ గురుకుల్ టెస్ట్-2018

తెలంగాణ గురుకుల సంక్షేమ పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలు
బోధనా మాధ్యమం: ఇంగ్లిష్
అర్హత: ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు.
వయసు: 01.09.2018 నాటికి 9-11 ఏళ్లు.
ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.
ఆన్‌లైన్ దరఖాస్తు: 19.02.2018 నుంచి 16.03.2018 వరకు
వెబ్‌సైట్: http://tgcet.cgg.gov.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఒత్తిడి తక్కువ.. వేతనం ఎక్కువ!

మంచి వేతనం.. పని ఒత్తిడి తక్కువ ఉండాలని ఎవరైనా కోరుకుంటారు. అదీ పదోతరగతి విద్యార్హతతో.. అలాంటి అవకాశాన్ని మన ఏపీ పోస్టల్ సర్కిల్ పోస్ట్‌మెన్, మెయిల్ గార్డ్ పోస్టుల నోటిఫికేషన్ ద్వారా కల్పిస్తోంది.

పదోతరగతి విద్యార్హతతోనే జీవితంలో స్థిరపడే అవకాశం కల్పిస్తోంది తపాలా శాఖ. పోస్టు మెన్, మెయిల్ గార్డు అంటే ఇవేవో చిన్న ఉద్యోగాలే అనుకోవడం పొరపాటే. ఎందుకంటే కొత్తగా అమల్లోకి వచ్చిన వేతన నిబంధనల ప్రకారం ఈ రెండు ఉద్యోగాలకూ 21700 మూలవేతనం దక్కుతుంది. దీనికి అదనంగా కరవుభత్యం, ఇంటిఅద్దె భత్యం... మొదలైనవన్నీ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తిస్తాయి. కాబట్టి ఎలాంటి చిన్న గ్రామంలో పోస్టింగ్ వచ్చినప్పటికీ పాతికవేల రూపాయల నెల జీతం గ్యారెంటీ. అంతేకాకుండా ఒత్తిడి, పనివేళలు తక్కువగా ఉంటాయి. కొద్దిపాటి అనుభవంతో శాఖాపరమైన పరీక్షల ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. ఖాళీలను రాతపరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా భర్తీచేస్తారు. ప్రశ్నలు సైతం పదో తరగతి స్థాయిలోనే ఉంటాయి. కాబట్టి రైల్వే ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నవారు వీటినీ ప్రయత్నించవచ్చు.

పరీక్ష ఇలా...

వంద మార్కులకు ఆప్టిట్యూడ్ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో పదో తరగతి స్థాయిలోనే ఉంటాయి. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 25 చొప్పున ప్రశ్నలు వస్తాయి. అవి...

పార్ట్ – ఎ: జనరల్ నాలెడ్జ్, **పార్ట్ – బి:** మ్యాథమేటిక్స్
పార్ట్ – సి: ఇందులో రెండు విభాగాలు ఉన్నాయి. విభాగం 1లో ఇంగ్లిష్, 2లో తెలుగు సబ్జెక్టు నుంచి ప్రశ్నలు వస్తాయి.

ఏపీ పోస్టల్ సర్కిల్లో 245 పోస్టులు
■ పోస్టుమెన్ 234 ■ మెయిల్ గార్డు 11



అర్హత సాధించాలంటే...

పార్ట్ ఎ, బిలు కలిపి ఓసీలైతే 10, ఓబీసీలు 9, ఎస్సీ, ఎస్టీలు 8 మార్కులు సాధించాలి. అలాగే పార్ట్ సిలో రెండు విభాగాలూ కలిపి ఓసీలైతే 10, ఓబీసీలు 9, ఎస్సీ, ఎస్టీలు 8 మార్కులు సాధించాలి. ఇలా విభాగాల వారీ మార్కులు సాధించడంతోపాటు మొత్తం ప్రశ్నపత్రం నుంచి ఓసీలు 40, ఓబీసీలు 37, ఎస్సీ, ఎస్టీలు 33 మార్కులు సాధిస్తేనే అర్హులుగా పరిగణిస్తారు. అనంతరం అర్హుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన నియామకాలు చేపడతారు. ఎంపికైనవాళ్లు రెండేళ్లు ప్రొబేషన్‌లో కొనసాగుతారు. ఆ తర్వాత శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తారు. ఉద్యోగంలోకి చేరిన మొదటి నెల నుంచే రూ.21,700 మూలవేతనం చెల్లిస్తారు. ఇతర అన్ని అలవెన్సులూ కలుపుకుని ప్రారంభం నుంచే రూ.25 వేలకు తగ్గకుండా వేతనంగా పొందవచ్చు.

ఖాళీల వివరాలు: పోస్టుమ్యాన్ ఖాళీలు విజయవాడ రీజియన్లో 106, కర్నూలులో 60, విశాఖపట్నంలో 68 ఉన్నాయి. మెయిల్ గార్డు పోస్టులు విజయవాడ రీజియన్‌లో 6, కర్నూలులో 2, విశాఖపట్నంలో 3 ఉన్నాయి.

అర్హత: పోస్టుమ్యాన్, మెయిల్ గార్డు రెండు పోస్టులకూ పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులు.

వయసు 18 - 27 సంవత్సరాలలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తులు: ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.
నియామకం: పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన నియామకాలు చేపడతారు.
పరీక్ష తేదీ: తర్వాత ప్రకటిస్తారు.
పరీక్ష కేంద్రాలు: విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు.
ఫీజు: అప్లికేషన్ ఫీజు రూ.వంద అందరు అభ్యర్థులూ చెల్లించాలి. పరీక్ష ఫీజు రూ.400. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు పరీక్ష ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.
ఆన్‌లైన్‌లో ప్రాథమిక వివరాల నమోదుకు చివరితేదీ: మార్చి 15 **హెడ్ పోస్టాఫీసుల్లో ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** మార్చి 16
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరితేదీ: మార్చి 20
వెబ్‌సైట్: www.appost.in, www.indiapost.in

యునానీలో ప్రవేశం ఎలా?

Q మా అమ్మాయి ప్రస్తుతం ఏడో తరగతి చదువుతోంది. బీయూఎంఎస్ చేయించాలని కోరిక. అర్హత వివరాలను తెలియజేయండి. రెగ్యులర్ చదువుతోపాటు ఉర్దూనూ దూర విద్య ద్వారా చేయడం కుదురుతుందా?

- ఎస్.ఎండీ యూనుస్, కర్నూలు



జ: యునానీ చికిత్సకు దాదాపు ఆరు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. బ్యాచిలర్స్ ఇన్ యునానీ మెడికల్ సైన్సెస్ (బీయూఎంఎస్) కోర్సు చదవాలనుకునేవారు ఇంటర్ (10+2)లో బైపీసీ చదవాల్సి ఉంటుంది. బీయూఎంఎస్ కోర్సు వ్యవధి అయిదేళ్ల ఆరు నెలలు. ఇందులో చివరి ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ కోర్సును సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ (సీసీఐఎం) వారు రెగ్యులేట్ చేస్తారు. కోర్సును పూర్తిచేసిన విద్యార్థిని హకీమ్ అని పిలుస్తారు. పదో తరగతి వరకు ఉర్దూను ఒక సబ్జెక్టుగా చదివుండాలి లేదా ఇంటర్‌లో ఉర్దూను ఒక సబ్జెక్టుగా లేదా ఆప్షనల్‌గా చదివినవారు మాత్రమే అర్హులు. ఎందుకంటే ఈ కోర్సును ఉర్దూ మాధ్యమంలోనే అందిస్తారు.

మీ అమ్మాయి విషయంలో మీరు ఉర్దూ ఆప్షనల్‌గా ఉన్న విద్యాలయంలో చదివించడం శ్రేయస్కరం. మెరిట్ (10+2) ఆధారంగా సాధారణంగా బీయూఎంఎస్ కోర్సులో ప్రవేశ అర్హత లభిస్తుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా దూరవిద్య పాఠశాల స్థాయిలో చేయడం కుదురుతుంది. ముఖ్యంగా విద్యార్థి తనకిష్టమైన రంగంలో అడుగుపెట్టి కృషి చేస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.

ఆ కోర్సు సీఏతో సమానమేనా?

➤ ఏసీసీఏ చదవాలనుకుంటున్నాను. దాని ప్రాముఖ్యాన్ని తెలపండి. ఇది సీఏతో సమానమేనా? మనదేశంలో ఈ కోర్సు చేసినవారికి అవకాశాలెలా ఉన్నాయి?

- ఎన్.పి. భాస్కర్

జ: అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెన్స్ (ఏసీసీఏ) ఒక అంతర్జాతీయ ప్రొఫెషనల్ అకౌంటింగ్ బాడీ. చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సును అకౌంటింగ్ రెగ్యులేటరీ సంస్థ అయిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా వారు అందించే ఫ్లాగ్‌షిప్ కోర్సు. ఈ రెండు కోర్సులకూ అకౌంటింగ్ రంగంలో ప్రత్యేకత, గుర్తింపు ఉన్నాయి. ఏసీసీఏ కోర్సుకు అంతర్జాతీయ గుర్తింపు దాదాపుగా 130 దేశాల్లో ఉంది. అంతర్జాతీయంగా వేరే దేశాల్లో ఉద్యోగం చేయాలనుకునేవారు ఏసీసీఏ కోర్సును ఎంచుకోవచ్చు. బహుళజాతి సంస్థల్లో ఈ కోర్సుకు మంచి గిరాకీ ఉంది.



ఇక సీఏ కోర్సు పూర్తిచేసినవారు మనదేశంలో సొంతంగా ప్రాక్టీసు పెట్టుకోవచ్చు. చార్టర్డ్ అకౌంటెంట్ సంతకం ఆడిటింగ్, టాక్స్, రిపోర్టింగ్‌లో చాలా ప్రాముఖ్యమైంది. ఏసీసీఏ పూర్తి చేసిన వారికి ఈ సౌలభ్యం లేదు. కానీ ఉపాధి విషయానికి వస్తే రెండు కోర్సులకూ బాగా గిరాకీ ఉంది. చార్టర్డ్ అకౌంటింగ్ పూర్తిచేసినవారు ఏసీసీఏ కోర్సులో తొమ్మిది పేపర్ల వరకూ మినహాయింపు పొందవచ్చు.

ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

సుబాబుల్.. రైతు బెంబేలు

- పేపర్‌మిల్లుల చెలగాటం... దళారుల ఇష్టారాజ్యం
- కమలాపురం, కాగజ్‌నగర్ మిల్లుల మూతతో అవస్థలు
- మిగిలిన మిల్లుల గుత్తాధిపత్యంతో పడిపోతున్న ధర

ఈనాడు - హైదరాబాద్



మూతపడిన కమలాపురం పేపర్ మిల్లు

తెలుగు రాష్ట్రాల్లో సుబాబుల్, జామాయిల్ తోటలు సాగుచేసిన రైతులు నష్టాల సంద్రంలో చిక్కుకున్నారు. పేపర్ మిల్లుల గుత్తాధిపత్యం, దళారుల ఇష్టారాజ్యంతో గిట్టుబాటు ధర రాక అల్లాడుతున్నారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కమలాపురం, కాగజ్‌నగర్‌లలోని పేపరుమిల్లులు మూతపడటం, మిగిలిన మిల్లులు ఏకపక్షంగా వ్యహరిస్తుండటంతో రైతులకు కష్టాలు పెరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ కలపకు గిట్టుబాటు ధర ఇప్పించేందుకు ప్రభుత్వాల పరంగా చొరవ లేకపోవడం శాపంగా మారింది. సుబాబుల్ తోట వేయించే సమయంలో పేపరు మిల్లు యాజమాన్యం చెప్పిన మాటలకు...ధర ఇచ్చేసమయంలో వ్యవహరిస్తున్న తీరుకు పొంతనే లేదని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణలో పట్టించుకోని మార్కెట్ కమిటీలు: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 2.32 లక్షల ఎకరాల్లో జామాయిల్, మరో 71 వేల ఎకరాల్లో సుబాబుల్ తోటలు వేశారు. మొక్క నాటిన నుంచి 4 ఏళ్ల వరకూ సాగు ఖర్చు ఎకరానికి రూ.30 వేలవుతోంది. ఎకరానికి కౌలు రూ.10 వేల వరకూ చెల్లించి తోటలు పెంచిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఈ తోటల పంటతో తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం ఒక దశలో ఈ కలప టన్ను ధర రూ.5,500 నుంచి 6 వేల దాకా పలికింది. ఇప్పుడు రవాణా వ్యయం పెరిగినప్పటికీ అందులో సగం ధర కూడా రైతుకివ్వడం లేదు. గతంలో కాగజ్‌నగర్, కమలాపురం పేపర్‌మిల్లులు నడిచినప్పుడు కలప కొనుగోలుకు పోటీపడి ధరను రూ.5,500 దాకా పెంచారు. అంత భారీ ధరకు కొని ఉత్పత్తులు తయారుచేయలేక ఈ మిల్లులు మూత పడ్డాయని కమలాపురం పేపర్‌మిల్లు ఉద్యోగుల సంఘం నాయకుడు కోడెం సత్యనారాయణ 'ఈనాడు'కు చెప్పారు. ఆ తరవాత మిగిలిన మిల్లుల ఏకపక్షంగా ఇప్పుడు టన్ను ధరను రూ.2,700 నుంచి 3 వేలకు తగ్గించాయన్నారు. రైతు సొంతంగా కలప నరికి మిల్లు దగ్గరికి తెచ్చి ఇస్తే టన్నుకు రూ.4,500 ఇవ్వాలని భద్రాచలం పేపర్‌మిల్లును కోరినట్లు తెలంగాణ మార్కెటింగ్ శాఖ సంచాలకురాలు లక్ష్మీభాయి తెలిపారు. ఒకవేళ ఈ ధర ఎవరికైనా రాకపోతే సమీపంలోని మార్కెటింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు.

ఏపీలో మార్కెటింగ్‌శాఖ నిద్రావస్థ

ఆంధ్రప్రదేశ్‌లో అటవీప్రాంతంతో సహా మొత్తం 11 లక్షల ఎకరాల్లో సుబాబుల్, జామాయిల్, సరుగుడు పెరుగుతోంది. ప్రకాశం జిల్లాలో 1.76లక్షలఎకరాలు, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో 2లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం సుబాబుల్ టన్ను రూ.4,200, జామాయిల్ రూ.4,400 చొప్పున కొనుగోలు చేయాలి. మార్కెట్ కమిటీలు నిర్ణయించిన డంపింగ్ యార్డుల్లో గుర్తింపు కార్డులున్న రైతుల నుంచే కొనాలి. ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసి చెల్లింపులు చేయాలి. ఇవేవీ అమలు కావడం లేదు. టన్ను సుబాబుల్‌కు కృష్ణా జిల్లా రైతులకు రూ.2,100 మాత్రమే లభిస్తోంది. ప్రకాశం జిల్లాలో జామాయిల్ రైతుకు రూ.2,200 చొప్పున అందుతోంది. ఎకరాకు 25 టన్నుల కర్ర వస్తుంటే రూ.50వేలకు పైగా నష్టపోతున్నారు. మూడేళ్లుగా రైతులు నష్టపోతున్నా ఏపీ మార్కెటింగ్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కృష్ణా జిల్లా నందిగామలో రోజుకు 50 టన్నులు కూడా కొనడంలేదు. ప్రకాశం జిల్లాలో 20వేలటన్నులు ఇలా అక్రమంగా తరలుతున్నా నామమాత్రపు జరిమానాతో విడిచిపెట్టారు. రెండు రాష్ట్రాల నిర్లక్ష్య ధోరణి వల్ల రైతులు నష్టపోతున్నారు.

క్యాన్సర్‌తో పోరాడే వరి వంగడాలు

రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లో లభించే మూడు సంప్రదాయ వరి వంగడాలకు క్యాన్సర్‌తో పోరాడే శక్తి ఉన్నట్లు పరిశోధకులు కనిపెట్టారు. ఇందిరా గాంధీ కృషీ విశ్వవిద్యాలయ(ఐజీకేవీ), బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. ఔషధ గుణాలున్న గత్వాన్, మహరాజీ, లైచా వరి వంగడాలపై వారు దృష్టిసారించారు. ఇవి ఆరోగ్యకర కణజాలంపై ఎలాంటి దుష్ప్రభావాన్నీ చూపకుండా ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్‌లపై పోరాడగలుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. వీటిలో లైచా మరింత సమర్థంగా పనిచేస్తోందని, క్యాన్సర్ కణాల వ్యాప్తికి అడ్డుకట్ట వేయగలుగుతోందని పరిశోధకులు దీపక్ శర్మ తెలిపారు. మరోవైపు గత్వాన్ వరికి కీళ్లవాతాన్ని నయంచేసే శక్తి ఉన్నట్లు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని గిరిజన ప్రాంతాల్లో లైచాను చర్మ వ్యాధుల కట్టడికి ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. రోజుకు 200 గ్రాముల వరకూ ఈవరిని తీసుకుంటే ఫలితాలుంటాయని చెప్పారు.

నిరంతర విద్యుత్తు.. నియంత్రికలకు రక్ష!

ఈనాడు, వరంగల్: సాగుకు నిరంతరాయ ఉచిత విద్యుత్తు పుణ్యమా అని నియంత్రికల(ట్రాన్స్‌ఫార్మర్ల) వైఫల్యం గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి రైతులకు 24 గంటలపాటు ప్రభుత్వం కోతల్లేని విద్యుత్తు ఇస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది 31 డిసెంబరు వరకు సాగుకు 9 గంటలపాటు విద్యుత్తు ఇచ్చిన క్రమంలో వ్యవసాయ బావుల వద్ద ఉన్న నియంత్రికలపై అధిక లోడు పడేది. ఆటోస్టార్టర్ల ఏర్పాటుతో కరెంటు సరఫరా మొదలవ్వగానే ఒక్కసారిగా భారం పడేది. రైతులంతా సాగుకు ఒకే సమయంలో నీళ్లు కట్టడంతో తరచూ లోడు పడి అవి కాలిపోతుండేవి. అధికారులూ పట్టించుకోకపోవడంతో అన్నదాతలే ఖర్చు భరిస్తూ, నియంత్రికలను మరమ్మతు కేంద్రానికి తీసుకెళ్లేవారు. తక్కువలో తక్కువ రూ.1000 వరకు సొంతంగా వెచ్చించాల్సి వచ్చేది. 24 గంటలు నిరంతరాయ విద్యుత్తు అందిస్తున్న తర్వాత ఈ సమస్య నుంచి రైతులు బయటపడ్డారు. అధిక లోడుతో పాడయ్యే నియంత్రికల సంఖ్య గణనీయంగా తగ్గింది. మరోవైపు ప్రమాదాల సంఖ్య కూడా తగ్గింది.

వేలల్లో నుంచి వందల్లోకి..: ఉత్తర మండల విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో గత రెండేళ్ల వివరాలుచూస్తే మరమ్మతులకుగురయ్యే నియంత్రికల సంఖ్య వేలల్లో నుంచి వందల్లోకి చేరింది. 9 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా ఉన్న సమయంలో నెలకు సగటున 2,500 వరకు కాలిపోయేవి. పూర్వ వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్‌లలో చూస్తే ఒక్కో జిల్లాలో నెలకు కనీసం 500 నుంచి 600 వరకు అధిక లోడుతో నియంత్రికలు కాలిపోతుండేవి. తాజా గణాంకాలను పరిశీలిస్తే ఈ సంఖ్య బాగా తగ్గింది. ఈ ఏడాది జనవరిలో చూస్తే ఎన్పీడీసీఎల్ పరిధిలో మొత్తంగా 1,763 మాత్రమే పాడయ్యాయి. అప్పటికింకా ఆటోస్టార్టర్ల తొలగింపు ప్రక్రియ వేగం పుంజుకోలేదు. క్రమంగా రైతులు ఆటోస్టార్టర్లను తొలగిస్తుండడంతో నియంత్రికలపై భారం తగ్గుతున్నట్టు తెలుస్తోంది.

అంగారకుడిపై నీటి జాడకు ఆనవాళ్లు!

వాషింగ్టన్: అంగారకుడిపై నీటి ఉనికిని చాటిచెప్పే సరికొత్త ఆధారాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' శాస్త్రవేత్తలు సంపాదించారు! అరుణ గ్రహంపై 'పర్సెవరెన్స్ వ్యాలీ'గా పిలుస్తున్న ప్రాంతంలో శిలాచారలను తాజాగా గుర్తించారు. అంగారకుడిపై పరిశోధనలకుగాను నాసా 2004 జనవరిలో 'మార్స్ ఎక్స్‌ప్లోరేషన్ రోవర్ ఆపర్చునిటీ'ని ప్రయోగించింది. అంగారకుడిపై 5వేల రోజులను పూర్తిచేసుకున్న ఈ మిషన్ తాజాగా 'పర్సెవరెన్స్ వ్యాలీ'లో ప్రత్యేకమైన శిలాచారలను గుర్తించింది. సాధారణంగా పర్వత వాలుప్రాంతాల్లో తడి మట్టి పదేపదే గడ్డకడితే ఇలాంటి చారలు ఏర్పడేందుకు ఎక్కువ అవకాశాలుంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఫారం-సి
(ప్రకటన)
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద దీనిలో 10 ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడండి)
తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూ.సే) శాఖ

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం.G/4341/2017 తేది. 15-12-2017
నెం. ఎ/39/2017 తేది. 29-11-2017
గెజిట్ నెం. 25/2018 తేది. 15-12-2017

[illegible]

జిల్లా: యాదాద్రి భువనగిరి గ్రామం: తిమ్మాపురం మండలం: ఆత్మకూర్(యం)

క్ర. సం.	సర్వే నెం.	పొత్తు విధము	భూమి విధము	భూ సేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం.లు	భూమి పట్టేదారు/ అనుభవదారు/ ఆసక్తిదారు పేరు మరియు తండ్రి పేరు, చిరునామా	ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	నిర్మాణములు/ వృక్షములు మరియు ఇతరములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	[illegible]	[illegible]	[illegible]	0.08 1/2	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	—
2				0.08 1/2	[illegible]					—
3				0.06	[illegible]					—
4	572	[illegible]	[illegible]	0.02 1/2	[illegible]	588	571	572	572	—
5				0.02 1/2	[illegible]					—
[illegible]										
				6.24						

[illegible]

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) సం/- సంయుక్త కలెక్టర్ సం/- జిల్లా కలెక్టర్
యాదాద్రి-భువనగిరి జిల్లా

ప్లూటోను మళ్లీ గ్రహంగా మార్చమంటూ నాసాకు చిన్నారి లేఖ

వాషింగ్టన్: ప్లూటోను గ్రహాల జాబితాలో మళ్లీ చేర్చాలని కోరుతూ ఐర్లాండ్‌కు చెందిన కారా ఓకన్నర్ అనే ఆరేళ్ల చిన్నారి నాసా (అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ)కు లేఖ రాసింది. చిన్నారి బుజ్జి బుజ్జి మాటలను, ఖగోళ విషయాలపై ఆమె ఆసక్తిని చూసి ముచ్చటపడ్డ నాసా కూడా అందుకు ప్రత్యుత్తరం పంపింది. 2006లో ప్లూటోను మరుగుజ్జు గ్రహంగా పరిగణిస్తూ.. దానికి ఉన్న గ్రహ హోదాను అంతర్జాతీయ ఖగోళ సంఘం తొలగించింది. అయితే ఈ నిర్ణయం సరికాదని కారా తన లేఖలో వాదించింది. "నేను కొన్ని పాటల్లో చూశా. ప్లూటోను మరుగుజ్జు గ్రహమని చెత్తబుట్టలో వేశారు. ఏ గ్రహానికీ ఇలా జరగకూడదు. నా కోసం ఈ సమస్యను పరిష్కరించండి" అంటూ పేర్కొంది. ఈ లేఖ రాసేందుకు కారాకు ఆమె ఉపాధ్యాయురాలు సహకరించారు. ఇటు లేఖకు.. నాసాలోని గ్రహసంబంధ విజ్ఞాన విభాగం డైరెక్టర్ జేమ్స్ గ్రీన్ ప్రత్యుత్తరం పంపారు. "ప్లూటో చాలా మంచి గ్రహమని నువ్వు చెప్పిన విషయం వాస్తవమే కారా. అది మరుగుజ్జు గ్రహమా, కాదా అన్ని విషయాన్ని మనం పట్టించుకోనవసరం లేదు. ప్లూటో ఎంతో ఆసక్తిగొల్పే గ్రహం. దానిపై మనం అధ్యయనం కొనసాగిస్తూ ఉండాలి. భవిష్యత్తులో నువ్వే ఓ కొత్త గ్రహం కనుక్కోవాలని ఆశిస్తున్నా. బాగా చదువుకుంటే.. నువ్వూ నాసాకు రావొచ్చు" అని గ్రీన్ లేఖలో పేర్కొన్నారు.

భారత్‌లో క్యాన్సర్‌పై పరిశోధనలకు ఊపు!

- 'జన్యురాశి నిధి' ఏర్పాటు పనిలో ఐఐటీ-మద్రాసు
- మెరుగైన ఔషధాలు అందుబాటులోకి వచ్చే అవకాశం

చెన్నై: భారతీయుల్లో క్యాన్సర్‌ను తొలిదశల్లోనే గుర్తించడంతోపాటు రోగులకు మెరుగైన చికిత్సలను అభివృద్ధి చేసేందుకు వీలుగా ఐఐటీ-మద్రాసు ప్రత్యేక జన్యురాశిని తయారుచేయనుంది. ఇప్పటికే ఈ దిశగా కార్యాచరణ ప్రారంభించింది. దేశవ్యాప్తంగా పలువురు క్యాన్సర్ రోగుల నుంచి నమూనాలు సేకరిస్తోంది. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్సకు అందుబాటులో ఉన్న ఔషధాలన్నీ పాశ్చాత్య దేశాల రోగులపై పరిశోధనల ద్వారా తయారుచేసినవేనని ఐఐటీ-మద్రాసు ఆచార్యులు ఎస్.మహాలింగం తెలిపారు. వాటినే భారత్‌లోనూ ఉపయోగిస్తున్నామని చెప్పారు. ఈ ఔషధాలు పాశ్చాత్య దేశస్థులపై 80-90 శాతం సమర్థవంతంగా పనిచేస్తుండగా.. భారతీయులపై 50 శాతం కంటే తక్కువగానే విజయవంతమవుతున్నాయని వివరించారు. దీనికి పరిష్కారమార్గంగా ఐఐటీ-మద్రాసు విభాగమైన 'జాతీయ క్యాన్సర్ కణజాల జీవబ్యాంకు(ఎన్‌సీటీబీ)' మనదేశంలో క్యాన్సర్ రోగుల నుంచి క్యాన్సర్ కణజాలాన్ని సేకరిస్తున్నట్లు మహాలింగం తెలిపారు. వాటితో 'క్యాన్సర్ జన్యురాశి సమాచార నిధి'ని ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. చెన్నైలోని 9 వైద్య విద్యాసంస్థలతో కలిసి.. ఇప్పటివరకు 1,800 మందికిపైగా రోగుల నుంచి(వారి అనుమతితో) నమూనాలు సేకరించామన్నారు. భవిష్యత్తులో మనదేశంలోని పరిశోధకులెవరైనాసరే ఈ నిధి నుంచి కణజాలం తీసుకొని పరిశోధనలు చేపట్టవచ్చునని వివరించారు. తద్వారా ప్రత్యేకంగా మనదేశంలో క్యాన్సర్ ఎలాంటి మార్పులు చెందుతోందో తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. భారతీయుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ఔషధాలు, చికిత్సలను అభివృద్ధి చేసేందుకు వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

వ్యాపార రంగంలో ప్రవేశించేందుకు సంరక్షకుడి అనుమతి అవసరం లేదు

సౌదీలో నిబంధనల సడలింపు

రియాద్: భర్త లేదా సంరక్షకులైన పురుషుల ముందస్తు అనుమతి అవసరం ఏదీ లేకుండానే సౌదీ అరేబియా మహిళలు ఇప్పుడిక సొంతగా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించుకోవచ్చు. వ్యాపార రంగంలో రాణించవచ్చు. ఈ మేరకు విధానపరమైన మార్పులను సౌదీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. శరవేగంతో అభివృద్ధి చెందుతున్న ప్రయివేటు రంగానికి మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి మహిళలు తమ సొంతగా వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు...ఈ-సేవల నుంచి ప్రయోజనాలను పొందవచ్చు. భర్త లేదా సంరక్షకుల అనుమతితో నిమిత్తం లేకుండా అనుకున్న వ్యాపార రంగంలో ముందడుగు వేయవచ్చు అంటూ వాణిజ్యం, పెట్టుబడుల మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు తమ అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలను ఉంచింది. సౌదీ అరేబియా సంరక్షక వ్యవస్థ ప్రకారం... .మహిళలు ఎక్కడికైనా ప్రయాణం చేయాలన్నా..ఏదైనా తరగతుల్లో చేరాలన్నా...అధికారిక పరమైన డాక్యుమెంట్‌ల పనిచేయాలన్నా కూడా ముందస్తు అనుమతులు అవసరమయ్యేవి. అంటే...ఆమె తండ్రి/సోదరుడు/భర్త/సంరక్షకుడి ముందస్తు అనుమతిని సాధికారికంగా సమర్పించాల్సి ఉండేది. ఇప్పుడా పరిస్థితి మారనుంది.

భూటాన్‌తో భారత్ వ్యూహాత్మక చర్చలు

దిల్లీ: సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ బిపిన్ రావత్, విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌లు ఈ నెల మొదట్లో గోప్యంగా భూటాన్ వెళ్లి వచ్చారు. డోక్లామ్‌లో పరిస్థితి సహా అనేక వ్యూహాత్మక అంశాలపై అక్కడి అగ్రనాయకత్వంతో విస్తృత చర్చలు జరపడం అరుదైన ఈ పర్యటన విశేషమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కీలకమైన డోక్లామ్ పీఠభూమిలో చైనా తన సైనిక సత్తాను, మౌలిక వసతులను పెంచుకుంటున్న నేపథ్యంలో భారత్, భూటాన్‌లు తమ ద్వైపాక్షిక భద్రత, రక్షణ సహకారాన్ని సమీక్షించుకున్నాయి. ముగ్గురు ఉన్నతాధికారుల పర్యటన ఈ నెల 6, 7 తేదీల్లో జరిగిందని సంబంధిత వర్గాలు వివరించాయి. వీరు భూటాన్ ప్రభుత్వంలో కీలక అధికారులతో చర్చలు సాగించారని తెలిపాయి. చైనాతో తాము సాగిస్తున్న సరిహద్దు చర్చల తీరుతెన్నులను భూటాన్ వివరించినట్లు పేర్కొన్నాయి.

తెలంగాణ ప్రభుత్వం, రెవిన్యూ (భూ.సే) శాఖ

ఫారమ్-సి
నోటిఫికేషన్
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద దీనిలో 10 ఎ మినహాయింపు గలదు)
(నిబంధన 6/12 చూడండి)

No.Rev/G1/LAG/0021/2018-G-Section తేది:10-02-2018
గెజిట్ నెం.04/2018 తేది: 12-02-2018

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్టపరిచిన మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్ డివిజన్ జడ్చర్ల మండలం ఆలూరు, బాదేపల్లి, చిత్తబోయినపల్లి, గొల్లపల్లి, జడ్చర్ల మరియు మాచారం గ్రామాలలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.9.02½ గుంటలు ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా ఉందానగర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రైలు మార్గాన్ని రెండు లైన్లతో విద్యుదీకరణ మార్చేందుకు అవసరమై ఉన్నదని భావించడమైనది.

కావున పై ప్రాజెక్టు కోసం మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్ డివిజన్ జడ్చర్ల మండలం ఆలూరు, బాదేపల్లి, చిత్తబోయినపల్లి, గొల్లపల్లి, జడ్చర్ల మరియు మాచారం గ్రామాలలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.9.02½ గుంటలు భూమి వివరములు ఈ క్రింద చూపిన విధంగా భూ సేకరణ పనులు ప్రారంభ నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేయడమైనది.

గ్రామము: ఆలూరు మండలం: జడ్చర్ల జిల్లా: మహబూబ్‌నగర్

క్ర. సం.	సర్వే నం.	భూమి స్వభావం	భూమి రకం	సేకరించవలసిన భూమి విస్తీర్ణం (ఎ.గుంటలు)	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు	చెట్లు	కట్టడములు	కట్టడములు
1	41/a	[illegible]	[illegible]	0-04.50	అచ్యుత బాయి భ. రఘువేందర్ రావు	అచ్యుత బాయి భ. రఘువేందర్ రావు	SCR	41	V.B. of BDP	39	–	–	–	–
2	41/aa	[illegible]	[illegible]		విద్యావతి భ. శ్రీక్రిష్ణ	విద్యావతి భ. శ్రీక్రిష్ణ								
3	35	[illegible]	[illegible]	0-03.50	గడ్డం అంజనేయులు [illegible]	గడ్డం అంజనేయులు [illegible]	[illegible]	35	38	37	–	–	–	–
[illegible]														
18	254/lu	[illegible]	[illegible]		చాకలి అంజనేయులు తం. చంద్రయ్య	చాకలి అంజనేయులు తం. చంద్రయ్య					–	–	–	–
19	254/ruu	[illegible]	[illegible]		చాకలి పెంటయ్య తం. చంద్రయ్య	చాకలి పెంటయ్య తం. చంద్రయ్య					–	–	–	–
20	255/e	[illegible]	[illegible]	0-10.50	యెడ్ల వెంకటయ్య తం. నాగయ్య	యెడ్ల వెంకటయ్య తం. నాగయ్య	254	255	256	SCR	–	–	–	–
	మొత్తం			3-29.50										

గ్రామము: జడ్చర్ల మండలం: జడ్చర్ల జిల్లా: మహబూబ్‌నగర్

[illegible]

మొత్తం 1-14.50

గ్రామము: బాదేపల్లి మండలం: జడ్చర్ల జిల్లా: మహబూబ్‌నగర్

[illegible]

మొత్తం 0-13

గ్రామము: చిత్తబోయినపల్లి మండలం: జడ్చర్ల జిల్లా: మహబూబ్‌నగర్

[illegible]

మొత్తం 0-15.50

గ్రామము: గొల్లపల్లి మండలం: జడ్చర్ల జిల్లా: మహబూబ్‌నగర్

[illegible]

మొత్తం 2-08

గ్రామము: మాచారం మండలం: జడ్చర్ల జిల్లా: మహబూబ్‌నగర్

క్ర. సం.	సర్వే నం.	భూమి స్వభావం	భూమి రకం	విస్తీర్ణం	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు	చెట్లు	కట్టడములు	కట్టడములు
[illegible]														
16	40/aa1	[illegible]	[illegible]	0-01	నంగూరి చంద్రప్రకాశ్ తం. నిరంజన్	నంగూరి చంద్రప్రకాశ్ తం. నిరంజన్		V.B.of Jadcherla		SCR	–	–	–	–
17	40/a1	[illegible]	[illegible]	0-04	యండి సులేమాన్ తం. బురనోద్దిన్	యండి సులేమాన్ తం. బురనోద్దిన్				SCR	–	–	–	–
	మొత్తం			1-02										

సారాంశం

క్ర.సం	గ్రామము పేరు	విస్తీర్ణం (ఎ.గుం.)
1.	ఆలూరు	1.14½
2	బాదేపల్లి	0.13
3	చిత్తబోయినపల్లి	0.15½
4	గొల్లపల్లి	3.29½
5	జడ్చర్ల	2.08
6	మాచారం	1.01
	మొత్తం	9.02½

ఇట్టి ప్రకటన భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నెం. 21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) (కేంద్ర చట్టం నెం.30/2013) ప్రకారం దీనితో సంబంధం కలిగిన వ్యక్తులు అందరికి తెలియజేయుటకు గాను ఈ నోటిఫికేషన్ జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టరు, మహబూబ్‌నగర్ మరియు రాజస్వ మండలాధికారి / భూసేకరణ అధికారి, మహబూబ్‌నగర్ వారి కార్యాలయములో ఉంచడమైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ గారు రాజస్వ మండలాధికారి/ భూసేకరణ అధికారి గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి తవ్వకానికి సంబంధించిన సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అధికారం ఇవ్వడమైనది.

సదరు చట్టంలోని 11(4) అనుసరించి కలెక్టర్ గారి అనుమతిలేకుండా షెడ్యూలులో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయవిక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూ సేకరణపై ఏవైనా అభ్యంతరాలుగాని, ఆక్షేపణలు గాని ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కోసం జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులైన వారెవరైనా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి అరవై(60) రోజుల లోపల జిల్లా కలెక్టరు, మహబూబ్‌నగర్ / రాజస్వ మండలాధికారి / భూ సేకరణ అధికారి, మహబూబ్‌నగర్ గారికి లిఖిత పూర్వకంగా దాఖలు చేసుకోవచ్చును.

రెవెన్యూ డివిజనల్ అధికారి మహబూబ్‌నగర్ | జాయింట్ కలెక్టర్, మహబూబ్ నగర్ | జిల్లా కలెక్టర్, మహబూబ్ నగర్

DIPR No.1623/LA/PP/2017-18

33,482 దిగితే దిద్దుబాటు!



సమీక్ష : అంతర్జాతీయ మార్కెట్లు రాణించినప్పటికీ.. గత వారం దేశీయ సూచీలు స్తబ్దుగా ముగిశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన ఒక శాఖలో రూ.11,300 కోట్ల విలువైన మోసపూరిత లావాదేవీలు వెలుగుచూడటంతో దేశీయంగా సెంటిమెంటు ప్రతికూలంగా మారింది. విదేశీ మదుపర్లు స్థిరంగా అమ్మకాలు కొనసాగించడం, ముడిచమురు ధరలు పెరగడం, వాణిజ్య లోటు 56 నెలల గరిష్ఠానికి చేరడం ఇందుకు తోడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు దన్నుగా నిలవడంతో సూచీలు గత వారాన్ని బలంగానే ప్రారంభించాయి. 2018-19లో పన్ను వసూళ్లపై జైట్లీ ధీమా వ్యక్తం చేయడం కలిసొచ్చింది. భారత విదేశీ రుణం, వ్యవస్థ తట్టుకునే స్థాయిలోనే ఉందన్న వార్తలు, డిసెంబరు ఐఐపీ, జనవరి ద్రవ్యోల్బణ గణాంకాలు సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. అయితే మదుపర్లు షేరు ఆధారిత కొనుగోళ్లకే మొగ్గుచూపగా, చిన్న, మధ్యస్థాయి షేర్లలో లాభాలు స్వీకరించారు. మొండి బకాయిల పరిష్కారానికి ఆర్‌బీఐ కొత్త నిబంధనలు తీసుకురావడంతో ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం వెలుగు చూడటంతో మార్కెట్లను భయాలు వెంటాడాయి. విదేశీ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇవ్వడం ఆపివేయాలన్న భారత ఎక్స్ఛేంజీల నిర్ణయం సైతం ఆందోళనలకు పెంచింది. ఈ పరిణామాలతో వారం మొత్తం మీద సెన్సెక్స్ కేవలం 5 పాయింట్లు పెరిగి 34,010 వద్ద ముగిసింది. నిఫ్టీ 2.65 పాయింట్లు పెరిగి 10,452 దగ్గర స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐలు) నికర విక్రయాలు రూ.2849 కోట్లుగా నమోదయ్యాయి. డీఐఐలు, ఫండ్లు మాత్రం రూ.2369 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:4గా నమోదుకావడం.. మార్కెట్లలో అనిశ్చితిని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } సెన్సెక్స్ ఒకవేళ 33482 దిగువన ముగిస్తే.. ప్రస్తుత దిద్దుబాటు సమీప కాలంలో కొనసాగే అవకాశం ఉంది. 34,700 ఎగువకు చేరితేనే సూచీల లాభాలు నిలుస్తాయి.


ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, దేశీయ పరిణామాలు, ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తాయి. అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చు. 22న కాంట్రాక్టుల ముగియనుండటంతో మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనవ్వచ్చు. పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించిన వార్తలపై మదుపర్లు దృష్టిపెట్టొచ్చు. పీఎన్‌బీ, ఇతర ప్రభుత్వ బ్యాంకుల నుంచి ప్రతికూల వార్తలు వస్తే.. మార్కెట్ల బలహీనతలు కొనసాగొచ్చు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బ్యాంకుల షేర్లు ఒత్తిడి ఎదుర్కోవచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా మార్కెట్ల కదలికలు దిశానిర్దేశం చేయొచ్చు. బ్రిటన్ జీడీపీ గణాంకాలు, ఇతర అమెరికా గణాంకాలు కీలకం కానున్నాయి. చమురు ధరలు, డాలరుతో పోలిస్తే రూపాయి కదలికలు, ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 33,482, 32,886, 32,565; **తక్షణ నిరోధ స్థాయి:** 34,666, 35,006, 35,507

33,482 పాయింట్ల దిగువకు చేరితే సమీపకాలంలో దిద్దుబాటు కొనసాగొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

ఈనాడు బిజినెస్



18న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)	(100కు రూపాయలలో)		
హైదరాబాద్	380	వరంగల్	382
చిల్లరగా (ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	385
బెంగళూరు	405	చెన్నై	415
19వ తేదీకి		చిత్తూరు	408
విజయవాడ/గోదావరి	383	నమక్కల్	395


కోడిగుడ్లు


ఊగిసలాటకు అవకాశం!

- పీఎన్‌బీ ప్రభావం ఉండొచ్చు
- 10400-10620 మధ్య నిఫ్టీ కదలికలు
- ప్రైవేటు బ్యాంకులు, మౌలిక షేర్లు రాణించొచ్చు
- ఔషధ, సిమెంటు స్క్రిప్‌లకు ప్రతికూలతలు
- విశ్లేషకుల అంచనాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం

వివిధ సూచీల్లో భారత వెయిటేజీలో ఎమ్ఎస్‌సీఐ మార్పులు చేసిన నేపథ్యంలో ఆ ప్రభావం ఈ వారం స్టాక్ మార్కెట్లపై కనిపించొచ్చు. మరో పక్క పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో చోటుచేసుకున్న రూ.11,400 కోట్ల కుంభకోణం పరిణామాలు సైతం సెంటిమెంట్‌పై పనిచేస్తాయని విశ్లేషకులు అంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల ధోరణిని అనుసరించి దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మొదట్లో సానుకూలతలు ప్రదర్శించవచ్చు. మార్కెట్లు స్థిరీకరణ దిశగా పయనించొచ్చు. ఆర్థికంగా బలంగా ఉన్నందున మరీ భారీగా నష్టాలు రాకపోవచ్చు. ఎక్కువగా ఎంపిక చేసిన షేర్లపై ఆధారపడి ట్రేడింగ్ జరగవచ్చు. నిఫ్టీ-50 10400-10620 శ్రేణిలో కదలాడవచ్చని సాంకేతిక నిపుణులు అంటున్నారు. ఒక వేళ సూచీ 10400 పాయింట్ల దిగువకు వెళితే 9900-10100 స్థాయి వరకు నష్టపోవచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు రాబోయే కొద్ది వారాలు ఊగిసలాటకు లోనుకావొచ్చు. మౌలిక, ప్రైవేటు బ్యాంకుల షేర్లు ఈ వారం రాణించే అవకాశం ఉంది. ఐటీ, ఔషధ షేర్లు నష్టపోవచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..





ఎఫ్ఎమ్‌సీజీ: ఈ వారం సానుకూలంగా చలించే అవకాశం ఉంది. గ్రామీణ విక్రయాలు పెరగడం ఇందుకు నేపథ్యం. ఈ విషయంలో బ్రిటానియా ఇండస్ట్రీస్, మారికో వరుసగా 11%, 9% చొప్పున వృద్ధిని సాధించాయి. మారికో లాభం 16.7%, బ్రిటానియా లాభం 20% చొప్పున రాణించిన నేపథ్యంలో ఇవి వెలుగులోకి రావొచ్చు.



చమురు: హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్‌లు ప్రతికూల ధోరణితో ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. మధ్య నుంచి దీర్ఘకాలానికి బలమైన మూలాలు ఉన్నప్పటికీ.. స్వల్పకాలంలో ఈ షేర్లు సాంకేతిక చార్టులపైన స్తబ్దుగా కనిపిస్తున్నాయి. ముడి చమురు ధరల ప్రభావం చమురు షేర్లపై కనిపించొచ్చు. ఆయిల్ ఇండియా 2 షేర్లకు 1 బోనస్ షేరు ఇవ్వడానికి వాటాదారులు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆ కంపెనీపై మార్కెట్ వర్గాలు కన్నేసే అవకాశం ఉండొచ్చు.



టెలికాం: బలహీన త్రైమాసిక ఫలితాల కారణంగా చాలా వరకు టెలికాం కంపెనీలు నష్టపోయే అవకాశం ఉంది. భారతీ ఎయిర్‌టెల్ షేరు మధ్య కాలంలో ఒత్తిడికి గురికావొచ్చు. స్వల్పకాలంలో తన మద్దతు స్థాయి అయిన రూ.400 దిశగా పయనించొచ్చు. ఇక ఐడియా కూడా రూ.75 స్థాయిని స్వల్పకాలంలో పరీక్షించే అవకాశం ఉంది. రిలయన్స్ జియో మాత్రం బలంగా ముందు కెళ్లవచ్చు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను రూ.946 లక్ష్యంతో పడినపుడల్లా కొనుగోలు చేయవచ్చు.

వాహన: చాలా వరకు వాహన కంపెనీలు నష్టపోయే అవకాశం ఉంది. ఐషర్ మోటార్స్, టాటా మోటార్స్‌లు బలహీనంగా కనిపిస్తున్నాయి. ఐషర్ మోటార్స్ తన చెన్నై ప్లాంటులో ఉత్పత్తిని పెంచుతున్నా.. ఆర్డర్లు చాలా తక్కువగా ఉండడంతో అది ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. మరో పక్క జాగ్వార్ లాండ్ రోవర్ ఒత్తిడిలో కొనసాగే అవకాశం ఉన్నందున ఆ ప్రభావం టాటా మోటార్స్‌పై పడొచ్చు.





యంత్ర పరికరాలు: ఎటువంటి వార్తలూ లేనందున చాలా తక్కువ శ్రేణికి లోబడి ఈ రంగ షేర్లు చలించే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ ఓ మోస్తరుగా చలించొచ్చు. గత వారంలో రూ.3,800 కోట్ల విలువైన ఆర్డర్లు రావడం ఇందుకు నేపథ్యం. డిసెంబరు త్రైమాసిక ఫలితాలు అంచనాలను తప్పడంతో భెల్ షేర్లు స్వల్పకాలంలో నష్టపోవచ్చు.




బ్యాంకింగ్: పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ఈ వారం కూడా ప్రభుత్వ బ్యాంకుల షేర్లపై ఆ ప్రభావం కనిపించొచ్చు. అయితే ప్రైవేటు రంగ బ్యాంకుల షేర్లు సానుకూలంగా చలించొచ్చు. ఎస్‌బీఐ రెండు దశాబ్దాల్లోనే తొలి త్రైమాసిక నష్టాన్ని ప్రకటించడం కూడా ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రతికూలతల్లోకి తోయొచ్చు.



లోహ: లోహ కంపెనీల షేర్లు ఈ వారం నష్టపోయే అవకాశం ఉంది. చైనా కొత్త సంవత్సరం ఇందుకు నేపథ్యం. రైట్స్ ఇష్యూ నేపథ్యంలో టాటా స్టీల్ షేర్లు వెలుగులోకి రావొచ్చు. రైట్స్ ఇష్యూ ద్వారా అదనపు షేర్లు పొందుతారు కాబట్టి ప్రస్తుత వాటాదార్లు కొన్ని టాటా స్టీల్ షేర్లను విక్రయించే అవకాశం ఉంది.



సిమెంటు: సాంకేతిక చార్టుల్లో బలహీనంగా కనిపిస్తున్నందున సిమెంట్ షేర్లు క్షీణించే అవకాశం ఉంది. అంబుజా సిమెంట్ ఫలితాలు మంగళవారం ఉన్నందున మదుపర్లు సునిశితంగా గమనించొచ్చు. మధ్య నుంచి దీర్ఘకాలంలో ఈ కంపెనీలు సానుకూలంగా పయనించొచ్చు.



ఔషధ: ఔషధ షేర్లు మార్కెట్ పడిన సమయంలో పెరుగుతూ ఉంటాయి కానీ.. ఈ సారి పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో దేశీయ మదుపర్లు జాగ్రత్తగా ఉంటున్నారు. ఈ రంగ షేర్లకు కూడా దూరంగా ఉండే అవకాశం ఉంది. సన్‌ఫార్మా ఇండస్ట్రీస్ షేర్లపై మదుపర్లు దృష్టి సారించొచ్చు.

మౌలికంపై అదనపు భారం రూ.2 లక్షల కోట్లు

దిల్లీ: మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో ఆలస్యం వల్ల, దాదాపు రూ.2 లక్షల కోట్ల అదనపు భారం పడనుందని ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. రూ.150 కోట్లు, అంతకంటే ఎక్కువ మొత్తం అంచనా వ్యయంతో చేపట్టిన 349 మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులకు ఇప్పుడు అదనంగా మరో రూ.2 లక్షల కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. మొత్తం 1,283 ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.15,58,352.33 కోట్లు అవసరమని అంచనా వ్యయం వేయగా, పనుల్లో జాప్యం కారణంగా నిర్మాణ వ్యయం 12.90 శాతం పెరిగి రూ.17,59,443.87 కోట్లకు చేరిందని తాజా నివేదికలో ప్రభుత్వం వెల్లడించింది. 2017 అక్టోబరు నాటికి ఈ ప్రాజెక్టులపై రూ.6,59,009.46 కోట్లు ఖర్చు చేశారు.


రూ.15,000 కోట్ల ఫ్లాట్లు విక్రయిస్తాం

వచ్చే 3-4 ఏళ్లపై డీఎల్ఎఫ్ ప్రణాళికలు

దిల్లీ: నివసించడానికి సిద్ధమైన ఫ్లాట్లను వచ్చే 3-4 ఏళ్లలో రూ.15,000 కోట్ల విలువైనవి విక్రయించాలని స్థిరాస్తి దిగ్గజం డీఎల్ఎఫ్ నిర్ణయించింది. నిర్మాణం దాదాపు పూర్తయ్యే స్థాయికి చేరితేనే కొత్త ప్రాజెక్టులలో విక్రయాలు ప్రారంభించాలని భావిస్తోంది. రూ.15,000 కోట్ల విలువైన నివాస సముదాయలకు సంబంధించి, గురుగ్రామ్ ప్రాంతంలోనే రూ.9000- 10,000 కోట్ల విలువైన నిర్మాణాలు ఉండొచ్చని అంచనా.

పీఎన్‌బీ కథ ఇంకా ముగియలేదు

- **ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల రుణాలు 23 శాతం పెరిగాయ్**



దిల్లీ: రూ.11,400 కోట్ల మోసపూరిత లావాదేవీలు నమోదైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో ఉద్దేశపూర్వక ఎగవేతదార్లూ తమ ప్రతాపం చూపుతున్నారు. రూ.25 లక్షలు అంతకంటే అధికమొత్తం రుణాలు తీసుకుని, ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన మొత్తాలు 8 నెలల్లోనే 23 శాతం అధికమయ్యాయని బ్యాంక్ గుర్తించింది. ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల నుంచి వసూలు కావాల్సిన స్థూల రుణాలు ఈ ఏడాది జనవరి 31 నాటికి రూ.14,593 కోట్లకు చేరాయి. 2017 జూన్ నుంచి ఈ గణాంకాలను బ్యాంక్ వెల్లడిస్తోంది. అప్పుడు ఇలాంటి వారి నుంచి వసూలు కావాల్సిన స్థూల రుణాల మొత్తం రూ.11,879.74 కోట్లు. అంటే 8 నెలల్లోనే 22.8 శాతం పెరిగాయి. పారు బకాయిల వసూళ్లపై బ్యాంకు ఏడాది కాలంగా దృష్టి పెట్టగా, ఈ కాలంలోనే ఇవి ఇంతలా పెరగడం గమనార్హం.

ఈ జాబితాలోని కొన్ని సంస్థలు

- ప్రెసియస్ జువెలరీ&డైమండ్స్ - రూ.747.97 కోట్లు
- కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ - రూ.597.44 కోట్లు
- జూమ్ డెవలపర్స్ - రూ.410.18 కోట్లు
- ఎంబీఎస్ జువెలర్స్ - రూ.266.17 కోట్లు
- బ్యాంకు 95 ఖాతాలను జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ దృష్టికి తెచ్చింది. ఈ ఖాతాల నుంచి మొత్తం రూ.18,000-19,000 కోట్లు వసూలు కావాల్సి ఉంది.
- తక్కువమొత్తం రుణాల వసూలుకు అమలు చేస్తున్న ఒకేదఫా పరిష్కారం కింద 2017-18లో 1,800 కోట్లు జమయ్యాయి.

వజ్రాభరణాల వ్యాపారులపై అప్రమత్తత

150 డొల్ల కంపెనీలు, 4 నమోదిత సంస్థలపైనా దృష్టి

నీరవ్ మోదీ చేసిన మోసపూరిత లావాదేవీల ఫలితంగా, వివిధ నియంత్రణ సంస్థల దృష్టి ఈ వ్యాపార విభాగంపై తీవ్రంగా పడింది. ముఖ్యంగా వజ్రాభరణాల వ్యాపారాలతో లావాదేవీలు నిర్వహించే ఆర్థిక సంస్థలు, వాటి ప్రతినిధుల తీరు ఎలా ఉందో పరిశీలిస్తున్నారు. గీతాంజలి జెమ్స్ వాణిజ్య కార్యకలాపాలను సెబీ పరిశీలిస్తోంది. అంతేకాక వజ్రాల వ్యాపారులు, స్టాక్‌మార్కెట్ బ్రోకర్ల మధ్య బంధాన్ని తనిఖీ చేస్తోంది. పీఎన్‌బీ స్థితిని ఆర్‌బీఐ పరిశీలిస్తుండగా, మిగిలిన బ్యాంకులు కూడా వజ్రాభరణాల వ్యాపారుల లావాదేవీలపై పరిశీలన జరుపుతున్నాయి. మోదీ, ఆయన సన్నిహితుడైన చోక్సీతో అనుబంధం కలిగిన నమోదిత కంపెనీలు, వాటి డైరెక్టర్లపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ దృష్టి సారించింది. 150 డొల్ల కంపెనీలపై పరిశోధన నిర్వహించాలని నిర్ణయించింది. నీరవ్‌మోదీ డైరెక్టరుగా ఉన్న 4 నమోదిత కంపెనీలు, మరో 4 పరిమిత భాగస్వామ్య సంస్థల (ఎల్ఎల్‌పీ)పైనా పరిశీలన జరుపుతోంది. వీటిలో ఫైర్‌స్టార్ డైమండ్ ప్రైవేట్ లిమిటెడ్, ఫైర్ స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్, రాధాషిర్ జువెలరీ కంపెనీ అండ్ జువెలరీ సొల్యూషన్స్ ఇంటర్నేషనల్ వంటి నమోదిత కంపెనీలున్నాయి. ఎల్ఎల్‌పీలు చూస్తే పాంచజన్య డైమండ్స్, నీశాల్ ఎంటర్‌ప్రైజెస్, పారగాన్ జువెలరీ, పారగాన్ మర్చండైజింగ్ ఉన్నాయి.

పరిశీలనలో పీఎన్‌బీ రేటింగ్: క్రిసిల్

రూ.11,400 కోట్ల మోసపూరిత లావాదేవీలు వెలుగుచూసిన పీఎన్‌బీకి రేటింగ్‌ను పరిశీలనలో ఉంచినట్లు రేటింగ్ సంస్థ క్రిసిల్ ప్రకటించింది. ఈ బ్యాంక్ రుణ పథకాలకు క్రిసిల్ నుంచి ఏఏఏ, ఏఏ రేటింగ్‌లు ఉన్నాయి. బ్యాంకులో తాజాగా వెలుగుచూసిన మోసపూరిత లావాదేవీలు అనూహ్యమైనవని, ఇందుకు బ్యాంక్ బాధ్యత ఎంత అనేది చట్ట ప్రకారం నిర్ణయమవుతుందని సంస్థ పేర్కొంది. బ్యాంక్ బాధ్యత, రికవరీకి అవకాశాలు, కేటాయింపులుఉ ఎంత జరపాల్సి వస్తుంది, పెట్టుబడి శాతాలపై ప్రభావం వంటి అంశాల్లో పీఎన్‌బీ యాజమాన్యం నుంచి స్పష్టత కోరినట్లు క్రిసిల్ వెల్లడించింది. బ్యాంక్ సమాధానం రాగానే రేటింగ్‌ను నిర్ధారిస్తామని తెలిపింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.60,000 కోట్ల పెట్టుబడులు



మహారాష్ట్ర పెట్టుబడిదార్ల సదస్సులో రతన్ టాటాతో ముకేశ్ అంబానీ

ముంబయి: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) భారీ పెట్టుబడులు ప్రకటించింది. దేశంలోనే మొట్టమొదటి సమీకృత డిజిటల్ పారిశ్రామిక ప్రాంతాన్ని మహారాష్ట్రలో ఏర్పాటు చేయడానికి రూ.60,000 కోట్లు పెట్టుబడి పెడతామని ఆర్ఐఎల్ అధిపతి ముకేశ్ అంబానీ ప్రకటించారు. అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి వచ్చే పదేళ్లలో ఈ పెట్టుబడులు పెట్టనున్నారు. మాగ్నెటిక్ మహారాష్ట్ర పెట్టుబడిదార్ల సదస్సులో పాల్గొన్న ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ప్రతిపాదిత ప్రాంతానికి సంబంధించిన వివరాలు, మొదటి దశ ఎప్పుడు మొదలవుతుందన్న వివరాలను అంబానీ వెల్లడించలేదు. సిస్కో, సీమెన్స్, హెచ్‌పీ, డెల్, నోకియా వంటి అగ్రగామి 20 దిగ్గజ కంపెనీలు ఇందులో పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించారు.

ఐఓసీ రూ.70 వేల కోట్ల పెట్టుబడి

- 2030కి భారీగా సామర్థ్య విస్తరణ

దిల్లీ: ముడిచమురు శుద్ధి (రిఫైనింగ్) సామర్థ్యాన్ని భారీగా పెంచుకునేందుకు రూ.70,000 కోట్ల పెట్టుబడులు పెట్టాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) నిర్ణయించింది. 2030 నాటికి దేశ ఇంధన అవసరాలే లక్ష్యంగా చమురు శుద్ధి సామర్థ్యాన్ని పెంచుకోవాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఏడాదికి 80.7 మిలియన్ టన్నుల ముడిచమురు శుద్ధి సామర్థ్యం ఇండియన్ ఆయిల్‌కు ఉంది. 2030 నాటికి సామర్థ్యాన్ని 116.55 మిలియన్ టన్నులకు పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. దేశ ఇంధన వినియోగం ఏటా 3.5 - 4.0 శాతం పెరుగుతోంది. ఎనర్జీ ఇన్ఫర్మేషన్ ఏజెన్సీ ఆఫ్ యూఎస్ ప్రాజెక్ట్స్ (ఐఈఏ) అంచనా ప్రకారం 2040 నాటికి భారతదేశంలో ఇంధన వినియోగం 434 మిలియన్ టన్నులకు చేరనుంది. కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ అంచనా ప్రకారం 2030 నాటికి భారత ఇంధన వినియోగం 335 మిలియన్ టన్నులకు చేరుతుంది. అందుకే 2020 నాటికే దేశీయంగా ముడిచమురు శుద్ధి సామర్థ్యాన్ని 415 మిలియన్ టన్నులకు విస్తరించాలన్నది ప్రభుత్వ యోచన. ప్రస్తుతం ఏడాదికి 247.6 మి.టన్నుల చమురును శుద్ధి చేస్తున్నారు.


2018-19లో 8 పీఎస్‌యూల ఐపీఓలు

దిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం 8 ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నాయి. 2018-19లో రూ.80,000 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని, అందుకనుగుణంగా సరైన సమయంలో పీఎస్‌యూలు ఐపీఓలకు వస్తాయని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ కమిటీ (డీఐపీఏఎం) కార్యదర్శి నీరజ్ గుప్తా తెలిపారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (10%), రైట్స్ (12%), ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (13.9%), భారత్ డైనమిక్స్ (12%), మిధాని (25%) వాటాల విక్రయానికి ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించాయి.

వెండి లాభదాయకమే

కమొడిటీస్ ఈ వారం

బంగారం, వెండి




పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు గతవారం రూ.30,188 వద్ద ప్రారంభమైనా, ఆ తరవాత దిద్దుబాటుకు లోనై రూ.30,030కి దిగివచ్చింది. అనంతరం పుంజుకొని రూ.30,839 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. ఆఖరుకు 2.08% లాభంతో రూ.30,816 వద్ద స్థిరపడింది. గత వారం పసిడి కాంట్రాక్టు రాణించడానికి ప్రధాన కారణం.. డాలరు బలహీనపడటమే. అయితే ఇటీవలి పతనం నుంచి ఈక్విటీ మార్కెట్లు కోలుకోవచ్చనే వార్తలకు తోడు డాలరు పుంజుకునే అవకాశం వంటివి ఈవారం పసిడి కాంట్రాక్టుపై ప్రతికూల ప్రభావం చూపించొచ్చు. అందువల్ల లాంగ్ పొజిషన్లు ఉన్నవారు లాభాలు స్వీకరించి బయటపడటం ఉత్తమం. వెండి మార్చి కాంట్రాక్టు కిందటివారం రూ.37,785 వద్ద ఆరంభమై, రూ.37,777- 38,870 మధ్య చలించింది. చివరకు 2.36% లాభంతో రూ.38,676 వద్ద ముగిసింది. సాంకేతికంగా వెండి కాంట్రాక్టు ప్రతికూల ధోరణి నుంచి బయటకు వచ్చినట్లు కనిపిస్తోంది. అలాగే ఈ ఏడాదిలో మరింత పైకి వెళ్లే అవకాశం కూడా ఉంది. అందువల్ల కాంట్రాక్టు ధర తగ్గినప్పుడల్లా కొత్తగా లాంగ్ పొజిషన్లు జతచేసుకుంటూ పోవడం మంచి వ్యూహం అవుతుంది.

ప్రాథమిక లోహాలు



వరుసగా నాలుగు వారాల నష్టాల అనంతరం రాగి కాంట్రాక్టు లాభాల్లోకి వచ్చింది. ఫిబ్రవరి కాంట్రాక్టు గడువు దగ్గర పడటంతో ఈవారం ఒడుదొడుకుల మధ్య చలించొచ్చు. అయితే సానుకూల ధోరణి కొనసాగే అవకాశం ఉంది. రూ.448 దిగువకు వచ్చే వరకు షార్ట్ సెల్ పొజిషన్ల జోలికి వెళ్లకపోవడమే మేలు. సీసం ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ.162.45- 171.20 శ్రేణి నుంచి బయటకు వస్తేనే మున్ముందు కదలికలపై స్పష్టత వస్తుంది. లేకుంటే ఈ శ్రేణిలోనే అటు ఇటు కదలాడొచ్చు. అందువల్ల ఈ రెండు స్థాయిలపై ట్రేడర్లు కన్నేసి ఉంచాలి. జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ.223.70 దిగువకు రాకుంటే షార్ట్ షెల్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టుకు సాంకేతికంగా రూ.143.85 వద్ద గట్టి నిరోధం కనిపిస్తోంది. ఈ స్థాయిని అధిగమిస్తే మరింత ముందుకు వెళుతుందని భావించవచ్చు. అందువల్ల కొత్తగా లాంగ్ పొజిషన్లు తీసుకోదలిచిన వారు ఈ స్థాయి వరకు వేచిచూచే ధోరణి అవలంబించాలి. నికెల్ ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ.841.90 దిగువన ట్రేడ్ కాకుంటే లాంగ్ పొజిషన్లు అట్టేపెట్టుకోవచ్చు. ఒకవేళ ఈ స్థాయి కంటే కిందకు వస్తే రూ.818కు; ఆ తర్వాత రూ.795 వరకు పడిపోవచ్చు.

ఇంధన రంగం



ముడి చమురు మార్చి కాంట్రాక్టు ఈవారం కూడా సానుకూలంగానే కనిపిస్తోంది. అయితే కాంట్రాక్టు మరింత ముందుకు వెళ్లడానికి ముందు ఓసారి కిందకు వచ్చే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఆచితూచి వ్యవహరించడం ఉత్తమం. సహజ వాయువు ఫిబ్రవరి కాంట్రాక్టుకు రూ.158.25 వరకు అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ స్థాయి వరకు షార్ట్ సెల్ పొజిషన్లు అట్టేపెట్టుకోవచ్చు.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (నవంబరు కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	435	460.80	5.93
సీసం (ఫిబ్రవరి)	163.65	167.55	2.38
జింక్ (ఫిబ్రవరి)	219.25	230.75	5.25
అల్యూమినియం(ఫిబ్రవరి)	137	141.35	3.18
నికెల్ (ఫిబ్రవరి)	837.60	887	5.90
ముడి చమురు(మార్చి)	3,850	3,975	3.25
సహజ వాయువు(ఫిబ్రవరి)	168	165.50	(1.49)
సెనగలు (మార్చి)	3,849	3,857	0.21
ధనియాలు (ఏప్రిల్)	5,770	5,496	(4.75)
గోరు చిక్కుడు (మార్చి)	4,510	4,436	(1.64)

వ్యవసాయ ఉత్పత్తులు



సెనగలు మార్చి కాంట్రాక్టును రూ.3,748-3,782 మధ్య కొనుగోలు చేయడం మంచి వ్యూహమే. ధనియాలు ఏప్రిల్ కాంట్రాక్టుకు ఈవారం తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. రూ.5,408 వరకు దిగిరావచ్చు. గోరుచిక్కుడు మార్చి కాంట్రాక్టు ఏ ప్రతికూల వార్త వచ్చినా కిందకు దిగివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రూ.4,579-4,623 మధ్య కాంట్రాక్టును షార్ట్‌సెల్ చేయొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

ఏం చేస్తారో చేసుకోండి..!

ఇదీ పీఎన్‌బీ అధికారులకు నీరవ్ సోదరుడి సమాధానం

దిగమింగిన డబ్బును కట్టాలంటే విదేశాలకు పరార్

ముంబయి: 'ఏం చేస్తారో చేసుకోండి'... ఇదీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను భారీస్థాయిలో మోసగించిన నిందితుడు నీరవ్ మోదీ సోదరుడు ఆ బ్యాంకు అధికారులకు నిర్లక్ష్యంగా ఇచ్చిన సమాధానం. దిగమింగిన డబ్బును కట్టాల్సిందిగా సమన్లు జారీ కాగానే కుటుంబంతో కలిసి నిందితుడు ఏకంగా విదేశాలకు చెక్కేసినట్లు పీఎన్‌బీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వర్గాలకు ఆదివారం తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి లాంఛనంగా ఫిర్యాదు చేయడానికంటే ముందు... డబ్బును రాబట్టుకునేందుకు పీఎన్‌బీ అధికారులు చివరిసారిగా ప్రయత్నించారు. ఆ క్రమంలోనే తమ కార్యాలయానికి నీరవ్ సోదరుడిని పిలిపించి మాట్లాడారు. అధికారులు చెబుతున్న డబ్బులేవీ తమ వద్ద లేవనీ, అందువల్ల వాటిని వాపసు చేసే అవకాశమే లేదని తేల్చిచెప్పేసరికి పీఎన్‌బీ వర్గాలు విస్తుబోయాయి. డబ్బు కట్టాల్సిందేనని రెట్టించే సరికి ఏం చేసుకుంటే చేసుకోండంటూ తెగేసి చెప్పేశాడు.

ఇప్పటికైనా మాట్లాడండి

ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి జైట్లీలపై రాహుల్ విమర్శలు

దిల్లీ: పీఎన్‌బీ కుంభకోణంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శల పరంపరను కొనసాగిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలను ఆయన ఆదివారమూ లక్ష్యంగా చేసుకున్నారు. 'పిల్లలు పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణత సాధించాలో మోదీ రెండు గంటలపాటు మాట్లాడతారు. కానీ పీఎన్‌బీ కుంభకోణంపై స్పందించేందుకు ఆయనకు రెండు నిమిషాలు కూడా దొరకట్లేదు. జైట్లీ అయితే ఎక్కడో దాక్కున్నారు. గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు తడుముకొన్న చందంగా ప్రవర్తించొద్దు. ఇప్పటికైనా నోరుతెరచి మాట్లాడండి?'అని రాహుల్ ట్వీట్‌చేశారు. మరోవైపు కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ కూడా స్పందించారు. ఎన్డీయే ప్రభుత్వంలోని అగ్రనేతలతో మోసగాళ్లకు సంబంధముందని ఆయన ఆరోపించారు. బ్యాంకింగ్ వ్యవస్థపై శ్వేతపత్రాన్ని విడుదలచేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం విమర్శలను సంధించారు. పీఎన్‌బీ కుంభకోణంలో చాలా బ్యాంకుల ప్రమేయం ఉందని, ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆమె డిమాండ్‌చేశారు. నోట్ల రద్దు సమయంలోనే ఈ కుంభకోణం జరిగిందని ఆమె ఆరోపించారు. నీరవ్ దేశం విడిచి పారిపోవడానికి ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో)దే బాధ్యతని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంత పెద్ద కుంభకోణాన్ని చూసి విస్మయం చెందానని చెప్పారు.

నీరవ్, ఛోక్సీలకు 32 బ్యాంకుల రుణాలు

ముంబయి

వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతని మేనమామ మెహుల్ ఛోక్సీలకు పంజాబ్ నేషనల్ బ్యాంకు ఒక్కటే కాకుండా మొత్తం 32 భారతీయ బ్యాంకులు రుణాలను సమకూర్చాయని ఆదాయపు పన్ను శాఖ విచారణలో వెల్లడయింది. స్టెల్లార్ డైమండ్స్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, డైమండ్స్ ఆర్ యూఎస్, ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్... కేవలం ఈ నాలుగు కంపెనీల పేరుతో నీరవ్ రూ.7817.90 కోట్లు దిగమింగినట్లు తెలుస్తోంది. గీతాంజలి జెమ్స్, దాని అనుబంధ సంస్థలు కలిపి మరో రూ.7500 కోట్లను రుణాల రూపంలో తీసుకోగలిగాయి. వీటిలో కొంత మొత్తాన్ని మాత్రం తిరిగి చెల్లించాయి. నీరవ్‌మోదీ వ్యాపార భాగస్వాముల్లో చాలా మందికి భారీ రుణాలు తీసుకునేటంత తాహతు లేనేలేదని ఐ.టి. దర్యాప్తులో తేలింది. 2014-15, 15-16, 16-17 ఆర్థిక సంవత్సరాల్లో ఇతని భాగస్వాముల్లో చాలా మంది తమకు పన్ను చెల్లించాల్సినంత ఆదాయం లేదని ప్రకటించడం గమనార్హం. మరికొందరైతే రూ.434, రూ.620, రూ.930 వంటి అతి స్వల్ప మొత్తాలను పన్ను రూపంలో చెల్లించారు. అయినా వారికి రుణాల రూపంలో భారీ మొత్తాలు చేజిక్కాయి. ఈ కంపెనీల్లో నీరవ్ వాటా కూడా చాలా తక్కువే. గత ఏడాది నీరవ్ భాగస్వాముల్లో చాలామంది ఆయా సంస్థల్లో తమకున్న వాటాలను పూర్తిగా ఉపసంహరించుకున్నారు. తమ సొంత డబ్బులకు ఎలాంటి నష్టం లేకుండా వారంతా బయటపడ్డారు. రుణాల రూపంలో లభించిన ప్రజాధనాన్ని మాత్రం యథేచ్ఛగా వాడుకున్నారు. మూడు కంపెనీలైతే తమ వార్షిక అమ్మకాల కంటే ఎక్కువ విలువైన ఆభరణాలను దిగుమతి చేసుకున్నట్లుగా లెక్కల్ని సృష్టించాయి. సరకు విలువను పెంచి చూపించడమో, తక్కువ తెచ్చి ఎక్కువగా పేర్కొనడమో జరిగి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.

ఆ ముగ్గురి చరిత్ర ఇదీ...

బ్యాంకుకు సంబంధించిన ఇద్దరిని, నీరవ్‌మోదీ సంస్థకు చెందిన ఒకరిని సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరందరూ సీబీఐ రిమాండ్‌లో ఉన్నారు.

1) **గోకుల్‌నాథ్ శెట్టి:** పీఎన్‌బీలో విశ్రాంత డీజీఎం. 2010 నుంచి బ్రాడీహౌస్ శాఖలోనే పనిచేస్తున్నారు.



గత ఏడాది మే నెలలో రిటైరయ్యారు. అంతకు మూడు నెలల ముందు కూడా నీరవ్‌మోదీ సంస్థల పేరిట రూ.281 కోట్లకు మూడు భరోసా పత్రాలు (ఎల్‌వోయూలు) మంజూరు చేశారు. బ్యాంకు కంప్యూటర్ వ్యవస్థలో చొరబడి, అయిదో అంచెలో ఉండే కీలక రహస్య సంకేతాన్ని సయితం నమోదు చేసి, విదేశాల్లోని బ్యాంకులకు మోసపూరితంగా చెల్లింపు ఆదేశాలు పంపించేవారు.

2) **మనోజ్ కారాట్:** బీఈ చేశాక పీఎన్‌బీలో గుమస్తాగా చేరి మూడేళ్లయింది. ఏకగవాక్ష ఆపరేటర్‌గా ఉంటూ శెట్టి ఆదేశాల మేరకు వ్యవస్థను తారుమారు చేసేవారు.

3) **హేమంత్ భట్:** నీరవ్‌మోదీకి చెందిన 16 కంపెనీలలో ఒకదానికి డైరెక్టర్. కంపెనీల జమాపద్దులు చూడడంతో పాటు అధీకృత సంతకం చేసే అధికారం సంపాదించాడు. శెట్టి, కారాట్‌లతో కలిసి కావాల్సిన రీతిలో పనులు చక్కబెట్టేవాడు.

వేగం పెంచిన సీబీఐ

గీతాంజలి బ్యాలెన్స్ షీట్లపై నిశిత పరిశీలన

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం దర్యాప్తులో 'కేంద్ర దర్యాప్తుసంస్థ' (సీబీఐ) వేగాన్ని పెంచింది. కుట్రకు మూలబిందువైన శాఖను ఆమూలాగ్రం శోధించడంతో పాటు గీతాంజలి గ్రూపు సంస్థల బ్యాలెన్స్ షీట్లపై దృష్టి సారించింది. మనదేశంలో ఆ గ్రూపునకు ఉన్న 18 అనుబంధ సంస్థలకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎక్కడకు వెళ్లాయి, ఆ సంస్థల ఆస్తులు-అప్పులు ఏమిటనే వివరాలను లోతుగా పరిశీలిస్తోంది. ఇప్పటికే అరెస్టైన ముగ్గురి నుంచి సమాచారాన్ని సేకరిస్తోంది. కొన్ని వేల పత్రాలు, డిజిటల్ రికార్డుల్ని జల్లెడ పడుతోంది. ప్రధాన నిందితుడు నీరవ్ మోదీ మేనమామ, గీతాంజలి గ్రూపు ప్రమోటర్- మెహుల్ ఛోక్సీపై కేసు నమోదయ్యాక నిర్వహించిన సోదాల్లో సీబీఐకి ఒక సర్వర్ లభ్యమయింది. దానినీ విశ్లేషిస్తున్నారు. నీకు ఇది-నాకు అది (క్విడ్ ప్రోకో) తరహాలో నీరవ్, ఛోక్సీ, పీఎన్‌బీ అధికారుల మధ్య లోపాయికారీగా ఏమైనా జరిగి ఉంటుందా అనే ప్రశ్నకు అధికారులు సమాధానమిస్తూ- వివరాల సేకరణ పూర్తికాలేదన్నారు. ఎప్పటికప్పుడు ఇచ్చిపుచ్చుకోవడాలు వంటివి ఉన్నాయా లేదా స్పష్టంగా చెప్పలేమన్నారు. 'కుంభకోణంలోతెంతో అర్థం చేసుకోవడంపైనే మా దృష్టంతా ఉంది. నిధులు ఎక్కడి నుంచి ఎక్కడకెళ్లాయి, దానిలో సీనియర్ అధికారుల పాత్ర ఏమిటనే వివరాలు రాబట్టడానికి ప్రాధాన్యం ఇస్తున్నాం' అని ఓ సీబీఐ అధికారి తెలిపారు.

బ్రాడీరోడ్ శాఖలో రోజంతా సోదాలు: మొత్తం కుంభకోణానికి కేంద్ర బిందువు అయిన పీఎన్‌బీ బ్రాడీరోడ్ శాఖ (ముంబయి)లో ఆదివారం రోజంతా సీబీఐ సోదాలు కొనసాగాయి. దాదాపు శాఖ మొత్తాన్ని ఆ సంస్థ తమ నియంత్రణలోకి తీసుకొంది. ఏకబిగిన సోమవారం ఉదయం వరకు ఇవి కొనసాగనున్నాయని అధికారవర్గాలు తెలిపాయి. జీఎం స్థాయి అధికారులతో సహా మరో అయిదుగురిపై ప్రశ్నల వర్షం కురిపించాయి. విచారణను ఎదుర్కొంటున్న అధికారుల సంఖ్య 11కి చేరింది.

విదేశాల్లోని బ్యాంకులకు నష్టం లేదు: పీఎన్‌బీ ద్వారా అందిన సూచనల మేరకు భరోసా పత్రాలు, రుణ పత్రాల కింద రూ.11,384 కోట్ల చెల్లింపులను చేసిన ఉదంతంలో విదేశాల్లోని భారతీయ బ్యాంకులకు నష్టమేమీ లేదని ఓ అధికారి చెప్పారు. చేసిన చెల్లింపులకు పీఎన్‌బీ హామీగా ఉండడంతో పాటు వాటిని తిరిగి ఆయా బ్యాంకులకు జమ చేయడంలో ఆలస్యమైతే వడ్డీ కూడా చెల్లించాల్సి ఉండడం దీనికి కారణమని వివరించారు. గోకుల్‌నాథ్ శెట్టి అనే కీలకాధికారి పదవీ విరమణ తర్వాత నీరవ్ నుంచి యథాలాపంగా వచ్చిన ప్రతిపాదనతో డొంకంతా కదిలిందన్నారు.

విదేశాల్లో భారత బ్యాంకుల అధికారులపై దృష్టి

- **పీఎన్‌బీ భరోసా పత్రాలు స్వీకరించిన వారిపై దర్యాప్తు**

దిల్లీ: పీఎన్‌బీ భరోసా పత్రాలను స్వీకరించిన విదేశాల్లోని భారత బ్యాంకుల సిబ్బందిపైనా దర్యాప్తు అధికారులు దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. హాంకాంగ్‌లోని అలహాబాద్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు ఈ భరోసా పత్రాలను (లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌లను) తీసుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. వజ్రాలు, ఆభరణాల రంగంలోని వ్యాపారులకు భరోసా పత్రాలను 90 రోజుల గడువుతో ఇస్తారని, అయితే తాజా కుంభకోణంలో 365 రోజుల గడువుతో వీటిని మోసపూరితంగా పీఎన్‌బీ అధికారులు జారీచేశారని పేర్కొన్నాయి. వీటిని విదేశాల్లో బ్యాంకుల శాఖల్లోని సిబ్బంది ఎలాంటి అభ్యంతరమూ లేకుండా తీసుకోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయని వివరించాయి. ఈ బ్యాంకుల్లోని ఏ అధికారి అప్రమత్తమయినా కుంభకోణం ఇంత పెద్దదిగా అయ్యుండేది కాదని వ్యాఖ్యానించాయి. హాంకాంగ్‌లో మొత్తంగా 11 భారత బ్యాంకులు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వీటిలో అలహాబాద్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లు ఉన్నాయి. పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి తమ శాఖలో రూ.1365 కోట్లు (212 మిలియన్ల డాలర్లు) మేర అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఎస్‌బీఐ ఇప్పటికే ప్రకటించింది. యూనియన్ బ్యాంక్ రూ.1931 కోట్లు (300 మిలియన్ల డాలర్లు), యూకో బ్యాంకు రూ.2646 కోట్లు (411.82 మిలియన్ల డాలర్లు) అక్రమ లావాదేవీలను వెలుగులోకి తెచ్చాయి. అలహాబాద్ బ్యాంక్‌లో దాదాపు రూ.2000 కోట్లు మేర మోసం జరిగినట్లు వార్తలు వస్తున్నాయి.



ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్‌డీవో చీఫ్ డాక్టర్ క్రిస్టోఫర్ (ఎడమ వైపు), రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి తదితరులు

పౌర, రక్షణ రంగాల్లో సమీకృత సూక్ష్మ వ్యవస్థలపై దృష్టి

డీఆర్‌డీవో చీఫ్ డాక్టర్ క్రిస్టోఫర్

ఈనాడు, హైదరాబాద్: గగనతలంలో రెండు విమానాలు ఢీకొనేంత సమీపంలోకి వెళ్లి ప్రమాదం నుంచి తృటిలో బయటపడ్డాయి. ఇటీవల జరిగిన ఈ ఉదంతం కీలకమైన కంట్రోల్, గైడెన్స్ వ్యవస్థలు మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని సూచిస్తోందని డీఆర్‌డీవో చీఫ్ డాక్టర్ ఎస్ క్రిస్టోఫర్ అన్నారు. పౌర, రక్షణ రంగాల భవిష్యత్ సాంకేతికతలో నావిగేషన్, గైడెన్స్, స్మార్ట్ సెన్సర్లు, సమీకృతంగా పనిచేసే సూక్ష్మ వ్యవస్థలే వెన్నెముక అన్నారు. వీటిపై దృష్టి సారించినట్లు తెలిపారు. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆటోమేటిక్ కంట్రోల్(ఐఎఫ్ఏసీ) సదస్సులో ఆయన ఆదివారం మాట్లాడారు. దేశంలో నావిగేషన్, గైడెన్స్, డైనమికల్ సిస్టమ్స్‌లో సాధించిన పురోగతితో రక్షణ వ్యవస్థల సామర్థ్యం పెరిగిందన్నారు. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఇందుకు నిదర్శనమన్నారు. రక్షణ మంత్రి శాస్త్ర సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వనరులు, మౌలిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే మరింత పురోగతి సాధిస్తామన్నారు. దేశంలో క్షిపణుల వ్యవస్థ కంట్రోల్, గైడెన్స్ అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన మాజీ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.వి.కదం, ఎస్.కె.రాయ్‌లను ఈ సందర్భంగా సన్మానించారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కెన్యా రచయిత గూగీ వా థియోంగో(మధ్యలో), కె.శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు

ప్రపంచాన్ని మార్చే శక్తి స్వప్నాలకుంది

కెన్యా రచయిత గూగీ వా థియోంగో

'యుద్ధకాలంలో స్వప్నాలు' అనువాద పుస్తకావిష్కరణ

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచాన్ని మార్చగల శక్తి స్వప్నాలకు ఉందని కెన్యా నవలా రచయిత, ప్రొఫెసర్ గూగీ వా థియోంగో అన్నారు. ఒక శిశువుగా చదువు గురించి కలల్లో మునిగి తేలడంతోనే విజ్ఞానాన్ని దక్కించుకోగలిగానని పేర్కొన్నారు. ఆయన రాసిన 'డ్రీమ్స్ ఇన్ ఎ టైమ్ ఆఫ్ వార్.. చైల్డ్‌హుడ్ మెమొరీస్' అనే పుస్తకాన్ని ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా తెలుగులో 'యుద్ధకాలంలో స్వప్నాలు - బాల్య జ్ఞాపకాలు'గా అనువదించారు. ఈ అనువాద పుస్తకాన్ని ఆదివారం రాత్రి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గూగీ వా థియోంగో ఆవిష్కరించారు. తన రచనకు దారితీసిన నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. వలస పాలకుల చెరలో చిక్కి కెన్యాలో తాను చవిచూసిన ఎన్నో అనుభవాలను వివరించారు. రోజూ వచ్చే కలలు ఎంతో నేర్పుతాయని తెలిపారు. తన కళ్ల ఎదుటే పోలీసులు తన చెవిటి అన్నయ్యను కాల్చిపారేసిన ఘటన ఎంతో కదలించిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ కెన్యా రచయిత గొప్పతనాన్ని వివరించారు. చదువుకునే సమయంలో రచయిత గూగీ సహ విద్యార్థిగా వున్న మహిళా అధ్యయనాల నిపుణులు సుజీతారు, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, సాహిత్య విమర్శకులు ఎ.కె.ప్రభాకర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వరవరరావు, శివారెడ్డి, రచయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ భూతానికి వాననీటి విరుగుడు

- **బోర్ల ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకించిన జేఎన్‌టీయూహెచ్**
- **సూర్యాపేట జిల్లాలో ప్రయోగం విజయవంతం**
- **పంచాయతీల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అమలుకు సర్కారు యోచన**

ఈనాడు - హైదరాబాద్

మనుషులను జీవచ్ఛవాలుగా మారుస్తున్న ఫ్లోరైడ్ పీడకు విరుగుడు దొరికింది. ఇంకుడు గుంతల్లో బోర్లు వేసి వాటి ద్వారా వాననీటిని భూగర్భంలోకి పంపించడంపై జేఎన్‌టీయూహెచ్ నీటి వనరుల విభాగం చేపట్టిన ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. రెండు గ్రామాల్లో ఫలితం కనిపించడంతో పాత నల్గొండ జిల్లాతోపాటు సమస్య ఉన్న ఇతర ప్రాంతాల్లో దీన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. తాగే నీటిలో అధికంగా ఫ్లోరైడ్ ఉంటే శరీరంలోని ఎముకలు పెళుసుబారతాయి. కాళ్లు, చేతులు వంకర్లు తిరుగుతాయి. దంత సమస్యలు తలెత్తుతాయి. చివరకు ఫ్లోరోసిస్ అనే వ్యాధి బారిన పడతారు. లీటరు నీటిలో 1.5 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువ ఫ్లోరైడ్ ఉండకూడదు. పూర్వ నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అది 8 మిల్లీ గ్రాముల వరకు ఉంది. దానివల్ల వేలాది మంది ఇప్పటికే ఫ్లోరోసిస్ బాధితులయ్యారు. సురక్షిత తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. అయితే ఫ్లోరైడ్ పంట ఉత్పత్తులు, పశువుల నుంచి వచ్చే పాల ద్వారా మన శరీరాల్లోకి చేరుతోంది. మరి ఈ సమస్యకు పరిష్కారం ఎలా?.. దీనిపై ఇప్పటికే జేఎన్‌టీయూహెచ్‌లోని నీటి వనరుల విభాగం సహ ఆచార్యుడు డాక్టర్ ఎంవీఎస్ఎస్ గిరిధర్ లోతైన పరిశోధన చేస్తున్నారు. రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి(టీఎస్‌కాస్ట్) ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం కోసం ప్రాజెక్టు చేపట్టాలని ఆయనను కోరింది. అందుకు ఆర్థిక సహకారం అందించింది.

భూగర్భంలోకి పంపేది ఇలా..

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి అందులో బోర్లు వేయడం ద్వారా హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూహెచ్ ప్రాంగణంలో ఏడాదికి 10 కోట్ల లీటర్ల వాననీటిని భూగర్భంలోకి పంపిస్తున్నారు. ఇంకుడుగుంతలోకి వేసే బోర్ల కేసింగ్‌కు రంధ్రాలు చేస్తారు. వాటి ద్వారా నీరు భూగర్భంలోకి వెళ్తుంది. ఈ ప్రయోగం ద్వారా ఫ్లోరైడ్ కూడా తగ్గించవచ్చని నీటి వనరుల కేంద్రం సహ ఆచార్యుడు గిరిధర్ నిరూపించారు. అధిక ఫ్లోరైడ్ ఉన్న సూర్యాపేటలోని మర్రిగూడ మండల కేంద్రంతో పాటు అదే మండలంలోని యరగండ్లపల్లిని ఆయన ఎంచుకున్నారు. దాదాపు 10 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో పడిన వాననీరు ఆ గ్రామాల్లోని పాఠశాలల్లోకి వస్తుంది. అందుకే ఒక్కో పాఠశాలలో ఒక్కో ఇంకుడుగుంత తవ్వించారు. 100, 200 అడుగుల లోతుతో ఒక్కో చోట రెండు బోర్లు వేశారు. ప్రాజెక్టు ప్రారంభానికి ముందు, తర్వాత ఫ్లోరైడ్ శాతాన్ని పరిశీలించగా భారీగా తేడా కనిపించింది. జేఎన్‌టీయూహెచ్ చేసిన ప్రయోగ ఫలితాలను సోమవారం ఆచార్య గిరిధర్ నుంచి తెలుసుకున్న అటవీశాఖ మంత్రి జోగు రామన్న, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్ సైతం దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం ద్వారా నేరుగా నిధులొస్తున్నాయి. వాటి ద్వారా దీన్ని అమలు చేయాలని భావిస్తున్నారు.



మర్రిగూడలో వాననీటిని ఇంకించే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న గిరిధర్

మర్రిగూడ, యరగండ్లపల్లిలో ఫ్లోరైడ్‌శాతంలో మార్పు ఇదీ.. (లీటర్ నీటిలో మిల్లీగ్రాములు)

స్థలం	2017 సెప్టెంబరుకు ముందు		2018 ఫిబ్రవరి 6 తర్వాత	
	మర్రిగూడ	యేరుగండ్లపల్లె	మర్రిగూడ	యేరుగండ్లపల్లె
100 అడుగుల బోరు	5.2	8.0	1.5	2.5
ఎగువ ప్రవాహంలో	6.3	6.2	1.6	6.2
దిగువ ప్రవాహంలో	4.7	5.1	2.4	2.4
200 అడుగుల బోరు	5.9	7.3	1.8	2.6

గ్రామస్థులూ గమనించారు



వాననీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా నీటిలో ఫ్లోరైడ్ శాతం భారీగా తగ్గింది. నీటిని సాధికారిక సంస్థలు పరీక్షించి తాజాగా నివేదికలు ఇచ్చాయి. మర్రిగూడ, యరగండ్లపల్లి గ్రామస్థులు సైతం నీటిలో వచ్చిన మార్పును గమనించారు. ప్రతి గ్రామంలో వాననీటిని ఇంకిస్తే ఫ్లోరైడ్ సమస్య లేకుండా చేయడంతోపాటు భూగర్భ జలం కూడా పెంచుకోవచ్చు.

– ఆచార్య గిరిధర్, నీటి వనరుల కేంద్రం, జేఎన్‌టీయూహెచ్

రక్తం చిందిన అడవి

చింతూరు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ మరోసారి రక్తసిక్తమైంది. పెద్దఎత్తున మావోయిస్టులు జవాన్లపై విరుచుకుపడి ఇద్దరు జవాన్ల ప్రాణాలను బలిగొన్నారు. ఆదివారం సుకుమా జిల్లాలో పోలీసులకు, మావోయిస్టులకు భీకర పోరు జరిగింది. రహదారిపనులు జరుగుతున్న ప్రాంతంలో మావోయిస్టులు మాటువేసి రోడ్డు నిర్మాణానికి భద్రతగా ఉన్న పోలీసులపై కాల్పులకు పాల్పడ్డారు. ఇద్దరు జవాన్లు మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వారిని రాయ్‌పూర్ ఆసుపత్రికి తరలించారు. 20 మంది మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు ప్రకటించారు.

300 మంది దాడి..12 వాహనాలకు నిప్పు: సుకుమా జిల్లాలోని బెజ్జి- చింతకుప్ప గ్రామానికి రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు ఎస్‌పీఎఫ్, డీఆర్జీ జవాన్లు రక్షణగా వ్యవహరిస్తున్నారు. మావోయిస్టులు అదునుచూసి పోలీసులను దెబ్బతీయాలనే లక్ష్యంతో ఒక్కసారిగా వారిపై విరుచుకుపడ్డారు. 300మందికిపైగా మావోయిస్టులు ఆ ప్రాంతానికి చేరుకుని పనులు చేస్తున్న 12 వాహనాలను దహనం చేశారు. అక్కడ పనులు చేయిస్తున్న గుమస్తాను హతమార్చారు. ఈ ఘటనలో మరో పౌరుడు మృత్యువాతపడినట్లు తెలుస్తోంది. దీనిని గమనించిన పోలీసులు కాల్పులకు దిగారు. అక్కడకూలీలు కొందరిని మావోయిస్టులు అపహరించుకుపోయినట్లు తెలిసింది.



మృతి చెందిన జవాన్లు, పౌరుడు

ఒక్క మృతదేహమే లభ్యం: ఎదురుకాల్పుల్లో 20 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు, పది మంది గాయపడినట్లు పోలీసులు ప్రకటించగా.. సంఘటనా స్థలంలో ఓ మావోయిస్టు మృతదేహం మాత్రమే లభ్యమైంది.

రూ.రెండు వేల నోట్లు రావేమీ..!

- **బ్యాంకుల్లో తగ్గుతున్న జమలు**

ఈనాడు, హైదరాబాద్: పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో చలామణిలోకి వచ్చిన రూ.రెండు వేల విలువైన నోట్లు రోజువారీ లావాదేవీల్లో భాగంగా బ్యాంకులకు దొరకడం గగనంగా మారింది. మూడు నెలలుగా ఈ నోట్లను జమచేసేవారి సంఖ్య సగానికి తగ్గిపోయింది. మరోవైపు బ్యాంకుల్లో మళ్లీ నగదు కొరత కనిపిస్తోంది. ఒక్క రోజు బ్యాంకులకు సెలవు వస్తే చాలు... ఏటీఎంలు పనిచేయడం మానేస్తున్నాయి. బ్యాంకుల్లో నగదు నిల్వలపై నిఘా పెరిగిన తరువాత, ఎఫ్ఆర్‌డీఐ బిల్లు వచ్చాక బ్యాంకుల నుంచి నగదు ఉపసంహరణలు పెరుగుతున్నాయి. ఎక్కువమంది స్థిరాస్థి వ్యాపారాల్లో పెట్టుబడిగా పెడుతున్నారు. రూ.2 వేల విలువైన నోట్లు బ్యాంకులకు రావడం లేదని, స్థిరాస్థి వ్యాపారంలోనే ఎక్కువగా ఉంటున్నాయని ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి కుమార్ తెలిపారు. ఇటీవల కొన్ని జాతీయ బ్యాంకుల లావాదేవీలు పరిశీలించినపుడు రోజువారీ వచ్చే డిపాజిట్లలో గతంలో రూ.10 లక్షల వరకు రూ.2 వేల విలువైన నోట్లుండేవి. ఇప్పుడు ఆ మొత్తం రూ.4-5 లక్షలకు పడిపోయినట్లు సమాచారం. బ్యాంకులకు అవసరమైన నగదు సర్దుబాటు చేసే విషయంలో రిజర్వుబ్యాంకు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. బ్యాంకుల రోజువారీ కార్యకలాపాలకూ నగదు కొరత ఉంటోంది. హైదరాబాద్‌లోని కొన్ని ప్రధాన ప్రాంతాల్లోని బ్యాంకుల్లోనూ ఇలాంటి పరిస్థితి ఉంది. ఇక జిల్లా, మండల, గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకుల్లో నేటికీ నగదు కొరత కనిపిస్తూనే ఉంది. కొన్ని బ్యాంకుల శాఖలో రోజువారీ ఉపసంహరణలు రూ.లక్షకు మించి ఇవ్వడం లేదు.

రూ.4000 కోట్ల బకాయిల వసూళ్లే లక్ష్యం

- **ప్రత్యేక ఆడిట్ విధానంతో ముందుకు..**
- **వాణిజ్య పన్నుల శాఖ కార్యాచరణ**

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రూ.4000 కోట్ల వాణిజ్య పన్నుల బకాయిల వసూళ్లే లక్ష్యంగా ఆ శాఖ ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. వ్యాట్ అమల్లో ఉన్నప్పటి నుంచి ఈ మొత్తం మొండి బకాయిలుగా మిగిలాయి. ఇందులో కొంత మొత్తం న్యాయ వివాదాల్లో ఉంది. ఈ నేపథ్యంలో న్యాయ వివాదాల్లో లేని బకాయిల వసూళ్లకు కసరత్తు చేస్తున్నారు. ప్రత్యేక ఆడిట్ విధానంతో పన్ను వసూళ్లకు నాంది పలుకున్నారు. ఆడిట్ చేసేందుకు వెళ్లే అధికారుల్లో కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ పన్ను బకాయిలపై దృష్టి సారించకపోవడం వంటి అంశాలు వెలుగు చూసిన నేపథ్యంలో వాణిజ్య పన్నుల శాఖ ప్రణాళికాబద్ధ పారదర్శక విధానానికి శ్రీకారం చుట్టింది. పన్ను చెల్లించాల్సిన వారిని రెండు కేటగిరీలుగా విభజించి వసూళ్లు చేయనున్నారు. బకాయిలు వసూలు కావడానికి అవకాశం ఉన్న వాటిని ఓ కేటగిరీగా.. మిగిలిన వాటిని మరో కేటగిరీగా విభజించనున్నారు. కోర్టు వివాదాలు లేకుండా తప్పనిసరిగా పన్ను వసూలుకు అవకాశం ఉన్న వాటిని సులభమైన పారదర్శక విధానం (స్టార్) కింద ఆడిట్ చేసి పన్ను వసూలు చేయనున్నారు. మిగతా డీలర్ల నుంచి సాధారణ తనిఖీల ద్వారా రాబడతారు. ఈ మేరకు వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన విధివిధానాలతో మార్గదర్శకాలు జారీ చేశారు.

12 అంశాల పరిశీలన

- ఆడిట్ చేసిన అధికారి.. నిర్దేశించిన 12 అంశాలను క్షుణ్నంగా పరిశీలించి నివేదికతోపాటు ప్రమాణ పత్రం విధిగా ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో ఆడిట్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశం ఉండదు.
- ఆడిట్‌లో లొసుగులు ఉంటే సంబంధిత అధికారే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- రాష్ట్రవ్యాప్తంగా ఆడిట్ చేసే 300 మంది అధికారుల్లో 'స్టార్' కింద ఆడిట్ చేసే వారిని ఎంపిక చేసుకున్నారు. జూన్ 15 లోపు ఒక్కో ఆడిట్ అధికారి 30 అంతకంటే ఎక్కువ సంస్థలను విధిగా ఆడిట్ చేయాల్సి ఉంటుంది.
- వ్యాట్ బకాయిదారులకు సంబంధించి తనిఖీ చేసే అంశాల్లో వే బిల్లులు, క్రయ, విక్రయాలకు సంబంధించిన బిల్లులు, నిర్వహించిన రికార్డులు, బ్యాంకు నిల్వలు సహా వివిధ అంశాలను క్షుణ్నంగా తనిఖీ చేస్తారు.
- స్టీలు డీలర్లు, నూనెవ్యాపారులు, రైస్ మిల్లులు, మార్బుల్ డీలర్ల రికార్డులను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు.
- అపార్ట్‌మెంట్లు, విల్లాలకు సంబంధించి అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించని స్థిరాస్తి వ్యాపారులకు నోటీసులు ఇచ్చి పన్ను వసూళ్లు చేయనున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు

సత్తెనపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సత్తెనపల్లి ఆర్టీసీ డిపో డ్రైవర్ బండారు శ్రీనివాసరావు బస్సు నడుపుతూ గుండెపోటుకు గురయ్యారు. బీపీ పెరిగి.. ఎడమ చేయి స్పర్శ కోల్పోయారు. నొప్పిని భరిస్తూనే ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చి ఆసుపత్రిలో చేరారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు శ్రీనివాసరావు మెట్రో సర్వీసులో ప్రయాణికులను ఎక్కించుకొని గుంటూరు నుంచి సత్తెనపల్లి బయలుదేరారు. మేడికొండూరు సమీపంలోని 14వ మైలు అడ్డరోడ్డు వద్దకు వచ్చేసరికి అస్వస్థతకు గురయ్యారు. విషయాన్ని ఎవరికి చెప్పకుండా బస్సును గమ్యస్థానానికి చేర్చారు. అక్కడ డ్రైవర్ పరిస్థితిని గమనించిన కండక్టర్, ప్రయాణికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జలమే హాలాహలం

- పశువులకూ పనికిరానంతగా విషతుల్యం
- ఆ నీళ్లు తాకినా చర్మవ్యాధులు
- పరిశ్రమల సమీప గ్రామాల్లో కాలుష్య భూతం
- కిలోమీటర్ల దూరంగా బోర్లు..పైపులైన్లతో నీటి సరఫరా

సుతారపు సోమశేఖర్
ఈనాడు - హైదరాబాద్

కిష్టాయిపల్లి.. సంగారెడ్డి జిల్లాలో జిన్నారం మండలంలో ఓ చిన్న గ్రామం. 200 ఇళ్లున్న ఈ ఊళ్లో బోర్లు, బోరింగుల్లో సరిపడా భూగర్భ జలాలున్నాయి. కానీ పారిశ్రామిక వ్యర్థాలు కలిసి అవి పనికిరాకుండా పోయాయి. స్నానం చేసేందుకు, బట్టలు ఉతికేందుకు కాదు కదా బహిర్భూమికి కూడా వాటిని వాడలేకపోతున్నామని గ్రామస్థులు వాపోయారు. ఆ నీళ్లను ముట్టుకున్నా చర్మవ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు కూడా ఆ నీటిని తాగలేకపోతున్నాయని చెప్పారు. అయితే ఉన్న ఊరిని వదల్లేక, విషపు నీటిని తాగలేక గ్రామానికి మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో బోర్లు వేసుకుని.. పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేసుకుంటున్నారు. పటాన్‌చెరు మండలం పాశమైలారంలోనూ ఇదే పరిస్థితి. సాధారణ అవసరాలకోసం ఊరికి మూడు కిమీ దూరంలో బోరు వేసుకున్నారు. తాగునీటి కోసం శుద్ధి చేసిన నీటిని తెప్పించుకుంటున్నారు.

హైదరాబాద్ చుట్టుపక్కల పారిశ్రామిక ప్రాంతాల సమీప గ్రామాల్లో ఇలాంటి దుస్థితే ఉంది. సాధారణ అవసరాలకు సైతం డబ్బు పెట్టి కొన్న నీటిని వాడుకోవాల్సి వస్తోంది. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఖాజీపల్లి, గడ్డపోతారం, చెట్లపోతారం, ఐడీఏ బొల్లారం, గుమ్మడిదల మండలం బొంతపల్లి, దోమడుగు.. పటాన్‌చెరు మండలం గండిగూడెం, సుల్తాన్‌పూర్, ఇస్నాపూర్... ఇలా అనేక గ్రామాల్లో కలుషిత నీటి ప్రభావం కారణంగా ఊరికి మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంగా బోర్లువేసుకుని.. అక్కడి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండలంలో ఎనిమిది గ్రామాల్లో భూగర్భజలాలు కలుషితమయ్యాయి. ఆరెగూడెనికి సర్వేల్ పరిధిలోని జాల వాగు, చిట్యాల మండలం ఏపూరులో రెండు బోర్లు వేసి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. కొయ్యల గూడెంలో చేనేత నూలుకు రంగులు అద్దుకోకపోవడానికి కలుషిత నీరే కారణమని కార్మికులు వాపోతున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలో పలు గ్రామాల్లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితి.

పరిశ్రమల పాపమే..

రసాయన, ఔషధ పరిశ్రమలు నిబంధనల మేరకు వ్యర్థాలను పూర్తి స్థాయిలో శుద్ధి చేసి ఆ తర్వాతే బయటికి వదలాలి. కానీ ఇవన్నీ నిబంధనల్లోనే పక్కాగా ఉంటాయి. ఖర్చు తగ్గించుకునేందుకు చాలా కంపెనీలు వ్యర్థాలను కొంతవరకే శుద్ధి చేయించి, మిగిలింది చెరువులు, కుంటల్లో కలిపేస్తున్నాయి. మరి కొన్ని కంపెనీలు అయితే బోర్లు వేసి హానికారక రసాయనాలను నేరుగా భూగర్భంలోకి పంపిస్తున్నాయి. ఫలితంగా ఆ చుట్టుపక్కల జలవనరులు కలుషితమైపోతున్నాయి. చెరువులు, కుంటల నీటినే కాదు.. బోర్లు, చేతిపంపుల నీటిని వాడలేక కొన్ని గ్రామాల్లో వాటిని పక్కన పెట్టేశారు. 'ఈనాడు' క్షేత్రస్థాయి పరిశీలనలో, నీటినమూనాల పరీక్షల్లో కాలుష్య తీవ్రత ఆందోళనకరంగా ఉన్నట్లు తేలింది. మనుషులకే కాదు చేపలు, మొక్కలకు కూడా ఈ నీరు ప్రమాదకరమేనని నిపుణులు సైతం చెబుతున్నారు.



చర్మవ్యాధులు, కీళ్లనొప్పులు వస్తున్నాయని చెబుతున్న పాశమైలారం మహిళలు

1వ నమూనా — పాశమైలారం చెరువు

పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీటితో తీవ్రంగా కలుషితమైన ఈ చెరువు నీళ్లు సహజమైన రంగును కోల్పోయాయి. భరించలేని దుర్వాసన వస్తున్నాయి. స్నానం చేయడానికి, బట్టలు ఉతకడానికే కాదు. ఈ నీళ్లు పోస్తే మొక్కలు కూడా బతికే పరిస్థితి లేదు. జంతువులకూ పనికిరావు. చేపలు ఈ నీటిలో బతకవు. ఈ నీటిని తాకితే చర్మవ్యాధుల ప్రమాదం ఉంది.

నెలకు రూ.వెయ్యి ఖర్చు

ఊళ్లో ఒకప్పుడు నీళ్లు మంచిగా ఉండేవి. కంపెనీలు వస్తున్నాయని మా భూములు తీసుకున్నారు. మా పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వలేదు. కూలీ పనులకు వెళుతున్నారు. కంపెనీల వల్ల నీళ్లు విషం అయ్యాయి. తాగేందుకు ఒక్కోటి 10 రూపాయల చొప్పున రోజుకు మూడు క్యాన్ల నీళ్లు కొంటున్నాం. నెలకు రూ.వెయ్యి ఖర్చవుతుంది. ఆ నీళ్లను కూడా పక్క ఊరి నుంచి తెచ్చుకోవాలి. ఏం చేస్తాం? మా ఖర్మ ఇలా అయ్యింది.

- బాలమ్మ, పాశమైలారం

నాలుగేళ్లుగా ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా



ఇక్కడి నీళ్లు తాగడానికి కాదు, స్నానం చేసేందుకు కూడా పనికిరావు. నీళ్లను ముట్టుకుంటే దురద. కంపెనీల వల్లే ఇట్లా మారాయి. దగ్గు, దమ్ము, కీళ్లనొప్పులు.. నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఎర్రగడ్డ ఛాతీ ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నా.

- మల్లయ్య, పాశమైలారం

ప్రయోగశాలలో నీటి నాణ్యత పరీక్ష ఫలితాలివీ

ప్రమాణం	సాధారణ పరిమితి (లీటర్‌కు)	పాశమైలారం చెరువు	పాశమైలారం బోరుబావి	కిష్టాయిపల్లి నీళ్లట్యాంకు	ఆసానికుంట	ఆరెగూడెం బోరుబావి
టీడీఎస్	500-2,000 మి.గ్రా	7,680	1,880	2,050	4,300	1,668
పీహెచ్	6.5 - 8.5	7.9	7.1	7.4	7.3	7.9
నీటి రంగు	5-15 హజన్ యూనిట్లు	80	రంగు లేదు	100	80	0
టర్బిడిటీ	1-5 మి.గ్రా	110.5	-	9.6	80.5	0
నీటి కాఠిన్యత	200-600 మి.గ్రా.	4000	1,113	1,904	2,892.8	768.4
ఎలక్ట్రిక్ కండక్టవిటీ	2,000	16,980	3,520	2,050	9,450	2,580

3వ నమూనా — ఆసానికుంట, బొల్లారం

పారిశ్రామిక రసాయనాలు, వ్యర్థాల కారణంగా ఆసానికుంట తీవ్ర కాలుష్యం బారినపడింది. నీరు ముదురు ఆకుపచ్చ రంగులోకి మారి దుర్వాసన వస్తోంది. ఎలక్ట్రిక్ కండక్టవిటీ సీపీసీబీ ఉండాల్సిన దానికన్నా ఐదు రెట్లు అధికంగా ఉంది. ఈ నీటిని తాకితే చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఒకవేళ తాగితే వాంతులు, విరేచనాలకు దారితీస్తాయి. ఈ నీళ్లు మొక్కలకు పనికిరావు. చేపలు బతకవు.

4వ నమూనా — పాశమైలారం మంచినీటి ట్యాంక్

నీళ్ల నుంచి రసాయన వాసనలు వాస్తున్నాయి. రసాయనాలతో పాటు మురుగునీరు కలిసింది. ఈ నీటిలో కాల్షియం, అమ్మోనియా, నైట్రేట్లు అధికంగా ఉన్నాయి. ఎలక్ట్రిక్ కండక్టివిటీ సీపీసీబీ గరిష్ఠ పరిమితి కంటే 75 శాతం అధికంగా ఉంది. తాగేందుకు కాదు కదా స్నానం చేసేందుకు కూడా సురక్షితమైనవి కాదు. ఈ నీటితో ఉతికితే దుస్తుల రంగు వెలిసిపోతుంది. వాషింగ్‌మెషిన్లు పాడైపోతాయి. తాకితే చర్మవ్యాధులు వచ్చే ప్రమాదముంది.



రంగు మారిన నీటిని చూపిస్తున్న కిష్టాయిపల్లి గ్రామస్థుడు

2వ నమూనా — కిష్టాయిపల్లి వ్యవసాయ బోరు

నీళ్ల నుంచి రసాయనాల వాసన వస్తోంది. పరిమితి దాటి నీరు పసుపు రంగులోకి మారింది. ఎలక్ట్రిక్ కండక్టవిటీ పరిమితి దాటిపోయింది. పారిశ్రామిక వ్యర్థాలతో భూగర్భజలాలు కలుషితమయ్యాయి. నీళ్లలో టీడీఎస్, కాల్షియం, మెగ్నీషియం పరిమితికి మించి అధికంగా ఉన్నాయి. సాగుకు ఈ నీళ్లు పనికిరావు. భూమిలో సోడియం, పొటాషియం, ఫాస్ఫరస్ తగ్గి నారు పెరగదు. దిగుబడి సరిగా రాదు. నీటిలో కాల్షియం అధికంగా ఉంది. గరిష్ఠ పరిమితి అయితే 473గా నమోదైంది.



కాలుష్యం కారణంగా నల్లగా మారిన కిష్టాయిపల్లి చెరువు

5వ నమూనా — ఆరెగూడెంలో బోరుబావి

నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉంది. ఈ నీటిని పరిమితకాలం తాగితే ఇబ్బంది ఉండకపోవచ్చు. దీర్ఘకాలం ఉపయోగించడం శ్రేయస్కరం కాదని, దంత సమస్యలు వస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

మందులు వాడకపోతే దురద



కలుషిత నీటితో చర్మవ్యాధుల బారినపడ్డాం. హైదరాబాద్‌లో చర్మవ్యాధి నిపుణుడికి చూపించుకున్నా. రూ. ఐదు వేలు ఖర్చయ్యింది. మందులు వేసుకోవడం ఆపితే మళ్లీ దురద వస్తుంది. ఊరిలోని చిన్నా పిల్లాడి నుంచి ముసలివారి వరకు అందరికీ దురదలే. కొందరికి చర్మంపై ఎర్ర దుద్దుర్లు వస్తున్నాయి. పిల్లలను బడికి పంపితే పక్కవారికి వ్యాపిస్తుందని ఉపాధ్యాయులు రానివ్వడం లేదు.

- పిసాటి శ్రీకాంత్, ఆరెగూడెం

హరిత న్యాయస్థానం ఆదేశించినా...



పరిశ్రమల రసాయనాలతో నీరు విపరీతంగా కలుషితమైపోయింది. వాడుకు నీటికీ సమస్యగా మారింది. హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించగా రోజుకు 1.20 లక్షల లీటర్ల మంజీరా నీళ్లు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖను ఆదేశించింది. రెండు రోజులకోసారి 60వేల లీటర్ల నీరే సరఫరా అవుతుంది. దీంతో గ్రామానికి కిలోమీటర్ దూరంలో పైప్‌లైన్ వేసి సాధారణ వాడకానికి నీళ్లు అందిస్తున్నారు.

- ఆకుల నవీన్, ఖాజీపల్లి

బహిర్భూమికి కూడా పనికిరావు

మా గ్రామంలో, చుట్టుపక్కల ఊర్లలో భూగర్భజలాలకు ఢోకా లేదు. కానీ ఆ నీళ్లు స్నానానికి కూడా పనికిరావు. పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన వ్యర్థాలే కారణం. ఈ నీళ్లను బహిర్భూమికి వెళ్లినప్పుడు వినియోగించడానికి కూడా భయపడుతున్నాం.

- బి.లక్ష్మయ్య, కిష్టాయిపల్లి

పశువులు కూడా తాగట్లేదు

బోర్లు, బోరింగుల్లోని నీళ్లు వాడితే కురుపులు, దురద వంటి ఆరోగ్యసమస్యలు వస్తున్నాయి. బట్టలు కూడా ఆ నీళ్లతో ఉతకలేకపోతున్నాం. పశువులు కూడా ఈ నీళ్లను తాగట్లేదు. ఊర్లో మూడొంతులకుపైగా ఈ నీళ్ల కారణంగా ఆరోగ్యసమస్యలు ఎదుర్కొన్నవారే. ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో బోరేసి పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా అవుతోంది. వాటిని శుద్ధి చేసి తాగుతున్నాం. రోజు రెండు క్యాన్లు నీళ్లు కొంటున్నాం.

- ఆగమయ్య, రైతు

ప్రజారోగ్యంపై పంజా



ఆరెగూడెంలో విశ్వతేజారెడ్డి అనే పిల్లాడికి వీపుపై వచ్చిన ఎర్రని దుద్దుర్లు

పరిశ్రమలకాలుష్యం ప్రజల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతోంది. "కొన్ని కంపెనీలు భూగర్భంలోకి రసాయనాల్ని వదులుతున్నాయి. బోర్లలో నీళ్లు రంగుమారి వస్తున్నాయి. వాటిని వాడితే చర్మ, శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి'అని పటాన్‌చెరుకు చెందిన రాజశేఖర్ చెప్పారు. 'మా గ్రామంలో 90 శాతం మంది నీళ్ల కారణంగా జబ్బుపడ్డ వాళ్లే. మహిళల్లో గర్భవిచ్ఛిత్తి జరిగిన ఘటనలూ ఉన్నాయి' అని పాశమైలారానికి చెందిన కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

జీర్ణకోశ జబ్బులు, క్యాన్సర్లు పెరుగుతున్నాయ్

పరిశ్రమల నుంచి వెలువడే రసాయనాలు ముఖ్యంగా సెలేనియం, కాడ్మియం, యురేనియం కారణంగా జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్ వంటి జబ్బులకు దారితీస్తున్నాయి. ఉత్తరాదినఉన్న ఈ సమస్య దక్షిణాది రాష్ట్రాలకు విస్తరిస్తోంది. ఈ కలుషిత నీటితో పండించిన వరి, ఆకుకూరల్ని తినడం వల్ల రక్తం ద్వారా కాలేయంలోకి వెళ్లి జీర్ణకోశ జబ్బులు వస్తున్నాయి. నీళ్ల విరేచనాలు, పిత్తాశయంలో రాళ్లు రావడం, క్యాన్సర్‌గా మారడం, పిల్లల్లో బుద్ధి మాంద్యం, మూత్రపిండాల సమస్య వంటివి తలెత్తే ప్రమాదం ఉంది.

- డాక్టర్ బీరప్ప, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, నిమ్స్

విభజన చట్టం అమలుపై హోంశాఖ భేటీ 23కి వాయిదా

ఈనాడు, దిల్లీ: విభజన చట్టం అమలుపై ఈనెల 21న హోంశాఖ కార్యదర్శి తలపెట్టిన సమీక్ష సమావేశం 23వ తేదీకి వాయిదాపడింది. ఆరోజు తెలంగాణకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వస్తున్నందున సమావేశాన్ని వాయిదా వేయాలని ఆ రాష్ట్ర అధికారులు కోరడంతో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ సమావేశానికి రావాలని కేంద్ర హోంశాఖ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విభజన వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న అధికారులకు ఇప్పటికే ఆహ్వానం పంపింది. విభజన చట్టం కింద అమలు చేయాల్సిన అంశాలు ఏపీలోనే అధికంగా ఉండటంతో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, విభజన వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రేమచంద్రారెడ్డి, ప్రణాళికామండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావుతోపాటు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, ఇంధన, మౌలిక వసతుల శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, రహదారులు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, పరిశ్రమలశాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్‌లనూ పంపుతోంది. రాష్ట్రంలో జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు నిదానంగా సాగుతుండటం, దుగరాజపట్నం నౌకాశ్రయానికి ప్రత్యామ్నాయ స్థలం కావాలని కేంద్రం చెబుతుండటం, ఉక్కుపరిశ్రమ ఏర్పాటు, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మాణంలాంటి అంశాలు చర్చించే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా శాఖల అధికారులను ఈ సమావేశానికి పంపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. తెలంగాణ నుంచి ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, విభజన వ్యవహారాల ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు హాజరుకానున్నట్లు సమాచారం.

మూడెకరాలు ఉన్నవారికే రిజర్వేషనా?

- అంత భూమి ఉన్న రైతుల పిల్లలకే 40% సీట్లు
- వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీల్లో నిబంధన
- 65% రైతు కుటుంబాలకు నష్టమే
- ఎకరానికి తగ్గించే యోచనలో వ్యవసాయశాఖ

ఈనాడు - హైదరాబాద్

వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీ సీట్ల భర్తీకి అమలు చేస్తున్న రిజర్వేషన్ విధానాన్ని మార్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. ఈ విధానంలో లోసుగులతో అత్యధిక శాతం రైతుల పిల్లలకు అన్యాయం జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ మూడు డిగ్రీ కోర్సుల సీట్లలో 40 శాతాన్ని 'రైతు కోటా' పేరుతో రిజర్వు చేశారు. ఈ కోటాలో సీటు పొందాలంటే విద్యార్థి తండ్రి పేరున మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉండాలి. అంతభూమి ఉన్నట్లు చూపే పాసుపుస్తకం నకలు (జిరాక్స్ కాపీ)పై ఆ మండల తహసీల్దార్ ధ్రువీకరిస్తూ సంతకం చేయాలి. ఆ నకళ్లను విద్యార్థి దరఖాస్తుతో జత చేస్తేనే రైతు కోటా రిజర్వేషన్ ప్రకారం సీటు ఇస్తారు. కానీ ఇటీవల రెవెన్యూ శాఖ దస్త్రాల పరిశీలనలో అత్యధిక మంది రైతులకు మూడెకరాల సొంత భూమి లేదని గుర్తించారు. 2010-11 లెక్కల ప్రకారమే తెలంగాణలోని మొత్తం 55.53 లక్షల కమతాల్లో 61.96 శాతం. హెక్టారు (2.47 ఎకరాల)లోపే ఉన్నట్లు గుర్తించారు. ఈ లెక్కన వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీ సీట్ల రిజర్వుడు సీట్లు 65 శాతం రైతు కుటుంబాలకు అందడం లేదు. సొంత భూములున్న వారిలోనూ కొందరికి వివిధ కారణాలతో పట్టాదారు పాసుపుస్తకాలు లేవు. విద్యార్థి తాత లేదా నాయనమ్మ, అమ్మమ్మ వంటి వారి పేరుతో పాసుపుస్తకాలున్నా పరిగణనలోకి తీసుకోవడం లేదు. పలు కుటుంబాల్లో వారసత్వ భూములకు పాసుపుస్తకాలు తీసుకోలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు సొంత భూములుండీ సేద్యం చేస్తున్నా ఈ కోటాకు దూరమవుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు కమతాలు పెద్దగా ఉండేవని ఈ రిజర్వేషన్ విధానాన్ని కనిష్ఠంగా మూడెకరాల పరిమితితో నిర్ణయించారు. కానీ జనాభా పెరిగి, కమతాలు తగ్గినా దానినే కొనసాగిస్తున్నారు.

జయశంకర్ వర్శిటీకి ఆదేశాలు

అధిక భూములున్న కొద్ది మంది రైతుల పిల్లలకే రిజర్వుడు కోటా సీట్లన్నీ ఇవ్వడం తగదని, ఈ పరిమితిని ఎకరానికి తగ్గించాలని తెలంగాణ పశువైద్య పట్టభద్రుల సంఘం, వ్యవసాయ విద్యార్థులు వ్యవసాయ శాఖకు విన్నవించారు. ఈ నేపథ్యంలో మూడెకరాల పరిమితి వల్ల ఎన్ని రైతు కుటుంబాలకు రిజర్వేషన్ అందుతోంది, ఎకరానికి తగ్గిస్తే ఎందరికి అందుతుందో నివేదిక పంపాలని ఈ మూడు డిగ్రీల ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయాన్ని కోరినట్లు వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి 'ఈనాడు'కు చెప్పారు. ఎక్కువ మంది రైతుల పిల్లలకు ఇది అందకపోవడం వాస్తవమేనన్నారు. ఈ రిజర్వేషన్ ఎప్పటి నుంచి అమలవుతోంది, ఏ ఏ అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రారంభించారనే వివరాలను జయశంకర్ వర్శిటీ పరిశీలిస్తోంది. రాష్ట్రంలో సగానికి భూములను సాగు చేస్తున్న కౌలు రైతుల పిల్లలకు.. ఎకరా, రెండెకరాల రైతుల పిల్లలకు ఈ రిజర్వేషన్ వర్తింపజేయకపోవడం దారుణమని పశువైద్య పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటం శ్రీధర్ అన్నారు.

రేపటినుంచి హైదరాబాద్‌లో ఎస్సీ కమిషన్ పర్యటన

ఈనాడు, హైదరాబాద్: జాతీయ ఎస్సీ కమిషన్ మంగళ, బుధవారాల్లో హైదరాబాద్‌లో పర్యటించనుంది. కమిషన్ ఛైర్మన్ ఆచార్య రామ్‌శంకర్ కథేరియా నేతృత్వంలో కమిషన్ ఉపాధ్యక్షుడు ఎల్.మురుగన్, సభ్యులు స్వరాజ్ విద్వాన్, కె.రాములు, యోగేంద్ర పాశ్వాన్‌తోపాటు కమిషన్ సంయుక్త కార్యదర్శి స్మితా ఎస్.చౌధురి పర్యటనలో ఉంటారు. ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో ఎస్సీ ప్రజాప్రతినిధులు, ఎస్సీ సంఘాలతో కమిషన్ సమావేశమవుతుంది. 21న ఉదయం ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి జగదీశ్వర్‌తో కలిసి ఎస్సీ సంక్షేమ పథకాలను సమీక్షిస్తుంది. వేధింపుల నిరోధక చట్టం కింద నమోదైన కేసులు, విచారణపై మధ్యాహ్నం 2 గంటలకు పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తుంది.

మార్చి 10న కోదండరాం పార్టీ ఆవిర్భావం!

తెఐకాస సారథ్య సంఘం సమావేశంలో నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఐకాస ఛైర్మన్ కోదండరాం ఏర్పాటు చేయనున్న రాజకీయ పార్టీ మార్చి 10వ తేదీన ఆవిర్భవించే అవకాశం ఉంది. తెలంగాణ సాధనలో కీలకమలుపుగా నిలిచిన మిలియన్‌మార్చ్ మార్చి పదో తేదీనే నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇదే రోజున తాను స్థాపించదలచుకున్న కొత్త పార్టీ పేరును కోదండరాం ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆదివారం హైదరాబాద్‌లోని ఐకాస కార్యాలయంలో కోదండరాం నేతృత్వంలో ఐకాససారథ్య సంఘం(స్టీరింగ్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి అనేక అంశాలను చర్చించారు. ముఖ్యంగా కోదండరాం స్థాపించదలచిన పార్టీపైనే ఎక్కువగా చర్చించారు. పార్టీ ఆవిర్భావం చరిత్రాత్మక మిలియన్‌మార్చ్ నిర్వహించిన రోజయితే బావుంటుందని సమావేశం అభిప్రాయపడింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లానుంచి కనీసం 10నుంచి 15వేల మందిని సమీకరించి హైదరాబాద్ తరలించాలని పలువురు సూచించారు. ఇందుకోసం ప్రతిజిల్లానుంచి ఒక కన్వీనర్‌ను ఎంపిక చేయాలని నిర్ణయించారు. రాజకీయ సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించడంపై కొంత భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సభ నిర్వహించాలనుకుంటే వరంగల్‌లో బావుంటుందనే సూచన వచ్చింది. జన సమీకరణతో సరిపెట్టాలా?, రాజకీయ సభ ఏర్పాటు చేయాలా? అన్నది నిర్ణయించుకున్న తర్వాత వేదిక ఖరారు చేయనున్నారు. కాగా మార్చి 10న పార్టీకి సంబంధించి కీలక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. కోదండరాం త్వరలో అమెరికా వెళ్లనున్నారు. నెలాఖరులో ఆయన తిరిగి వచ్చిన తర్వాత దీనిపై పూర్తిస్థాయి కార్యాచరణ ప్రకటించవచ్చని భావిస్తున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య గురించి ముఖ్యమంత్రికి లేఖలు రాయాలని, రైతాంగ సమస్యలపై సదస్సులు నిర్వహించాలని సారథ్య సంఘం నిర్ణయించింది.

ప్రపంచ తెలుగు మహాసభల తీర్మానాలను ప్రకటించాలి



మాట్లాడుతున్న ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని తెలుగు భాషాబివృద్ధి కోసం జనవరిలోగా తీర్మానాలు చేయనున్నట్లు సర్కారు పేర్కొంది. అయితే, ఇప్పటివరకూ తీర్మానాలను ప్రకటించలేదు. వీటిని త్వరగా ప్రకటించి, అమలు చేయాలని, తెలుగు భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కవి, రచయిత, పరిశోధకుడు, ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో 'చాటింపు' (ప్రత్యామ్నాయ భావ ప్రకటన ఐక్య వేదిక) ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1 నుంచి 12వ తరగతి వరకు తెలుగును తప్పనిసరి చేయాలన్నారు. తెలుగు భాషలోనే పరిపాలన కొనసాగించాలన్నారు. ఆదివాసీల మూలం ద్రవిడ భాష అయినా వారి నుంచి తెలుగు పదాలను సేకరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని కులాల్లోని వంద ఉపకులాల నుంచి కూడా తెలుగు పదాలను సేకరిస్తున్నట్లు వివరించారు. మేడారం సమ్మక్క, సారలమ్మ చరిత్రపై అధికారికంగా పరిశోధనలు చేయాలని కోరారు. తెలంగాణ భాషా విశిష్ట కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యునెస్కో ఇచ్చిన భాషా పరిరక్షణ పిలుపులో భాగంగా ఫిబ్రవరి 21 ని తెలంగాణ తెలుగు భాషాదినంగా నిర్వహించాలన్నారు. చాటింపు కన్వీనర్ వినాయక్‌రెడ్డి, రచయితలు భూపతి వెంకటేశ్వర్లు, పొట్లపల్లి వరప్రసాద్‌రావు మాట్లాడారు.

ప్రభుత్వాల చిత్తశుద్ధితోనే తెలుగు అమలు సాధ్యం

- ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు

ఈనాడు డిజిటల్, విజయవాడ: ప్రజాస్వామ్యంలో ఉండే శాసన, న్యాయ, పరిపాలన వ్యవస్థలు మూడింటిలోనూ తెలుగు భాష అమలు జరగాలని, మిగతా రెండింటిలో మార్పు రాకుండా కేవలం న్యాయవ్యవస్థలో రావాలనుకోవడం సరికాదని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) సమావేశ మందిరంలో 'న్యాయస్థానాల్లో తెలుగు వినియోగం కోసం ఉద్యమ సమాలోచన' పేరుతో ఆదివారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ రామలింగేశ్వరావు మాట్లాడుతూ.. న్యాయస్థానాల్లో ప్రజలకు అర్థమయ్యేలా తెలుగులోనే తీర్పులను, వాటి ప్రతులను ఇవ్వాలంటే ఉద్యమాలు చేస్తే కాదని, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో దృష్టి పెడితేనే సాధ్యమవుతుందని అన్నారు. న్యాయవ్యవస్థ తీర్పుల విషయంలో మాత్రమే స్వతంత్రంగా వ్యవహరిస్తుందని, న్యాయ పరిపాలనకు అవసరమైన నిధులు మొత్తం ప్రభుత్వమే ఇస్తుందన్నారు. తర్జుమా, డీటీపీ, న్యాయపరిపాలనలో పదకోశం వంటివి లేకపోతే తెలుగులో తీర్పులు చెప్పడం కష్టమని జస్టిస్ రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. న్యాయ విద్య చదివే విద్యార్థులు, కిందస్థాయి న్యాయవాదులు, ఉద్యోగులకు సైతం తెలుగుపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఉద్యోగ నియామకాల్లోనూ ప్రాంతీయ భాషకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. విశ్రాంత జిల్లా న్యాయమూర్తి, తెలంగాణ సర్వీస్ కమిషన్ సభ్యుడు మంగారి రాజేందర్ మాట్లాడుతూ.. చట్టాలు వ్యక్తుల వెంట ఉన్నా. అవి ఆంగ్ల భాషలో ఉండడంతో ప్రజలకు దూరంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు సామల రమేష్‌బాబు, తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షుడు బి.హనుమారెడ్డి, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.లక్ష్మణరావు, బెజవాడ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, అఖిలభారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు. వేదికపై కుడివైపు నుంచి ఎడమవైపు ఉన్నవారు వరుసగా.. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షుడు బి హనుమారెడ్డి, విశ్రాంత జిల్లా న్యాయాధికారి మంగారి రాజేందర్, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు సామల రమేష్‌బాబు, మచిలీపట్నం జిల్లా న్యాయాధికారి వై.లక్ష్మణరావు, బెజయవాడ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్

ఆధ్యాత్మిక పర్యాటకానికి 'వజ్ర' బస్సులు

తొలుత శ్రీశైలం.. ఆపై మిగతా పుణ్యక్షేత్రాలకు

టీఎస్‌ఆర్టీసీ సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ సేవలను విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది. నగరంలో సిటీ బస్సులు తిప్పడంతోనే సరిపెట్టకుండా జిల్లాల, అంతర్రాష్ట్ర సర్వీసులను నడుపుతోంది. ఇలా ఇప్పుడు ఆధ్యాత్మిక యాత్రలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే మినీ బస్సులను సమకూర్చుకుంటోంది. ఇప్పటికే వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, గోదావరిఖనిలకు మినీ 'వజ్ర' బస్సులను నడుపుతున్న టీఎస్‌ఆర్టీసీ వాటిని వివిధ పుణ్యక్షేత్రాలకు నడిపేందుకు చర్యలు తీసుకుంటోంది. కాలనీల నుంచే ఈ బస్సులను నడిపేలా ప్రణాళికలు రచిస్తున్నారు. నగరం నుంచి ముందుగా శ్రీశైలంలో ఉన్న మల్లన్న గుడికి ఆర్టీసీ 'వజ్ర' మినీ బస్సులను తిప్పాలని నిర్ణయించింది. శ్రీశైలం వైపు ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక ప్రదేశాలు ఎక్కువగా ఉండడంతో ఈ బస్సులను అటువైపు నడిపితే ప్రయోజనకరంగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి సోమవారం ముందు రోజు ఈ మార్గంలో రద్దీ బాగుంటుంది. మిగతా రోజుల్లో ఒక్కోసారి పెద్ద బస్సులు నిండని పరిస్థితి ఎదురవుతోంది. అలాగే ఈ మార్గంలో ఏసీ బస్సులు కూడా లేవు. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఏసీ మినీ బస్సులయితే ఉభయతారకంగా ఉంటుందని ఆర్టీసీ భావిస్తోంది. శ్రీశైలానికి బస్సులు నడిపిన తర్వాత.. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన యాదాద్రి, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు ఆంజనేయస్వామి, బాసర, భద్రాచలంలకు ఆధ్యాత్మిక యాత్రలను టీఎస్‌ఆర్టీసీ చేపట్టనుంది. ఇందుకోసం దాదాపు 50 బస్సుల వరకూ సిద్ధం చేస్తోంది. ఎవరైనా కుటుంబసభ్యులు కలిసి వెళ్లాలనుకుంటే అద్దెకు కూడా ఈ బస్సులను సమకూర్చుతారు. అలాగే ఆలయాలను కలుపుతూ నిర్వహించే పర్యాటక యాత్రలకు వినియోగిస్తారు. ఇలా ఒకటి రెండు రోజుల పాటు సాగే యాత్రలకు ఈ బస్సులను వినియోగించుకోవాలని టీఎస్‌ఆర్టీసీ చూస్తోంది. ఛార్జీలు ఎంత వసూలు చేయాలనేది ఇంకా నిర్ణయించాల్సి ఉంది. ఇప్పటికే వివిధ జిల్లాలకు నగరంలోని ప్రధాన కాలనీలను కలుపుతూ బస్సులను నడుపుతోంది. ఆన్‌లైన్లో సేవలందిస్తోంది. ముందుగానే రిజర్వేషన్ చేసుకుని.. ఆ బస్సు ఎక్కడుందో తెలుసుకునే వ్యవస్థ ఉంది. కొద్ది రోజుల్లో ఈ సేవలు ప్రారంభించనున్నట్లు టీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులు చెప్పారు.

చాంపియన్స్

203
భారత్ స్కోరు. దక్షిణాఫ్రికాలో ఇదే భారత్‌కు అత్యుత్తమం.

సూపర్ ఫామ్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంటే.. ఉత్సాహం ఉరకలేస్తుంటే.. ఫార్మాట్ ఏదైనా ఒక్కటే. టీమ్ ఇండియాది అదే దూకుడు. ఫటాఫట్ క్రికెట్లోనూ అదే పట్టు. జోరుమీదున్న కోహ్లీసేన, ఆల్‌రౌండ్ ఆధిపత్యంతో టీ20 సిరీస్‌లో ఘనంగా బోణీ కొట్టింది. శిఖర్ ధావన్ ధనాధన్ ఆటకు భువనేశ్వర్ సంచలన బౌలింగ్ తోడైన వేళ.. భారత్ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికాను మట్టికరిపించింది. భువి టీ20 క్రికెట్లో తొలి సారి ఐదు వికెట్ల ఘనత సాధించడం విశేషం.

ధావన్ దంచగా.. భువి కూల్చగా..

తొలి టీ20లో దక్షిణాఫ్రికాపై భారత్ విజయం



"భారత్ బ్యాటింగ్ చేస్తున్నపుడు పిచ్‌ను పరిశీలించి, ప్రత్యర్థి జట్టు బౌలింగ్‌ను గమనించి మా బౌలింగ్ ప్రణాళికలు రచించుకున్నాం. సరైన ప్రదేశాల్లో బంతిని వేయాలనుకున్నా. దాని ఫలితమే ఈ ప్రదర్శన. బౌలర్లకు ఇబ్బందిగా ఉండే ఆరంభ, చివరి ఓవర్లలో బంతులేయడాన్ని ఆస్వాదిస్తా. ఈ రోజుల్లో వికెట్లు తీయడానికి కొత్త అస్త్రాలు ప్రయత్నించాలి. నేను ఏడాదిగా 'నకుల్' బంతి మీద కసరత్తు చేస్తున్నా. అది ఈ రోజు కూడా ప్రయోగించా"
– భువనేశ్వర్

"బ్యాట్స్‌మెన్ సమష్టిగా ఆడి మంచి స్కోరు చేశారు. భువి తన అనుభవాన్ని రంగరించి బౌలింగ్ చేశాడు. ఇది జట్టు సమష్టి కృషికి దక్కిన విజయం. టీ20ల్లో ఇలాంటి ప్రదర్శన చేయాలని చాన్నాళ్లుగా అనుకుంటున్నాం. సమతూకంతో కూడిన ప్రదర్శనల్లో ఇదొకటి"
– కోహ్లి

జొహానెస్‌బర్గ్

తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించిన భారత జట్టు ఆదివారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో 28 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. శిఖర్ ధావన్ (72; 39 బంతుల్లో 10×4, 2×6) విధ్వంసక బ్యాటింగ్‌తో మొదట భారత్ 5 వికెట్లకు 203 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' భువనేశ్వర్ కుమార్ (5/24) అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టడంతో ఛేదనలో దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 175 పరుగులు మాత్రమే చేయగలిగింది. హెండ్రిక్స్ (70; 50 బంతుల్లో 8×4, 1×6), బెహార్డీన్ (39; 27 బంతుల్లో 3×4, 2×6) రాణించారు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సంపాదించింది. రెండో మ్యాచ్ బుధవారం జరుగుతుంది.

అదరహో భువి: అనుభవజ్ఞులైన బ్యాట్స్‌మెన్ లేనప్పటికీ ఛేదనలో దక్షిణాఫ్రికా కొన్ని అవకాశాలు సృష్టించుకుంది. కానీ చివరికి భారత బౌలర్లదే పైచేయి అయింది. ఛేదనను ధాటిగా ఆరంభించిన దక్షిణాఫ్రికా.. 2.4 ఓవర్లలోనే 29 పరుగులు రాబట్టింది. కానీ ఆ జట్టు ముచ్చట కాసేపే. భువనేశ్వర్ విజృంభించడంతో ఆ జట్టు 48/3కు చేరుకుంది. భువి.. వరుస ఓవర్లలో ఓపెనర్ స్మట్స్ (14), డుమిని (3)లను ఔట్ చేసి దక్షిణాఫ్రికాను దెబ్బతీశాడు. స్లో బంతులతో వాళ్లను బోల్తా కొట్టించాడు. మిల్లర్ (9)ను పాండ్య ఔట్ చేశాడు. ఐతే చక్కగా ఆడుతున్న మరో ఓపెనర్ హెండ్రిక్స్‌కు బెహార్డీన్ తోడు కావడంతో ఆతిథ్య జట్టు కోలుకుంది. 14 ఓవర్లలో 121/3తో రేసులో నిలిచింది. సాధించాల్సిన రన్‌రేట్ ఎక్కువగానే ఉన్నప్పటికీ క్రీజులో నిలదొక్కుకున్న బ్యాట్స్‌మెన్ ఉండడం, చేతిలో వికెట్లు ఉండడంతో దక్షిణాఫ్రికా మంచి ఆశలతోనే ఉంది. ఐతే బెహార్డీన్‌ను చాహల్ ఔట్ చేయడంతో 81 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఐతే హెండ్రిక్స్ జోరు కొనసాగించడం, క్లాసన్ (16) దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించడంతో 17 ఓవర్లకు దక్షిణాఫ్రికా 154/4తో నిలిచింది. గెలవాలంటే 18 బంతుల్లో 50 పరుగులు అవసరం. ఆతిథ్య జట్టు ఆశలు సజీవమే. కానీ భువనేశ్వర్ అద్భుత బౌలింగ్‌తో ఆ జట్టు ఆశలపై నీళ్లు చల్లాడు. ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి భారత్ విజయాన్ని ఖాయం చేశాడు.

ధన్‌ధనా ధావన్: భారత్ ఇన్నింగ్స్‌లో ధావన్ ధనాధన్ ఆటే హైలైట్. అలవోకగా బ్యాటింగ్ చేస్తూ.. కళ్లు చెదిరే షాట్లు ఆడిన అతడు జట్టు స్కోరు 200 దాటడంలో కీలక పాత్ర పోషించాడు. నిజానికి భారత్ ఇంకా ఎక్కువ స్కోరే చేయాల్సింది. కానీ దక్షిణాఫ్రికా బౌలర్లు పుంజుకుని పరుగుల ప్రవాహాన్ని కాస్త అడ్డుకున్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ విధ్వంసంతో ఇన్నింగ్స్ ఆరంభించింది. కానీ రెండో ఓవర్లోనే తొలి వికెట్‌ను చేజార్చుకుంది. రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లతో భీకరంగా కనిపించిన రోహిత్ శర్మ (21; 9 బంతుల్లో 2×4, 2×6) డాలా బంతిని థర్డ్‌మన్ మీదుగా కట్‌చేయబోయి వికెట్‌కీపర్‌కు చిక్కాడు. కానీ ధావన్ మాత్రం దక్షిణాఫ్రికా బౌలర్లను ప్రశాంతంగా ఉండనివ్వలేదు. వీర ఉతుకుడుతో స్కోరు బోర్డును ఉరకలు పెట్టించాడు. డాలా బౌలింగ్‌లో మిడ్‌వికెట్లో ఫ్లిక్‌తో సిక్స్ కొట్టడంతో మొదలైంది అతడి బౌండరీల మోత. మోరిస్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన ధావన్.. వెంటనే డాలా ఓవర్లో రెండు ఫోర్లు, ఫైన్ లెగ్‌లో ఓ సిక్స్ బాదేశాడు. అదే ఊపులో 27 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. ఐతే మరో వైపు రైనా (15; 7 బంతుల్లో 2×4, 1×6), కోహ్లి (26; 20 బంతుల్లో 2×4, 1×6) కాస్త మెరిపించి ఔటయ్యారు. ధావన్‌తో మూడో వికెట్‌కు కోహ్లి 59 పరుగులు జోడించాడు. 12 ఓవర్లకు 128/3తో భారత్ చాలా బలమైన స్థితిలో నిలిచింది. కానీ చివరి ఎనిమిది ఓవర్లలో దక్షిణాఫ్రికా బౌలర్లు కాస్త కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత్, అనుకున్నంత స్కోరు చేయలేకపోయింది. విధ్వంసక బ్యాటింగ్‌తో శతకం దిశగా దూసుకెళ్లిన ధావన్.. 15వ ఓవర్లో, ఫెలుక్వాయో బౌలింగ్‌లో ఔట్ కావడంతో స్కోరు వేగం తగ్గింది. ధావన్.. మనీష్ పాండేతో నాలుగో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. పాండే (29 నాటౌట్; 27 బంతుల్లో 1×6) క్రీజులో స్థిరపడ్డా.. ధాటిగా ఆడలేకపోయాడు. ధోని (16; 11 బంతుల్లో 2×4), పాండ్య (13 నాటౌట్; 7 బంతుల్లో 2×4) కాస్త బ్యాట్ ఝుళిపించారు. చివరి ఐదు ఓవర్లలో భారత్ 46 పరుగులు రాబట్టింది.



ఆ ఓవర్లో..

ఛేదనలో 17వ ఓవర్ పూర్తయింది. దక్షిణాఫ్రికా స్కోరు 154. విజయం కోసం ఇంకా 18 బంతుల్లో 50 పరుగులు చేయాలి. అసాధ్యమేమీ కాదు. ఆశలు సజీవమే. ఎందుకంటే చేతిలో ఇంకా ఆరు వికెట్లు ఉన్నాయి. క్రీజులోనేమో జోరు మీదున్న హెండ్రిక్స్, క్లాసన్ ఉన్నారు. కానీ మరో ఆరు బంతుల్లోనే తమ ఆశలకు తెరపడుతుందని ఆ జట్టు ఊహించలేకపోయింది. అద్భుతంగా బౌలింగ్ చేసిన భువనేశ్వర్ 18వ ఓవర్లో ఐదు పరుగులకే మూడు వికెట్లు పడగొట్టాడు. తొలి బంతికి హెండ్రిక్స్‌ను ఔట్ చేసిన అతడు.. నాలుగో బంతికి క్లాసన్‌ను, ఐదో బంతికి మోరిస్‌ను వెనక్కి పంపాడు. ఆరో బంతికి ప్యాటర్సన్ రనౌట్ కావడంతో ఆ ఓవర్లో మొత్తం నాలుగు వికెట్లు పడ్డట్లయింది.





భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) క్లాసన్ (బి) డాలా 21; ధావన్ (సి) క్లాసన్ (బి) ఫెలుక్వాయో 72; రైనా (సి) అండ్ (బి) దలా 15; కోహ్లి ఎల్బీ (బి) శంసి 26; మనీష్ పాండే నాటౌట్ 29; ధోని (బి) మోరిస్ 16; పాండ్య నాటౌట్ 13; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (20 ఓవర్లలో 5 వికెట్లకు) **203**
వికెట్ల పతనం: 1-23, 2-49, 3-108, 4-155, 5-183
బౌలింగ్: ప్యాటర్సన్ 4-0-48-0; డాలా 4-0-47-2; మోరిస్ 4-0-39-1; శంసి 4-0-37-1; స్మట్స్ 2-0-14-0; ఫెలుక్వాయో 2-0-16-1

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: స్మట్స్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 14; హెండ్రిక్స్ (సి) ధోని (బి) భువనేశ్వర్ 70; డుమిని (సి) రైనా (బి) భువనేశ్వర్ 3; మిల్లర్ (సి) ధావన్ (బి) పాండ్య 9; బెహార్డీన్ (సి) పాండే (బి) చాహల్ 39; క్లాసన్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 16; ఫెలుక్వాయో (సి) చాహల్ (బి) ఉనద్కత్ 13; మోరిస్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 0; ప్యాటర్సన్ రనౌట్ 1; డాలా నాటౌట్ 2; శంసి నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **175**
వికెట్ల పతనం: 1-29, 2-38, 3-48, 4-129, 5-154, 6-158, 7-158, 8-159, 9-175; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-24-5; ఉనద్కత్ 4-0-33-1; బుమ్రా 4-0-32-0; పాండ్య 4-0-45-1; చాహల్ 4-0-39-1

5/24
భువనేశ్వర్ గణాంకాలు. టీ20ల్లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన తొలి భారత ఫాస్ట్‌బౌలర్ అతనే. అంతే కాదు.. మూడు ఫార్మాట్లలోనూ ఈ ఘనత సాధించిన తొలి భారత బౌలరూ భువినే.

అమ్మాయిల జోరుకు బ్రేక్

మూడో టీ20లో భారత్ ఓటమి


హర్మన్‌ప్రీత్ (48)

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో జైత్రయాత్ర చేస్తున్న భారత మహిళల జట్టు జోరుకు బ్రేక్ పడింది. మూడో టీ20 మ్యాచ్‌లో గెలిచిన సఫారీ జట్టు సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 17.5 ఓవర్లలో 133 పరుగులకే ఆలౌటైంది. ఫామ్‌లో ఉన్న మిథాలీ రాజ్ (0) డకౌట్ కాగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (48; 30 బంతుల్లో 6×4, 2×6), స్మృతి మంధాన (37; 24 బంతుల్లో 5×4, 1×6) జట్టును ఆదుకున్నారు. ఒక దశలో భారత్ 7 ఓవర్లకు 54/1తో మెరుగైన స్థితిలోనే కనిపించింది. కానీ మంధాన ఔటైన తర్వాత పరిస్థితి మారిపోయింది. భారత్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. హర్మన్‌ప్రీత్ ఒకవైపు ధాటిగా ఆడుతున్నా.. ఆమెకు మద్దతు ఇచ్చేవాళ్లు కరువయ్యారు. వేద కృష్ణమూర్తి (23; 14 బంతుల్లో 4×4) ధాటిగా ఆడుండకపోతే భారత్ ఆ స్కోరు కూడా చేయలేకపోయేది. దక్షిణాఫ్రికా బౌలర్లలో షబ్నిమ్ ఇస్మాయిల్ (5/30) సత్తా చాటింది. లూస్ (41; 34 బంతుల్లో 5×4), ట్రయాన్ (34; 15 బంతుల్లో 4×4, 2×6) రాణించడంతో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో ఉంది. నాలుగో టీ20 బుధవారం సెంచూరియన్‌లో జరుగుతుంది.



ఇంగ్లాండ్ పర్యటనకు నెల ముందే..

దిల్లీ: సరైన సన్నద్ధత లేకపోవడం వల్లే దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో భారత్ ఓటమి పాలైందన్న అభిప్రాయాలు గట్టిగానే వినిపించాయి. కీలకమైన ఈ సిరీస్ కోసం కేవలం పది రోజుల ముందే దక్షిణాఫ్రికా చేరుకుంది భారత్. అక్కడికి బయల్దేరడానికి నాలుగు రోజుల ముందు కూడా శ్రీలంకతో టీ20 మ్యాచ్ ఆడారు భారత ఆటగాళ్లు. ఈ నేపథ్యంలో బీసీసీఐ తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఐతే ఈ ఏడాది ద్వితీయార్ధంలో రాబోయే మరో కీలక పర్యటన విషయంలో మాత్రం ఈ తప్పు పునరావృతం కాకూడదని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. జులై 3-సెప్టెంబరు 11 మధ్య భారత్ ఇంగ్లాండ్‌లో పర్యటించనుండగా.. దాదాపు నెల రోజుల ముందే భారత ఆటగాళ్ల సన్నాహకం మొదలవుతుందట. జూన్‌లో ఇంగ్లాండ్‌లో సిరీస్ ఆడనున్న భారత్-ఎ జట్టు తరఫున కొందరు ఆటగాళ్లు బరిలో దిగనున్నట్లు సమాచారం. ఈ పర్యటనలో ముందుగా టీ20లు, వన్డేలు జరగనుండగా.. అదే సమయానికి టెస్టు స్పెషలిస్టులు అక్కడికి చేరుకుని కౌంటీల్లో ఆడటం, అక్కడి పిచ్‌లపై సాధన చేయడం ద్వారా టెస్టులకు సన్నద్ధం కానున్నారట. మొత్తంగా ఈసారి సన్నద్ధత విషయంలో ఏ లోటూ రాకుండా చూసుకోవాలని బోర్డు భావిస్తోందట. 2019లో వన్డే ప్రపంచకప్ జరగబోయేది ఇంగ్లాండ్‌లోనే కావడంతో ఈ పర్యటనలో భాగంగా భారత ఆటగాళ్లు ఎక్కువ సమయం ఆ దేశంలో గడిపితే ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు.

కివీస్ ఓడినా ఫైనల్‌కు

ఇంగ్లాండ్ గెలిచినా ఇంటికి



మోర్గాన్

హామిల్టన్: ముక్కోణపు వన్డే సిరీస్ చివరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఓడినప్పటికీ ఫైనల్ చేరింది. ఈ మ్యాచ్ గెలిచినా ఇంగ్లాండ్‌కు ఆనందం లేకపోయింది. ఆ జట్టు ఇంటి ముఖం పట్టక తప్పలేదు. ఇంగ్లాండ్ ఫైనల్ చేరాలంటే ఈ మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో గెలిచి ఉండాలి. కానీ ఆ జట్టు 2 పరుగుల తేడాతో నెగ్గింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (80 నాటౌట్) చెలరేగి ఆడాడు. మలన్ (53; 36 బంతుల్లో 2×4, 5×6) కూడా సత్తా చాటాడు. అనంతరం కివీస్ 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 192 పరుగులు చేసింది. ఓపెనర్ మన్రో (57) ఇంగ్లాండ్ బౌలర్లపై విరుచుకుపడి ప్రత్యర్థి ఫైనల్ ఆశలు గల్లంతు చేశాడు. అతను 18 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరో ఓపెనర్ గప్తిల్ (62) కూడా రాణించాడు. చాప్‌మన్ (37 నాటౌట్) చివర్లో కీలక ఇన్నింగ్స్‌తో కివీస్ ఫైనల్ చేరేందుకు అవసరమైన స్కోరును దాటించాడు. ఆస్ట్రేలియా ఇప్పటికే ఫైనల్ చేరింది.

సకినాకు రజతం

కోల్‌కతా: పారా పవర్‌లిఫ్టింగ్ ప్రపంచకప్‌లో సకినా కాతున్ సత్తా చాటింది. దుబాయ్‌లో జరిగిన పోటీల్లో 45 కేజీల విభాగంలో ఆమె రజత పతకం సాధించింది. సకినా 80 కేజీలు బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది.

వింటర్ ఒలింపిక్స్‌లో జకో!


జకో


వాల్టీర్

ప్యాంగ్‌చాంగ్: వింటర్ ఒలింపిక్స్‌లో జకోవిచ్! టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్‌కు శీతాకాల ఒలింపిక్స్‌కు ఏంటి సంబంధం? అయితే ఆడేది జకోవిచ్ కాదు దాదాపు అతని పోలికలతోనే ఉన్న పియరీ వాల్టీర్. తాజాగా వింటర్ ఒలింపిక్స్‌లో ఈ ఫ్రాన్స్ అథ్లెట్ స్నోబోర్డ్ క్రాస్‌లో పసిడి పతకం గెలుచుకున్నాడు. జకోవిచ్ రూపంతో పాటు అతనిలాగే పొడువుగా ఉండే వాల్టీర్‌కు నొవాక్ అంటే చాలా ఇష్టం. అతణ్ని ఎప్పటి నుంచో కలవాలని కూడా అనుకుంటున్నాడు. ఈ విషయాన్నే అతను వింటర్ ఒలింపిక్స్‌లో చెప్పాడు. "జకో ఆడుతుంటే అతని హావభావాలు, మాటతీరు అచ్చంగా నాలాగే అనిపిస్తాయి. నన్ను నేనే చూసుకున్నట్లు ఉంటుంది" అని వాల్టీర్ చెప్పాడు. దీంతో వెంటనే స్పందించిన జకో... "రొలాండ్ గారోస్‌లో తప్పకుండా కలుద్దాం వాల్టీర్.. స్వర్ణం గెలిచినందుకు అభినందనలు" అని ట్వీట్ చేశాడు. గత ఒలింపిక్స్‌లోనూ వాల్టీర్ స్వర్ణం గెలిచాడు. మే 27న ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభం కానుంది.



ఏబీకి మళ్లీ గాయం.. సిరీస్‌కు దూరం

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ మళ్లీ గాయపడ్డాడు. అతను భారత్‌తో మూడు టీ20ల సిరీస్‌కు దూరమయ్యాడు. భారత్‌తో చివరి వన్డే సందర్భంగా ఏబీ మోకాలికి గాయమైంది. ఆదివారం తొలి టీ20 ఆరంభానికి ముందు అతను ఆడే పరిస్థితి లేదని తేలింది. వేలి గాయం కారణంగా డివిలియర్స్.. భారత్‌తో తొలి మూడు వన్డేలకు దూరమైన సంగతి తెలిసిందే.

కుశాల్ మెరుపులు

బంగ్లాపై టీ20 సిరీసూ లంకదే

ఢాకా: బంగ్లాదేశ్ పర్యటనలో శ్రీలంక జైత్రయాత్ర పరిపూర్ణమైంది. ఇప్పటికే ముక్కోణపు వన్డే సిరీస్‌తో పాటు టెస్టు సిరీస్‌ను కూడా సొంతం చేసుకున్న లంక.. చివరగా జరిగిన టీ20 సిరీస్‌లోనూ విజేతగా నిలిచింది. ఆదివారం రెండో టీ20లో 75 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన లంక.. సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మొదట కుశాల్ మెండిస్ (70; 42 బంతుల్లో 6×4, 3×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో లంక 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. గుణతిలక (42), తిసార పెరీరా (31), శనక (30 నాటౌట్), తరంగ (25) కూడా ధాటిగా ఆడారు. ఛేదనలో బంగ్లా తేలిపోయింది. 18.4 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌటైంది. 41 పరుగులు చేసిన మహ్మదుల్లానే టాప్‌స్కోరర్. మదుశంక (2/23), గుణతిలక (2/3) బంగ్లాను దెబ్బ తీశారు. గత మ్యాచ్‌లోనూ అర్ధసెంచరీ సాధించిన కుశాల్ మెండిస్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు రెంటినీ గెలుచుకున్నాడు.


కుశాల్

టైటిల్ నంబర్ 97

రోటెర్‌డామ్: రోజర్ ఫెదరర్‌కు తిరుగేలేదు. సుదీర్ఘ విరామం తర్వాత నంబర్‌వన్ ర్యాంకు సొంతం చేసుకున్న ఈ స్విస్ మాస్టర్.. రోటెర్‌డామ్ టోర్నీలో విజేతగా నిలిచి కెరీర్‌లో 97వ టైటిల్ సాధించాడు. ఆదివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో ఫెదరర్ 6-2, 6-2తో గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా)ను చిత్తు చేశాడు. ఈ టోర్నీలో గెలవడం అతనికిది మూడోసారి. మొత్తం మీద ఈ సీజన్‌లో రోజర్‌కు ఇది రెండో టైటిల్. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్లోనూ అతను టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే.



భాజపా నరనరాల్లో ప్రజాస్వామ్యం



అగర్తలాలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న త్రిపుర సీఎం మాణిక్‌సర్కార్

త్రిపురలో 76% పోలింగ్

దిల్లీ: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 76 శాతానికిపైగా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. గత అసెంబ్లీ ఎన్నికలకన్నా ఇది15%తక్కువ. మొత్తం 60అసెంబ్లీ స్థానాలుండగా.. 59 సీట్లకు ఆదివారం పోలింగ్ జరిగింది. చారిలాం నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థి మృతితో ఎన్నిక వాయిదాపడింది. ఇక్కడ మార్చి 12న పోలింగ్ జరుగనుంది. రెండు చమురు బాంబులను భద్రతాదళాలు గుర్తించి.. నిర్వీర్యం చేసినట్లు డిప్యూటీ ఎన్నికల కమిషనర్ సుదీప్ జైన్ తెలిపారు. 41 స్థానాలకు సంబంధించిన పోలింగ్ శాతాన్ని వెల్లడించామని.. ఇది మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 25.73 లక్షల ఓటర్లున్నారు.

- అందువల్లే మిత్రపక్షాలను కలుపుకొని వెళ్లగలుగుతున్నాం
- ప్రధాని మోదీ ఉద్ఘాటన
- పార్టీ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభం

దిల్లీ: జాతీయ ప్రయోజనాల కోసం జరిగిన అన్ని ఉద్యమాలకు భాజపా, జన్‌సంఘ్ నేతృత్వం వహించాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యమే పార్టీకి మూల సిద్ధాంతమని, దానివల్లే విజయవంతంగా మిత్రపక్షాలను కలుపుకొని వెళ్లగలుగుతోందని చెప్పారు. భాజపాకు చెందిన కొత్త కేంద్ర కార్యాలయాన్ని మోదీ ఆదివారం ఇక్కడ ప్రారంభించారు. 1951లో భారతీయ జన సంఘ్‌గా ప్రారంభమైనప్పటి నుంచి సాగిన భాజపా ప్రస్థానాన్ని ఆయన వివరించారు.

వ్యవస్థాపక సిద్ధాంతాల నుంచి పార్టీ ఎన్నడూ దూరం జరగలేదని మోదీ చెప్పారు. కాంగ్రెస్‌కు చెందిన అనేక మంది నేతలు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. ఆ తర్వాత సొంత రాజకీయ విలువలను వ్యాప్తి చేసుకునేందుకు.. ఆ పార్టీతో తెగతెంపులు చేసుకొని సొంత పార్టీలు



దిల్లీలో భాజపా నూతన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ, భాజపా అగ్రనేత అద్వాణీ, భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, సుష్మాస్వరాజ్, గడ్కరీ తదితరులు

పెట్టుకున్నారని చెప్పారు. ఒకటి లేదా రెండు బలమైన జాతీయ పార్టీలు అవసరం ఉందని భావించడం వల్ల స్వాతంత్ర్యం తర్వాత జనసంఘ్ ఏర్పాటైందన్నారు. "స్వాతంత్ర్యం తర్వాత దేశంలో జాతీయ ప్రయోజనాల కోసం జరిగిన అన్ని ఉద్యమాలకు జనసంఘ్, భాజపా నేతృత్వం వహించాయి. ఇది గర్వకారణం. భాజపా.. నిలువెల్లా దేశభక్తితో నిండిపోయింది. దేశం కోసం ఉద్యమించడానికి, త్యాగం చేయడానికి సదా సిద్ధంగా ఉంది" అని పేర్కొన్నారు. పార్టీ నరనరాల్లో, మూల సిద్ధాంతాలన్నీ ప్రజాస్వామ్యంతో పెనవేసుకుపోయాయని తెలిపారు. ఆలోచన, పనితీరు, ఎజెండా అమలు వంటి అంశాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి అడుగడుగునా ఉందని తెలిపారు. ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చుకుంటూ సంకీర్ణ పక్షాలను కలుపుకొని వెళ్లడంలో వాజ్‌పేయీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విజయం సాధించిందని మోదీ చెప్పారు. దేశానికో కొత్త ఆశాకిరణంగా మారిందన్నారు. తెదేపా సహా పలు మిత్రపక్షాలు అసంతృప్తి గళాలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రజాస్వామ్యం అనేది మా రక్తంలో ఉండటం వల్లే.. సాధ్యమైనంత మేర మేం అందరినీ కలుపుకొని వెళ్లగలుగుతున్నాం"అని చెప్పారు. భిన్న రాజకీయ పార్టీ మధ్య భిన్నాభిప్రాయాలు.. భారత ప్రజాస్వామ్య సౌందర్యాన్ని మరింత ఇనుమడింపచేస్తాయన్నారు.

ప్రపంచంలోనే పెద్దది..

భాజపా కొత్త ప్రధాన కార్యాలయ విస్తీర్ణం 1.70 లక్షల చదరపు అడుగుల మేర ఉందని పార్టీ అధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పార్టీల కార్యాలయాల్లో ఇదే అతిపెద్దదన్నారు. ఏడాదిలోగా దేశంలోని దాదాపు ప్రతి జిల్లాలోనూ భాజపాకు సొంత కార్యాలయం ఉంటుందని చెప్పారు. తాజా కార్యాలయంలో అధునాతన కమ్యూనికేషన్ పరిజ్ఞానాలు, సువిశాలమైన సామాజిక మాధ్యమ కార్యాలయం ఉంటుందన్నారు. ఇక్కడ కూర్చొని రాష్ట్ర కార్యనిర్వాహక వర్గం సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడవచ్చని తెలిపారు. కొత్త కార్యాలయానికి గత ఏడాది ఆగస్టులో మోదీ, అమిత్ షాలు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంగణంలో మూడు భవనాలు ఉన్నాయి. ఈ కార్యక్రమానికి పార్టీ అగ్రనేతలు ఎల్.కె.ఆద్వాణీ, మురళీ మనోహర్ జోషి, పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు.



సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కమల్‌హాసన్

రజనీకాంత్‌తో కమల్ భేటీ

డీఎంకే అధ్యక్షుడు ఎం.కరుణానిధితో కూడా

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాట రాజకీయ ప్రవేశానికి రంగం సిద్ధం చేసుకున్న నటుడు కమల్‌హాసన్ ఆదివారం అకస్మాత్తుగా సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో సమావేశమయ్యారు. కమల్‌హాసన్ ఈ నెల 21న రామేశ్వరంలోని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నివాసం నుంచి తన రాజకీయ యాత్ర ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రజనీకాంత్‌ను ఆయన చెన్నై పోయెస్‌గార్డెన్ నివాసంలో ఆదివారం మధ్యాహ్నం కలిశారు. అనంతరం కమల్‌హాసన్ విలేకరులతో మాట్లాడుతూ... స్నేహపూర్వంగానే రజనీకాంత్‌ను కలిశానని, ఇది రాజకీయపరమైన సమావేశం కాదని స్పష్టంచేశారు. యాత్ర చేపట్టనున్న నేపథ్యంలో తనకు నచ్చినవారికి ఆ విషయాన్ని నేరుగా కలిసి చెబుతున్నానని, అందులో భాగంగానే రజనీతో భేటీ అయ్యానని వివరించారు. మదురై సమావేశంలో పాల్గొనేందుకు రజనీని ఆహ్వానించానని పేర్కొన్నారు. అనంతరం రజనీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ.. తమిళనాడు ప్రజలకు మంచి చేయాలని కమల్ రాజకీయాల్లోకి వస్తున్నారని తెలిపారు. కమల్‌కు అన్ని ఆశీర్వాదాలు లభించాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని, ఆయన యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తమ బాణీలు వేరైనా ఉద్దేశం మాత్రం రాజకీయంగా ఒకటేనని వ్యాఖ్యానించారు. రజనీకాంత్ కూడా రాజకీయ ప్రవేశంపై గత ఏడాది డిసెంబరు 31న ప్రకటన చేసిన నేపథ్యంలో ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెంచింది. రజనీకాంత్‌తో కలిసి రాజకీయ ప్రయాణం చేస్తారా? అని కొన్ని రోజుల క్రితం విలేకరులు కమల్‌ను ప్రశ్నించగా... ఆయన రాజకీయాల్లో కాషాయం ఉండబోదని విశ్వసిస్తున్నానంటూ వ్యాఖ్యానించడం గమనార్హం. అలా ఉంటే పొత్తు పెట్టుకోనని కూడా ఆ సమయంలో కమల్ స్పష్టం చేశారు. మరోవైపు, డీఎంకే అధ్యక్షుడు ఎం.కరుణానిధిని కూడా గోపాలపురంలోని ఆయన నివాసంలో కమల్‌హాసన్ ఆదివారం రాత్రి మర్యాదపూర్వంగా కలిశారు. ఆ సమయంలో డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కూడా ఉన్నారు.



తాజ్ అందాలను తిలకించిన కెనడా ప్రధాని

దిల్లీ: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆదివారం తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఆయన వెంట భార్య సోఫీ ట్రూడో, పిల్లలు ఎల్లా-గ్రేస్ మార్గరేట్, హాడ్రీన్, గ్జేవియర్ జేమ్స్ ఉన్నారు. తమ పిల్లలతో కలిసి తాజ్‌ను సందర్శించడం చాలా ఆనందంగా ఉందని ట్రూడో అన్నారు. వారం రోజుల పర్యటన నిమిత్తం శనివారం ఆయన భారత్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా శుక్రవారం (ఈ నెల 23న) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ట్రూడో సమగ్ర చర్చలు జరపనున్నారు.

కళ్లల్లోకి యాసిడ్ ఇంజెక్షన్.. బిహారులో దారుణం

- అక్రమ సంబంధం పెట్టుకున్నందుకు
- అంధుడై పోయిన ట్రాక్టర్ డ్రైవర్

పట్నా: ట్రాక్టర్ యజమాని భార్యతో అనైతిక సంబంధాన్ని పెట్టుకున్న ఓ డ్రైవర్‌ను సుమారు 20 మంది ఆగంతకులు అత్యంత దారుణంగా హింసించారు. డ్రైవర్ కళ్లలోకి యాసిడ్ నింపిన ఇంజెక్షన్ ఇచ్చి అతడిని శాశ్వతంగా అంధుడిని చేసేశారు. సమస్తిపూర్ జిల్లా బరౌని గ్రామంలో ఈ నెల 16న ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేస్తున్న ఓ 30ఏళ్లవ్యక్తి తన యజమాని భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నెల 6న ఇద్దరూ కలిసి ఎటో వెళ్లిపోయారు. ఆమె భర్త డ్రైవరుపై కిడ్నాప్ కేసుపెట్టారు. దాదాపు పదిరోజుల తర్వాత అంటే...16వ తేదీన డ్రైవర్‌తో సహా ఆమె వెనక్కి తిరిగి వచ్చింది. న్యాయస్థానానికి వెళ్లి తన భర్త వద్దకే వెళ్లిపోతానంటూ స్పష్టం చేసింది. ఇది జరిగిన కొన్ని గంటల తర్వాత ఆమె సమీప బంధువు ఒకరు ట్రాక్టర్ డ్రైవరుకు ఫోన్‌చేశారు. ఆమె పోలీసు స్టేషన్ వద్దే ఉందనీ...అతడితోనే జీవించాలనుకుంటోందనీ చెప్పారు. పీఎస్ వద్దకు రావలసిందిగా కోరారు. బాధితుడు అక్కడికి చేరుకుంటుండగా దాదాపు 20 మంది ఒక్కసారిగా అతడిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఆ తర్వాత సిరంజ్‌లో యాసిడ్ నింపి అతడి కళ్లకు ఇంజెక్షన్ ఇచ్చారు. బాధతో గిలగిలలాడుతున్న అతడిని ఓ చోట పడేసి వెళ్లిపోయారు.

బ్రిటన్ తీవ్రవాద వ్యతిరేక పోలీసు సారధిగా భారతీయుడు!

లండన్: బ్రిటన్ తీవ్రవాద వ్యతిరేక పోలీసు దళాధిపతి రేసులో భారత సంతతి పోలీసు అధికారి నీల్‌బసు ఉన్నారు. స్కాట్‌లాండ్ యార్డ్‌కు చెందిన 'నేషనల్ లీడ్ ఫర్ కౌంటర్ టెర్రరిజం' సారధిగా ఉన్న మార్క్ రౌలీ వచ్చేనెలలో వైదొలగనున్నారు. ఈ తదుపరి బాధ్యతలు స్వీకరించే అవకాశం భారత సంతతి అధికారి నీల్ బసుకే ఉన్నట్లు 'ది సండే టైమ్స్' పేర్కొంది. ప్రస్తుతం ఆయన మెట్రోపాలిటన్ పోలీసు డిప్యూటీ సహాయ కమిషనరుగా ఉన్నారు. గత మూడేళ్లుగా బసు తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తించారు.

మా సహనాన్ని పరీక్షించొద్దు

- ఇరాన్‌కు ఇజ్రాయెల్ ప్రధాని హెచ్చరిక

మ్యూనిక్: తమ దేశ సహనాన్ని పరీక్షించవద్దని ఇరాన్‌ను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరించారు. ఇరాన్ ప్రపంచానికి అతిపెద్ద ముప్పు అని.. ఆదేశ క్రూర పాలకులు ఇజ్రాయెల్ మెడ చుట్టూ ఉరికంబం బిగిస్తుంటే ఊరుకోమని ఆయన అన్నారు. జర్మనీలోని మ్యూనిక్‌లో జరిగిన ఓ భద్రతా సదస్సులో నెతన్యాహు ఈ మేరకు మాట్లాడారు. ఇటు సిరియాలో ఉండి ఇరాన్ అతిక్రమణలకు పాల్పడుతోందని.. ఇటీవల తమ భూభాగంలోకి ప్రవేశించిన ఇరాన్ డ్రోన్‌ను కూల్చివేశామని పేర్కొన్నారు. 2015లో కుదిరిన అణు ఒప్పందంతో ఇరాన్‌లోని ప్రమాదకారి నిద్ర లేచిందని అన్నారు. తమ దేశరక్షణ కోసం ఏ చర్యకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి ఈ ఆరోపణలను కొట్టిపారేశారు. నెతన్యాహు ప్రసంగం హాస్యాస్పదంగా ఉందని.. దానిపై స్పందించాల్సిన అవసరం కూడా లేదని వ్యాఖ్యానించారు. ఇటీవల ఇరాన్ డ్రోన్ సిరియా గుండా తమ భూభాగంలోకి ప్రవేశించిందనిచెప్పిన ఇజ్రాయెల్.. సిరియాలో ఇరాన్‌కు సంబంధించిన కొన్నిచోట్ల వైమానిక దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌కు చెందిన ఎఫ్-16యుద్ధ విమానాన్ని సిరియా సేనలు కూల్చివేశాయి. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తలు మళ్లీ రేగాయి.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00